# లాటరీలు

## అదృష్టాన్ని మించి..

ఎన్. సుగాల్‌చంద్ జైన్, బి.ఎ

తెలుగు సేత
బి.ఎస్. రామకృష్ణ
సిహెచ్.వి. రమణ్‌రావు

**SUGAL & DAMANI**
6/35, W.E.A. Karol Bagh
New Delhi - 110 005

© Sugal & Damani, 2008

అన్ని హక్కులూ రచయిత సొంతం. పబ్లిషర్‌నుంచి రాతపూర్వకమైన అనుమతి పొందకుండా ఈ పుస్తకంలోని ఏ భాగాన్నయినా ఏ పద్ధతిలోనైనా పునర్ముద్రించడంగాని, ఎలక్ట్రానిక్, మెకానికల్ పద్ధతుల్లో ఇతరులకు బదిలీ చేయడంగానీ, రికార్డు చేయడంగానీ కూడదు. లాటరీలకు సంబంధించిన విస్తృతమైన సమాచారాన్ని ఈ పుస్తకంలో పొందుపరచడం జరిగింది. పుస్తకంలోని సమాచారం కచ్చితత్వానికి సంబంధించి రచయిత జవాబుదారీ కాదు. ఈ పుస్తకంలోని సమాచారం ఆధారంగా ఏ వ్యక్తికయినా కష్టనష్టాలు కలిగితే అందుకు రచయిత బాధ్యత లేదు.

**ప్రథమ ప్రచురణ : ఏప్రిల్ 2008**

Published by
Sugal & Damani
No.11, Ponnappa Lane
Triplicane
Chennai- 600 005
South India
Pbone: 044- 2848 1354 / 2848 1366
E-mail: sugalchand@yahoo.com
www.sugaldamani.com

Copies can be had from
SUGAL & DAMANI
6/35, W.E.A. Karolbagh,
New Delhi - 110 005

405, Krushal Commercial Complex
G.M. Road, Above Shoppers' stop
Chembur (W), Mumbai - 400 089

C Wing, Kapil Tower, II Floor
45, Dr. Ambedkar Road
Near Sangam Bridge
Pune - 411 001

1554, Sant Dass Street
Clock Tower
Ludhiana - 141 008

Price : Rs. 299/-

ISBN: 978-81-904253-4-6

Printed in India by : GOPSONS PAPERS LTD., NOIDA

# అంకితం

**సమాజాభ్యున్నతిలో తమ వంతు పాత్ర పోషిస్తున్న**

**లాటరీ టిక్కెట్ విక్రేతలకు, లాటరీలు ఆడేవారికి,**

**పాల్గొనేవారికి...**

# క్లుప్తంగా...

లాటరీలు ఉండాలా, వద్దా... అని ఒకపక్క మన దేశంలో చర్చ జరుగుతుండగానే స్పానిష్ లాటరీవారు ప్రజాదరణ పొందిన ఎల్‌గొరోడో అనే తమ లాటరీ గేమ్ డ్రా గురించి సెప్టెంబర్ 2004 'స్వాగత్' సంచికలో ప్రకటన ఇచ్చింది. ఇండియన్ ఎయిర్‌లైన్స్ ఇన్‌ఫ్లైట్ మ్యాగజైన్ పేరు స్వాగత్ అన్న సంగతి తెలిసిందే. మన రాష్ట్ర ప్రభుత్వాలు లాటరీ గేమ్‌లను పెద్దగా నిర్వహించడం లేదని పసిగట్టిన స్పానిష్ లాటరీ... భారతీయులను తమ లాటరీలవైపు ఇట్టే ఆకట్టుకోవచ్చన్న విషయాన్ని గ్రహించినట్టుంది. తమ దేశ ప్రజలు ఇతర దేశాల లాటరీలవైపు ఆకర్షితులవుతున్నారని, తద్వారా ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలు బలోపేతమవుతున్నాయని తెలుసుకున్న వెంటనే బ్రిటిష్ ప్రభుత్వం స్వయంగా లాటరీల నిర్వహణకు శ్రీకారం చుట్టింది. తదనంతరకాలంలో బ్రిటిష్ ప్రభుత్వం లాటరీల నిర్వహణలో ఎన్నో విజయాలను సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో లాటరీల విషయంలో సరైన నిర్ణయానికి రావడానికి మనం ఇంకా ఏళ్ళ తరబడి వేచి ఉండాలా?

లాటరీల్లో గెలవాలంటే అదృష్టం కలసి రావాలని, వాటిలో విజయావకాశాలు తక్కువగా ఉంటాయని, అందువల్ల లాటరీలను బహిష్కరించాలని కొందరు డిమాండ్ చేస్తుంటారు. లాటరీలు అదృష్టంతో ముడివడి ఉంటాయన్న మాట నిజమే. ఫార్వర్డ్ ట్రేడింగ్, స్టాక్ మార్కెట్, సరకుల లావాదేవీలు, రేసులు, ఫారన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో బెట్టింగ్ వంటివి కూడా అలాంటివే. వీటన్నింటినీ కొనసాగిస్తున్నప్పుడు కేవలం లాటరీలనే విమర్శించడం ఎందుకు? అభివృద్ధి పనులకు, ఉపాధి అవకాశాలకు ఊతమిస్తున్న లాటరీలను నిషేధించాలనడం సమంజసమేనా?

పేదరికంలో మగ్గుతున్న వ్యక్తి తనకు పెద్దమొత్తంలో డబ్బు దక్కుతుందనే ఆశతో లాటరీ ఆడతాడు. అలాకాకుండా లాటరీని, వినోదం కలగజేసే క్రీడగా

భావించాలంటే ముందుగా అతని ఆర్థిక పరిస్థితులు మెరుగుపడాలి. అంతేతప్ప లాటరీని నిషేధించడం వల్ల ప్రయోజనమేమీ ఉండదు. ఇక్కడ సమస్య పేదరికమే తప్ప లాటరీ ఎంతమాత్రమూ కాదు.

మద్యపానం, పొగాకు వల్ల ఆరోగ్యం పాడవుతుందనే విషయం అందరికీ తెలుసు. అయినా వాటి వినియోగం నిర్నిరోధంగా సాగిపోతూనే ఉంది. పొగాకు వినియోగం ప్రజల ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నా పొగాకు ఉత్పత్తుల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతూనే ఉంది. మద్యం, పొగాకు మాదిరిగా లాటరీలు ఎలాంటి దుష్ప్రభావాన్నీ చూపడం లేదు. అయినా లాటరీలపైనే ఎందుకు కత్తి కడుతున్నారో అర్థం కాని విషయం.

అయినా నిషేధం సమస్యకు పరిష్కారమెలా అవుతుంది? మద్యపాన నిషేధం అమలు చేసినప్పుడు అక్రమ సారా అమ్మకాలు ఊపందుకున్నాయి. ఈ సారా తాగి ఎంతోమంది అసువులు బాసిన సంగతి తెలిసిందే. దేనినైనా నిషేధిస్తే తలెత్తే విపరిణామాలకు ఇదో ఉదాహరణ. లాటరీల నిర్వహణలో అవతవకలు జరగడమనేది ఓ చిన్న సమస్య. దానిని సరిదిద్దడం పోయి నిషేధించడం ఎన్నో అనర్థాలకు కారణమవుతుంది. లాటరీలను నిషేధిస్తే, అక్రమ లాటరీలు వెల్లువెత్తుతాయి. దానివల్ల ప్రభుత్వానికి రావలసిన ఆదాయం దారిమళ్ళుతుంది. ఫలితంగా ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లడమే కాకుండా, అభివృద్ధి పనులకూ అవరోధం ఏర్పడుతుంది. లాటరీల వల్ల లక్షల సంఖ్యలో సమకూరుతున్న ఉపాధి అవకాశాల విషయం కూడా విస్మరించరానిది. లాటరీలు కాకుండా మరే రంగమూ ఈ లోటును భర్తీ చేయలేదు. తమిళనాడు ప్రభుత్వాలు ఎన్నోసార్లు లాటరీలను నిషేధించడం, ఆ తరవాత నిషేధాన్ని ఎత్తివేయడం ఈ రంగంలో మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్న నాకు న్న అనుభవం. ఇలాంటివే ఎన్నో ఇతర కారణాలు ఉండబట్టే ఈ పరిశ్రమతో సంబంధమున్నవారంతా లాటరీల నిర్వహణకు నిర్దిష్టమైన, కఠినమైన చట్టాలను రూపొందించాలని కోరుతున్నారు.

లాటరీలకు సంబంధించిన ఎన్నో వాస్తవాలను ఈ పుస్తకంలో వివరించడం జరిగింది. నాకు తగిన సహాయ సహకారాలు, అండదండలు అందించిన ఈ పరిశ్రమలోని నా స్నేహితులు, సహోద్యోగులు అందరికీ కృతజ్ఞతలు. ఈ పుస్తకాన్ని మీ ముందుకు తీసుకురావడంలో నాకు సహకరించిన శ్రీ కమలేష్ విజయ్‌కు, నా భాగస్వాములు శ్రీయుతులు జి.ఎన్. దామనీ, పి.బి. చద్దా, ఆర్.ఎన్. దామనీ, రాజన్ చద్దా, కిషోర్ అజ్మేరాలకు రుణపడి ఉంటాను. లాటరీలపై పుస్తకం వెలువరించాలన్న నా చిరకాల స్వప్నం నెరవేరడంలో చేదోడు వాదోడుగా నిలచిన నా కుమారులు ప్రసన్‌చంద్ జైన్, వినోద్ కుమార్‌ల గురించి ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రస్తావించాల్సిన అవసరం ఉంది. పురాతన గ్రంథాలను పరిశీలించేందుకు అనుమతి ఇచ్చిన ఆర్కైవ్స్ అండ్ హిస్టారికల్ రీసెర్చి కమిషనర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు. ఆర్కైవ్స్ విభాగంలోని లైబ్రరీ, రీసెర్చి హాల్ సిబ్బందికి నా ధన్యవాదాలు. కిజకెమురి పాత్ర గురించి, లాటరీలకు సంబంధించిన ఇతర విశేషాల గురించి తెలియజెప్పిన శ్రీ డి.సి. రవి (డి.సి. బుక్స్, కొట్టాయం) కి కృతజ్ఞతలు. సమాచార సేకరణలోనూ, కూర్పులోనూ తోడ్పాటునందించిన శ్రీమతి జెస్సీ శామ్యూల్‌కు కూడా నా ధన్యవాదాలు. ఈ పుస్తకం ఎడిటింగ్‌లో సహకరించిన సీనియర్ జర్నలిస్ట్ శ్రీ మురళీధర్ (హైదరాబాద్)కు కృతజ్ఞతలు. పుస్తకాన్ని చక్కగా తెలుగులోకి అనువదించిన శ్రీ బి.ఎస్. రామకృష్ణ, శ్రీ సిహెచ్.వి. రమణ్‌రావులకు నా ధన్యవాదాలు. లాటరీ పరిశ్రమకు చెందిన లక్షలాదిమంది వ్యాపారులు, రిటైలర్లు, ఆటగాళ్ళకు నేను సదా రుణపడి ఉంటాను.

ఈ పుస్తకం విమర్శకుల కళ్ళు తెరిపిస్తుందని, లాటరీలను సమర్థించేవారికి ఉపయోగపడుతుందని భావిస్తున్నాను.

గ్లోబలైజేషన్ పుణ్యమాని ప్రపంచమే ఓ కుగ్రామంగా మారిపోయింది. ఎక్కడో ఓ చిన్న దీవిలో ఉన్న వ్యక్తి కూడా ఇంటర్నెట్ సహాయంతో లాటరీ ఆడగలుగుతున్నాడు. మన దేశ ప్రజలకు మాత్రం ఆ భాగ్యం ఇంకా అందని

ద్రాక్షగా మిగిలిపోవలసిందేనా? యునైటెడ్ నేషన్స్ సైతం విశ్వవ్యాప్తంగా లాటరీని ప్రారంభించాలన్న యోచనలో ఉన్న ప్రస్తుత తరుణంలో మన ఆలోచనలను, అభిప్రాయాలను పునస్సమీక్షించుకోవలసిన అవసరం లేదా? ఈ విషయంలో ప్రజలను చైతన్యవంతుల్ని చేసేందుకు ఈ పుస్తకం దోహదపడుతుందని భావిస్తున్నాను.

ఎన్. సుగాల్‌చంద్ జైన్
ఏప్రిల్ 2008

# విషయసూచిక


| | పుట |
|---|---|
| 1. లాటరీలు- అదృష్టాన్ని మించిన అంశాలు | 1 |
| 2. అభివృద్ధికి లాటరీల బాసట | 5 |
| 3. లాటరీల తరతరాల చరిత్ర | 13 |
| 4. లాటరీల (నిషేధ) బిల్లు, 1999-ప్రొసీడింగ్స్ కమిటీ సమావేశం | 21 |
| 5. లాటరీల వల్ల ఎన్నో ప్రయోజనాలు | 25 |
| 6. రకరకాల లాటరీలు | 29 |
| 7. ఆన్‌లైన్ లాటరీలు | 49 |
| 8. ఇండియాలో లాటరీలు | 53 |
| 9. వివిధ రాష్ట్రాల్లో లాటరీలు | 67 |
| 10. దేశ విదేశాల్లో లాటరీలు | 75 |
| 11. సంక్షేమ లాటరీలు | 137 |
| 12. బహుళ జాతీయ, అంతర్రాష్ట్ర లాటరీలు | 141 |
| 13. లాటరీ డ్రాలు | 145 |
| 14. భారతీయ లాటరీల్లో ఆర్థికకోణం | 151 |
| 15. భారతీయ లాటరీల్లో టాక్సు వ్యవహారాలు | 155 |

16. లాటరీ కార్యకలాపాలు సజావుగా సాగాలంటే.. 159

17. ఆటగాళ్లకు రక్షణ 163

18. భద్రతా చర్యలు 169

19. రిటైలర్ల పాత్ర 177

20. లాటరీ ఆధారిత పరిశ్రమలు 181

21. లాటరీ నియమ నిబంధనలు 187

22. లాటరీలు - కుంభకోణాలు 195

23. లాటరీ సూక్తులు 199

24. వింతలు - విశేషాలు 205

అనుబంధం

ప్రతిస్పందన 209

ఉపయుక్త గ్రంథ పట్టిక 211

టైమ్స్' అనే టాబ్లాయిడ్‌ను తీసుకువచ్చారు. 'ఎంపతీ' పేరుతో సుగాల్ అండ్ దమానీ గ్రూప్ ఆధ్వర్యంలో జైన్ ఓ మ్యాగజైన్‌నూ ప్రచురించేవారు.

సుగాల్‌చంద్ జైన్ నిరాడంబరుడు. దయాళువు. ఆయనలో దానగుణం మెండు. నిరక్షరాస్యుల్లో అక్షర జ్యోతులు వెలిగించేందుకు, అనారోగ్య పీడితులకు వైద్య సహాయం అందచేసేందుకు లెక్కలేనన్ని విరాళాలు అందజేసిన దాత. అంతేకాదు, భగవాన్ మహావీర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయన మూడు వార్షిక అవార్డులను కూడా ఏర్పాటు చేశారు. సమాజ సేవలో విశేష కృషి చేసినవారికి, విద్య, వైద్య రంగాల్లో ప్రతిభ కనబరిచినవారికి, అహింసకోసం పాటుపడేవారికి ఈ అవార్డులను అందజేస్తారు. ఒక్కో అవార్డుతోపాటు ఐదు లక్షల రూపాయల నగదును కూడా అందజేస్తారు. ఫౌండేషన్ గురించి, అవార్డులు, అవార్డు గ్రహీతల గురించి వివరిస్తూ ఏటా ఓ చిన్న పుస్తకాన్ని కూడా వెలువరిస్తారు.

జైన్ ఎన్నో వ్యాపారాలను దీక్షాదక్షతలతో నిర్వహిస్తున్నారు. జుయెలరీ, ట్రావెల్ అండ్ టూరిజం, రియల్ ఎస్టేట్, కమోడిటీ ట్రేడింగ్ తదితర రంగాలకు ఆయన వ్యాపార సామ్రాజ్యం విస్తరించారు.

# లాటరీలు, అదృష్టాన్ని మించి..

లాటరీ అనేది అదృష్టంతో ముడిపడి ఉన్న ఆట కాబట్టి ఇదీ ఒకరకమైన జూదమే- లాటరీలకు వ్యతిరేకంగా మాట్లాడేవారు చేసే వాదన ఇది. అయితే స్టాక్ మార్కెట్ స్పెక్యులేషన్, ఫార్వర్డ్ ట్రేడింగ్, హెడ్జింగ్, విదేశీ మారక ద్రవ్య మార్కెట్‌లో బెట్టింగ్, గుర్రపు పందాలు వంటివి కూడా ఇదే కోవకు చెందుతాయి మరి. వీటన్నింటినీ ఎవరూ నిషేధించలేదు. పైపెచ్చు వాటిని పునర్నిర్మించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. అలాంటప్పుడు లాటరీలను నిషేధించడానికి బదులు వాటిని పునర్ వ్యవస్థీకరించడమే సమంజస మనిపించుకుంటుంది. స్పెక్యులేషన్‌లో పెట్టుబడులు ఎక్కువగా ఉంటాయి. నష్టాలూ అదే తీరులో ఉంటాయన్న విషయం విస్మరించరానిది. దాంతో పోలిస్తే లాటరీలు ఆడేందుకు ఆటగాడు పెట్టే పెట్టుబడి బహు స్వల్పం.

జూదమాడాలన్న కోరిక మనిషిలో అంతర్గతంగా ఉండటం సహజం. ఆకలి, మైథునం, ఆధిక్యం కనబరచాలనుకోవడం, అదృష్టాన్ని పరీక్షించు కోవాలనుకోవడం... ఈ నాలుగూ మనిషిలో నిగూఢంగా ఉండే గుణాలు. ఆకలి తీర్చుకునేందుకు పంటలు పండిస్తున్నాం. స్త్రీ పురుష సంబంధాల కోసం వివాహ వ్యవస్థను ఏర్పరచుకున్నాం. ప్రభుత్వ విభాగాలు, ఇతర సంస్థల్లో ఎన్నో అధికారిక పదవులు ఏర్పడ్డాయి. వీటికి అధికారాలను అప్పగించారు. ఇక అదృష్టం విషయానికొస్తే...మానవ జీవితంలోని అన్ని విషయాలకూ ఇది వర్తిస్తుంది. చదువు మొదలుకుని ఉద్యోగం, పెళ్ళి వంటి అన్ని విషయాల్లోనూ అదృష్టం కీలకపాత్ర పోషిస్తుంది. మానవ సహజమైన కోరికలను అణచివేయాలని ప్రయత్నిస్తే అవి దుష్ఫలితాలకు దారితీసే ప్రమాదం ఉంటుంది. ఉదాహరణకు మద్యపాన నిషేధం విధించినప్పుడు అక్రమ సారా వ్యాపారం ఊపందుకుంది. ఈ సారా తాగి ఎంతో మంది మరణించారు. ఇదే సూత్రం గేంబ్లింగ్‌కు కూడా వర్తిస్తుంది. గేంబ్లింగ్ ఆడాలన్న సహజసిద్ధమైన కోరికను అణచివేయాలని ప్రయత్నించకూడదు. వారికి అవకాశం కల్పించాలి.

అందుకోసం ప్రస్తుతం ఉన్న మార్గం లాటరీ. దీనిని క్రమబద్ధీకరించడమే సరైన చర్య. లాటరీ హానికరమైనదే అయితే మన రాజ్యాంగ నిర్మాతలు దాని గురించి రాజ్యాంగంలో పేర్కొనేవారే కాదు.

లాటరీల్లో ఉండే అనిశ్చితస్థితి, కాస్త తేడాలో బహుమతులను కోల్పోవడం వంటివి భరించలేక ఆటగాళ్ళు డిప్రెషన్‌కు లోనవుతూంటారు. ఆత్మహత్యలకు పాల్పడేవారూ లేకపోలేదు. అయితే ఇవన్నీ కేవలం లాటరీలకు మాత్రమే పరిమితం కావు. మారుతున్న జీవన విధానాలు, పని ఒత్తిడుల కారణంగా మానవ జీవితంలో డిప్రెషన్ సర్వసాధారణంగా మారింది. ఆత్మహత్యలకు పాల్పడేవారి విషయంలోనూ అంతే. పరీక్షల్లో పాస్ కాని విద్యార్థులు మొదలు సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్స్, అందాల పోటీల్లో గెలిచే అమ్మాయిల వరకూ ఎంతోమంది సమస్యలతో సతమతమవుతూ ఆత్మహత్యలే పరిష్కారమనుకుంటున్నారు. దీనికి అసలైన పరిష్కారమేమిటంటే, హెల్ప్‌లైన్లను, కౌన్సిలింగ్ సెంటర్లను నెలకొల్పడం. వాటి ఫోన్ నెంబర్లను లాటరీ టిక్కెట్ల వెనక ముద్రించాలి. కొన్ని దేశాల్లో ఈ సాంప్రదాయం ఉంది.

ఇక ఆరోగ్యరంగానికి వద్దాం. మద్యం, పొగాకు ఉత్పత్తులను ఎలాంటి చట్టబద్ధమైన హెచ్చరికలూ లేకుండానే యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. వినియోగదారుల ఆరోగ్యంపై విపరీతమైన ప్రభావాన్ని చూపించే వీటితో పోలిస్తే లాటరీలు ఎంతో మెరుగు. తాగుడుకు, పొగాకు ఉత్పత్తులకు అలవాటు పడి ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నవారికోసం ప్రభుత్వం ఆస్పత్రుల నిర్మాణానికి, డాక్టర్లు, నర్సులకోసం ఎంతో డబ్బును వ్యయం చేయాల్సి వస్తోంది.

లాటరీలు ఓ వ్యసనమనేవారు లేకపోలేదు. అలాంటప్పుడు కాఫీ, సిగరెట్, బ్రౌజింగ్, షాపింగ్ వంటివీ అంతేకదా. ఆ మాటకొస్తే తేనెను కూడా పరిమితికి మించి తాగితే ప్రమాదమే. మనుషులు దేనినైనా ఓ వ్యసనంలా అలవాటు పడటం రసాయనిక, జీవ సంబంధమైన సమస్య అని ఇటీవల పరిశోధకులు తేల్చి చెప్పారు. అలా చూస్తే గేంబ్లింగ్ అనేది ఓ సమస్యే కాదు.

పేదరికం విషయానికొస్తే, అసలు సమస్య పేదరికమే తప్ప లాటరీలు కాదు. పేద ప్రజలు కూడా తమ కష్టాలు తీరతాయన్న ఆశతోనే లాటరీ ఆడతారు. లాటరీని వారు ఓ ఆటగానే భావించాలంటే, ముందుగా వారి సామాజిక ఆర్థిక స్థితిగతుల్లో మార్పు తీసుకురావలసి ఉంటుంది. అంతేతప్ప లాటరీని నిషేధించడం వల్ల ప్రయోజనం ఉండదు.

పేదలు తాము సంపాదిస్తున్న దాంట్లో అధికభాగాన్ని లాటరీ టిక్కెట్లకే వెచ్చిస్తున్నారన్నది లాటరీలను నిషేధించాలని కోరుతున్నవారు చేస్తున్న వాదన. ఇది లాటరీలకే కాకుండా అన్ని ఉత్పత్తులకూ వర్తిస్తుంది. నెలకు రూ.2000 సంపాదిస్తున్న వ్యక్తి 10 రూపాయలు పెట్టి బియ్యం కొనుగోలు చేసినా, లేక లాటరీ టిక్కెట్ కొన్నా అది అతని సంపాదనలో 0.5% మాత్రమే. నెలకు రూ. 20,000 సంపాదించే వ్యక్తి రూ.10 ఖర్చు చేస్తే అది అతని సంపాదనలో 0.05 % అవుతుంది. అదే సమయంలో 'నీ ఆర్థిక పరిస్థితి బాగోలేదు కాబట్టి నువ్వు లాటరీ టిక్కెట్ కొనకు' అని ఏ వ్యక్తీ సలహా ఇవ్వలేడు. అలా చేస్తే ఎదుటి వ్యక్తి స్వేచ్ఛను హరించినట్టే. ఈ సమస్యను అధిగమించేందుకు ఎన్ఎఎస్పిఎల్ అధ్యక్షుడు ఎడ్వార్డ్ జె. స్టానెక్ ప్రభుత్వానికి ఓ సూచన చేశారు. అదేమిటంటే- ఆర్థికంగా వెనుకబడినవారికోసం ప్రభుత్వమే లాటరీ టిక్కెట్లను డిస్కౌంట్‌రేట్లకు అమ్మడం.

లాటరీ ఆడేవారిలో ఎక్కువమంది తక్కువ ఆదాయవర్గాలవారేనని, వారు నివసించే ప్రాంతాల్లోనే ఎక్కువ రిటైల్ లాటరీ అవుట్‌లెట్లు ఉంటాయన్నది అత్యధికుల అభిప్రాయం. అయితే మధ్యతరగతికి చెందినవారే ఎక్కువగా లాటరీలు ఆడుతున్నట్లు అమెరికాలో జరిగిన ఓ అధ్యయనంలో వెల్లడైంది. సంపన్న వర్గాలతో పోలిస్తే చదరపు కిలోమీటర్‌కు అల్పాదాయవర్గ నివాసితుల సంఖ్య ఎన్నో రెట్లు ఎక్కువ. అందువల్ల సమానావకాశాలు కల్పించే ఉద్దేశంతోనే అల్పాదాయవర్గాలుండే ప్రదేశాల్లో ఎక్కువ రిటైల్ అవుట్‌లెట్లు ఏర్పాటు చేస్తున్నారని భావించవచ్చు.

తమిళనాడులో లాటరీలను నిషేధించినప్పుడు ఆరు లక్షల కుటుంబాలకు జీవనోపాధి పోయింది. లాటరీల వల్ల విద్యావంతులకేగాక నిరక్షరాస్యులకు కూడా ఉపాధి అవకాశాలు కలుగుతాయి. మార్కెటింగ్ వ్యవస్థలో చిట్టచివరి ఉద్యోగి అయిన టిక్కెట్ల అమ్మకందారుకు అక్షర పరిజ్ఞానమేమీ అక్కరలేదు. కేవలం కొన్ని వందల రూపాయల పెట్టుబడి పెడితే చాలు. ఇండియాలో చాలామంది అంగవికలురు, అభాగ్య మహిళలు ఈ వృత్తిలో కొనసాగుతున్నారు.

చైనాలో ఉద్యోగాల్లోంచి ఉద్వాసనకు గురైన 15000మంది కార్మికులు లాటరీ రిటైలర్లుగా ఉపాధి పొందారు. అమెరికాలో లాటరీ నిర్వహించే రాష్ట్రాల్లో 178,000 మంది రిటైలర్లు ఉన్నారు. కేరళలో 35000మంది రిజిష్టర్డ్ ఏజెంట్లు ఉన్నారు. ఇండియాలో దేశం మొత్తంమీద 25 లక్షలమంది వెండర్లు లాటరీ పరిశ్రమద్వారా ఉపాధి పొందుతున్నారు. మునుపటి అధ్యాయాల్లో చెప్పుకున్నట్లు లాటరీలు ఎన్నో ప్రభుత్వ రంగాలకు, స్వచ్ఛంద, సామాజిక సంక్షేమ రంగాలకు చేయూతనిస్తున్నాయి. వాటితోపాటు కొన్ని లక్షలమందికి ఉపాధిని కల్పిస్తున్నాయి. అలాంటప్పుడు లాటరీ పరిశ్రమను కొనసాగించడమే ఉత్తమం.

# అభివృద్ధికి లాటరీల బాసట

**లా**టరీలను నిషేధించాలంటూ మనదేశంలో కొందరు అరచి గీపెడుతున్నారు. కానీ అవే లాటరీలు సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన చిన్నారులకు అన్నం పెడుతున్నాయి. నెదర్లాండ్స్‌లో లాటరీల నిర్వహణ భారతదేశంలో ఎందరో చిన్నారుల భవిష్యత్తుకు బాటవేస్తోంది. ఆశ్చర్యంగా ఉన్నా నమ్మక తప్పని నిజమిది.

బెంగుళూరుతో సహా కర్నాటకలోని పలుచోట్ల లాటరీలకు వ్యతిరేకంగా అనేకమంది నిరసనలతో హోరెత్తిస్తున్నారు. విచిత్రమేమిటంటే - కర్నాటకలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజనపథకం సవ్యంగా సాగేందుకు లాటరీలు పరోక్షంగా దోహదపడుతున్నాయి.

ఎక్కడో పరాయిదేశంలో లాటరీలు నిర్వహిస్తుంటే, వాటివల్ల మనదేశంలో చిన్నారులకు ప్రయోజనం చేకూరడమేమిటన్న సందేహం కలగడం సహజమే. నెదర్లాండ్స్‌కు చెందిన నేషనల్ పోస్ట్‌కోడ్ లాటరీ (ఎన్.పి.ఎల్) తన టర్నోవర్‌లో 60 శాతాన్ని విరాళంగా ఇస్తోంది. ప్రపంచవ్యాప్తంగా పేదరిక నిర్మూలన కోసం, మానవహక్కుల పరిరక్షణ, ప్రకృతి సంరక్షణ కోసం కృషిచేస్తున్న నలభై స్వచ్ఛందసంస్థలకు ఈ డబ్బు అందుతోంది. భారతదేశానికి చెందిన ప్రథమ్ అనే ప్రభుత్వేతర స్వచ్ఛందసంస్థ వాటిలో ఒకటి. 2001లో ఎన్.పి.ఎల్. వివిధ స్వచ్ఛంద సంస్థలకు 177 మిలియన్ యూరోలను (213 మిలియన్ డాలర్లు) విరాళంగా ఇచ్చింది. ఈ విధంగా లబ్ధిపొందిన సంస్థల్లో నోవిబ్, వరల్డ్‌వైడ్ ఫండ్ ఫర్ నేచర్, రెడ్‌క్రాస్, యునిసెఫ్, గ్రీన్‌పీస్, మెడిసిన్స్ శాన్స్ ఫ్రాంటియర్స్, ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ వంటివి ఉన్నాయి.

నెదర్లాండ్స్‌కు చెందిన ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్ సహకారాత్మక అభివృద్ధికోసం కృషిచేసే సంస్థ. దానికి అనుబంధంగా పనిచేసే నోవిబ్

1956లో ఏర్పాటైంది. భారతదేశంలో ప్రతి చిన్నారికీ అక్షరజ్ఞానం నేర్పేందుకు కృషిచేస్తున్న స్వచ్ఛందసంస్థ ప్రథమ్‌తో నోవిబ్ చేతులు కలిపింది. ముంబాయి (బొంబాయి), గుజరాత్, ఢిల్లీ, రాజస్థాన్, బీహార్‌లలో ప్రథమ్-నోవిబ్‌లు సంయుక్తంగా అమలుచేస్తున్న సామాజిక కార్యక్రమాలకు నెదర్లాండ్స్ లాటరీద్వారా ఏడాదికి 30 మిలియన్ రూపాయల ఆర్థికసాయం అందుతోంది.

ప్రథమ్-నోవిబ్‌ల ఆధ్వర్యంలో బ్రిడ్జ్‌కోర్సులు (6-11 ఏళ్ల వయసున్న పిల్లలను బడికి పంపేందుకు సన్నద్ధం చేయడం), బాలసఖి క్లాసులు (చదువులో వెనకబడినవారికోసం), బాల్వాడీ క్లాసులు (ప్రీస్కూల్) నిర్వహిస్తున్నారు. ఢిల్లీలో ప్రస్తుతం 79 బ్రిడ్జ్ కోర్సులు, 347 బాలసఖి క్లాసులు, 46 బాల్వాడీల ద్వారా 9000 మంది పిల్లలకు లబ్ధి చేకూరుతోంది. రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో బ్రిడ్జ్‌కోర్సులతో పాటు పాఠశాలలులేని గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలకోసం ప్రథమ్ ఎడ్యుకేషన్ సెంటర్లు (పి.ఇ.సి) కూడా నడుస్తున్నాయి. కమ్యూనిటీ చిల్డ్రన్స్ సెంటర్లు (సి.సి.సి.) పిల్లలకు సాంప్రదాయమైన విద్యతోపాటు క్రియాశీలతతో కూడిన చదువును బోధిస్తున్నాయి. ఏకమొత్తంగా 150 బ్రిడ్జికోర్సులు, 32 పి.ఇ.సి.లు, ఒక సి.సి.సి.ల ద్వారా 9000 మంది పిల్లలకు అక్షరజ్ఞానం కలుగుతోంది. ఇలాంటి ప్రాజెక్టుల ద్వారా పాట్నా (బీహార్)లో 1500 మంది పిల్లలకు అక్షరజ్ఞానం కలుగుతోంది. 2001 భూకంపం అనంతరం ప్రథమ్-నోవిబ్‌లు తమ సామాజిక కార్యకలాపాలను గుజరాత్‌కు విస్తరించాయి. ప్రస్తుతం ఆ రాష్ట్రంలో ఈ సంస్థల పుణ్యమా అని 16,000మంది పిల్లలు చదువుకోగలుగుతున్నారు. ముంబాయిలో బోధనాపద్ధతుల్లో కొత్తరీతులను ప్రవేశపెట్టాయి. చదువు నేర్పడమే కాకుండా, పాఠశాల భవనాల పునరుద్ధరణ కోసం, మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రథమ్-నోవిబ్ శ్రమిస్తున్నాయి. లాటరీలవల్ల సమాజానికి ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని నెదర్లాండ్స్ ప్రజలు గ్రహించి, వాటిని ఆదరిస్తున్నందువల్లే ఇంతటి అభివృద్ధి సాధ్యమవుతోంది.

## విదేశాలపై ఎందుకు ఆధారపడటం?

లాటరీల నిర్వహణ ద్వారా రూ.20,000 కోట్ల రూపాయలవరకూ ఆదాయాన్ని సమకూర్చుకోగల సత్తా మనదేశానికి ఉంది. అలాంటప్పుడు ఇతరదేశాలు అందించే లాటరీ విరాళాలపై ఆధారపడాల్సిన అగత్యమేమిటి? ఇతర పరిశ్రమల్లాగే లాటరీ కూడా ఓ పరిశ్రమే. దాన్ని నిషేధించడమెందుకు? లాటరీల నిర్వహణలో అవకతవకలు జరుగుతున్నమాట నిజమే కావచ్చు. ఇలాంటివి అభివృద్ధికోసం తలపెట్టిన ఏ ప్రాజెక్టులోనైనా సహజమే. లాటరీ... అభివృద్ధికోసం తలపెట్టిన ప్రాజెక్టువంటిది కాకపోవచ్చు. కానీ, దాని సాయంతో అభివృద్ధికి బాటలు వేయవచ్చున్నది మాత్రం ముమ్మాటికీ నిజం. లాటరీలవల్ల గ్రామాలకు గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉండదు. మహా అయితే, ఒక వ్యక్తి లాటరీ టిక్కెట్లను కొనుగోలు చేయడంవల్ల కొంత డబ్బును నష్టపోవచ్చు. అంతే! అభివృద్ధికోసం తలపెట్టే ప్రాజెక్టులవల్ల ఎన్నో ప్రతికూల పరిణామాలు చోటుచేసుకోవచ్చు. (రష్యాలోని చెర్నోబిల్ అణువిద్యుత్ కర్మాగారంలో 1986లో జరిగిన ప్రమాదం ఇందుకు ఉదాహరణ. ఈ సంఘటన అనంతరం 20 మైళ్ల విస్తీర్ణం మేరకు విస్తరించిన రేడియోధార్మిక ప్రభావంవల్ల ఎందరో మరణించారు.) ఇతర పరిశ్రమలతో పోల్చిచూస్తే, లాటరీలవల్ల కలిగే నష్టం బహుస్వల్పం. లాటరీల నిర్వహణలో అవకతవకలకు పాల్పడటంద్వారా కొందరు జేబులు నింపుకుంటూ ఉండవచ్చు. అలాంటివాటిని అరికట్టి, లాటరీల నిర్వహణను పటిష్ఠంగా అమలుచేయవలసిన అవసరం ఉంది. తద్వారా సమకూరిన ఆదాయంతో మన పిల్లలకు చక్కటి చదువులు చెప్పించడమే కాకుండా, అభివృద్ధి చెందుతున్న ఇతర దేశాలకూ సాయపడవచ్చు.

దక్షిణాసియాలో 2004లో 'బాక్సింగ్ డే' రోజున సంభవించిన సునామీవల్ల ఎన్నో దేశాలకు తీరని నష్టం వాటిల్లింది. బాధితదేశాల్లో ఒకటైన శ్రీలంక - లాటరీల నిర్వహణద్వారా సమకూరిన నిధులతో సునామీ బాధితులకు

సాయమందించాలని నిర్ణయించుకుంది. అందుకోసం ఆ దేశానికి చెందిన నేషనల్ లాటరీస్ బోర్డు 2005లో సరానా నేషనల్ లాటరీని ప్రవేశపెట్టింది. శ్రీలంక స్వాతంత్ర్యదినోత్సవంనాడు లాటరీ డ్రా తీస్తారు. దీనిద్వారా 35 మిలియన్ రూపాయల ఆదాయం సమకూరుతుందని శ్రీలంక అంచనా వేస్తోంది. యు.కె.లోని గుడ్‌కాజ్ లాటరీ ఫండ్ డిస్ట్రిబ్యూటర్లలో ఒకటైన బిగ్ లాటరీ ఫండ్ - సునామీ బాధిత ప్రాంతాల్లో సహాయ కార్యక్రమాలకోసం 12 మిలియన్ స్టెర్లింగు పౌండ్లను విరాళంగా ప్రకటించింది. మొదట్లో తమిళనాడు ప్రభుత్వం నిర్వహించిన లాటరీల ద్వారా లభించిన ఆదాయాన్ని ఇండియా - పాకిస్థాన్ యుద్ధ సమయంలో రక్షణ దళాలకోసం వినియోగించారు. అలాగే వికలాంగులు, భిక్షగాళ్ళ పునరావాసానికి కూడా వెచ్చించేవారు. యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన నేషనల్ లాటరీ సంస్థ లాటరీల ద్వారా వచ్చిన ఆదాయంలో 19 బిలియన్ డాలర్లను వికలాంగుల సంక్షేమంకోసం కృషి చేసే సౌతాంప్టన్ డ్రాగన్ ఫ్లై టీమ్‌కు, అలాగే సమస్యలను ఎదుర్కొంటున్న యువతరానికి చేదోడుగా నిలిచే యూత్ టు యూత్ అనే సంస్థకు కూడా అందించింది.2008 ఒలింపిక్స్‌కోసం శిక్షణ పొందేందుకు సింగపూర్‌కు చెందిన ఏడుగురు అథ్లెట్లకు లాటరీ నిధులు దోహదపడ్డాయి. కెనడాలోని బ్రిటిష్ కొలంబియా ప్రాంతంలో కార్యకలాపాలు నిర్వహించే బ్రిటిష్ కొలంబియా లాటరీ కార్పొరేషన్ గత 30 ఏళ్ళలో సమాజాభ్యున్నతికోసం ఆరు బిలియన్ డాలర్లకు పైగా వెచ్చించింది.

1973కు ముందు తమిళనాడు ప్రభుత్వం డిఫెన్స్ ఫండ్ లాటరీ నిర్వహణ ద్వారా 213 లక్షల రూపాయలను సేకరించింది. 1973లో బులియన్ రేట్ల ప్రకారం 10 గ్రాముల బంగారం ధర 200 రూపాయలనుకుంటే ఈ మొత్తం ఇప్పుడు 95.85 కోట్ల రూపాయలకు సమానం. అమెరికాలోని ఫ్లోరిడా మరియు మిచిగాన్ రాష్ట్రాలు లాటరీ నిధుల ద్వారా వచ్చిన ఆదాయంలో విద్యాభివృద్ధికోసం వరుసగా 15 బిలియన్లు, 13 బిలియన్ డాలర్లు కేటాయించాయి. మరో రెండు రాష్ట్రాలు పర్యావరణ ప్రాజెక్టులకోసం ఒక్క

2005 సంవత్సరంలోనే 176 మిలియన్ డాలర్లను కేటాయించాయి. అమెరికాలోని రెండు రాష్ట్రాలు మరియు ఆస్ట్రేలియా సంయుక్తంగా 2005లో ఆరోగ్య సంరక్షణ ప్రాజెక్టులకు 901 మిలియన్ డాలర్లను లాటరీల ద్వారా లభించిన ఆదాయంనుంచి అందించాయి. 2005లో నెదర్లాండ్స్ స్టేట్ లాటరీ 6000 మిలియన్ యూరోలను (సుమారు 30,000 కోట్ల రూపాయలు) ప్రజారోగ్యం, పర్యావరణం తదితర రంగాలకు కేటాయించింది. న్యూజీలాండ్, సింగపూర్ వంటి చిన్న దేశాలు సైతం లాటరీల ద్వారా బిలియన్ల కొద్దీ డాలర్లను సంపాదించడమే కాకుండా వీటిలో అధికమొత్తాలను సంక్షేమ కార్యక్రమాలకు వినియోగించాయి.

## అంతర్జాతీయ లాటరీ

నిజానికి, ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో జరిగే అభివృద్ధిపనుల కోసం అంతర్జాతీయస్థాయిలో ఒక లాటరీని నిర్వహించాలన్న ప్రతిపాదన 1970 నుంచీ నలుగుతూనే ఉంది. మొట్టమొదటగా ఘనా 1972లో ఈ ప్రతిపాదన చేసింది. 2002లో 'అభివృద్ధికి ఆర్థికసాయం' అనే అంశంపై జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఫిన్‌లాండ్ అధ్యక్షుడు టార్జా హలోనెన్ కూడా ఈ ప్రస్తావన తీసుకువచ్చారు. ప్రపంచవ్యాప్తంగా అనేకదేశాల్లో లాటరీలవల్ల చేకూరుతున్న ప్రయోజనాలను పరిశీలించిన మీదటే ఇలాంటి ప్రతిపాదనలు వెలుగుచూస్తున్నాయన్న విషయం నిర్వివాదం. గతంలో మాదిరిగా లాటరీలను ఇప్పుడు ఎవరూ తక్కువచేసి చూడటం లేదు. 1970 వరకూ రిటెయిలర్లుగా వ్యాపారం ప్రారంభించి, ఆపరేటర్లస్థాయికి చేరుకున్న వ్యాపారవేత్తల చేతుల్లోనే లాటరీలు ఉండేవి. అప్పట్లో లాటరీల నిర్వహణలో పొరపాట్లు, అవకతవకలు జరిగేవన్న మాట నిజం. కానీ, ప్రస్తుతం లాటరీల నిర్వహణ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా పారదర్శకంగా జరుగుతోంది. అవకతవకలకు ఆస్కారమే లేదు. ప్రధాన, బహుళజాతి కార్పొరేషన్ సంస్థలే ఇప్పుడు లాటరీలను నిర్వహిస్తున్నాయి. దీనివల్ల లాటరీల నిర్వహణలో వృత్తిగతమైన

నైపుణ్యం ఉట్టిపడుతోంది. బహుళజాతి సంస్థలు తమ మార్కెటింగ్ టెక్నిక్కులతో మధ్యతరగతి ప్రజలను కూడా లాటరీల వైపు ఆకర్షించగలుగుతున్నాయి. లాటరీల నిర్వహణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రభుత్వం అందిపుచ్చుకోవాలి. లాటరీల పట్ల ప్రజల దృక్పథంలో చోటుచేసుకున్న మార్పును గమనించాలి. లాటరీల ద్వారా సమకూరిన డబ్బుతో అభివృద్ధిపనులకు నిధులు సమకూర్చవచ్చన్న విషయాన్ని ఇకనైనా గ్రహించాలి.

ఎర్స్కైన్ చిల్డర్స్, బ్రియాన్ ఉర్క్హార్ట్‌లు 1994లో సమర్పించిన ఓ అధ్యయనపత్రంలో వనరులు సమకూర్చుకునేందుకు ఐక్యరాజ్యసమితి లాటరీ నిర్వహణను చేపట్టాలని సూచించారు. సెక్రటరీ జనరల్ అధీనంలో ఓ ప్రత్యేక అథారిటీ ఆధ్వర్యంలో ఏటా యునైటెడ్ నేషన్స్ లాటరీని నిర్వహించడంద్వారా నేరుగా నిధుల సమీకరణకు పూనుకోవచ్చునని పైన పేర్కొన్న అధ్యయనవేత్తలు అభిప్రాయపడ్డారు. ఫిన్‌లాండ్ మాజీ అధ్యక్షుడు మర్టి అతిసారి కూడా ఇటీవల గ్లోబల్ లాటరీ విషయాన్ని ముందుకు తెచ్చారు. హెల్సింకీలోని యునైటెడ్ నేషన్స్ యూనివర్శిటీ, యు.ఎన్-డి.ఇ.ఎస్.ఎ. సంయుక్తంగా 2003లో 'ఆర్థికంగా పుంజుకునేందుకు సరికొత్త మార్గాలు' అనే అంశంపై ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీకి చెందిన సర్ ఆంథోనీ బి. అట్కిన్‌సన్ నేతృత్వంలో ఓ ప్రాజెక్టును చేపట్టాయి. ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు లాటరీల ద్వారా వనరులను సమకూర్చుకోవచ్చని ఈ ప్రాజెక్టుపై అధ్యయనపత్రం సమర్పించిన టోనీ అడిసన్, అబ్దుర్ ఆర్. చౌదరి అభిప్రాయపడ్డారు. గ్లోబల్ లాటరీ నిర్వహించాలంటే, ముందుగా ప్రతిదేశానికీ జాతీయస్థాయిలో లాటరీ నిర్వహించుకునేందుకు అనుమతి ఇవ్వాలి. గ్లోబల్ లాటరీ కార్యకలాపాలన్నింటినీ ఒకే సంస్థ చేతులమీదుగా జరిగేలా చూడాలి. గ్లోబల్ లాటరీ ద్వారా వచ్చిన లాభాలను ఆయా దేశాలతో కలిసి పంచుకోవాలా లేక ఆయా దేశాల్లోని జాతీయ లాటరీలకు పోటీగా గ్లోబల్ లాటరీని నిర్వహించాలా

అనే అంశంపై అధ్యయనపత్రంలో కూలంకషంగా చర్చించారు. జాతీయ లాటరీలకు పోటీగా గ్లోబల్ లాటరీని నిర్వహిస్తామంటే సంబంధిత దేశాలు అంగీకరించకపోవచ్చనే అభిప్రాయాన్ని కూడా వారు వ్యక్తం చేశారు.

ఐక్యరాజ్యసమితి, ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ వంటి ప్రతిష్ఠాత్మకమైన, పేరుప్రఖ్యాతులు గల సంస్థలు గ్లోబల్ లాటరీ గురించి ఆలోచిస్తున్నాయంటే, లాటరీలవల్ల కలిగే ప్రయోజనాలేమిటో అర్థమవుతూనే ఉన్నాయి. ఒకప్పుడు లాటరీలను నిర్వహించిన బ్రిటిష్ మ్యూజియం, కింగ్స్ కాలేజీల అనుభవాలను బట్టి చూసినా, ఇప్పటి సిడ్నీ ఒపెరా హౌస్ అనుభవాలను బట్టి చూసినా లాటరీల నిర్వహణ ద్వారా వచ్చే ఆదాయాన్ని నిర్మాణాత్మక కార్యక్రమాలకు వినియోగించవచ్చని అర్థమవుతుంది. కాబట్టి, లాటరీల నిర్వహణద్వారా ప్రజోపయోగ కార్యక్రమాలను విస్తృతప్రాతిపదికన చేపట్టేందుకు భారతదేశం కూడా ముందడుగు వేయాలి.

# లాటరీల తరతరాల చరిత్ర

## లాటరీ అంటే...

అదృష్టంతో ఫలితం ముడివడి ఉన్న అంశాన్ని లాటరీ అంటారు. లాటరీ అనే పదం డచ్ భాషలో 'లోటెరిజె' అనే మాటనుంచిగాని, 'లోటెరీ' అనే ఫ్రెంచ్ మాటనుంచిగాని ఆవిర్భవించి ఉండవచ్చు. లాటరీకి విశ్వవ్యాప్తమైన నిర్వచనమేమీ లేకపోయినప్పటికీ, ఐరోపా సమాఖ్య (ఇ.యు.)లోని సభ్యత్వ దేశాలకు వర్తించే చట్టం లాటరీలను ఈ క్రింది విధంగా నిర్వచించింది. 'గెలుస్తామనే ఆశతో ప్రజలు పాల్గొనేందుకు వీలు కల్పించే ఆట. దీనిని నిర్వహించే ఆపరేటర్ ప్రజలనుంచి డబ్బు తీసుకుని టిక్కెట్లు ఇస్తాడు. డ్రా నిర్వహించి, గెలిచినవారికి బహుమతి మొత్తాలను అందిస్తాడు.'

'వ్యక్తుల అదృష్టాన్ని బట్టి విజయం వరించే ఒక కార్యక్రమం' అని లాటరీలను నిఘంటువులు నిర్వచిస్తున్నాయి. '...ఆదాయాన్ని పొందగోరే ఎన్నో ప్రభుత్వాలు లాటరీలను అధికారికంగా మంజూరు చేస్తున్నాయి. సొంతంగా నిర్వహిస్తున్నాయి. సాధారణంగా లాటరీలో పాల్గొనేవారు నంబర్లతో కూడిన ఓ రశీదును కొనుగోలు చేస్తారు లేదా తమకు ఇష్టమైన నంబర్లను రాసి ఇస్తారు. వాటిని డ్రా తీయడం ద్వారా విజేతలను నిర్ణయిస్తారు. ఖర్చులు, ప్రభుత్వానికి దక్కవలసిన వాటాను మినహాయించి మిగిలిన సొమ్మును విజేతకు బహుమతిగా అందజేస్తారు. లాటరీని గెలుచుకున్నవారు సాధారణంగా పన్ను కట్టాల్సి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో గరిష్ఠ బహుమతి మిలియన్లలో ఉంటుంది...' అని ఎన్సైక్లోపీడియా బ్రిటానికా వివరించింది.

## నిర్ణయాలు తీసుకునేందుకు లాటరీలు

లాటరీలు ఎంతోకాలంగా ఉన్నాయి. ఇవి ఎప్పుడు మొదలయ్యాయనే విషయంపై చరిత్రకారులకు, మేధావులకు మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నాయి.

లాటరీలను తీయడంపై బ్రెజిల్‌లో కొన్ని ప్రస్తావనలు ఉన్నాయి. అప్పట్లో లాటరీల నిర్వహణ చిత్రంగా ఉండేది. డబ్బుతోగాని, బహుమతులతోగాని లాటరీలకు సంబంధం ఉండేది కాదు. భూమి పంపకాల కోసం, నిర్ణయాలు తీసుకోవడానికి మాత్రమే లాటరీ వేసేవారు. ఇజ్రాయెల్‌కు చెందిన 12 తెగలవారికి భూమి పంపిణీ చేసేందుకు తాను లాటరీ వేశానని 'ఓల్డ్ టెస్ట్‌మెంట్' అనే పుస్తకంలో రచయిత జోషువా పేర్కొన్నారు. వైపరీత్యాలు సంభవించడానికి కారకులెవరో తెలుసుకునేందుకు లాటరీ నిర్వహించినట్లు జోనా మరియు శామ్యూల్-1 రాసిన పుస్తకాల్లో ఉంది. జీసస్‌ను శిలువ వేశాక, ఆయన దుస్తుల్ని ఎవరు తీసుకోవాలో తేల్చుకునేందుకు సైనికులు లాటరీ వేసి నిర్ణయించుకున్నారని 'న్యూ టెస్ట్‌మెంట్'లో ఉంది. అలాగే జుదా మరణానంతరం శిష్యులు లాటరీద్వారా ఆయన స్థానంలో మత్తయ్యను ఎన్నుకున్నారట.

లాటరీ ద్వారా నిర్ణయాలు తీసుకోవడమనే పద్ధతి ఇప్పటికీ ఉంది. రాజస్థాన్‌లో గనుల్ని లీజుకిచ్చేందుకు ప్రభుత్వం ఇదే పద్ధతిని అనుసరిస్తోంది. భారతదేశంలో దాదాపు అన్ని రాష్ట్రప్రభుత్వాలూ ఇళ్లను లేదా ఫ్లాట్లను కేటాయించేందుకు లాటరీ పద్ధతినే అనుసరిస్తున్నాయి.

## ప్రాచీనకాలంలో లాటరీలు

గ్రీస్, ఇండియా, రోమ్, చైనా, జపాన్ వంటి దేశాల్లో లాటరీ ఆధారిత గేమ్‌ల నిర్వహణ ప్రాచీనకాలంనుంచీ అమల్లో ఉంది. తమలో మినోటార్ (గ్రీకు పురాణంలో సగం మనిషి, సగం ఎద్దు ఆకారంలో ఉండే జీవి)ను కొలిచే వ్యక్తి ఎవరో నిర్ణయించేందుకు గ్రీకు యువకులు లాటరీ వేస్తారు .ధర్మరాజు జూదమాడి తన రాజ్యాన్ని కౌరవులకు ఎలా ధారాదత్తం చేశాడో 'మహాభారతం' చెబుతుంది. నిడధదేశపు రాజు నలన్ తన ప్రత్యర్థి పుష్కరాణ్‌తో జూదమాడి రాజ్యాన్ని పోగొట్టుకున్న వైనాన్ని 'నలవెంప' పుస్తకం కళ్లకు కడుతుంది. రథాల పందేలను నిర్వహించడం రోమన్‌లకు ఆనవాయితీ.

చైనాలో లాటరీ తొలిసారిగా క్రీస్తుపూర్వం 195లో మొదలైంది. హాన్ రాజ్యానికి చెందిన చెయుంగ్ లియుంగ్ లాటరీని ప్రవేశపెట్టాడని చైనీయుల చరిత్ర చెబుతోంది. తన నగరాన్ని శత్రువులు ఆక్రమించుకున్నప్పుడు యుద్ధంకోసం విరాళాలు ఇవ్వవలసిందిగా హాన్ ప్రజల్ని కోరతాడు. అందుకు ప్రజలెవరూ స్పందించకపోవడంతో హాన్ 'కెనో' అనే ఆటను ప్రవేశపెడతాడు. అదృష్టంతో ముడివడి ఉన్న ఈ ఆటలో పాల్గొనేవారు డబ్బును గాని, ఆస్తినిగాని పణంగా పెట్టి ఆడాలి. అమెరికాలో రైలురోడ్డు ప్రాజెక్టుల్లో పనిచేసేందుకు వలసవెళ్లిన చైనా కార్మికులు 'కెనో' ఆటను అమెరికాకు పరిచయం చేశారు.

## ఐరోపా, అమెరికాల్లో లాటరీలు

పదిహేను, పదహారు శతాబ్దాల్లో ఐరోపాదేశాల్లో లాటరీలు ఎంతో బాగా నడిచాయనేందుకు ఎన్నో ఆధారాలు ఉన్నాయి. చైనీయుల 'కెనో' ఆటను అలా ఉంచితే, బహుమతి రూపంగా నగదును అందజేసే లాటరీని తొలిసారిగా ఇటలీలోని ఫ్లోరెన్స్‌లో 1530లో నిర్వహించారు. ఇటలీనుంచి ఈ ఆట 1533లో ఫ్రాన్స్‌కు పాకింది.

యు.కె.లో తొలిసారిగా 1566లో లాటరీ నిర్వహించారు. యూరోపియన్లు అమెరికాకు వలసపోయినప్పుడు వారితోపాటే ఈ ఆట కూడా అమెరికన్లకు పరిచయమైంది. తదనంతరం 1612లో అమెరికాలో తొలిసారి లాటరీ నిర్వహించారు. ఇంగ్లీషు లాటరీల ప్రభావంతో ఉత్తర అమెరికాలో లాటరీలు మొదలయ్యాయి. దక్షిణ, మధ్య అమెరికాల్లో లాటరీలకు స్పానిష్ లాటరీలు స్ఫూర్తినిచ్చాయి. అమెరికాలో వర్జీనియా రాష్ట్రంలోని జేమ్స్‌టౌన్‌లో ఇంగ్లీషు కాలనీ ఏర్పాటుకోసం ఇంగ్లండు రాజు జేమ్స్-1 లండన్‌లో అధికారికంగా లాటరీ నిర్వహించారు. ఓ ఆస్పత్రిని, నావికుల కోసం ఇళ్లను నిర్మించే ఉద్దేశంతో జార్జియాలో తొలిసారిగా 1784లో లాటరీ నిర్వహించారు. ఆ తరవాత 1790-1839 మధ్య కాలంలో స్క్రైవెన్‌లో ఓ కోర్టు హౌస్, మిల్లెడ్‌గెవిల్లెలో రోడ్లు, అగస్టాలో ఓ అగ్నిమాపకసంస్థతో సహా ఎన్నో సామాజిక

అభివృద్ధిపనులు చేపట్టేందుకు నిధులసమీకరణకోసం లాటరీలే శరణ్యమయ్యాయి.

## లాటరీలు-చర్చిలు

తాము చేపట్టే వివిధ కార్యక్రమాలకు నిధులు సేకరించేందుకు చర్చిలు లాటరీల్లో పాల్గొనేవంటే ఆశ్చర్యంగా ఉంటుంది. జేమ్స్‌టౌన్‌కోసం నిర్వహించిన లాటరీలో మూడు టిక్కట్లకు బహుమతులు లభిస్తే, వాటిలో రెండు టిక్కెట్లు చర్చిలు కొనుగోలు చేసినవే. ఫ్రాన్స్‌లో అనేక చర్చిలను లాటరీలద్వారా లభించిన ఆదాయంతో పునరుద్ధరించారు. 1960లలో కేరళలో కూడా ప్రైవేటు లాటరీల ద్వారా వచ్చిన డబ్బుతో చర్చిలకు లబ్ధి చేకూర్చారు. భారత్‌లో లాటరీలను పోలిన హౌసీ-హౌసీ, తంబోలా వంటి గేమ్‌ల ద్వారా నిధుల సేకరణ జరిపి, వాటిని చర్చిల అభివృద్ధిపనులకు ఉపయోగిస్తారు.

## రుణాలకు బదులు లాటరీలు

19వ శతాబ్దం వరకు ప్రభుత్వ బ్యాంకులు తక్కువ సంఖ్యలో ఉండేవి. 1790కి ముందువరకూ అమెరికాలో చట్టబద్ధమైన బ్యాంకులు కేవలం మూడే ఉండేవి. బ్యాంకులు రుణాలు ఎలా ఇస్తాయో అదేవిధంగా ప్రభుత్వాలు లాటరీల ద్వారా వచ్చిన ఆదాయంలో కొంత మొత్తాన్ని సమాజసేవా కార్యక్రమాలకు, మౌలిక సదుపాయాలకు వెచ్చించేవి. మొదట్లో లాటరీల ద్వారా లభించిన మొత్తంలో 85% బహుమతులుగా ఇచ్చేవారు. మిగతా 15% సంక్షేమ కార్యక్రమాలకు వెచ్చించేవారు. లాటరీలను లాభాలు తెచ్చిపెట్టే సాధనాలుగా కాకుండా సమాజసేవకు, ప్రజావసరాలకు ఉపయోగపడేవిగా భావించేవారు.

## 18వ శతాబ్దం... ఓ గడ్డుకాలం

18వ శతాబ్దంలో వినోదాన్ని అందించే ఆటగా లాటరీ కొత్తరూపాన్ని

సంతరించుకుంది. అదేసమయంలో లాటరీలు ప్రైవేటుపరం కావడమూ మొదలైంది. ఎప్పుడైతే లాటరీల పట్ల ప్రజలు ఆసక్తి కనబరచడం ప్రారంభమైందో అప్పటినుంచీ అవినీతి చోటుచేసుకోవడమూ ఆరంభమైంది. అమెరికా రివల్యూషనరీవార్ సమయంలో లాటరీలకు గడ్డుకాలం దాపురించింది. వాటిని మూసివేయాల్సిన పరిస్థితి దాపురించింది. అమెరికాలో లాటరీలను నిషేధించిన మొదటి రాష్ట్రం న్యూయార్క్. ఆ తరవాత కెనడా నిషేధించింది. 1878నాటికి లూసియానా మినహా అమెరికాలోని అన్ని రాష్ట్రాలూ లాటరీలపై నిషేధం వేటు వేశాయి. లూసియానా 1905లో లాటరీలను బహిష్కరించింది. అయితే స్పెయిన్, నెదర్లాండ్స్ వంటి దేశాల్లో లాటరీలు క్రమేణా ప్రజాదరణను కూడగట్టుకున్నాయి. అమెరికాలోని న్యూహాంప్‌షైర్ 1964లో లాటరీ వ్యతిరేక చట్టాలను సడలించి, గుర్రపుపందాలతో లాటరీలను అనుసంధానించింది. ప్రభుత్వ అధీనంలో లాటరీని పునరుద్ధరించింది. దాంతో మిగిలిన రాష్ట్రాలన్నీ అదే బాటను అనుసరించాయి. 1980ల నాటికి అనేక దేశాలు కొత్త రకం బహుమతులు, సరికొత్త ఆటలు, ఇన్‌స్టంట్ లాటరీ, మల్టిపుల్ గేమ్ మార్కెటింగ్ వంటివాటితో లాటరీలను మరింత ఆకర్షణీయంగా రూపొందించాయి.

## ముస్లిం, కమ్యూనిస్టు దేశాల్లో లాటరీలు

ముస్లిమ్ చట్టాలు లాటరీలను నిషేధిస్తున్నా మొరాకో వంటి అనేక ముస్లిమ్ దేశాలు లాటరీలను నిర్వహిస్తున్నాయి. రష్యా, కజక్‌స్థాన్, చైనా తదితర కమ్యూనిస్టు దేశాలు కూడా లాటరీలను నిర్వహిస్తున్నాయి.

## లాటరీలు - లాభనష్టాలు

యు.కె.లో 1826లో లాటరీలపై నిషేధం విధించారు. ఆ తరవాతనుంచి ఆ దేశంలో లాటరీలు లేవు. 1994లో ప్రభుత్వం ఆధ్వర్యంలో నేషనల్ లాటరీ ప్రారంభమైంది. బ్రిటన్ ప్రజలు ఇతర ఐరోపా దేశాలు నిర్వహించే

లాటరీల్లో పాల్గొంటూ ఉండటంవల్ల ఆయాదేశాలకు లబ్ధి చేకూరుతోంది. ఈ విషయాన్ని గమనించిన ప్రభుత్వం స్వయంగా లాటరీ నిర్వహణకు పూనుకుంది.

ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ప్రభుత్వాలు లాటరీలను నిర్వహిస్తున్నాయి. వాటిద్వారా వచ్చిన లాభాలతో మౌలికసదుపాయాలను కల్పిస్తున్నాయి. కళలకు, విద్య, వైద్య, క్రీడారంగాలకు, సమాజసేవకు వెచ్చిస్తున్నాయి. అయితే ఇతర ప్రాజెక్టుల మాదిరిగానే లాటరీల్లోనూ వివాదాలు చోటుచేసుకోక పోలేదు. లాటరీల్లో జరుగుతున్న అక్రమాలను ఎత్తి చూపేవారు, లాటరీలు దుర్వ్యసనంగా మారాయని విమర్శించేవారూ ఉన్నారు. లాటరీలకు కొందరు అలవాటుపడుతున్నారన్న మాట నిజమే కావచ్చు. కానీ లాటరీ పొగాకు, మద్యం వంటి చెడు వ్యసనం కాదు. లాటరీలకు అలవాటుపడితే ఆరోగ్య పరమైన సమస్యలేవీ తలెత్తవు. పొగాకు, మద్యం వంటి వ్యసనాలకు ప్రజలు లోనై, అనారోగ్యం పాలుబడితే వారికి చికిత్స చేయించేందుకు ప్రభుత్వంపై భారం పడుతుంది. లాటరీకంటే ఇంటర్నెట్‌ను అదేపనిగా సర్ఫ్ చేయడమే ప్రజలకు సమస్యగా పరిణమించే ప్రమాదం ఉందని ఐరోపా సమాఖ్య సైకాలజిస్టులు కొందరు 1999లో జరిపిన ఓ అధ్యయనంలో తేల్చారు.

అవకతవకల విషయానికొస్తే, లాటరీల్లో అక్రమాలు జరుగుతున్నాయంటూ నిషేధించడం సరైన పరిష్కారం కాదు. లాటరీలను నిషేధించిన రాష్ట్రాల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన లాటరీ టిక్కెట్ల విక్రయం ఊపందుకుంటోంది. దాంతో సమస్య మరింత తీవ్రతరం అవుతుంది. పైపెచ్చు లాటరీలను నిషేధించడంవల్ల ప్రభుత్వానికి ఆదాయపరంగానూ కష్టం వాటిల్లుతుంది. ఒక పక్క ఇంటర్నెట్ ద్వారా విదేశీ లాటరీలు అందుబాట్లోకి వచ్చేశాయి. ప్రజల విదేశీమారకద్రవ్య వ్యయంపై ఉన్న ఆంక్షలను ప్రభుత్వాలు సడలిస్తున్నాయి. ఇటువంటి సమయంలో లాటరీలను నిషేధించడం వివేకవంతమైన చర్య అనిపించుకోదు. బ్రిటన్‌లో లాటరీలు విజయవంతంగా

నడుస్తున్నాయి. దీనిపై నిశితంగా అధ్యయనం చేసి, అక్కడి విధానాలను ఇక్కడి పరిస్థితులకు అనుగుణంగా మలచుకుని లాటరీల్లో అవకతవకలను, లోపాలను నివారించి, నిర్వహించాలి.

## లాటరీలు-విద్య

పందొమ్మిదో శతాబ్దంలో చిన్నారుల చదువుకు అవసరమైన నిధుల కోసం లోటో తరహా గేములను నిర్వహించేవారు. ఈ తరహా ఆటలు పిల్లల్లో చరిత్ర, లెక్కలు, జంతువులు, మొక్కలు వంటి అంశాలకు సంబంధించి అవగాహనను పెంపొందించేవి.

## పునర్వ్యవస్థీకరణ జరగాలి

లాటరీలను నిషేధించడంవల్ల సమస్య పరిష్కారం కాదు సరికదా మరింత తీవ్రమవుతుంది. లాటరీల ద్వారా భారతదేశంలో ఐదు మిలియన్లమంది ఉపాధి పొందుతున్నారు. వీరిలో అత్యధికులు నిరక్షరాస్యులు. పైగా లాటరీ అనేక ఇతర పరిశ్రమలకు చేయూతనందిస్తోంది. లాటరీలు ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చడం, లక్షలమందికి ఉపాధి కల్పించడమే కాకుండా అనేక సమాజసేవాసంస్థలకు కూడా సహకారం అందిస్తున్నాయి. చెన్నైలోని కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ వంటి సంస్థలకు లాటరీలు ఆర్థికసాయం అందిస్తున్నాయి.

లాటరీలు నిర్వహించే ప్రతిదేశంలోనూ, వాటిద్వారా వచ్చే ఆదాయంలో కొంతమొత్తాన్ని సమాజసేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నాయి. లాటరీలు కాదు... పేదరికమే అసలైన సమస్య. కాబట్టి, నిషేధం విధించడానికి బదులు లాటరీవ్యవస్థను పునర్వ్యవస్థీకరిస్తే అందరికీ ప్రయోజనం కలుగుతుంది.

# లాటరీల (నిషేధ) బిల్లు, 1999- ప్రొసీడింగ్స్ కమిటీ సమావేశం

లాటరీల (నిషేధ) బిల్లు, 1999 పై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చర్చకు చేపట్టింది. కమిటీ ఆరుసార్లు సమావేశమై బిల్లుపై క్షుణ్ణంగా చర్చించింది. దరిమిలా లాటరీలను నిషేధించే విషయమై పత్రికలలో ప్రకటనలు ఇచ్చి ప్రజాభిప్రాయాన్ని సేకరించాలని 2000వ సంవత్సరంలో రాజ్యసభ నిర్ణయించింది. ఈ మేరకు పత్రికల్లో ప్రకటనలు ఇచ్చిన వారంరోజులకే ప్రజలనుంచి 70,000కు పైగా స్పందనలు వెల్లువెత్తాయి. వారిలో చాలామంది లాటరీలను నిషేధించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని విమర్శించడం గమనార్హం. లాటరీలను కొనసాగించాలంటూ కోరినవారిలో 26మంది పార్లమెంటు సభ్యులు కూడా ఉన్నారు. వారంతా లాటరీల (నిషేధ) బిల్లు, 1999ను వ్యతిరేకిస్తూ ఒక వినతిపత్రాన్ని సైతం అందజేశారు. ఒకే ఒక్క ఎం.పి. మాత్రం లాటరీల నిషేధాన్ని సమర్థించారు. లాటరీల నిషేధ బిల్లు, 1999పై చర్చించేందుకు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఏర్పాటు చేసిన సమావేశానికి ఈ పుస్తక రచయిత కూడా హాజరై. కీలకమైన ఎన్నో అంశాలను లేవనెత్తారు.

లాటరీలను నిషేధిస్తే నిరుద్యోగ సమస్య మరింత మితిమీరుతుందని పలువురు పార్లమెంట్ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. లాటరీ వ్యాపారానికి 1,00,000 టన్నుల కాగితం అవసరమవుతుంది. లాటరీలను నిషేధిస్తే కాగితం పరిశ్రమ సంక్షోభంలో పడుతుందని, లాటరీ పరిశ్రమపై ఆధారపడిన 50 సెక్యూరిటీ ప్రింటర్ల భవితవ్యం కూడా అంధకారమయమవుతుందని ఎం.పి.లు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

అయితే లాటరీ వ్యాపారులు ఇప్పటికే సింగిల్ డిజిట్ లాటరీలవంటి ఇతర

మార్గాలను ఎంచుకున్నారని, కాబట్టి లాటరీలను నిషేధించడం వల్ల లాటరీ లాబీ చెబుతున్నట్లుగా ఉపాధి కోల్పోయే వారి సంఖ్య పెద్దగా ఏమీ ఉండదని లాటరీల నిషేధాన్ని సమర్థిస్తున్న పలు వేదికలు వాదించాయి. పైగా లాటరీల నిషేధం వల్ల రాష్ట్ర ప్రభుత్వాలకు కలిగే నష్టాన్ని కేంద్రప్రభుత్వం అదనపు గ్రాంట్లు మంజూరు చేయడం ద్వారా భర్తీ చేయవచ్చని కూడా అవి సలహా ఇచ్చాయి.

లాటరీల నిషేధంవల్ల కలిగే నష్టాలను పేపర్ మిల్లులు, ప్రింటింగ్ ప్రెస్సులు, రవాణా సంస్థల యాజమాన్యాలు ఏకరవు పెట్టాయి. లాటరీలను నిషేధించడానికి బదులు వాటిని క్రమబద్ధీకరించాలని ప్రింటర్లు కోరారు. లాటరీ వ్యాపారంలో అక్రమాలను అరికట్టాలంటే ప్రైవేటు లాటరీలను నిషేధించడమే సరైన మార్గమని లాటరీ వ్యాపారులు, ఏజెంట్ల సంఘాలు సూచించాయి. ఏకమొత్తంగా లాటరీలను నిషేధించడం వల్ల ప్రభుత్వం పెద్దమొత్తంలో ఆదాయాన్ని నష్టపోవలసి వస్తుందని, లాటరీ అనుబంధ పరిశ్రమలకు కూడా నష్టం తప్పదని అవి హెచ్చరించాయి. పైపెచ్చు 25 లక్షలమంది ఉపాధి కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశాయి. సారా, ధూమపానం వంటి అనేక వ్యసనాలు లాటరీలకంటే ప్రమాదకరమైనవి. వాటివల్ల ప్రజారోగ్యానికి తీరని నష్టం వాటిల్లుతోంది. వాటన్నింటినీ వదిలి కేవలం లాటరీలను మాత్రమే నిషేధించడంలో అర్థమేమిటి? అన్నది వారి వాదన. లాటరీల వ్యాపారం వల్ల వచ్చే ఆదాయంలో కొంతమొత్తం ఆస్పత్రులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజారోగ్యానికి కృషి చేసే సంస్థలకు విరాళంగా అందుతోందని, అందువల్ల లాటరీలను నిషేధించకూడదని సామాజిక సంస్థల ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు.

లాటరీల నిర్వహణపై ప్రభుత్వం నిఘా ఉంచాలని, లాటరీలను డ్రా తీయడం, ఫలితాలను ప్రకటించడం వంటివి ప్రభుత్వ పర్యవేక్షణలోనే జరగాలని, ప్రైజ్ మనీని ఎవరూ తీసుకోనప్పుడు ఆ డబ్బును ప్రజా సంక్షేమానికి

వినియోగించాలని ... ఇలా ప్రభుత్వానికి అనేక సూచనలు వచ్చాయి. లాటరీల నిర్వహణ ద్వారా లభించిన ఆదాయంలో ఎంతో కొంత మొత్తాన్ని తీసుకోవడం కాకుండా ప్రభుత్వం ఆమోదించిన టిక్కెట్ల స్థూల విలువలో నిర్దిష్ట శాతం రాష్ట్ర ప్రభుత్వాలకు దక్కే పద్ధతి ఉండాలని మరికొందరు సూచించారు. ఇలా చేయడం వల్ల టిక్కెట్లను పెద్ద సంఖ్యలో ముద్రించడం వంటి అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని వారు అభిప్రాయపడ్డారు. టిక్కెట్ల అమ్మకాలపై ప్రభుత్వ పర్యవేక్షణ ఉండాలని మరికొందరు సలహా ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం రోజుకు నిర్వహించే లాటరీల డ్రాలపై కూడా నియంత్రణ ఉండాలని ఇంకొందరు అన్నారు. ప్రభుత్వాలు గుర్రపు పందేలు, కేసినోలు, ఫార్వర్డ్ ట్రేడింగ్ వంటివాటిని నిషేధించలేదు. స్టాక్ మార్కెట్ల నిర్వహణ, షేర్ల లావాదేవీలు కూడా ఒక విధంగా జూదం లాంటివే. పైపెచ్చు వాటి నిర్వహణను మరింత సరళీకరణ చేస్తున్నాయి.. అలాంటప్పుడు లాటరీలరపై మాత్రమే కన్నెర్ర చేయడమెందుకు? అని ఒకరు ప్రశ్నించారు.

లాటరీల నిషేధ బిల్లుకు కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు మద్దతు ఇచ్చాయి. మరికొన్ని రాష్ట్రాలు షరతులతో కూడిన మద్దతును ప్రకటించాయి. బిల్లును వ్యతిరేకించిన ప్రభుత్వాలు... లాటరీలను నిషేధించడంవల్ల నిరుద్యోగ సమస్య మితిమీరిపోతుందని ఆందోళన వ్యక్తం చేశాయి. లాటరీ వ్యాపారం పారదర్శకంగా, సమర్ధంగా నడిచేందుకు వీలుగా దానిని క్రమబద్ధీకరణకు ఒక యంత్రాంగాన్ని రూపొందించాలని అరుణాచల్ ప్రదేశ్ ప్రభుత్వం సూచించింది. రోజువారీ డ్రాలను 20 లేదా 25కు పరిమితం చేయాలి. లాటరీలకు అర్థం పర్దం లేని పొట్టి పేర్లు కాకుండా సరైన పేర్లను పెట్టాలి. ఒక ఏడాదిలో నిర్వహించే బంపర్ డ్రాలను నాలుగు లేదా ఐదుకు పరిమితం చేయాలి. లాటరీల మొత్తం టర్నోవర్‌లో ఐదు నుంచి ఏడు శాతం లాభాన్ని రాష్ట్రాలు తీసుకోవాలి. లాటరీ టిక్కెట్ల ప్రింటింగ్‌ను ప్రభుత్వాలే సొంత ఖర్చుతో చేపట్టాలి. మొత్తం టర్నోవర్‌లో 50 శాతం డబ్బును ప్రైజ్‌మనీగా ఇవ్వాలి. ఈ బహుమతులను ప్రభుత్వమే విజేతలకు అందించాలి... ఇవీ అరుణాచల్ ప్రదేశ్

చేసిన సూచనలు.

తమకు చాలినంత ఆర్థిక వనరులు లేని కారణంగా తాము నిధుల సేకరణకు లాటరీలపై ఆధారపడక తప్పదని గోవా, సిక్కిం, మేఘాలయ, మణిపూర్ ప్రభుత్వాలు తేల్చి చెప్పాయి. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే లాటరీలను నిషేధిస్తే, ప్రైవేటు గ్రూపులు రాష్ట్రాలపై ఒత్తిడి తెచ్చి, ఆ అవకాశాన్ని సొంతం చేసుకునేందుకు పైరవీలు ప్రారంభిస్తాయని మహారాష్ట్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. లాటరీల నిర్వహణ రాజ్యాంగంలోని ఏడో షెడ్యూల్ ప్రకారం రాష్ట్రాల జాబితాలో ఉండటం వాటికి కలిసి వస్తుందని ప్రభుత్వం పేర్కొంది. లాటరీల నిర్వహణ వేర్వేరు రాష్ట్రాల్లో వేర్వేరు విధాలుగా ఉన్నదని, ఈ విషయంలో ఏకీకరణ అవసరమని పంజాబ్ సూచించింది. లాటరీ నిర్వహణ ద్వారా వసూలయ్యే డబ్బులో నిర్దిష్ట మొత్తాన్ని బహుమతులకోసం వెచ్చించేలా నిబంధనలు విధించాలని, పారదర్శకతకోసం కంప్యూటరైజ్డ్, శాటిలైట్ లింక్డ్ లాటరీలను నిర్వహించాలని కోరింది. సిక్కిం ప్రభుత్వం ఒక రోజున లేదా ఒక నెలలో నిర్వహించే డ్రాల సంఖ్యపై నియంత్రణ ఉండాలని సూచించింది.

బిల్లుపై సుదీర్ఘంగా సాగిన చర్చోపచర్చలకు ముగింపునిస్తూ కమిటీ చైర్మన్ కీలకమైన వ్యాఖ్యలు చేశారు. ఏ లాటరీలను నిషేధించే విషయమై కమిటీలోని సభ్యులమధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఆ విషయాన్ని అలాఉంచితే, బిల్లుపై రాజకీయవర్గాల మధ్య ప్రభుత్వం ఏకాభిప్రాయం సాధించాల్సిన అవసరం ఉందని సభ్యులు అభిప్రాయపడ్డారు. కాబట్టి ఆ దిశగా ప్రభుత్వం నడుం బిగించాలి అని ఆయన అన్నారు.

# లాటరీల వల్ల ఎన్నో ప్రయోజనాలు

- లాటరీలవల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. గత చరిత్రను పరిశీలిస్తే అందుకు ఎన్నో ఉదాహరణలు కనిపిస్తాయి.

- చైనాలో లాటరీల ద్వారా సమకూరిన ఆదాయాన్ని రక్షణరంగంలో వినియోగించిన దాఖలాలు ఉన్నాయి. గ్రేట్‌వాల్ ఆఫ్ చైనా నిర్మాణంలోనూ లాటరీల ఆదాయాన్ని వినియోగించారు.

- ప్రజా సంక్షేమం కోసం లాటరీని నిర్వహించిన ఘనత అగస్టస్ సీజర్‌దేనని చెబుతారు. లాటరీల ద్వారా సంపాదించిన మొత్తాన్ని ఆయన రోమ్ నగరాభివృద్ధికి ఖర్చు చేశారట.

- ఫ్రాన్సులోని ఎల్. ఎక్లూజ్ అనే నగరంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కావలసిన నిధుల సేకరణకు 1420లో లాటరీని నిర్వహించారు. లాటరీలో గెలిచినవారికి నగదు కాకుండా అనేక వస్తువులను బహుమతులుగా ఇచ్చారట.

- బెల్జియంలో 1465లో చర్చిలు, అనాథాశ్రమాలు, మత్స్యకారులకు ఇళ్ళు నిర్మించేందుకు లాటరీలు నిర్వహించారు.

- 1539లో అప్పటి ఫ్రాన్స్‌రాజు ఫ్రాన్సిస్ I తన ఖజానా ఖాళీ కావడంతో నిధుల సేకరణకు లాటరీలనే సాధనంగా ఎంచుకున్నారు.

- అమెరికాలోని వర్జీనియాలో జేమ్స్‌టౌన్ అనే బ్రిటిష్ కాలనీ నిర్మాణానికి 1612లో అప్పటి ఇంగ్లండ్ రాజు జేమ్స్ I లాటరీ ద్వారా నిధులు సేకరించారు.

- అమెరికాలోని న్యూ ఆమ్‌స్టర్‌డామ్‌లో నిరుపేదలను ఆదుకునే ఉద్దేశంతో నెదర్లాండ్స్ ప్రభుత్వం1665లో లాటరీ నిర్వహించింది. ఇప్పటి న్యూయార్క్ నగరమే ఒకప్పటి న్యూఆమ్‌స్టర్‌డామ్.

- 18వ శతాబ్దంలో లాటరీల ద్వారా లభించిన ఆదాయంతో బోస్టన్ నగరంలోని చరిత్రాత్మక ఫాన్యుయిల్ హాల్ పునర్నిర్మాణం చేపట్టారు. ఈ హాల్‌ను 1742లో పీటర్ ఫాన్యుయిల్ నిర్మించారు. ఇక్కడ ఎన్నో చరిత్రాత్మకమైన సమావేశాలు జరగడంతో ఈ హాల్‌ను స్వేచ్ఛా ఊయలగా అభివర్ణించేవారు.

- న్యూయార్క్ నగర పాలక సంస్థ 1746లో తొలిసారిగా లాటరీ నిర్వహించి, వచ్చిన ఆదాయాన్ని నగరాభివృద్ధికి ఖర్చు చేసింది. కొలంబియాలో కింగ్స్ కాలేజీ స్థాపనకోసం అదే ఏడాది మరికొన్ని లాటరీలను నిర్వహించారు.

- లాటరీలద్వారా గడించిన ఆదాయంతో 1753లో బ్రిటిష్ మ్యూజియం ఏర్పాటైంది.

- యుద్ధాలలో గెలుపొందేందుకు ఫ్రాన్స్‌కు లాటరీలు పరోక్షంగా తోడ్పడ్డాయి. ప్రజలు యుద్ధాలలో పాల్గొనాలంటే వారికి ఆయుధాలు సమకూర్చాలి. అందుకోసం 1756లో న్యూయార్క్‌లో లాటరీ నిర్వహించారు. అదే ఏడాది యుద్ధ ఖైదీలను ఉంచేందుకు జైలు అవసరం కావడంతో దాని నిర్మాణంకోసం మరోసారి లాటరీ నిర్వహించారు.

- 1758లో యుద్ధం కారణంగా అప్పుల్లో కూరుకుపోయిన అల్బనీ నగరం తిరిగి పుంజుకునేందుకు లాటరీనే ఆశ్రయించింది.

- గియొవన్నీ గియకొమా కేసనోవా సలహాపై ఫ్రాన్స్ రాజు లూయిస్ 1759లో లాటరీ రాయల్ ఆఫ్ మిలటరీ స్కూల్‌ను స్థాపించాడు. ఫ్రాన్స్‌ను అప్పుల ఊబినుంచి ఈ స్కూల్ గట్టెక్కించింది. ఆ తరవాత ఇది లాటరీల

నిర్వహణకు కేంద్రస్థానంగా ప్రసిద్ధికెక్కింది.

- న్యూయార్క్ నగరంలో 1761లో రెండుసార్లు లాటరీ నిర్వహించారు. శాండీ హుక్‌లో లైట్‌హౌస్ నిర్మాణానికి మొదటిసారి, సిటీహాల్ నిర్మాణానికి రెండోసారి లాటరీలు జరిపారు.

- అమెరికాలో 1790 -1860 మధ్యకాలంలో లాటరీల ద్వారా వచ్చిన ఆదాయంతో యాభై కాలేజీలు, మూడువందల పాఠశాలలు, రెండువందల చర్చిలు రూపుదాల్చాయి. ఇలా ఏర్పాటైన వాటిలో హార్వర్డ్, యేల్, ప్రిన్స్‌టన్, డార్ట్‌మౌత్, బ్రౌన్, కొలంబియా యూనివర్శిటీలు ఉన్నాయి.

- అమెరికాలోని 33 రాష్ట్రాలు 1790 - 1860 మధ్యకాలంలో లాటరీల ద్వారా సంపాదించిన మొత్తంతో ఆస్పత్రులు, జైళ్ళు, అనాథాశ్రమాలు, లైబ్రరీలు వంటివాటిని నిర్మించాయి.

- అమెరికా అధ్యక్షుడు బెంజమిన్ ఫ్రాంక్లిన్ యుద్ధ సమయంలో ఫిలడెల్ఫియా రక్షణకోసం లాటరీల ద్వారా లభించిన మొత్తంతో భారీ ఎత్తున ఆయుధాలను కొనుగోలు చేశాడు.

- 19వ శతాబ్దం తొలినాళ్ళలో హడ్సన్ నదిపై నౌకల రవాణాకోసం న్యూయార్క్‌లో అనేక లాటరీలను నిర్వహించారు. నది వెంబడి రోడ్డు నిర్మాణానికి, యూనియన్ కాలేజీ ఏర్పాటు కోసం బ్లాక్ రివర్ లాటరీని నిర్వహించారు.

- మిత్రదేశాలతో కలసి మొదటి ప్రపంచ యుద్ధంలో పాల్గొనేందుకు సిద్ధమైన థాయ్‌లాండ్ దేశం లాటరీల ద్వారా ఆర్థిక వనరులను సమకూర్చుకుంది.

- ప్రజోపయోగకరమైన పనులను చేపట్టేందుకు థామస్ జెఫర్‌సన్

లాటరీలను ఎంచుకునేవారు.

- క్వీన్స్‌లాండ్‌లో లాటరీల ద్వారా లభించిన ఆదాయంతో 1938లో రాయల్ మహిళా ఆస్పత్రిని నిర్మించారు.
- 1968లో రిడ్జ్ పర్వతాలపై మౌంటైన్ రోడ్డు నిర్మాణానికి జార్జి వాషింగ్టన్ లాటరీని నిర్వహించారు.

## ఇండియాలో లాటరీలు

- కలకత్తాలో 1813లో లాటరీ ద్వారా వచ్చిన డబ్బుతో టౌన్‌హాల్ నిర్మాణం చేపట్టారు.
- చెన్నైలో మూర్ మార్కెట్, విక్టోరియా పబ్లిక్ హాల్, రిప్పన్ బిల్డింగ్ నిర్మాణానికి లాటరీలు ఇతోధికంగా సాయపడ్డాయి.
- రెండువందల ఏళ్ల కిందట కేరళలోని సుచీంద్రలో ఉన్న తానుమాలయన్ ఆలయ పునరుద్ధరణకు ట్రావెంకూర్ మహారాజు లాటరీని నిర్వహించారు. దీనికి సంబంధించిన శాసనం సదరు ఆలయంలో ఇప్పటికీ ఉంది (అనుబంధం 2 చూడండి)

# రకరకాల లాటరీలు

అనేక దేశాల్లో రకరకాల లాటరీలు వాడుకలో ఉన్నాయి. వాటిలో లోటో రకం గేమ్స్ కూడా ఉన్నాయి.. కొన్ని నంబర్లలోంచి ... ఉదాహరణకు 1నుంచి 60 నంబర్లలోంచి ఆటగాడు 4, 5 లేదా 6 నెంబర్లను ఎంచుకోవాలి. నాలుగు నెంబర్లను ఎంపిక చేసుకునే గేమ్ అయితే దానిని 4/60 లోటో అంటారు. బింగో, కెనో అనేవి లోటో గేమ్‌లో రెండు రకాలు.

అంకెల ఆధారంగా నిర్వహించే లాటరీ గేమ్స్‌లో ఆటగాడు 00నుంచి 99 వరకూ లేదా 000 నుంచి 999 వరకూ లేదా 0000నుంచి 9999వరకూ గల అంకెల్లోంచి ఓ అంకెను ఎంచుకుంటాడు. ఆటగాడు ఎంచుకున్న నంబర్లు తుది ఫలితం (విన్నింగ్ నంబర్లు) తో సరిపోతే అతనికి బహుమతి లభిస్తుంది. ఆసియాలో... మరీ ముఖ్యంగా ఇండియాలో నిర్వహించే పేపర్ లాటరీలు ఈ కోవలోకి వస్తాయి. ఇండియాలో ప్రాచుర్యంలో ఉన్న కొన్ని పాసివ్ లాటరీ గేమ్స్‌ను ఈ కింద ఇస్తున్నాం. మాక్స్ 3, లక్కీ 3 వంటివి ఇండియాలో నడుస్తున్న ఆన్‌లైన్ గేమ్స్. ఫాస్ట్ లోటో, సూపర్ లోటో, థండర్‌బాల్ వంటివి ఆన్‌లైన్‌లో నడుస్తున్న లోటో తరహా గేమ్స్.

## పాసివ్ లాటరీ

ఈ తరహా లాటరీలో టిక్కెట్లను ముందే ప్రింట్ చేస్తారు. బహుమతి మొత్తాలను టిక్కెట్ల అమ్మకాన్ని బట్టి కాకుండా ముందుగానే నిర్ణయిస్తారు. ఈ లాటరీని డ్రా లాటరీ లేదా ట్రెడిషనల్ లాటరీ అంటారు. ఇండియాలోను, ఆసియాలోని ఇతర దేశాల్లోనూ బహుళ ప్రాచుర్యం ఉన్న లాటరీ ఇదే. సింగిల్ డిజిట్ లాటరీ, 2డి, 3డి. 4డి గేమ్స్ ఈ లాటరీ పరిధిలోకే వస్తాయి.

**i) సింగిల్ డిజిట్ లాటరీ**

ఇండియాలో అధిక జనాదరణ గల ఒక లాటరీ వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది. దీంతో లాటరీల (క్రమబద్ధీకరణ) చట్టం- 1998 కింద ఈ లాటరీని నిషేధించారు. ఈ లాటరీలో విన్నింగ్ నంబర్‌తో సరిపోయిన నంబర్ గల టిక్కెట్‌కు మొదటి బహుమతి లభించేది. మిగిలిన బహుమతులను విన్నింగ్ నంబర్‌లో చివరి అంకెలు మ్యాచ్ అయినవారికి ఇచ్చేవారు. ఉదాహరణకు టిక్కెట్ నంబర్ 4576849 అనుకోండి. విన్నింగ్ నంబర్ చివర్లో 9 అనే అంకె ఉంది కాబట్టి చివరన 9 అంకె గల టిక్కెట్లు కొన్నవారందరికీ బహుమతులు వస్తాయన్నమాట. బహుమతి మొత్తం స్వల్పమే అయినప్పటికీ, ఈ పద్ధతిలో ప్రతి 10 టిక్కెట్లలో ఒక దానికి బహుమతి లభించే అవకాశం ఉంటుంది. అలాగే ప్రతి 30 నిమిషాలకూ ఓసారి డ్రా తీస్తారు. దీనివల్ల సింగిల్ డిజిట్ లాటరీకి ఎంతో ఆదరణ లభించింది. ఉదయం 9 గంటలనుంచి రాత్రి 10 గంటలలోగా రోజుకు 52 డ్రాలు ఉండేవి. వచ్చిన ఆదాయంలో 91శాతం ప్రైజ్‌మనీగా ఇచ్చేవారు.

ii) **టూ డిజిట్ లేదా 2డి గేమ్**

ఇందులో కూడా డ్రా తీసిన నంబర్‌తో మ్యాచ్ అయ్యే నంబర్‌గల టిక్కెట్‌కు మొదటి బహుమతి లభిస్తుంది. డ్రా తీసిన నంబర్‌లోని చివరి రెండంకెలు మ్యాచ్ అయ్యే టిక్కెట్లకు ఇతర బహుమతులు దక్కుతాయి. ఉదాహరణకు విన్నింగ్ నంబర్ 15784 అయితే, చివరన 84 గల టిక్కెట్లన్నింటికీ బహుమతులు లభించినట్టే. ఈ తరహా లాటరీ గేమ్‌లో ప్రతి 100 టిక్కెట్లకు ఒక దానికి బహుమతి లభించే అవకాశం ఉంటుంది.

iii) **త్రీ డిజిట్ లేదా 3డి గేమ్**

ఈ తరహా గేమ్స్‌లో విన్నింగ్ నంబర్‌లో చివరి మూడంకెలతో మ్యాచ్ అయ్యే టిక్కెట్లకు బహుమతులు లభిస్తాయి.

## సెట్ 3డి గేమ్

ఇండియాలోని కొన్ని రాష్ట్రాల్లో సెట్ 3డి గేమ్స్ జోరుగా నడుస్తున్నాయి. ఆయా రాష్ట్రాల్లో వాడుకలో ఉన్న భాషను బట్టి ఈ గేమ్‌ను సెట్ లేదా 3డి గేమ్‌గా పిలుస్తారు. ఒక సెట్‌లో 20, 45, 50, 60 లేదా 100 వరకూ టిక్కెట్లు ఉంటాయి. అన్ని టిక్కెట్లపైనా ఒకే నంబర్లు ఉంటాయి. బహుమతి మొత్తాన్ని , టిక్కెట్ల సంఖ్యను కలిపి (ఉదాహరణకు 5000 x 60) పేర్కొంటారు. టిక్కెట్లపైనా ఒకే నంబర్ (ఉదాహరణకు 27695) ఉంటుంది. సీరీస్ మాత్రం సీరీస్ ఎబి, ఎసి... ఈ విధంగా ఉంటాయి.

## ఆన్‌లైన్ 3డి గేమ్స్

3డి లేదా 3 డిజిట్ గేమ్‌కు ఇది ఆన్‌లైన్ వెర్షన్. దీనిని ఆడేవారు 000నుంచి 999 మధ్య ఏదో ఒక నెంబర్‌ను ఎంచుకోవాలి. ఈ తరహా గేమ్‌ను రకరకాలుగా ఆడవచ్చు. ఎస్‌టిఆర్ లేదా స్ట్రెయిట్ ప్లే గా వ్యవహరించే గేమ్‌లో ఆటగాళ్ళు ఎంచుకున్న నంబర్లు అదే వరసలో డ్రా తీసిన నంబర్‌తో మ్యాచ్ కావాల్సి ఉంటుంది. బాక్స్ లేదా బాక్స్ ప్లే అని పిలిచే గేమ్‌లో ఆటగాళ్ళు ఎంపిక చేసుకున్న నంబర్ విన్నింగ్ నంబర్‌తో ఏ క్రమంలో మ్యాచ్ అయినా బహుమతి లభిస్తుంది. ఉదాహరణకు డ్రా తీసిన నంబర్ 678 అయితే 678, 876, 867, 768, 786... ఇలా ఏ క్రమంలో మ్యాచ్ అయినా ఫరవాలేదన్నమాట. బ్యాక్ పెయిర్ ప్లే అనే గేమ్‌లో ఆటగాళ్ళు రెండంకెలు ఎంచుకోవాలి. అవి డ్రా తీసిన నంబర్‌లో చివరి రెండంకెలతో మ్యాచ్ అయితే బహుమతి లభిస్తుంది. ఎనీ పెయిర్ ప్లే పద్ధతిలో ఆటగాళ్ళు మూడు అంకెల్ని ఎంచుకోవాలి. వాటిలో ఏ రెండంకెలు ఫ్రంట్ పెయిర్, బ్యాక్ పెయిర్ లేదా స్ప్లిట్ పెయిర్‌లతో ఏ క్రమంలో మ్యాచ్ అయినా ప్రైజ్ దక్కుతుంది.

మరో తరహా 3డి ఆన్‌లైన్ గేమ్‌లో ఏడు ఆప్షన్లు ఉంటాయి. వాటిని స్ట్రెయిట్, బాక్స్ 3, బాక్స్ 6, బ్యాక్ పెయిర్, స్ప్లిట్ పెయిర్, ఎనీ పెయిర్

అంటారు. ఎంచుకున్న మూడు అంకెల్లో ఏ రెండు అంకెలు విన్నింగ్ నంబర్‌లో ఉన్నా బాక్స్ 3 ప్రకారం బహుమతి వస్తుంది.

**iv) బంపర్ డ్రాలు**

ఇవి అనేక అంకెలతో, తక్కువ ఫ్రీక్వెన్సీలో ఉండే డ్రాలు. ప్రైజ్‌మనీ అధికంగా ఉంటుంది. టిక్కెట్ ధరలు కూడా ఎక్కువే. ఇండియాలో బంపర్ డ్రా టిక్కెట్ ధరలు జాక్‌పాట్‌ను బట్టి రూ. 50, 100, 1000... ఇలా ఉంటాయి. దీపావళి, సంక్రాంతి వంటి పండుగల రోజున డ్రా తీస్తారు. సాధారణంగా పంజాబ్‌లో వైశాఖి ఉత్సవం నాడు, మహారాష్ట్రలో వినాయక చతుర్థినాడు బంపర్ డ్రాలు ఉంటాయి. కొన్ని రాష్ట్రాల్లో నెలకోసారి చొప్పున కూడా బంపర్ డ్రాలను నిర్ణయిస్తారు. ట్రినిడాడ్ - టొబాగోలో దీనిని అసాధారణ డ్రా (ఎక్స్‌ట్రా ఆర్డినరీ డ్రా)గా పరిగణిస్తారు. బ్రిటన్‌లో సూపర్ డ్రా అంటారు. ఇందులో జాక్‌పాట్ మొత్తం ఐదు మిలియన్ (50 లక్షల) పౌండ్లు ఉంటుంది.

## లోటో గేమ్స్

**i) ఫాస్ట్‌లోటో**

ఫాస్ట్‌లోటో గేమ్స్‌లో ఆటగాడు 1నుంచి 31 వరకూ గల అంకెల్లో ఐదు అంకెలను ఎంచుకోవాలి. అవి డ్రా నంబర్‌తో సరిపోతే, రెండు లక్షల రూపాయల బహుమతి లభిస్తుంది.

**ii) సూపర్ లోటో**

ఇది 6 /49 తరహా గేమ్. ఆరు అంకెలూ మ్యాచ్ అయిన పక్షంలో కనీసం రెండు కోట్లు విజేత వశమవుతాయి. ఐదు, నాలుగు లేదా మూడు అంకెలు మ్యాచ్ అయిన వారికీ బహుమతులు ఉంటాయి. డ్రా నెంబర్‌తో ఆరు అంకెలు మ్యాచ్ అయిన టిక్కెట్ లేకపోతే, జాక్‌పాట్‌ను వచ్చే వారానికి బదలాయిస్తారు.

**iii) థండర్‌బాల్**

ఈ గేమ్ ఆడేవారు 1నుంచి 42 అంకెల్లో ఐదు అంకెలను, 1నుంచి 15 అంకెల్లో ఒక థండర్‌బాల్ నెంబర్‌నూ ఎంచుకోవాలి. డ్రా తీసిన నంబర్‌తో ఐదు అంకెలతో పాటు థండర్‌బాల్ నంబర్ కూడా మ్యాచ్ అయితే కోటి రూపాయల జాక్‌పాట్ లభిస్తుంది. నంబర్లు మ్యాచ్ కాకపోతే జాక్‌పాట్ తదుపరి వారానికి మారుతుంది. థండర్‌బాల్ నంబర్‌తో సహా ఒకటి, రెండు, మూడు, నాలుగు నంబర్లు మ్యాచ్ అయినా, థండర్‌బాల్ నంబర్ మ్యాచ్ కాకుండా ఐదు, నాలుగు లేదా మూడు అంకెలు మ్యాచ్ అయినా బహుమతులు లభిస్తాయి.

అజర్ బైజాన్‌లో ఈ గేమ్ 5 ప్లస్ 1 లోటోగా ప్రాచుర్యంలో ఉంది. ఇందులో ఒక గోల్డెన్ నంబర్, ఐదు సాధారణ నంబర్లు... డ్రా నంబర్‌తో మ్యాచ్ కావలసి ఉంటుంది. కొన్ని దేశాల్లో దీనిని పవర్ బాల్ గేమ్‌గా పిలుస్తారు. అమెరికాలో పవర్ బాల్ గేమ్ అనేక రాష్ట్రాల మధ్య జరుగుతుంది. ఇందులో జాక్‌పాట్ మొత్తం చాలా ఎక్కువగా ఉంటుంది. ప్రతి డ్రాలోనూ 53 వైట్ బాల్స్ లోంచి ఐదింటిని, 42 రెడ్ బాల్స్ లోంచి ఒక దానిని ఎంచుకోవాలి. అవి డ్రా తీసిన నంబర్‌తో మ్యాచ్ కావాల్సి ఉంటుంది. ప్రతి బుధ, శనివారాల్లో డ్రా తీస్తారు.

## అమెరికాలో వివిధ రాష్ట్రాల మధ్య నిర్వహించే లాటరీలు:

**iv) 2 బై 2**

ఆటగాళ్ళు 1నుంచి 26 అంకెల్లో రెండు ఎరుపు నంబర్లను, రెండు తెలుపు నంబర్లను ఎంచుకోవాలి. అమెరికాలోని బహుళ రాష్ట్రాల లాటరీ సంఘం డ్రాలను నిర్వహిస్తుంది. వారానికి ఆరు డ్రాలు ఉంటాయి. డ్రా తీసిన నంబర్‌లోని అంకెలతో ఎన్ని అంకెలు మ్యాచ్ అయ్యాయనే దాన్ని బట్టి బహుమతి ఉంటుంది.

### v) ఎన్‌డి హాట్ లోటో

ఉత్తర డకోటాలో 2002లో మొదలైన ఈ గేమ్‌లో పాల్గొనడానికి కేవలం ఒక్క డాలర్ వెచ్చిస్తే చాలు. గెలిస్తే మాత్రం ఒక మిలియన్ (పది లక్షలు) డాలర్లు లభిస్తాయి. ఆటగాళ్ళు 1నుంచి 39 లోపు ఐదు అంకెలను, 1నుంచి 19 లోపు ఒక హాట్ బాల్ నంబర్‌ను ఎంచుకోవాలి, ఈ గేమ్ డ్రాలను ప్రతి బుధ, శనివారాల్లో పవర్‌బాల్ డ్రాలు ముగిసిన వెంటనే తీస్తారు.

### vi) ఎన్‌డి వైల్డ్ కార్డ్ 2

ఉత్తర డకోటాలో 1998లో ఈ గేమ్ మొదలైంది. రెండుసార్లు ఈ గేమ్ ఆడేందుకు ధర కేవలం ఒక్క డాలర్ మాత్రమే. జాక్‌పాట్ విలువ 1,00,000 డాలర్లు. ఆటగాళ్ళు 1నుంచి 31లోపు ఐదు అంకెలను, 16 వైల్డ్ కార్డుల్లో ఒక దానిని ఎంచుకుని రంగంలోకి దిగాలి.

### vii) మెగా మిలియన్స్

ఆటగాడు 1 నుంచి 52 మధ్య ఆరు అంకెలను ఎంచుకోవాలి. వివిధ రకాల ప్రైజుల్లో తొమ్మిది రకాల ఆటలు ఇందులో ఉన్నాయి.

### పవర్‌బాల్ మల్టీ మిలయనైర్

ఇది అప్పటికప్పుడే ఫలితం తేలిపోయే ఇన్‌స్టంట్ గేమ్ షో. ఇందులో అమెరికాలోని 14 రాష్ట్రాలకు సభ్యత్వం ఉంది. పోటీలో పాల్గొనేవారిలో ముగ్గురిని ర్యాండమ్ పద్ధతిలో ఎంపిక చేస్తారు. వారు మాత్రమే ఈ గేమ్‌లో పాల్గొంటారు. దీనిని క్రేజీ ఎయిట్స్ అంటారు.

## స్పీల్ గేమ్స్

ప్రాథమిక గేమ్‌తోపాటు ఆఫర్ చేసే సెకండరీ గేమ్ ఇది. సాధారణంగా

లోటో తరహా గేమ్స్‌తోపాటు స్పీల్‌గేమ్స్‌ను ఆఫర్ చేస్తారు. ఈ గేమ్‌ను మొట్టమొదటిసారిగా జర్మనీ 1975లో ప్రవేశపెట్టింది. అదనంగా డబ్బు గెలుచుకునేందుకు ఆటగాళ్ళు స్పీల్ గేమ్‌ను ఆడవచ్చు. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ పద్ధతిలో ఈ గేమ్‌లో పాల్గొనే వీలు ఉంది. కంప్యూటర్ అందించే కొన్ని నంబర్లతో లేదా నంబర్‌ను ముందుగానే ప్రింట్ చేసిన టిక్కెట్ సాయంతో ఈ గేమ్‌ను ఆడతారు. కెనడాతోపాటు వివిధ ఐరోపా దేశాల్లోనూ, ఆస్ట్రేలియాలోనూ, అమెరికాలోని కొన్ని రాష్ట్రాల్లోనూ స్పీల్ గేమ్స్ జోరుగా సాగుతున్నాయి.

## కంప్యూటర్ లాటరీలు

ఇండియాలో పాసివ్ లాటరీ గేమ్స్ ఎలక్ట్రానిక్ రూపాన్ని సంతరించుకున్నాయి. బయట కంప్యూటర్ సెంటర్లలో ఈ గేమ్స్‌ను ఆడవచ్చు. వీటిని కంప్యూటర్ లాటరీలు అంటున్నారు.

## జోకర్

ఇది ఒక సరళమైన కార్డ్ గేమ్. డైమండ్స్, పార, హృదయాకారం వంటి బొమ్మలున్న ఫేస్ కార్డులను ఆటగాళ్ళు ఎంచుకోవాలి. అవి డ్రాలో తీసిన ఫేస్ కార్డులతో మ్యాచ్ అయితే విజయం సాధించినట్టు లెక్క.

## బింగో

ఇది ఇటలీలో బహుళ ప్రాచుర్యంలో ఉన్న ఒక లాటరీని పోలి ఉంటుంది. దీనిని మొదటిసారిగా 1530లో నిర్వహించారు. వారానికోసారి చొప్పున ఇప్పటికీ బింగో లాటరీ డ్రాలు జోరుగా సాగుతూనే ఉన్నాయి.

అసలైన లోటో గేమ్‌లో ఒక్కొక్క కార్డులో మూడు అడ్డు వరుసలు, తొమ్మిది నిలువు వరుసలు ఉంటాయి. ప్రతి అడ్డ వరుసలో ఐదు అంకెలు, నాలుగు ఖాళీలు ఉంటాయి. ఒక సంచీలో 90 వరకూ అంకెలున్న టోకెన్లు ఉంటాయి.

గేమ్‌లో పాల్గొన్నవారికి కొన్ని అంకెలతో కూడిన చీటీలను ఇస్తారు. డ్రా నిర్వహించే వారు సంచీలోంచి ఒక్కొక్క నంబర్‌ను తీసి, గట్టిగా అరచి చెబుతూంటారు. నిర్వాహకుడు చెప్పే నంబర్లు ఆటగాళ్ళ వద్దనున్న చీటీలోని నంబర్లతో మ్యాచ్ కావాలి, ఇలా ముందుగా ఒక వరుసలోని నంబర్లు ఎవరికి మ్యాచ్ అయితే వారిదే విజయం.

ఎడ్ లోవె అనే పెద్దాయన ఈ గేమ్‌ను న్యూయార్క్‌లో ప్రవేశపెట్టారు. ఎండిన బీన్సు, ఒక రబ్బరు స్టాంపు, ఓ కార్డు బోర్డు సాయంతో ఈ గేమ్‌ను నిర్వహించారు. మొదట్లో దీనిని బీనో అనేవారు. ఓసారి ఈ గేమ్‌లో గెలిచిన మహిళ ఒకరు ఆనందం పట్టలేక బింగో అని అరచిందట. ఆనాటినుంచి ఈ ఆటకు బింగో అనే పేరు ఖాయమైపోయింది.

బింగో జనాదరణ పొందుతున్న సమయంలో ఊహించని విధంగా ఓ చిక్కు సమస్య ఎదురైంది. పెన్సిల్వేనియాలోని విల్సెస్‌బారెలో ఓ చర్చి అప్పుల ఊబిలో కూరుకుపోయింది. చర్చిని గట్టెక్కించేందుకు దాని నిర్వాహకులు ఎడ్ లోవెనుంచి అనుమతి తీసుకుని తమ ఊర్లో ఈ గేమ్‌ను నిర్వహించారు. అయితే అనుకోని విధంగా అనేకమంది విజేతలుగా నిలిచారు. దీంతో అప్పుల బాధ నుంచి బయటపడటం మాట అటుంచి చర్చి నిర్వాహకులు మరిన్ని కష్టాల్లో కూరుకుపోయారు. గేమ్‌లోని లోపాలను సరిదిద్దేందుకు ఎడ్ లోవె కొలంబియా యూనివర్శిటీకి చెందిన లెక్కల ప్రొఫెసర్ కార్ల్ లెఫ్లెర్ సాయం అర్థించారు. లెఫ్లెర్ రంగప్రవేశం చేసి, ఒకసారి వచ్చిన అంకెలు మరోసారి పునరావృతం కాకుండా బింగో ఆటను పకడ్బందీగా రూపొందించారు.

## కెనో

చైనాలోని హున్ రాజ్యంలో కెనో ఆట మొదలైందని చెబుతారు. చెంగ్ లియాంగ్ అనే వ్యక్తి కెనో గేమ్‌ను కనుగొన్నారు. సైన్యం కోసం నిధుల సేకరణకు ఆయన ఈ ఆటను ఎంచుకున్నారు. అప్పటినుంచీ ఇప్పటివరకూ ఈ ఆటకు

జనాదరణ ఏ మాత్రం చెక్కుచెదరలేదు.

కెనో ఆటలో 120 చైనా అక్షరాలు ఉంటాయి. కనుఫ్యూషియస్, ఆయన సహచరులు రచించిన పుస్తకంలోంచి ఈ అక్షరాలను ఎంచుకున్నారు. తదనంతరకాలంలో ఈ అక్షరాల సంఖ్యను 90కి కుదించారు. చైనానుంచి అమెరికాకు మొదటిసారి వలస వచ్చినవారు ఈ ఆటను అమెరికాకు పరిచయం చేశారు. తరవాత కెనోలో అక్షరాల సంఖ్య 80కి తగ్గింది.

క్రమంగా చైనానుంచి ఈ ఆట ఇతర దేశాలకూ పరిచయం కావడంతో ఆటలో చైనా అక్షరాలకు బదులు 1నుంచి 80 అరబిక్ అంకెలు ప్రవేశించాయి. మొదట్లో ఈ అంకెలను చెక్క బంతులపై ముద్రించి వాటిని ఆపరేటర్లు చేతితో కలిపేవారు. వాటిలోంచి విన్నింగ్ నంబర్లను డ్రా తీసేందుకు చెక్క బంతుల్ని బాతు (గూస్) మెడ ఆకారంలో ఉండే ఒక ట్యూబ్‌లోంచి పంపేవారు. అందుకనే ఈ ట్యూబ్‌ను 'కెనో గూస్' అనేవారు. బంతుల్ని చేతితో కలపడం వల్ల అప్పుడప్పుడు అవకతవకలు జరిగేవి. అందువల్ల ప్రస్తుతం నంబర్లను పింగ్ -పాంగ్ బంతులపై ముద్రిస్తున్నారు. వాటిని యంత్రాల సాయంతో కలగలిపి, పారదర్శకంగా ఉండే ట్యూబ్ (కెనో గూస్) లోంచి పంపిస్తున్నారు.

బింగో గేమ్‌లో విజేత ఎవరో తేలేదాకా ఆపరేటర్లు అంకెలు ప్రకటిస్తూనే ఉంటారు. కెనోలో 20 అంకెల్ని మాత్రమే ఎంచుకుంటారు. విజేత ఎవరూ లేకపోతే బహుమతి మొత్తం కేసినోకు దక్కుతుంది.

## స్క్రాచ్ టిక్కెట్

ఈ తరహా లాటరీ కూడా ఇన్‌స్టంట్ లాటరీ కోవలోకే వస్తుంది. టిక్కెట్‌పై ఉండే నంబర్‌పై లేటెక్స్ కోటింగ్ ఉంటుంది. దానిని గీకితే నంబర్ బయటపడుతుంది. డ్రా తీసిన నంబర్‌తో టిక్కెట్ నంబర్ మ్యాచ్ అయితే గెలిచినట్టు లెక్క. మొదట్లో బ్రెజిలియన్సిస్ అనే చెట్టునుంచి తీసిన లేటెక్స్‌ను

నంబర్‌పై పూత పూసేవారు. వినియోగదారులను ఆకర్షించేందుకు ఈ పద్ధతి బాగా వాడుకలోకి వచ్చింది. స్క్రాచ్ టిక్కెట్ లాటరీ అమెరికాలో తొలిసారి 1974లో మసాచుసెట్స్‌లో ప్రారంభమైంది.సైంటిఫిక్ గేమ్స్ అనే సంస్థ ఈ గేమ్‌ను 1973లో అభివృద్ధి చేసింది. ఇప్పటికీ ఆన్‌లైన్ స్క్రాచ్ గేమ్స్‌లో ఈ సంస్థదే పైచేయి. మొట్టమొదటిసారి మసాచుసెట్స్ లాటరీకోసం సైంటిఫిక్ గేమ్స్ సంస్థ 25 మిలియన్ టిక్కెట్లను షీట్ - పెడ్ పద్ధతిద్వారా ముద్రించింది.

యూరప్‌లో మొదటిసారి స్క్రాచ్ టిక్కెట్ల లాటరీని 1978లో లాటరీ రోమన్‌డె ఆఫ్ స్విట్జర్లాండ్ ప్రవేశపెట్టింది. ఆ తరవాత 1999లో స్క్రాచ్ టిక్కెట్లను ఎలక్ట్రానిక్ రూపంలో టాక్టిలో ఎలక్ట్రానిక్ లాటరీ పేరిట ఆన్‌లైన్ పద్ధతిలోనూ ప్రారంభించింది.

ఇన్‌స్టంట్ లాటరీల్లో భిన్న పద్ధతులు అమలులో ఉన్నాయి.. గ్రహరాశులను బట్టి ఆడే పద్ధతి కూడా ఉంది. అయిదు రాశులు ఉన్న కార్డును స్క్రాచ్ చేయాలి. అందులో ఒకే రాశి గుర్తు రెండుసార్లు ఉంటే ఆ వ్యక్తి విన్‌బాక్స్‌ను స్క్రాచ్ చేసి తనకు ఏ బహుమతి లభించిందో చూసుకోవచ్చు. బెల్జియంలో కేబ్రియో అనే గేమ్‌లో అయితే ప్రధాన స్క్రాచ్ ఏరియాలో బహుమతి లభించనివారికి బోనస్ స్క్రాచ్ ఏరియా ఉంటుంది. కొన్ని దేశాల్లో బింగో గేమ్‌లోనే (స్క్రాచ్ టిక్కెట్‌లను ప్రవేశపెట్టారు. ఈ తరహా గేమ్‌లో టిక్కెట్ రెండు భాగాలుగా ఉంటుంది. ఒక భాగంలో బంతుల బొమ్మలుంటాయి. వాటిని స్క్రాచ్ చేస్తే 18 అంకెలు బయటపడతాయి. ఈ అంకెలు టిక్కెట్‌లోని మరో భాగంలో ఉన్న బింగో నంబర్లతో మ్యాచ్ కావాలి. ఇలా మ్యాచ్ అయిన అంకెలను బింగో కార్డుపై మార్క్ చేయాలి. ఇదీ ఆడే పద్ధతి. ఒక్కొక్క దేశంలో ఎన్నో స్క్రాచ్‌గేమ్‌లు ఉన్నాయి. ఉదాహరణకు బెల్జియంలో 16, స్విట్జర్లాండ్‌లో 14 స్క్రాచ్ గేమ్‌లు ఉన్నాయి.

## సంభావ్యత గల ఆటలు

వీటినే ప్రాబబులిటీ గేమ్స్ అంటారు. స్క్రాచ్ గేమ్‌లలాగే వీటిలో కూడా టిక్కెట్లపై కవరై ఉన్న నంబర్లు ఉంటాయి. ప్రతి టిక్కెట్‌పైనా విజయావకాశాలు ఉంటాయి. అయితే సరైన విధంగా స్క్రాచ్ చేస్తేనే విజయం వరిస్తుంది.

## పుల్-టాబ్ గేమ్స్

ఇవి కూడా ఇన్‌స్టంట్ లాటరీ గేమ్స్ కోవకే చెందుతాయి. టిక్కెట్ రెండు పొరలతో ఉంటుంది. ఒకవైపు గేమ్ పేరు, టిక్కెట్ ధర, ఇతర వివరాలు ఉంటాయి. వెనుకవైపు ప్రైజ్‌మనీ వివరాలతోపాటు విన్నింగ్ నంబర్స్ ఉంటాయి. ప్రైజ్ మనీ గురించి తెలుసుకోవాలంటే వెనుకవైపు మందంగా ఉన్న పొరను విరగ్గొట్టాలి. ఈ గేమ్‌ను పికెల్స్ అని, బ్రేక్- ఓపెన్స్ అనీ అంటారు.

## బెట్టింగ్ గేమ్స్

గుర్రపు పందేలు, కుక్కల పందేలు వంటి వాటిని నిర్వహించి, గెలుపు అవకాశాలు ఉన్న జంతువులపై పందేలు కాయడాన్ని బెట్టింగ్ గేమ్ అంటారు. ఇండియాలో గుర్రపు పందేలపై లాటరీలు లేవు. అయితే షాపూర్జీ పల్లోంజి వంటి కార్పొరేట్ సంస్థలు ఈ తరహా లాటరీల నిర్వహణకు ప్రభుత్వం నుంచి అనుమతి కోరుతున్నాయి.

## స్పోర్ట్స్ లాటరీలు

ఇవికూడా బెట్టింగ్ గేమ్స్ లాంటివే. అయితే ఆటలపై బెట్టింగ్ చేయడం స్పోర్ట్స్ లాటరీల్లో ప్రత్యేకత. ఫుట్‌బాల్, టెన్నిస్, క్రికెట్ వంటి ప్రముఖ క్రీడలపై బెట్టింగ్ జరుగుతోంది. ఇండియాలోని బెట్టింగ్ ఆపరేటర్లు మ్యాచ్‌లను ఫిక్స్ చేయడం ద్వారా అక్రమ పద్ధతుల్లో డబ్బు గడిస్తున్న ఉదంతాలు తెలిసినవే. ఇండియాలో ఆటలపై బెట్టింగ్ నిర్వహించే లాటరీలు లేవు.

## ఆన్‌లైన్ గేమ్స్

లోటో తరహా నంబరింగ్ గేమ్‌లను ఇంటర్‌లింక్డ్ కంప్యూటర్లపై ఆడవచ్చు. వీటినే ఆన్‌లైన్ గేమ్స్ అంటారు. ఈ ఆటల గురించి రానున్న అధ్యాయాల్లో విపులంగా చర్చించడం జరిగింది.

## కస్టమైజ్డ్ గేమ్స్

స్థానిక ఆచారాలు, ప్రాముఖ్యతలను బట్టి ప్రాంతీయ స్థాయిలో లాటరీ గేమ్స్‌ను నిర్వహించేవారు ఉన్నారు. ఉదాహరణకు స్వీడన్, మెక్సికో దేశాల్లో రెండు రోజుల వ్యవధిలో నిర్వహించే 35కు పైగా ఆటల్లో ఎవరెవరు గెలుస్తారో ముందే ఊహించి బెట్టింగ్ చేస్తూ ఉంటారు.

## టెలివైజ్డ్ గేమ్స్

సాంప్రదాయకమైన ఆటలను వీడియోగేమ్‌లుగా మలచి ఆడటం ఇటీవలికాలంలో ఎంతో ప్రాచుర్యం పొందింది. ఆటగాళ్ళు ఆన్‌లైన్ ఆపరేటర్లనుంచి టిక్కెట్లు కొనుగోలుచేసి, టివిలో ఆట ప్రసారమవుతుండగా దానిలో పాల్గొంటారు.

## వీడియో లాటరీ

వీడియో లాటరీలో వేగంగా ఆడే ఎన్నో ఆటలు ఒకే మెషీన్‌లో పొందుపరచి ఆడే వీలుంటుంది. ఆటగాళ్ళు బిల్లు లేదా కాయిన్లను ఉపయోగించి ఆడతారు. సాధారణంగా ఇవన్నీ యానిమేటెడ్ గేమ్స్ అయి ఉంటాయి. ఈ గేమ్స్ అన్నీ పోకర్ మరియు బ్లాక్‌జాక్ తరహా ఆటలను పోలి ఉంటాయి.

## కేసినో గేమ్స్

కేసినోల్లో ఆడేవాటిని కేసినో గేమ్స్ అంటారు. కొన్ని కేసినో గేమ్స్‌ను ఆన్‌లైన్ గేమ్స్‌గా కూడా ప్రవేశపెట్టారు. ఇలాంటివాటిలో బాకెరా,  బ్లాక్‌జాక్, క్రాప్స్,

రూలెట్, కెనో, స్లాట్ మెషీన్స్, వీడియో పోకర్, కరీబియన్ స్టడ్ పోకర్, లెట్ ఇట్ రైడ్, హార్స్ రేసింగ్, పై గో పోకర్ వంటివి ముఖ్యమైనవి. ఇందులో బాకెరా, బ్లాక్‌జాక్, క్రాప్స్, రౌలెట్, స్లాట్ మెషీన్స్ వంటి గేమ్స్‌కు ఇండియాలో ఆదరణ లభించే అవకాశం ఉంది. వీటిని ఇండియాలో ప్రవేశపెట్టేందుకు కొందరు ఆన్‌లైన్ లాటరీ ఆపరేటర్లు ప్రయత్నాలు జరుపుతున్నారు.

### i) బాకెరా

బాకెరా గేమ్‌ను ఇటలీ దేశస్థులు కనుగొన్నారు. ఫ్రాన్స్‌లోనూ, ఐరోపాలోని అన్ని దేశాల్లోనూ ఈ ఆట ఎంతో పాప్యులర్ అయింది. ఐరోపాలోని కేసినోల్లో ఇదే ఆకర్షణీయమైన ఆట. ఈ తరహా ఆటల్లో చెమిన్ డెఫెర్, బక్కారట్ ఎన్ బాంక్ అనే గేమ్స్‌కు విశేష ఆదరణ లభిస్తోంది. ఇటలీ భాషలో బాకెరా అంటే సున్నా అని అర్థం. బాకెరాలో ఉండే అన్ని ఫేస్ కార్డుల విలువ సున్నాతో సమానం. అందుకే ఈ గేమ్‌కు బక్కారట్ అనే పేరొచ్చింది. ఈ ఆటలో ఆటగాళ్ళ సంఖ్యతో పనిలేదు. కేవలం ఆటగాడి హ్యాండ్, బ్యాంకర్ హ్యాండ్... ఈ రెండే కీలకం. ఆటగాళ్ళు వీటిలో ఏదో ఒక హ్యాండ్‌పై బెట్ చేస్తారు. తొమ్మిదికి దగ్గరగా స్కోర్ చేస్తే గెలిచినట్టు. ప్లేయర్ హ్యాండ్‌పైన, బ్యాంకర్ హ్యాండ్‌పైన రెండేసి కార్డుల్ని మూసి ఉంచుతారు. ముందుగా డీలర్ ప్లేయర్ హ్యాండ్ వద్ద ఉన్న కార్డుల్ని, తరవాత బ్యాంకర్ హ్యాండ్ వద్ద ఉన్న కార్డుల్ని ఒక్కొక్కటే తెరుస్తాడు. ఏదైనా 9 నంబరున్న కార్డు వస్తే, దాన్ని నేచురల్‌గా పిలుస్తారు. ఆ హ్యాండ్‌పై ఆటగాడు విజయం సాధించినట్టు అర్థం. ఒకవేళ ఎనిమిదో నంబరున్న కార్డు వచ్చినా ఆట ముగిసినట్టే. ఎందుకంటే ఎనిమిదిని ఓడించే నంబరు 9 మాత్రమే. అది రానప్పుడు ఎనిమిది వచ్చినా గెలిచినట్టేనన్నమాట. ఒకవేళ రెండు కార్డులపై ఉన్న అంకెలను కలిపితే 9 కంటే ఎక్కువ వస్తే, చివరి అంకెను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. ఉదాహరణకు ఒక హ్యాండ్‌పై ఉంచిన కార్డులపై 9, 4 ఉన్నాయనుకోండి. వాటిని కూడితే 13 వస్తుంది కదా. అందులోంచి 3ను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు.

మొదటి రెండు కార్డులను బట్టి ఫలితం తేలకపోతే మూడవ కార్డుతో ఆడతారు. సాధారణంగా బాకెరాలో గేమ్ పూర్తవడానికి మూడే మూడు కార్డులు సరిపోతాయి.

### ii) బ్లాక్ జాక్

రెండు దశాబ్దాల కిందట ఎడ్వర్డ్ థార్ఫ్ అనే రచయిత బ్లాక్ జాక్ గేమ్‌లో మెలకువలను వివరిస్తూ 'బీట్ ది డీలర్' అనే పుస్తకాన్ని రాశారు. అప్పటినుంచీ ఈ గేమ్ ఎంతో ప్రజాదరణ పొందింది. దీనినే ట్వంటీవన్ గేమ్ అని కూడా అంటారు. ఒకే డెక్‌పై 52 కార్డులతో ఆడితే సింగిల్ డెక్ గేమ్ అని, ఒకటికి మించి ఎక్కువ డెక్‌లపై ఆడితే మల్టిపుల్ డెక్ గేమ్ అని అంటారు. ఇందులో ఫేస్ కార్డుల విలువ పది అయితే మిగతా కార్డులకు దేని ఫేస్ వాల్యూ దానికి ఉంటుంది. ఏస్‌కు 11, 1 విలువ ఉంటాయి. డీలర్, ఏడుగురు ఆటగాళ్ళు కలసి ఈ ఆటను ఆడతారు. సాధారణంగా కేసినోకు ప్రతినిధే డీలర్ అయి ఉంటాడు. ఆటగాళ్ళంతా పందేలు కాశాక, డీలర్ ప్రతి ఆటగాడికీ రెండేసి కార్డుల చొప్పున పంచుతాడు. వాటిని ముందుగా ఎవరూ చూడకూడదు. అలాగే తనకో కార్డు వేసుకుని, మరో కార్డును అందరికీ కనిపించేలా వేస్తాడు. డీలర్‌కి గాని, ఆటగాళ్ళలో ఎవరికైనాగాని ఏస్ మరియు 10 విలువ గల కార్డు వస్తే అతనికి లభించిన పాయింట్లు 21 అవుతాయి. అంటే బ్లాక్ జాక్ లభించినట్టు అర్థం. 14 పాయింట్లు లభించిన ఆటగాడు హిట్ కొట్టినట్టు అర్థం. అతనికి అదనంగా మరో కార్డు లభిస్తుంది. ఈ మూడో కార్డుతో అతని మొత్తం పాయింట్లు 21కి చేరితే అతని అవకాశాలు చెరి సగం ఉంటాయి. ఎవరైనా ఆటగాడికి 17 లేదా 18 పాయింట్లు వస్తే, అతను స్టాండ్ అయ్యేందుకు అవకాశం ఉంటుంది. అదనపు కార్డు మాత్రం లభించకపోవచ్చు. ఎవరికీ 21 పాయింట్లు రాకపోయినా, డీలర్‌కంటే తక్కువ పాయింట్లు వచ్చిన ఆటగాడు ఓడిపోయాడని అర్థం. ఉదాహరణకు ఒక ఆటగాడివద్ద ఉన్న కార్డులన్నీ కూడితే 17 లేదా 18 పాయింట్లు వచ్చాయనుకోండి. డీలర్‌కు 20 పాయింట్లు వచ్చి

ఉంటే, సదరు ఆటగాడు ఓడిపోయినట్టే.

మల్టిపుల్ డెక్ పద్ధతిలో రెండు, నాలుగు... కొన్ని సందర్భాల్లో ఆరు డెక్‌లను కూడా ఉపయోగిస్తారు.

**iii) క్రాప్స్**

క్రాప్స్ అనేది ఉత్కంఠభరితంగా సాగే గేమ్. బ్లాక్ జాక్‌లా కాకుండా ఆటగాడు తప్పని సరిగా డీలర్‌తో లేదా కేసినోతో ఆడాల్సిందే. క్రాప్స్‌లో ఆటగాళ్ళు షూటర్‌తో కలసి బెట్టింగ్ చేస్తే రైట్ బెట్టింగ్ అని, షూటర్‌కు వ్యతిరేకంగా బెట్టింగ్ చేస్తే రాంగ్ బెట్టింగ్ అని అంటారు. క్రాప్స్‌లో ఎన్నో రకాల బెట్టింగ్ విధానాలు ఉన్నాయి. పాస్ లైన్ / డోన్ట్ పాస్ బెట్, కమ్/ డోన్ట్ కమ్ బెట్, లే బెట్ వంటివి వాటిలో కొన్ని. ఈ రకమైన ఆటల్లో ఉపయోగించే డైస్‌ను కేసినో డైస్ అంటారు. మామూలు వాటికంటే వీటి సైజు పెద్దదిగా ఉంటుంది. ఎర్రరంగుతో, పారదర్శకమైన రీతిలో వీటిని తయారుచేస్తారు.

**iv) రూలెట్**

ఫ్రాన్స్‌లో పుట్టిన ఆట ఇది. రూలెట్ అంటే చిన్న చక్రం అని అర్థం. వినోదమంటే ఇష్టపడే రోమన్లు రథ చక్రాలతో జూదమాడే పద్ధతిని కనుగొన్నారు. ఫ్రాన్స్‌కు చెందిన గణిత శాస్త్రవేత్త పాస్కల్ 17వ శతాబ్దంలో రూలెట్ గేమ్‌ను కనుగొన్నారు. ఇది 1820లో ఇంగ్లండుకు, ఆ తరవాత అమెరికాకు పరిచయమైంది. ఐరోపాలో రూలెట్ ఎంతో ప్రాచుర్యం పొందిన ఆట. మూడు వందల సంవత్సరాలుగా ఈ ఆట చలామణిలో ఉన్నా పెద్దగా మార్పులు సంతరించుకోకపోవడం విశేషం'

రూలెట్ వీల్ (రూలెట్ చక్రం) అనేక భాగాలుగా విభజింపబడి ఉంటుంది. యురోపియన్ వీల్ 37 సెక్షన్లుగాను, అమెరికన్ వీల్ 38 సెక్షన్లుగానూ

ఉంటుంది. వీటిపై 1 నుంచి 36 అంకెలు వేసి ఉంటాయి. సరి సంఖ్యలకు ఎరుపు, నలుపు రంగులు వేస్తారు. మిగిలిన అంకెలు గల భాగాలకు ఆకుపచ్చ రంగు వేస్తారు. 38వ భాగానికి యురోపియన్ వీల్‌లో అయితే 0 అని, అమెరికన్ వీల్‌లో 00 అని మార్క్ చేస్తారు. ప్రతి భాగానికి సన్నటి గోడ వంటి నిర్మాణం ఉంటుంది. చక్రం తిప్పగానే బాల్ గిరగిరా తిరుగుతూ వెళ్ళి ఏదో ఓ భాగంలో ఆగుతుంది. ఆటగాళ్ళు డీలర్‌తో పోటీ పడతారు. ఆటగాళ్ళు ఏదో ఓ నంబర్‌పైగాని, కొన్ని నంబర్లపైగాని, రంగులపైగాని బెట్ చేయవచ్చు. ఆటగాళ్ళు అందరూ బెట్ చేశాక, వీల్‌ను తిప్పుతారు. బాల్‌ను టాస్ చేస్తారు. బాల్ తిరిగి తిరిగి ఏదో ఓ నెంబర్‌పైకి వచ్చి ఆగుతుంది. అదే విన్నింగ్ నెంబర్ అన్నమాట. బెట్‌ను బట్టి డీలర్ డబ్బు ఇవ్వడమో తీసుకోవడమో చేస్తాడు. స్పిన్ కావడానికి ముందు వరకూ బెట్‌లు వేయవచ్చు.

**v) స్లాట్ మెషీన్లు**

శాన్‌ఫ్రాన్సిస్కోకు చెందిన యంత్ర నిర్మాణ నిపుణుడు చార్లెస్ ఫే ఈ స్లాట్ మెషీన్‌ల సృష్టికర్త. 1890నుంచి స్లాట్ మెషీన్లను వాడేవారని తెలుస్తోంది. అప్పట్లో ఈ గేమ్‌ను బార్లలో నిర్వహించేవారు. సింబల్స్‌ను వరుసక్రమంలో అమర్చినవారికి ఉచితంగా మత్తుపానీయాలు అందించేవారు. హృదయాకారంలో ఉండే డిజైన్లు, పేకాటలో ఉండే డైమండ్స్, కళావర్ వంటి గుర్తులు, గుర్రపునాడాలు, నక్షత్రాలు వంటి సింబల్స్ ఉంటాయి. ఒకప్పుడు రెండు గుర్రపు నాడాలను వరుసక్రమంలో అమర్చినవారికి ఒక నికెల్, మూడు గంటలను అమర్చినవారికి పది నికెల్స్‌ను బహుమతులుగా ఇచ్చేవారు. అందువల్ల ఈ మెషీన్లను లిబర్టీ బెల్స్ అనేవారు.

ఇప్పటి స్లాట్ మెషీన్లలో మూడు రీళ్ళు, వివిధ రకాల సింబల్స్ ఉంటున్నాయి. కనీసం ఒక్కో రీల్‌కు ఒక జాక్‌పాట్ ఉంటుంది. ఆటగాడు కాయిన్లను క్లిక్ చేసి, మెషీన్‌ను తిప్పుతాడు. మెషీన్‌లోని సింబల్స్ గిరగిరా

తిరిగి ఆగాక వాటి వరుసక్రమం పే ఆఫ్ స్కేల్‌పై ఉన్న సింబల్స్ వరుసక్రమంతో సరిపోతే ఆ ఆటగాణ్ని విజయం వరిస్తుంది.

కాయిన్లను తీసుకోవడం, చెల్లించడం ఆటోమెటిక్ మెషీన్లపైనే జరగడంతో దీనిపట్ల జనాలు ఎంతో ఆసక్తి కనబరిచేవారు. దాంతో హెర్బర్ట్ స్టీఫెన్ మిల్స్ యాజమాన్యం అధునాతన స్లాట్ మెషీన్లను ఉత్పత్తి చేయడం ప్రారంభించింది. వీటిలో పొడుగ్గా ఉండే హ్యాండిల్స్ ఉండేవి. స్లాట్ మెషీన్లను ఆపరేట్ చేయడం 1930లలో నేరంగా భావించేవారు. ఒక కేసు విచారణకు సంబంధించి న్యాయమూర్తి ఒకరు స్లాట్ మెషీన్‌ను ' ఒంటి చేయి బందిపోటు'గా అభివర్ణించారు. కేసినో ఆపరేటర్లు ఆటగాళ్ళను మభ్యపెట్టి మిలియన్ల కొద్దీ డాలర్లను గుంజేవారు. అందువల్లనే స్లాట్ మెషీన్‌గేమ్‌ను అంతా తప్పు పట్టేవారు.

## ఐరోపాలో 17వ శతాబ్దంనాటి గేమ్స్

### i) లోటో డాఫిన్

లోటో డాఫిల్ గేమ్‌లో 90 అంకెలతో కూడిన 8నుంచి 12 బోర్డులు ఉండేవి. ప్రతి బోర్డూ ఒక డాఫిన్, 20 కౌంటర్లు, 20 డిస్కులతో ఉంటుంది. ఇవన్నీ నాలుగు రంగుల్లో ఉంటాయి. ఆటగాడు ఒకటి లేదా అంతకంటే ఎక్కువ బోర్డులను తీసుకోవచ్చు. ఆటగాడు తాను ఎంచుకున్న నంబర్లపై కౌంటర్లను ఉంచుతాడు. తరవాత తనకు ఇష్టమైన అంకెను తలచుకుంటూ డాఫిన్‌ను కదుపుతాడు. తాను ఎంచుకున్న నంబర్, డాఫిన్‌ను కదిపిన నంబర్ ఒకటే అయితే అతను గెలిచినట్టు అర్థం.

### ii) లోటో డెస్ మాన్యుమెంట్స్ డె పారిస్

రాతి పలకల సాయంతో అచ్చు వేసిన కార్డులతో ఆడే గేమ్ ఇది. వీటిపై వాటర్ కలర్స్‌లో వేసిన పారిస్ కళాఖండాలు ఉంటాయి. వీటిపై నిలువు గళ్ళలో అంకెలు ఉంటాయి.

**iii) బిరిబి**

ఒక కార్డుమీద 70 చతురస్రాలలో అంకెలు ఉంటాయి. తోలుతో చేసిన 70 కాగితపు ముక్కలపై అంకెలు రాసి, వాటిని సన్నగా చుట్టి, ఆలివ్ ఆకుల్లో పెడతారు. ఆ ఆలివ్ ఆకులన్నింటినీ ఓ బ్యాగులో భద్రపరుస్తారు. ఆటగాడు కార్డుపై ఉన్న నంబర్లలో ఒక దానిని ఎంచుకోవాలి, తరవాత బ్యాగ్‌లోని ఓ ఆలివ్ ఆకును తీసి,. దానిలో ఏ అంకె రాసి ఉందో చూస్తారు. రెండు నంబర్లూ ఒకటే అయితే ఆటగాడు గెలిచినట్టు అర్థం. అతనికి తాను పందెం కాసిన డబ్బుకు 64 రెట్లు అధికంగా లభిస్తుంది.

**iv) కవగ్నోల్**

ఇది కూడా బిరిబి గేమ్ లాంటిదే. కానీ ఇందులో ఆటగాడికి ఐదు లేదా తొమ్మిది అంకెలున్న కార్డును ఇస్తారు.

**v) బార్ లాటరీ**

ఈ గేమ్‌లను బార్‌లు, కెఫెలలో ఆడతారు. ఇందులో ఇనుముతో చేసిన అక్షానికి తిరిగే చక్రాన్ని బిగించి ఉంచుతారు.

**vi) బాగొటెల్లె, కకెలోరమ్, టివోలి**

ఈ తరహా గేమ్‌లలో ఒక జారుడు బల్లలాంటి సాధనం, దానికింద అంకెలతో కూడిన బాక్సులు ఉంటాయి. పైనుంచి చిన్న బంతినిగాని, ఏదైనా వస్తువును గాని జారవిడుస్తారు. అది కిందకు జర్రున జారి ఏదో ఒక నంబర్ బాక్స్ వద్ద ఆగుతుంది. కాలక్రమేణా ఇలాంటి గేమ్‌లలో పిన్‌బాల్ మెషీన్లను వాడటం మొదలైంది.

## బెట్లు... రకాలు

### i) సింగిల్ బెట్

సింగిల్ డ్రా లాటరీ టిక్కెట్‌ను కొనుక్కున్నా లేక ఆన్‌లైన్ సింగిల్ డ్రా గేమ్‌లో పాల్గొన్నా, దానిని సింగిల్ బెట్ గేమ్ అంటారు.

### ii) మల్టిపుల్ బెట్స్

ఆటగాడు ఒకే సమయంలో వివిధ గేమ్‌లు ఆడటాన్ని మల్టిపుల్ బెట్ అంటారు. ఒకటికిమించి ఎక్కువ లోటో గేమ్స్‌లో పందెం కాయడం లేక పెద్దమొత్తంలో టిక్కెట్లు కొనడం వంటివి ఈ కోవకు చెందుతాయి.

### iii) సబ్‌స్క్రిప్షన్

ఆటగాడు లాటరీ ఆపరేటర్‌వద్ద అకౌంట్‌ను ఓపెన్ చేస్తాడు. ఆటగాడు చెప్పిన నంబర్లను, అతను చెప్పిన గేమ్స్‌లో ఆపరేటర్ బెట్ చేస్తాడు.

### iv) గ్రూప్ బెట్స్

దీనినే సిండికేట్ లేదా పూల్ బెట్టింగ్ అని కూడా అంటారు. కొంతమంది ఆటగాళ్ళు కలసి వీలైనన్ని ఎక్కువ గేమ్‌లు ఆడేందుకుగాను తమ డబ్బునంతా పూల్ చేసి ఆడతారు. ఇలా ఆడటం వల్ల వారు గెలిచేందుకు ఎక్కువ అవకాశాలు ఉంటాయి. గెలిచిన పక్షంలో సిండికేట్ మెంబర్లంతా గెలిచిన మొత్తాన్ని పంచుకుంటారు.

# ఆన్‌లైన్ లాటరీలు

ఆన్‌లైన్ గేమ్స్ ప్రపంచవ్యాప్తంగా పాతికేళ్ళుగా విజయవంతంగా నడుస్తున్నాయి. ఆన్‌లైన్ లాటరీలు ప్రవేశించాక ఒక్క అమెరికాలోనే లాటరీలు ఆడేవారి సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. ఆ దేశంలో దాదాపు 90 శాతంమంది లాటరీలు ఆడుతూ ఉంటారు. అమెరికాలో ఆన్‌లైన్ లాటరీలు 15000మందిని మిలియనీర్లను చేశాయి. బ్రిటన్‌లో 1997లో ఆన్‌లైన్ లాటరీలు ప్రవేశించాయి. మొదట్లో 10,000 ఆన్‌లైన్ లాటరీ అవుట్‌లెట్లు ఉండేవి. ఇప్పుడు ఆ సంఖ్య 36,000కు పెరిగింది. బ్రిటన్‌లో 60 శాతానికి పైగా ప్రజలు ఆన్‌లైన్ లాటరీల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటూ ఉంటారు. అభివృద్ధి చెందిన దేశాలే కాదు, ఇండియా, బ్రెజిల్, ఫిలిప్పీన్స్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనూ ఆన్‌లైన్ లాటరీల హవా మొదలైంది. గ్లోబల్ ఆన్‌లైన్ లాటరీ వ్యాపార విస్తృతి 125 బిలియన్ డాలర్లు (6000 బిలియన్ రూపాయలు) అని అంచనా. ఇది మరో 10 శాతానికి పైగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఇండియాలో ఆన్‌లైన్ లాటరీ వ్యాపారం విలువ 2005 నాటికి 25,000 కోట్ల రూపాయలకు చేరుకుందని ప్రైస్ వాటర్ హౌస్ కూపర్స్ అనే సంస్థ అంచనా వేసింది.

ఇండియాలో ఆన్‌లైన్ లాటరీల శకం 2002లో మొదలైంది. ముందుగా సిక్కిం రాష్ట్రం ఈ తరహా లాటరీలకు శ్రీకారం చుట్టింది. అప్పటి ముఖ్యమంత్రి పవన్ కుమార్ చామ్లింగ్ వీటికి పచ్చజెండా ఊపారు. ఇండియాలో మొట్టమొదటగా ఎస్సెల్ గ్రూపునకు చెందిన ప్లేవిన్ అనే సంస్థ ఆన్‌లైన్ లాటరీ వ్యాపార కార్యకలాపాలను ప్రారంభించింది. సిక్కిం ప్రభుత్వం తరపున ఆ సంస్థ సూపర్ లోటో పేరిట ఆన్‌లైన్ లాటరీని మొదలుపెట్టింది. తొలిసారి నిర్వహించిన సూపర్ లోటో గేమ్‌కోసం 1.8 మిలియన్ టిక్కెట్లు అమ్ముడుపోయాయి. తీరా డ్రా తీశాక జాక్‌పాట్ ఎవరికీ దక్కలేదు. దాంతో జాక్‌పాట్‌ను తదుపరి గేమ్‌కు వాయిదా వేశారు. అదే ఏడాది మేలో నిర్వహించిన

రెండో ఆన్‌లైన్ గేమ్‌లో బిమల్ కుమార్ గజ్మార్ అనే వ్యక్తికి 8.61 కోట్ల రూపాయల జాక్‌పాట్ లభించింది. పన్నులు పోను ఆయనకు 7.75 కోట్ల రూపాయలు లభించాయి. ఇండియాలో ఆన్‌లైన్ లాటరీని ప్రారంభించిన రెండో రాష్ట్రం కర్నాటక. అనేక దేశాల్లో ప్రజలు ఆన్‌లైన్ లాటరీలపై మక్కువ చూపుతున్నారు. ఇండియాలో రాగల ఐదేళ్ళలో పేపర్ లాటరీని ఆన్‌లైన్ లాటరీ అధిగమించినా ఆశ్చర్యపోనక్కర్లేదు. పేపర్ లాటరీల పద్ధతిలోనైతే ముందుగానే నంబర్లను ప్రింట్ చేసిన టిక్కెట్లను బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, దుకాణాలు వంటి చోట్ల విక్రయిస్తారు. ఫలితాలను ప్రముఖ పత్రికల్లో ప్రకటిస్తారు. ఆన్‌లైన్ లాటరీల విషయానికొస్తే వీటిని ఆడేందుకు ఆన్‌లైన్ లాటరీ అవుట్‌లెట్లకు రావలసి ఉంటుంది. అక్కడ తమ పేరును రిజిష్టర్ చేసుకుంటే, యూజర్ నేమ్, పాస్‌వర్డ్ ఇస్తారు. లాటరీ ఆడేవారు తమ పే స్లిప్‌ను తీసుకుని, కొన్ని నంబర్లను ఎంచుకుని ఆటకు ఉపక్రమిస్తారు. లక్కీ పిక్ పేరిట మరో అవకాశం కూడా ఆటగాడికి ఉంటుంది. అంటే కంప్యూటరే స్వయంగా ఆటగాడికోసం నెంబర్లను ఎంపిక చేసి ఇస్తుందన్నమాట. లాటరీ అవుట్‌లెట్లలోని కంప్యూటర్లను సేల్ పాయింట్లు లేక పి.ఓ,ఎస్. టెర్మినల్స్ అని అంటారు. దేశవ్యాప్తంగా ఈ పి.ఓ.ఎస్ టెర్మినల్స్ అన్నీ ఏదో ఒక ముఖ్య నగరంలో కేంద్రీకృతమై ఉన్న ప్రధాన సర్వర్‌కు కనెక్ట్ అయి ఉంటాయి. ఆటగాడు తన నెంబర్‌ను సెలెక్ట్ చేసుకోగానే ఆ విషయం సి.డి.ఎం.ఎ, వి శాట్ (వెరీ స్మాల్ అపెర్చర్ టెర్మినల్) లేదా జి.పి.ఆర్.ఎస్ (జనరల్ పేకట్ రేడియో సర్వీస్) లేదా రేడియో వంటి సాధనాల ద్వారా ప్రధాన సర్వర్‌కు సమాచారం అందుతుంది. ఆటగాడు ఎంచుకున్న నెంబర్‌తోపాటు టిక్కెట్‌ను కొన్న తేదీ, సమయం, డ్రా తీసే తేదీ వంటి వివరాలన్నీ సర్వర్‌లో నమోదైపోతాయి. అదే నెంబర్‌ను మరో ఆటగాడు ఎంచుకోకుండా దానిని ప్రధాన సర్వర్ లాక్ చేస్తుంది. ఆటగాడు తన ప్లే స్లిప్‌ను డీలర్‌కు అందించగానే అతను దానిని మరో టర్మినల్ గుండా పంపిస్తాడు. వెంటనే ఒక టిక్కెట్ బయటకు వస్తుంది. దీనిపై కూడా టిక్కెట్‌ను కొన్న తేదీ, సమయం, డ్రా తేదీ వంటి వివరాలన్నీ ఉంటాయి.

పేపర్ లాటరీల మాదిరిగా కాకుండా, డ్రా తీసే చివరి నిమిషం వరకూ ఆన్‌లైన్ లాటరీ టిక్కెట్ల అమ్మకం కొనసాగుతుంది. ఈ ప్రక్రియ మొత్తం వేగవంతంగా ఉంటుంది. పైగా డ్రాను ప్రత్యక్ష ప్రసారం చేయడం ఆన్‌లైన్ లాటరీల్లో ప్రత్యేకత. దీనివల్ల డ్రాలో పారదర్శకత ఉట్టిపడుతుంది. పూర్తిగా ఆటోమేటిక్‌గా పనిచేసే యంత్రాల సాయంతో డ్రా తీస్తారు. ఫలితాలను అప్పటికప్పుడే ఆన్‌లైన్ రిటైల్ అవుట్‌లెట్‌లలో చూసుకోవచ్చు. పత్రికల్లో కూడా ప్రకటిస్తారు. విజేతలెవరూ లేకపోతే ప్రైజ్ మనీ తదుపరి లాటరీకి బదిలీ అవుతుంది. లాటరీలో గెలుపొందినవారు ప్రైజ్‌మనీని తీసుకోవడానికి సంబంధించిన నియమనిబంధనలన్నీ పేపర్ లాటరీనే పోలి ఉంటాయి.

ఆన్‌లైన్ లాటరీలను ఆడేవారు రిటైల్ అవుట్‌లెట్లకు వెళ్ళాల్సిన అవసరం లేకుండా, ఆపరేటర్లు స్మార్ట్ కార్డ్ ఆప్షన్లను ప్రవేశపెట్టారు. దీనివల్ల దేశంలో ఎక్కడనుంచైనా ఆన్‌లైన్ లాటరీలో పాల్గొనే అవకాశం ఏర్పడింది. ఆటగాడు క్రెడిట్ కార్డును ఉపయోగించి ఈ ఆటను ఆడవచ్చు. ఆపరేటర్లు ఆటగాడికి 12 అంకెల అక్కౌంట్ నంబర్‌ను, నాలుగు అంకెల పాస్‌వర్డ్‌ను ఇస్తారు. ఫోన్‌ద్వారా కూడా ఆన్‌లైన్ లాటరీలో పాల్గొనవచ్చు. అయితే కాయిన్‌తో పనిచేసే పబ్లిక్ టెలిఫోన్లనుంచి మాత్రం ఈ వెసులుబాటు లేదు. ఫోన్ ద్వారా ఆపరేటర్‌ను సంప్రదించి, తన అకౌంట్ నంబర్, పాస్‌వర్డ్ చెప్పి లాటరీలో పాల్గొనవచ్చు. గేమ్‌ను బట్టి అతనికి మూడు, ఐదు లేదా ఆరు నెంబర్లను కేటాయిస్తారు. భవిష్యత్ అవసరాలకోసం ఫోన్‌లో ఆడేవారి అకౌంట్ వివరాలు, లాటరీ టిక్కెట్ నంబర్ వంటి వాటితో ప్రింటయిన టిక్కెట్‌ను ఆన్‌లైన్ సెంటర్‌లో జాగ్రత్త పరుస్తారు. ఫోన్‌ద్వారా బహుమతి పొందిన ఆటగాడు తన కార్డును చూపించి ప్రైజ్‌మనీని క్లెయిమ్ చేసుకోవచ్చు. ఇదేవిధంగా తన అకౌంట్ నంబర్‌ను, పాస్‌వర్డ్‌ను, ఎంచుకున్న అంకెలను ఎస్‌ఎంఎస్‌లో పంపి కూడా ఆన్‌లైన్ లాటరీలో పాల్గొనవచ్చు.

## ఆన్‌లైన్ లాటరీల్లో భారత కంపెనీలు

ఇండియాకు చెందిన అనేక సంస్థలు విదేశీ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుని ఆన్‌లైన్ లాటరీలను నిర్వహిస్తున్నాయి. మరికొన్ని సంస్థలు విదేశీ సాంకేతిక సహకారాన్ని అందిపుచ్చుకుంటున్నాయి. జి.టెక్, ఇంట్రాలాట్, ఐ.ఎల్.టి.ఎస్, ఒలివెట్టి వంటి పేరెన్నికగన్న అంతర్జాతీయ కంపెనీలతో భారతీయ సంస్థలు ఒప్పందం కుదుర్చుకుని, వాటి నుంచి సాంకేతిక సహకారాన్ని పొందుతున్నాయి.

ఇండియాలోనే ప్రాచీనమైన లాటరీ నిర్వహణ సంస్థగా పేరొందిన సుగాల్ అండ్ దమాని దేశీయంగా లాటరీ నిర్వహించే శక్తి సామర్థ్యాలను అందిపుచ్చుకుంది. ఈమేరకు ఈ సంస్థ కంప్లోట్ పేరిట ఆన్‌లైన్ లాటరీని ఏర్పాటు చేసుకుంది. దేశీయంగానే సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవడంతో తక్కువ ఖర్చుతోనే విజయవంతంగా ఆన్‌లైన్ లాటరీని నిర్వహించగలుగుతోంది. సుగాల్ అండ్ దమాని సంస్థ మహారాష్ట్ర, పంజాబ్ రాష్ట్రాల్లో 6000 టెర్మినల్స్‌ను ఏర్పాటుచేసింది. డేటా కనెక్టివిటీకోసం సి.డి.ఎం.ఎ. టెక్నాలజీని వినియోగించిన తొలి భారతీయ కంపెనీ ఇదే.

అపోలో ఇంటర్నేషనల్, ఎస్సార్ గ్రూపునకు చెందిన ఫార్చ్యూన్ లాటరీ, మార్టిన్ లాటరీ గ్రూప్‌నకు చెందిన ఇన్‌లాట్ టెక్నాలజీస్, స్మార్ట్‌విన్, వీడియోకాన్ గ్రూపునకు చెందిన ధూత్ ఎంటర్‌టైన్‌మెంట్, ఎసెల్ గ్రూపునకు చెందిన ప్లేవిన్ లాటరీ, ఫోర్బ్స్ గ్రూపునకు చెందిన లాటరీ డివిజన్ ధన్ ధన్ ధన్, సిక్సో, కె.కె. మోడీ గ్రూపునకు చెందిన సన్‌షైన్ ఇండియా వంటివి మన దేశానికి చెందిన కార్పొరేట్ ఆన్‌లైన్ లాటరీ సంస్థలు.

# ఇండియాలో లాటరీలు

ఇండియాలో లాటరీ మార్కెట్ విలువ 20,000 కోట్ల రూపాయలని అంచనా. దేశం మొత్తం మీద ఉన్న 30 రాష్ట్రాలు, ఏడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో కేవలం పన్నెండు రాష్ట్రాలు మాత్రమే లాటరీలను నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా సరైన ఆదాయ మార్గాలు లేని అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, మిజోరాం, నాగాలాండ్, సిక్కిం వంటి ఈశాన్య రాష్ట్రాలు లాటరీల ద్వారా వచ్చే ఆదాయంపైనే ప్రధానంగా ఆధారపడుతున్నాయి. వీటితోపాటు హర్యానా, కేరళ, పంజాబ్, కర్నాటక, మహారాష్ట్ర కూడా లాటరీలను నిర్వహిస్తున్నాయి.

## వలస పాలనలో లాటరీలు

ఇండియాలో లాటరీలకు మూడువందల ఏళ్ళకు పైబడిన చరిత్ర ఉంది. పోర్చుగల్ పాలనలో ఉన్నప్పుడు గోవాలోనూ, బ్రిటిష్ వారి హయాంలో కలకత్తాలోనూ లాటరీలు మొదలయ్యాయి. మద్రాసులో 18వ శతాబ్దంలోనే లాటరీలు నిర్వహించినట్టు దాఖలాలు ఉన్నాయి. ఇండియాలో తొలిసారిగా లార్డ్ మెకార్ట్నీ ప్రభుత్వం 1781లో లాటరీ నిర్వహించినట్టు రికార్డులు చెబుతున్నాయి. కర్నాటక ప్రాంతంలో హైదర్ అలీ దళాల తిరుగుబాటు, మద్రాసులో నెలకొన్న  కరవు కాటకాల కారణంగా ప్రభుత్వ ఖజనా ఖాళీ అయిందని 1782 జనవరి 26న మెకార్ట్నీ లండన్‌కు స్వయంగా సమాచారం పంపారు. ఇంగ్లండ్ ఆమోదానికై పంపిన బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో మెకార్ట్నీ అప్పుకోసం బెంగాల్‌కు దరఖాస్తు చేసుకున్నారు. అలాగే లాటరీ నిర్వహించేందుకు అనుమతికోసం అభ్యర్థించారు. లాటరీల ద్వారా ఖజనాను భర్తీ చేయాలన్న మెకార్ట్నీ ఆలోచన ఫలించలేదు కానీ, లాటరీలను ఒక ఆర్థిక వనరుగా పరిగణించడం మాత్రం అప్పటినుంచే మొదలైంది.

ఫోర్ట్ సెయింట్ జార్జిలో ఒక ఎక్స్చేంజిని నిర్మించాలని పద్దెనిమిదో శతాబ్దంలో పీటర్ మాసే కేసిన్ అనే వాణిజ్యవేత్త బ్రిటిష్ ప్రభుత్వానికి ప్రతిపాదించాడు.

ఇందుకయ్యే వ్యయాన్ని లాటరీ ద్వారా సమకూర్చుకోవచ్చని సలహా కూడా ఇచ్చాడు. అతని ప్రతిపాదనకు బ్రిటిష్ ప్రభుత్వం స్పందించి, చీఫ్ ఇంజనీర్ కల్నల్ రాస్‌ను సర్వేకోసం పంపింది. కేసిన్ ప్రతిపాదించిన స్థలం ఎక్స్ఛేంజి నిర్మాణానికి అనువు కాదని రాస్ తేల్చేశారు. దీంతో రాబర్ట్ హ్యూస్ అనే పెద్దమనిషికి చెందిన స్థలాన్ని కొనుగోలు చేయాల్సిందిగా కేసిన్ సలహా ఇచ్చాడు. ప్రైవేటు భూమిని కొని, అందులో భవంతి నిర్మించడం ఖర్చుతో కూడిన పని కాబట్టి లాటరీ నిర్వహణ ద్వారా డబ్బును సేకరించాలని సలహా ఇచ్చాడు. లాటరీ టిక్కెట్ల అమ్మకం ద్వారా సేకరించిన డబ్బును డ్రా తీసేంతవరకూ ప్రభుత్వ ఖజనాలోనే ఉంచాలని, ప్రైజ్ మనీని మినహాయించి మిగిలిన మొత్తంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టవచ్చునని కేసిన్ ప్రభుత్వానికి ప్రతిపాదించాడు.

లాటరీని ఎలా నిర్వహించాలో కేసిన్ ఈ విధంగా సూచించాడు. 1,00,000 పగోడాలను 10,000 వాటా టిక్కెట్లుగా విభజించాలి. ఒక్కో టిక్కెట్‌కు పది పగోడాల చొప్పున కేటాయింపు జరగాలి. ప్రథమ బహుమతిగా 5,000 పగోడాలను ఇవ్వాలి. రెండు ద్వితీయ బహుమతులుగా చెరో 2500 పగోడాలను, ఒక్కొక్కటి 1000 పగోడాల చొప్పున ఐదు తృతీయ బహుమతులు, 500 పగోడాల విలువ గలిగిన 10 చతుర్ధ బహుమతులను ఇవ్వాలి, ఐదో స్థానంలో గెలిచిన 20మందికి ఒక్కొక్కరికి 250 పగోడాలను, ఆరో స్థానంలో వచ్చిన 50మందికి 100 పగోడాల చొప్పున, ఏడో స్థానంలో వచ్చిన 100మందికి 50 పగోడాల చొప్పున ఇవ్వాలి. ఎనిమిదో స్థానంలో గెలిచిన 3212మందికి 20 పగోడాల చొప్పున బహుమతులుగా కేటాయించాలి. కేసిన్ సూచనలను అనుసరించి ప్రభుత్వం లాటరీ నిర్వహించగా 10,000 పగోడాల ఆదాయం లభించింది. ఈ డబ్బును హ్యూస్‌నుంచి భవంతి కొనుగోలు చేసేందుకు వెచ్చించింది. ఆ స్థానంలో నిర్మించిన ఫోర్ట్ మ్యూజియం ఇప్పటికీ దిగ్విజయంగా పనిచేస్తోంది.

## మెమొరాండం

| ప్రైజ్ | సంఖ్య | డబ్బు | మొత్తం |
|---|---|---|---|
| 1. | 1 | 5,000 | 5,000 |
| 2. | 2 | 2,500 | 5,000 |
| 3. | 5 | 1,000 | 5,000 |
| 4. | 10 | 500 | 5,000 |
| 5. | 20 | 250 | 5,000 |
| 6. | 50 | 100 | 5,000 |
| 7. | 100 | 50 | 5,000 |
| 8. | 2750 | 20 | 55,000 |

2,938 బహుమతులకు లభించే మొత్తం పగోడాలు 90,000

7062 బ్లాంక్స్

10,000 టిక్కెట్లు

(వెస్టిజెస్ ఆఫ్ ఓల్డ్ మద్రాస్ మూడో భాగంలో ఉన్న మెమొరాండంలోని వివరాలు యథాతథంగా)

1791 మార్చిలో మద్రాస్ 50,000 పగోడాలతో మద్రాస్ లాటరీ ఫండ్‌ను నిర్వహించి, దానిపై వచ్చిన ఆదాయాన్ని మద్రాసులో నివసించే పేదలు, అంధులు, అవిటివారికి అందచేశారు. అదే ఏడాది డిసెంబర్‌లో మరో 50,000 పగోడాల లాటరీన నిర్వహించారు. లాటరీపై వచ్చిన ఆదాయాన్నిఎప్రభుత్వ నిర్లక్ష్యానికి గురవుతున్న రోడ్ల నిర్మాణానికిఎ వెచ్చించారు. 1795 - 1796

మధ్యకాలంలో మౌంట్ రోడ్డు పునర్నిర్మాణాన్ని చేపట్టారు. వార్షిక లాటరీలపై వచ్చిన ఆదాయాన్ని రోడ్డు నిర్మాణానికి మళ్లించారు. ఇప్పటి కమాండర్ ఇన్ ఛీఫ్ బ్రిడ్జ్ సమీపాన నదిపై కాజ్‌వేను కూడా ఈ నిధులతోనే నిర్మించారు. 1796లో బ్లాక్ టౌన్‌కు చెందిన వందమందికి పైగా క్రైస్తవులు తమ కాలనీలో చర్చి నిర్మాణాన్ని చేపట్టాలని భావించారు. దీనికైన వ్యయంలో ఆరోవంతు ఖర్చును అసైలమ్ లాటరీ ద్వారా సమకూర్చుకున్నారు. కమిటీ ఆఫ్ ది అసైలమ్ అండ్ రోడ్ లాటరీస్ 1799లో ఆగస్టు 1795నుంచి నవంబర్ 1799 వరకూ చేపట్టిన పనులపై ఓ నివేదిక ఇస్తూ, తదుపరి పనుల కొనసాగింపునకు అభ్యర్థించింది.

## నివేదిక వివరాలు...

| | |
|---|---|
| కాజ్‌వే నిర్మాణానికి చెల్లించిన మొత్తం | 2917 - ...... |
| శ్మశాన స్థలం వద్ద వంతెన నిర్మాణానికి చెల్లించిన మొత్తం | 2806 - 21- 56 |
| బ్లాక్ టౌన్‌లో ప్రొటెస్టెంట్ చర్చి నిర్మాణానికి చెల్లించిన మొత్తం | 1500 - ..... |
| మదర్ కంట్రీకి విరాళం కోసం చెల్లించిన మొత్తం | 5000 - ..... |
| మిలిటరీ మేల్ అసైలమ్ కోసం చెల్లించిన మొత్తం | 6000 - .... |
| 21 సెప్టెంబర్ 96 నుంచి 24 నవంబర్ 99 వరకూ మద్రాసు పరిధిలో చేపట్టిన రోడ్ల మరమ్మతుల కోసం చెల్లించిన మొత్తం | 12170 - .... |
| బ్యాలెన్స్ | 1209 - 10-76 |
| పగోడాలు | 31602 - 32- 32 |

సైన్యంలో లెఫ్టినెంట్‌గా పనిచేసిన మాథ్యూ కేంప్‌బెల్ డైరీలను చదివితే 1823 - 1828 మధ్యకాలంలో ఆయన స్నేహితులతో కాసిన పందేలను గురించి తెలుసుకుని ముక్కున వేలేసుకుంటాం. అయినదానికీ, కానిదానికీ కూడా ఆయన పందేలు కాసేవారు. ఉదాహరణకు,,,వచ్చే అయిదేళ్ళలో తాను ఇంగ్లండ్‌కు తిరుగుప్రయాణమవుతానా లేదా, తన స్నేహితుడు లెఫ్టినెంట్ ప్రిచర్డ్ బెంగుళూరును సందర్శిస్తాడా లేదా...ఇలాంటి చిన్నా చితకా విషయాలపై కూడా కేంప్‌బెల్ పందేలు వేసేవారు. విచిత్రమేమిటంటే అన్ని సందర్భాల్లోనూ ఆయన లాటరీ టిక్కెట్లనే పందెంగా కాయడం. అప్పటికే లాటరీలనేవి జనజీవనంలో ఎంత ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నాయో తెలిపేందుకు ఇదో ఉదాహరణ మాత్రమే. లాటరీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని సామాజిక ప్రయోజనాలకోసం వెచ్చించడం ఆనవాయితీగా ఉండేది. అప్పట్లో ఫాల్కొనెర్, కేంప్‌బెల్ వంటి వారి డైరీలను ముద్రించిన మేల్ అసైలమ్ ప్రెస్ కూడా లబ్ధిదారుల్లో ఒకటి. ప్రజలకు సౌకర్యాలను సమకూర్చడంలో లాటరీల పాత్రను 1850లో మద్రాస్ గవర్నర్ సర్ చార్లెస్ ఎడ్వార్డ్ ట్రెవెల్యాన్ ఓ సందర్భంలో ప్రముఖంగా ప్రస్తావించారు కూడా. మద్రాస్‌లో ప్రఖ్యాతి గాంచిన మూర్ మార్కెట్ (ఆ తరవాత ఈ మార్కెట్ ఓ అగ్ని ప్రమాదంలో బుగ్గి అయింది), విక్టోరియా పబ్లిక్ హాల్, రిప్పన్ భవంతి, ప్రభుత్వ మ్యూజియం థియేటర్ వంటివి లాటరీల ద్వారా గడించిన ఆదాయంతో నిర్మించినవే.

లాటరీలను నిర్వహించడానికి పైన పేర్కొన్న కమిటీకే మొదట్లో అనుమతి ఉండేది. రానురాను ప్రజాసంక్షేమంకోసం చేపట్టే పనులకోసం నిధులు సేకరించేందుకు లాటరీల నిర్వహణకు అనేక సంస్థలకు అనుమతి లభించింది. అలా ప్రభుత్వం నుంచి అనుమతి పొంది లాటరీలు నిర్వహించిన సంస్థల్లో లాటరీ రాఫెల్ ఒకటి. చెంగల్‌పట్ జిల్లాలోని సెయింట్ జోసెఫ్ బాలుర అనాథ శరణాలయానికి నిధులు సేకరించేందుకు ఈ సంస్థ లాటరీ నిర్వహించింది. లాటరీ రాఫెల్ 1920నుంచి ఈ అనాథ శరణాలయం కోసం పనిచేస్తోంది. లాటరీ రాఫెల్ ప్రకటించిన మొదటి పది బహుమతుల్లో 2000 రూపాయల

విలువ చేసే కారు, 500 రూపాయల విలువ చేసే డైమండ్ ఉంగరం కూడా ఉన్నాయి. ఇవేకాకుండా పది రూపాయలనుంచి రెండు రూపాయలవరకూ విలువ చేసే 990 బహుమతులను కూడా ఈ సంస్థ అందచేసింది. విజేతలకు బహుమతులు వద్దనుకుంటే వాటి విలువను నగదు రూపంలో అందచేసింది.

ఉన్నతమైన లక్ష్యాలుంటే తప్ప ప్రైవేటు లాటరీలకు ప్రభుత్వం అనుమతించేది కాదు. కడప జిల్లాకు చెందిన కృష్ణారెడ్డి అనే వ్యక్తి కొంత భూమిని కొన్నారు. ఆ తరవాత కుటుంబ కారణాలవల్ల ఆయన ఆ భూమిని విక్రయించుకోవడానికి వీల్లేకుండా పోయింది. దాంతో తన భూమిని ప్లాట్లుగా చేసి, లాటరీ పద్ధతిలో అమ్ముకునేందుకు ఆయన ప్రభుత్వాన్ని అనుమతి కోరాడు. అయితే అందుకు ప్రభుత్వం తిరస్కరించింది.

## ఆలయాల పునరుద్ధరణకు లాటరీలు

మతపరమైన పనులకోసం తమిళనాడులో లాటరీలను సాధనంగా వినియోగించుకున్న దాఖలాలు ఉన్నాయి. సుచీంద్రంలోని తనుమాలయన్ ఆలయం శిథిలావస్థకు చేరినప్పుడు అప్పటి ట్రావెంకూర్ మహారాజు శ్రీ అయిల్యం తిరుణాల్ ఆలయ పునర్ధరణకు నడుం బిగించారు. 1875లో పనులు ప్రారంభమయ్యాయి. అయితే అనుకోకుండా నిధులకు కొరత ఏర్పడింది. మిగిలిన పనులన్నీ పూర్తి కావాలంటే రూ. 70,000 కావాలి. రాజు తన సలహాదారు పాచు మూతతును పిలిచి సలహా అడిగాడు. అప్పుడు లాటరీ ద్వారా నిధుల సేకరణ జరపవచ్చని సలహాదారు సూచించడంతో లాటరీ టిక్కెట్ల ముద్రణకు రాజు ఆదేశాలు జారీ చేశాడు. అప్పట్లో సవరు బంగారం ధర మూడు రూపాయలు ఉండేది. లాటరీ టిక్కెట్ ధరను ఒక్క రూపాయిగా నిర్ణయించడాన్ని గొప్ప విశేషంగా చెప్పుకున్నారట. ఈ లాటరీ స్కీం పెద్ద విజయాన్ని సాధించింది. దీనిద్వారా ప్రభుత్వం సుమారు 40,000 రూపాయల భారీ మొత్తాన్ని సమకూర్చుకోగలిగింది. ఈ డబ్బుతో ఆలయ పునరుద్ధరణ పనులు నిర్విఘ్నంగా సాగిపోయాయి.

## లాటరీలు... నిర్ణయాత్మక పాత్ర

నిధుల సేకరణే కాదు... నిర్ణయాలు తీసుకోవడంలోనూ లాటరీలు కీలకపాత్ర పోషించిన సందర్భాలు ఉన్నాయి. మున్సిపాలిటీలు, పంచాయతీలు వంటి ప్రజా ప్రాతినిధ్య సంస్థలకు జరిగే ఎన్నికల్లో అభ్యర్థులకు ఓట్లు సమానంగా వస్తే, వారిలో ఒకరిని లాటరీ ద్వారా ఎన్నుకునే సాంప్రదాయం ఇప్పటికీ అనేక చోట్ల ఉంది.గోవాలోని శ్రీశాంతి దుర్గాదేవి ఆలయానికి జాతర ఉత్సవం, మాఘ పంచమి వంటి పండుగ రోజుల్లో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఆయా సందర్భాల్లో ఆలయ అతిథి గృహంలోని గదుల కేటాయింపును లాటరీ పద్ధతిలోనే జరుపుతారు. మధ్యప్రదేశ్ ప్రభుత్వం 2004లో మద్యం దుకాణాలను వేలంపాటద్వారా ఇచ్చే నిర్ణయాన్ని ఉపసంహరించుకుంది. లిక్కర్ మాఫియాను నిరోధించేందుకు గాను ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.  పద్ధతిని ఎంచుకుంది.

## స్వాతంత్ర్యం తరవాత లాటరీలు

స్వాతంత్ర్యం తరవాత ప్రభుత్వమే స్వయంగా లాటరీ నిర్వహించే సాంప్రదాయం మొట్టమొదటగా కేరళలో మొదలైంది. అప్పటికే ప్రైవేటు లాటరీలు నడుస్తున్నాయన్నది వేరే సంగతి. ఆ తరవాత అన్ని రాష్ట్రాల్లోనూ ప్రభుత్వాలే లాటరీలను ప్రారంభించాయి. కొన్ని రాష్ట్రాలు ఆర్థిక వనరుల సమీకరణకోసం లాటరీలను ఆశ్రయిస్తే, మరికొన్ని సట్టా, మట్కావంటి జూదాలపై ఉక్కుపాదం మోపేందుకు, ఇంకొన్ని రాష్ట్రాలు సంక్షేమ పథకాల అమలుకు లాటరీలను ప్రారంభించాయి. తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం 70వ దశకం తొలినాళ్ళలో అంధులకోసం బ్లైండ్ రిలీఫ్ ఫండ్ లాటరీ, బిచ్చగాళ్లకోసం బెగ్గర్ రిలీఫ్ ఫండ్ లాటరీలను నిర్వహించింది. ఇండో పాకిస్తాన్ యుద్ధం అనంతర్ రక్షణ శాఖ సహాయార్ధం డిఫెన్స్ రిలీఫ్ ఫండ్ లాటరీని నిర్వహించిన ఘనత తమిళనాడుకే దక్కుతుంది. భగవాన్ మహావీర్ వికలాంగ సహాయతా సమితి చేపట్టిన సామాజికాభివృద్ధి కార్యక్రమాలకు చేయూత ఇచ్చేందుకు

రాజస్థాన్ ప్రభుత్వం గతంలో లాటరీలను నిర్వహించింది. ఆయా ప్రభుత్వాలు ఏ కారణంపై లాటరీలను నిర్వహించినప్పటికీ, వాటికి బహుళ ప్రజాదరణ లభించిందన్న మాట తోసిపుచ్చలేని నిజం. ఇండియాలో లాటరీల నిర్వహణను డైరెక్టరేట్ ఆఫ్ లాటరీ నియంత్రిస్తుంది. ఈ విభాగం ఆర్థిక మంత్రిత్వ శాఖ అధీనంలో ఉంటుంది.

## లాటరీల నిర్వహణ

లాటరీని నిర్వహించడం యజ్ఞమే. ముందుగా టిక్కెట్లను చేయాలి. ప్రింటింగ్ ప్రెస్‌కు పేపర్‌ను సరఫరా చేయాలి. టిక్కెట్ల ముద్రణ పూర్తయ్యాక వాటిని అమ్మాలి. డ్రా తీయాలి. ఫలితాలను ప్రకటించాలి. విజేతలనుంచి టిక్కెట్లను తీసుకుని, వాటిని పరిశీలనార్థం ప్రింటింగ్ ప్రెస్‌కు పంపించాలి. అవి సరైనవేనని ధ్రువీకరించుకున్నాక విజేతలకు బహుమతులు ఇవ్వాలి. నిర్ణీత గడువు పూర్తయ్యాక డ్రా అకౌంట్‌ను మూసివేయాలి. అమ్ముడుపోక మిగిలిపోయిన టిక్కెట్లను పల్పింగ్‌కు తరలించాలి. బహుమతి పొందిన టిక్కెట్లను ఎవరూ క్లెయిమ్ చేసుకోకపోతే, వాటి తాలూకు డబ్బును ప్రభుత్వ ఖజానాలో జమ చేయాలి, ఇండియాలో లాటరీలను మూడు కేటగిరీలుగా విభజించవచ్చు.

1. కేంద్రప్రభుత్వం నిర్వహించే లాటరీలు. (ప్రస్తుతం కేంద్రం ఎలాంటి లాటరీలను నిర్వహించడం లేదు.

2. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే లాటరీలు

3. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుమతితో నడిచే ప్రైవేటు లాటరీలు

పై వాటిలో మొదటి రెండు కేటగిరీలు రాజ్యాంగంలోని కేంద్ర జాబితాలో 40 వ ఎంట్రీ పరిధిలోకి వస్తాయి. ప్రైవేటు లాటరీలు రాష్ట్ర జాబితాలోని 34వ ఎంట్రీకి చెందుతాయి. వివిధ రకాల ఛారిటబుల్, మెడికల్ లాటరీలు

మూడో కేటగిరీలోకి వస్తాయి. ప్రభుత్వ అనుమతి లేకుండా లాటరీలను నిర్వహించడం భారతీయ శిక్షాస్మృతిలోని 294 (ఎ) సెక్షన్ ప్రకారం నేరం.

గతంలో ఆర్.ఎం.డి.సి.. కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగంలోని 19 (1) (జి) అధికరణ కింద లాటరీలను వాణిజ్యపరమైన హోదా ఇచ్చేందుకు నిరాకరించింది.

**i)** ప్రభుత్వ నియమ నిబంధనలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లాటరీని ఒక క్రీడగా భావించి తగిన నియమ నిబంధనలను ఏర్పరచాయి. రాష్ట్రప్రభుత్వాలు నిర్వహించే లాటరీలకు 1998 వరకూ ఎలాంటి చట్టాలూ వర్తించేవి కావు. ప్రభుత్వాలు 258 (1) అధికరణ ప్రకారం రాష్ట్రపతి ఉత్తర్వులను పొంది, లాటరీలను నిర్వహించేవి. మహారాష్ట్ర ప్రభుత్వానికి, హెచ్. అన్‌రాజ్ అనే వ్యక్తికీ మధ్య నడచిన ఒక కేసుకు సంబంధించి ఏ విధమైన చట్టాలు లేనందున లాటరీల నిర్వహణకోసం రాష్ట్రాలు అనుమతి తీసుకోవలసిన అవసరం లేదని చెప్పింది. అయితే రాష్ట్రప్రభుత్వాలు నిర్వహించే లాటరీలకు 1994 ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు కొన్ని విధివిధానాలు నిర్దేశించింది. ఇప్పటికీ అనేక రాష్ట్రాలు ఈ కింద పేర్కొన్న కొన్ని నియమ నిబంధనలను కచ్చితంగా పాటిస్తున్నాయి.

అ) సంబంధిత రాష్ట్రప్రభుత్వ ఇంప్రింట్, లోగోలను టిక్కెట్‌పై తప్పనిసరిగా ముద్రించడం

ఆ) టిక్కెట్ల విక్రయాన్ని ప్రభుత్వమే చేపట్టడం. ఇందుకుగాను డిస్ట్రిబ్యూటర్‌ను లేదా సెల్లింగ్ ఏజెంటును ప్రభుత్వం నియమించవచ్చు.

ఇ) టిక్కెట్ల అమ్మకం ద్వారా లభించిన ఆదాయం ప్రభుత్వ ఖజానాలో జమ చేయడం

ఈ) రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోనే డ్రాలు తీయడం

ఉ) క్లెయిమ్‌కాని బహుమతి మొత్తాలను ప్రభుత్వ ఖజానాకు జమ చేయడం

ఈ నియమనిబంధనలన్నింటినీ లాటరీల క్రమబద్ధీకరణ చట్టం 1998లో చేర్చారు. దీని రాజ్యాంగబద్ధతను సుప్రీంకోర్టు ధ్రువీకరించింది కూడా.

**ii) వినియోగదారుల హక్కు**

లాటరీ టిక్కెట్ల క్రయ విక్రయాల్లో విక్రయదారులను దృష్టిలో ఉంచుకుని రెండు హక్కులు కల్పించబడ్డాయి. అవి...

అ) డ్రాలో పాల్గొనే హక్కు

ఆ) బహుమతిని గెలుచుకున్న వ్యక్తి ఆ బహుమతిని క్లెయిమ్ చేసుకునే హక్కు

టిక్కెట్ కొనుగోలు చేసిన విక్రేతలకు డ్రాలో పాల్గొనే హక్కును కోర్టు కల్పిస్తోంది. దీనివల్ల తమకు లభించే ప్రయోజనాలను క్లెయిమ్ చేసుకునే హక్కు గెలుపొందిన వ్యక్తులకు వర్తిస్తుంది. లాటరీలో లభించిన వస్తువులను, ఇతర బహుమతులను తమకు బదలాయించాలని విజేతలు కోరేందుకు ఈ హక్కు దోహదపడుతుంది. ఇలా విజేతలకు బదలాయించిన వస్తువులు, బహుమతులపై రాష్ట్రప్రభుత్వం రాజ్యాంగంలోని రెండో  జాబితాలోని 54 ఎంట్రీ ప్రకారం అమ్మకం పన్నును విధించవచ్చు.

**iii) పంపిణీ వ్యవస్థ**

లాటరీలకు సంబంధించి డిస్ట్రిబ్యూటర్లు / ఏజెంట్లుగా పనిచేసేవారికి రాష్ట్రప్రభుత్వాలు కొన్ని షరతులు విధించాయి. ఇవి ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కొక్క విధంగా ఉన్నాయి. ఏజెంట్ల వయోపరిమితి, నివాసస్థలం, కనీస టిక్కెట్ల విక్రయ సామర్ధ్యం వంటి వాటికి సంబంధించి ఈ షరతులు ఉంటాయి. టిక్కెట్ విలువలో కొంత మొత్తాన్ని ఏజెంటుకు కమిషన్‌గా ఇస్తారు. ఎంత శాతాన్ని

కమిషన్‌గా ఇవ్వాలనేది రాష్ట్రాన్ని బట్టి మారుతూ ఉంటుంది. ఏజెంట్లకిచ్చే కమిషన్ అయిదు శాతంనుంచి 40 శాతం వరకూ ఉంటుంది. ఏజెంట్లు తమ కమిషన్ మినహాయించుకుని ప్రభుత్వంనుంచి టిక్కెట్లను కొనుగోలు చేస్తారు. బహుమతి మొత్తంలో కొంత శాతాన్ని ఏజెంటుకు బోనస్‌గా కూడా ఇస్తారు. అమ్మకం కాని టిక్కెట్లకు బహుమతి వర్తించదు. అమ్ముడుకాని టిక్కెట్‌కు బహుమతి వచ్చినా చెల్లదు. అమ్ముడుపోయిన టిక్కెట్‌కు బహుమతి వచ్చేంతవరకూ డ్రా తీస్తారు. కొన్ని సందర్భాల్లో అమ్ముడుపోని టిక్కెట్లనూ డ్రాలో కలుపుతారు. వాటికి బహుమతి వస్తే, అది రిటైలర్‌కు చెందుతుంది. వాటిని రిటైలర్ కొనుగోలు చేసి ఉంటాడు కాబట్టి అవి అమ్ముడుపోయినట్టే భావించి వాటినీ డ్రాలో కలుపుతారన్నమాట. ఒక టిక్కెట్‌కు సంబంధించి ఒకే ఒక్క బహుమతి ఉంటుంది. ఒకే టిక్కెట్‌కు ఒకటికి మించి బహుమతులు వచ్చిన పక్షంలో వాటిలో ఏ బహుమతి విలువైనదో అది విజేతకు లభిస్తుంది. సాధారణంగా డిస్ట్రిబ్యూటర్లను టెండర్లు ఆహ్వానించి నియమించడం రివాజు.

### iv) టిక్కెట్ల ముద్రణ

టిక్కెట్ల ముద్రణ బాధ్యతను టెండర్లు పిలిచి, వాటిలో తక్కువమొత్తం కోట్ చేసిన వ్యక్తికి లేదా సంస్థకు అప్పగిస్తారు. భద్రతను పాటించే ప్రెస్సులుగా నమోదు అయినవారే ఈ పనికి ఎన్నుకోబడుతారు. టిక్కెట్లను ముద్రించేవారే వాటిని డిజైన్ చేయడం, డెలివరీ చేయడం వంటి బాధ్యతల్ని నిర్వహించాల్సి ఉంటుంది. ప్రింటింగ్‌కోసం వచ్చే బిడ్‌లను ఫైనాన్షియల్ బిడ్లు, టెక్నికల్ బిడ్లుగా విభజిస్తారు. టెక్నికల్ బిడ్‌లకు సంబంధించి బిడ్ చేసేవారు సంస్థలోని అధికారక్రమం, సిబ్బంది సంఖ్య, ప్రింటింగ్ ప్రెస్ సామర్థ్యం వంటి వివరాలను అందించాల్సి ఉంటుంది. డైరెక్టరేట్ ఆఫ్ స్టేట్ లాటరీస్ విభాగంనుంచి ఓ అధికారుల బృందం సదరు ప్రెస్‌ను తనిఖీ చేస్తుంది. టిక్కెట్లను ముద్రించేటప్పుడు కూడా అవకతవకలు జరక్కుండా, నకిలీ టిక్కెట్లకు ఆస్కారం లేకుండా తరచూ తనిఖీలు జరుపుతుంది. భద్రతాచర్యలు పటిష్ఠంగా

ఉన్నాయో లేవో పరిశీలిస్తుంది. టిక్కెట్లకు ప్రింటర్ బీమా చేయించడం కూడా ప్రభుత్వం కుదుర్చుకునే ఒప్పందంలో భాగమై ఉంటుంది. టిక్కెట్లను డెలివరీ చేశాక, ప్రెస్‌లో మిగిలిపోయిన వృథా టిక్కెట్లను, చిరిగిపోయిన వాటిని అధికారుల సమక్షంలో నాశనం చేస్తారు.

**v) బహుమతుల వివరాలు**

సాధారణంగా టిక్కెట్లను వివిధ సీరీస్‌లో, ఆరు అంకెల నెంబర్‌తో విడుదల చేస్తారు. ఇంగ్లీషు అక్షరక్రమంలో సీరీస్ ఉంటాయి. నంబర్లు 000000నుంచి 999999 వరకూ ఉంటాయి. ఇలా ఒక్కొక్క సీరీస్‌లో పది లక్షల టిక్కెట్లు ఉంటాయి.

విజేతలను ఎంచుకునే పద్ధతి వివిధ రకాలుగా ఉంటుంది. ఒక సీరీస్‌లో ఆరు అంకెల నంబర్‌గల ఒక టిక్కెట్‌కు (ఉదాహరణకు 825619) బహుమతి వచ్చిందనుకోండి. ఇతర సీరీస్‌లో అదే నంబర్ గల టిక్కెట్లకు కన్సొలేషన్ బహుమతులు (ఉదాహరణకు డిఖి 825619, డిజి 825619, డితీ 825619) ఇస్తారు. సాధారణంగా వివిధ సీరీస్‌లో కలిపి మూడు సెకండ్ ప్రైజ్‌లు ఉంటాయి. అలాగే మూడు లేక అయిదు థర్డ్ ప్రైజ్‌లు ఉంటాయి. ఇక నాలుగు, ఐదు ప్రైజ్‌లు వచ్చేసరికి సీరీస్‌తో పనిలేకుండా టిక్కెట్ నంబర్‌లోని చివరి అయిదు అంకెలు ఒకే విధంగా ఉన్నవారందరికీ బహుమతులు ఇస్తారు. అదేవిధంగా టిక్కెట్ నంబర్‌లోని చివరి నాలుగంకెలను బట్టి, మూడంకెలను బట్టి కూడా బహుమతులు ఉంటాయి. డ్రా ఫలితాలను ప్రముఖ పత్రికలతోపాటు ప్రభుత్వ గెజిట్‌లోను ప్రచురిస్తారు.

**vi) బహుమతులను పొందడం**

రూ. 5000లోపు బహుమతులను గెలుచుకున్నవారు తమ టిక్కెట్లను నేరుగా ఏజెంట్లను లేక జిల్లా లాటరీల కార్యాలయాల్లోను అప్పగించి బహుమతి మొత్తాన్ని తీసుకోవచ్చు. బహుమతిని డ్రా తీసిన 30 రోజుల్లోగా క్లెయిమ్

చేసుకోవాలి. బహుమతి మొత్తం ఎక్కువగా ఉంటే, క్లెయిమ్ అప్లికేషన్‌ను డైరెక్టరేట్ ఆఫ్ స్టేట్ లాటరీస్‌లో అందజేసి, బహుమతిని పొందాలి.

ఇండియాలో 18 శాతం మంది మాత్రమే లాటరీలు ఆడుతున్నారు. వారిలో రెగ్యులర్‌గా లాటరీ ఆడుతున్నది 8 శాతంమంది మాత్రమే. భారత లాటరీ మార్కెట్‌లో సింహభాగం పేపర్ లాటరీదే. లాటరీల క్రమబద్ధీకరణ చట్టం 1998ని రద్దు చేయడం ద్వారా కేంద్రప్రభుత్వం దేశంలో లాటరీ కార్యకలాపాలను పూర్తిగా నిషేధించేందుకు ప్రయత్నించింది. అనేక రాష్ట్రాలు ఈ నిర్ణయాన్ని నిరసించాయి. లాటరీల ద్వారా లభిస్తున్న ఆదాయాన్ని, ఉపాధికతను విస్మరించరాదంటూ వాదించాయి. లాటరీలను పూర్తిగా నిషేధించడం కంటే వాటిని క్రమబద్ధీకరించడం మేలని ఏజెంట్లతోపాటు రాష్ట్రప్రభుత్వాలు కూడా కోరాయి.

# వివిధ రాష్ట్రాల్లో లాటరీలు

## అరుణాచల్‌ప్రదేశ్

అరుణాచల్‌ప్రదేశ్‌లో లాటరీ కార్యకలాపాలు 1980లో ప్రారంభమయ్యాయి. రాష్ట్రప్రభుత్వం మొదట కొన్ని సొసైటీలను ఏర్పాటు చేసి, లాటరీల నిర్వహణ బాధ్యతను వాటికి అప్పగించింది. దరిమిలా వాటి నిర్వహణపై న్యాయపరమైన చిక్కులు ఎదురుకావడంతో ఆ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా భుజాలకెత్తుకుంది. అరుణాచల్‌ప్రదేశ్‌లో లాటరీల నిర్వహణ ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధీనంలో ఉంది. రాష్ట్రంలో ఆన్‌లైన్ లాటరీ కార్యకలాపాలు 2003లో మొదలయ్యాయి.

## కర్నాటక

కర్నాటక స్టేట్ లాటరీ కార్యకలాపాలు 1969లో ప్రారంభమయ్యాయి. అప్పటినుంచీ లాటరీలను ప్రభుత్వ రంగ సంస్థ అయిన మైసూర్ సేల్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ (ఎం.ఎస్.ఐ.ఎల్) మాత్రమే నిర్వహిస్తోంది. కర్నాటకలో ఈ లాటరీకి ఎంతో ప్రజాదరణ ఉండేది. లాటరీ టిక్కెట్లపై ప్రభుత్వం 1985లో అమ్మకం పన్నును విధించడం మొదలుపెట్టింది. ఆ మధ్య అమ్మకం పన్నును రద్దు చేసి, దాని స్థానంలో గాంబ్లింగ్ టాక్స్‌ను ప్రవేశపెట్టింది. కర్నాటకలో లాటరీలపై అమ్మకం పన్ను రూపేణా రూ. 50 లక్షలనుంచి రూ. 60 లక్షల వరకూ లభించేది.

కర్నాటకలో మూడు పువ్వులు- ఆరుకాయలుగా సాగుతున్న లాటరీ వ్యాపారాన్ని ప్రభుత్వం జూలై 2004లో నిషేధించింది. పేపర్ లాటరీలు, ఆన్‌లైన్ లాటరీల ద్వారా అప్పటివరకూ ప్రభుత్వానికి సంవత్సరానికి రూ. 300 కోట్ల ఆదాయం లభించేది. ఆన్‌లైన్ లాటరీలు కూడా ఎంతో జోరుగా నడిచాయి. ప్రారంభమైన మొదటి ఏడాదే ఆన్‌లైన్ లాటరీ ఆపరేటర్ రూ.

100 కోట్ల మేరకు ప్రభుత్వానికి చెల్లింపులు జరిపారు. లాటరీల ద్వారా సమకూరిన  రూ. 300 కోట్లను ప్రభుత్వం 'అక్షర దాసోహ' పేరిట నడిచే మధ్యాహ్న భోజన పథకం కోసం ఖర్చు చేసేది. లాటరీలను నిషేధించడంతో మధ్యాహ్న భోజన పథకం కోసం ప్రభుత్వం మరో దారి వెతుక్కోవలసి వచ్చింది.

కర్నాటక ప్రభుత్వం 2004 ఫిబ్రవరిలో భూటాన్ సహా మరో ఆరు రాష్ట్రాలకు చెందిన పేపర్ లాటరీ టిక్కెట్ల అమ్మకాలపై నిషేధం విధించింది. సదరు రాష్ట్రాలు 1999 స్టేట్ లాటరీ రూల్స్‌లోని 20వ నిబంధనను అనుసరించి సంబంధిత పత్రాలను, ఇతర వివరాలను సమర్పించనందున కర్నాటక ప్రభుత్వం ఈ చర్య తీసుకుంది. అయితే కోర్టు జోక్యంతో 2004 మార్చిలో నిషేధం తొలగిపోయింది.

ఎం.ఎస్.ఐ.ఎల్. నిర్వహించిన లాటరీల్లో మైసూర్ మల్లిగె, కర్నాటక లక్ష్మి వంటి వీక్లీ డ్రాలకు ఎంతో ఆదరణ లభించింది. లాటరీ స్కీమ్‌లు, బహుమతుల నిర్ణయం, బహుమతుల మొత్తం, ప్రింట్ చేయాల్సిన టిక్కెట్లు...ఇలా అన్ని విషయాలనూ ప్రభుత్వమే నిర్ణయించేది. వాటిని ఎం.ఎస్.ఐ.ఎల్. తూచ తప్పకుండా అమలు చేసేది. బంపర్ డ్రాలకు బహుమతులను, ఇతర లాటరీ స్కీమ్‌లకు మొదటి, రెండో బహుమతులను అమ్ముడుపోయిన టిక్కెట్లలోంచే ఎంపిక చేసేవారు.

## కేరళ

కేరళలో పేపర్ లాటరీకి డి.సి. కిజకెమురి అనే వ్యక్తిని ఆద్యుడిగా చెప్పవచ్చు. కొట్టాయంలో చిన్నపిల్లలకోసం లైబ్రరీని నెలకొల్పేందుకు ఆయన 1966లో లాటరీని నిర్వహించారు. ఒక్కో టిక్కెట్ ధరను ఒక్క రూపాయిగా నిర్ణయించారు. విజేతకు అంబాసిడర్ కారును బహుమతిగా ప్రకటించారు. యంత్రం సాయంతో టిక్కెట్లను కలగలిపి అందులోంచి ఓ టిక్కెట్‌ను తీసి విజేతను ఎంపిక చేశారు. అప్పటి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శంకర్, 'ఫ్యాక్ట్' మేనేజింగ్ డైరెక్టర్

ఎం. కె.కె. నాయర్ డ్రా తీశారు. ఈ లాటరీ ద్వారా 4.25 లక్షల రూపాయల ఆదాయం సమకూరింది. ఆ తరవాత కిజకెమురి, రష్యాలో అప్పటి భారత రాయబారి కె.పి.ఎస్. మీనన్ గవర్నర్‌ను కలసి, కొట్టాయంలో ప్రజా గ్రంథాలయం నిర్మాణంకోసం లాటరీ ద్వారా నిధుల సేకరణకోసం అనుమతి సంపాదించారు. అలా రూ. 4.85 లక్షలు సేకరించారు. సాహిత్యంలో విశేష కృషి చేసినవారికి అవార్డు అందించేందుకు కిజకెమురి మరోసారి లాటరీ నిర్వహించారు. ఆ తరవాత కొట్టాయం మున్సిపల్ కౌన్సిల్, బసాలియస్ కాలేజీ వంటి సంస్థలు కూడా కిజకెమురి బాటను అనుసరించాయి. అయితే కేరళలో తనకంటే ముందే క్విలన్‌లోని ఓ మహిళా సంస్థ లాటరీ నిర్వహించిందని కిజకెమురి చెప్పేవారు. అప్పట్లో కుటుంబ సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసేందుకు ఆరోగ్య శాఖ కూడా ప్రభుత్వ సహకారంతో పలుమార్లు లాటరీలు నిర్వహించి, నిధులు సమకూర్చుకుంది. తదనంతరకాలంలో ఎన్నో ప్రైవేటు లాటరీలు పుట్టుకువచ్చాయి. అవి అక్రమ విధానాలతో బడుగు జీవులను దోపిడీ చేయడాన్ని గమనించిన ప్రభుత్వం వాటిని నివారించేందుకు స్వయంగా లాటరీలను నిర్వహించడమే మార్గమని భావించింది. ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడానికి వెనుక అప్పటి ఆర్థిక మంత్రి పి.కె.కుంజు సాహబ్ కీలకపాత్ర వహించారు. ఈ మేరకు 1967లో రాష్ట్ర ప్రభుత్వ లాటరీల విభాగం ఏర్పడింది. మరియు మొట్టమొదటి డైరెక్టరుగా సయద్ మొహమద్‌ను ఎన్నుకున్నారు. లాటరీలను నిర్వహించడంలో ప్రభుత్వం కిజకెమురినుంచి సూచనలు, సలహాలు స్వీకరించింది. కిజకెమురి లాటరీలను నిర్వహించడంలో మెలకువలను వివరించడమే కాకుండా లాటరీ టిక్కెట్లను డ్రా తీసే మెషీన్‌ను ప్రభుత్వానికి బహూకరించారు కూడా.

కేరళలో లాటరీల నిర్వహణ పన్నుల విభాగం ఆధ్వర్యంలో నడుస్తోంది. ఏజెన్సీల నమోదు, వాటిని రెన్యూవల్ చేయడం, రూ. 5000 లోపు బహుమతి మొత్తాలను పంపిణీ చేయడం వంటి బాధ్యతలను జిల్లా లాటరీ కార్యాలయాలు నిర్వహిస్తాయి. ఇతర రాష్ట్రాలకు సంబంధించిన బహుమతులు, ఏజెన్సీలు

వంటి మిగతా అంశాలన్నీ డైరెక్టరేట్ అధీనంలో ఉంటాయి. మొదట్లో ఒకే ఒక్క వీక్లీ డ్రా ఉండేది. ఇప్పుడు నాలుగు వీక్లీ లాటరీలు నడుస్తున్నాయి. వాటి పేర్లు చైతన్య, పెరియార్, కేరలి, సౌభాగ్య. కాలానుగుణంగా బంపర్ డ్రాలను కూడా నిర్వహిస్తారు. వాటిలో గెలుపొందినవారికి రూ 50 లక్షల నుంచి రూ. కోటి వరకూ బహుమతులు ఉంటాయి. టిక్కెట్ల ధర రూ. 20. 30, 50 గా ఉంటుంది. టిక్కెట్లను ప్రభుత్వ ప్రెస్‌లోగాని, ఏదైనా సెక్యూరిటీ ప్రెస్‌లోగాని ముద్రిస్తారు. ప్రభుత్వం నియమించిన జడ్జీల ఆధ్వర్యంలో డ్రాలు తీస్తారు. లాటరీల ద్వారా ప్రభుత్వం 2003 ఆర్థిక సంవత్సరంలో రూ. 139 కోట్లు సేకరించింది. అందులో నికరాదాయం రూ. 13.45 కోట్లు. ఆన్‌లైన్ లాటరీలు రంగప్రవేశం చేశాక పేపర్ లాటరీ టిక్కెట్ల అమ్మకాలు 20 శాతం తగ్గాయి.

## హర్యానా

హర్యానాలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో లాటరీల నిర్వహణ 1968లో మొదలైంది. పేపర్ లాటరీలపై ప్రభుత్వం అమ్మకం పన్ను కూడా విధిస్తోంది.

## మహారాష్ట్ర

అభివృద్ధి కార్యక్రమాల అమలుకోసం నిధుల సేకరణకు గాను మహారాష్ట్ర ప్రభుత్వం 1969లో ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఒక లాటరీ బోర్డును ఏర్పాటు చేసింది. ఈ బోర్డు నియంత్రణలో చిన్న తరహా పొదుపు మొత్తాలు, ప్రభుత్వ లాటరీ కమిషనర్ నేతృత్వంలో లాటరీలు జరుగుతూంటాయి. తొలుత వారానికోసారి మాత్రమే ప్రభుత్వం డ్రా నిర్వహించేది. తరవాత వాటి సంఖ్య మూడుకు పెరిగింది. నెలలో 5, 15, 25 తేదీల్లో డ్రాలు నిర్వహిస్తున్నారు. సోమవారం నుంచి శనివారం వరకూ సాగర్ లక్ష్మి, పద్మిని, అక్షయ్, పుష్కరాజ్, వైభవ్ లక్ష్మి, మహారాష్ట్ర లక్ష్మి పేరిట రోజుకో లాటరీ చొప్పున నిర్వహిస్తున్నారు. బంపర్ లాటరీ పేరిట అనేక స్కీమ్‌లు కూడా అమలులో ఉన్నాయి. రిపబ్లిక్

డే, గుడి పడ్వా, మహారాష్ట్ర డే, దీవాలీ, మహారాష్ట్ర నాటల్ బంపర్ ప్రజాసత్తాక్ (రిపబ్లిక్ డే), శ్రీ భావ్యతమ్ (గణేశ చతుర్థి) వంటివి వాటిలో కొన్ని.

ఈ లాటరీలన్నింటికీ ప్రజాదరణ లభిస్తున్నా వాటిపై వచ్చే వార్షికాదాయం ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తక్కువగానే ఉండేది. దాంతో లాటరీ క్రమబద్ధీకరణ నిబంధనలు- 2000 కింద ప్రభుత్వం టూ డిజిట్ లాటరీని 2001 జూలైలో ప్రవేశపెట్టింది. 2డి గేమ్స్ నిర్వహణకోసం ప్రత్యేకంగా డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మహారాష్ట్రలో నలభై ఎనిమిది 2డి గేమ్స్ ఉన్నాయి. లాటరీల ద్వారా ప్రభుత్వానికి రూ. 50 కోట్ల వరకూ ఆదాయం లభిస్తున్నట్లు అంచనా.

## మిజోరం

ఆర్థిక వనరులు సమకూర్చుకునేందుకు మిజోరం ప్రభుత్వం 1986లో లాటరీల నిర్వహణకు శ్రీకారం చుట్టింది. లాటరీల ద్వారా లభిస్తున్న ఆదాయాన్ని క్రీడారంగం అభివృద్ధికి, ఇతర సామాజిక కార్యకలాపాలకోసం వెచ్చిస్తోంది. లాటరీల ద్వారా 2003లో మిజోరం ప్రభుత్వానికి రూ. 5.5 కోట్ల ఆదాయం లభించింది. ఆర్థిక మంత్రిత్వ శాఖ అధీనంలోని ఫైనాన్స్, స్మాల్ సేవింగ్స్ విభాగం లాటరీల నిర్వహణలను పర్యవేక్షిస్తోంది.

## నాగాలాండ్

నాగాలాండ్ ప్రభుత్వం 1972లో డైరెక్టరేట్ నాగాలాండ్ స్టేట్ లాటరీస్‌ను ఏర్పాటు చేసి, లాటరీల నిర్వహణను ప్రారంభించింది. దేశవ్యాప్తంగా నాగాలాండ్ లాటరీ టిక్కెట్లను విక్రయించేందుకు డైరెక్టరేట్ ఒక డిస్ట్రిబ్యూటర్‌ను నియమించారు. నాగాలాండ్‌లో ఆన్‌లైన్ లాటరీ 2002 డిసెంబర్‌లో మొదలైంది. రాష్ట్ర ప్రభుత్వానికి గల ప్రధాన ఆదాయ వనరుల్లో లాటరీ ఒకటి.

### పంజాబ్

పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం 1969లో లాటరీలను ప్రారంభించింది. సట్టా, మట్కా వంటి జూదాలను అరికట్టి, లాటరీల ద్వారా ప్రభుత్వ ఖజానా నింపేందుకు ఒక డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఏటా లాటరీల ద్వారా రూ. 150 కోట్ల ఆదాయం సమకూరుతోంది. అందులో పేపర్ లాటరీల ద్వారా 80నుంచి 90 శాతం ఆదాయం లభిస్తోంది.

పంజాబ్ స్టేట్ లాటరీస్ నిర్వహించే బంపర్ లాటరీలకు ఎంతో పేరుంది. వాటిలో రూ. 100 నుంచి రూ. 2 కోట్ల వరకూ బహుమతులు ఉండటం విశేషం. మొదటి బహుమతి (రూ. 2 కోట్లు) విజేతను అమ్ముడుపోయిన టిక్కెట్లనుంచే ఎంపిక చేస్తారు. లాటరీల ద్వారా పంజాబ్ ప్రభుత్వానికి ఏటా రూ. 20 కోట్ల ఆదాయం వస్తోంది.

## ప్రస్తుతం లాటరీలు లేని రాష్ట్రాలు

### గోవా

గోవాలో పోర్చుగీస్ ప్రభుత్వం 'ప్రొవెడోరియా డె అసిస్టెన్స్ పబ్లికా'కు నిధులు సమకూర్చుకునేందుకు తొలిసారిగా లాటరీల బాట పట్టింది. ఇప్పటికీ ప్రైవేటుపరంగా 'ప్రొవెడోరియా' కొనసాగుతూనే ఉంది. గోవా లాటరీలకు ఎంతో ఆదరణ ఉంది. లాటరీ ద్వారా వచ్చే ఆదాయాన్ని సంక్షేమ పథకాలు అనాథ ఆశ్రమాలకు, వృద్ధాశ్రమాలకు, పేదవారికోసం వినియోగిస్తారు. ముఖ్యంగా కొంకణ తీరంలోని ప్రజలకు లాటరీలపట్ల మక్కువ ఎక్కువ. కేంద్ర పాలిత ప్రాంతంగా ఉన్న గోవాకు రాష్ట్ర ప్రభుత్వ హోదా లభించాక లాటరీల నిర్వహణ బాధ్యతను ప్రభుత్వమే తీసుకుంది.

### హిమాచల్‌ప్రదేశ్

హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 1979లో నూతన సంవత్సరం మొదటి

రోజున లాటరీలను ప్రారంభించింది. అంతకుముందు నుంచీ ఏవో కొన్ని ప్రైవేటు సంస్థలు ప్రభుత్వ అనుమతితో లాటరీలు నిర్వహించేవి. అయితే అవన్నీ 1999లో మూతపడ్డాయి.

హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వం 2004లో అంతర్రాష్ట్ర లాటరీలను నిషేధించింది.

## మణిపూర్

మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం పేపర్, ఆన్‌లైన్ లాటరీలు రెండింటినీ నిర్వహించింది. ప్రస్తుతం మాత్రం ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎలాంటి లాటరీలు నడవటం లేదు.

## తమిళనాడు

మద్రాసు రాష్ట్రంలో 1700 చివరినాళ్ళలో బ్రిటిష్ ప్రభుత్వం లాటరీలను ప్రవేశపెట్టింది. ఇప్పుడు సెయింట్ జార్జి మ్యూజియం నడుస్తున్న భవనాన్ని 1795లో లాటరీ ద్వారా సమకూరిన నిధులతోనే నిర్మించారు. పై అంతస్థును పబ్లిక్ ఎక్స్చేంజ్ హాల్ లేదా లాంగ్ రూమ్ అని అంటారు. ఈ హాల్‌లోనే లాటరీ డ్రాలు తీసేవారు.

ప్రస్తుతం తమిళనాడు రాఫిల్స్ స్కీమ్ పేరిట లాటరీలను నిర్వహిస్తున్నారు. వీటిని 1968 ఆగస్టు 15న అప్పటి ముఖ్యమంత్రి సి.ఎన్. అన్నాదురై ప్రారంభించారు. సంక్షేమ కార్యక్రమాల అమలుకు కావలసిన నిధుల కోసం లాటరీలను మొదలుపెట్టారు. 1975 సెప్టెంబర్ - 1976 ఆగస్టు మధ్య కాలంలో ఏడాదిపాటు లాటరీలను నిలిపి వేసినా, తిరిగి ప్రారంభించారు. అయితే 2003 జనవరిలో రాష్ట్రవ్యాప్తంగా లాటరీలను నిషేధిస్తూ తీర్మానించారు. నిషేధానికి ముందు లాటరీలపై వసూలయ్యే అమ్మకం పన్ను రూపేణా ప్రభుత్వానికి ఏటా రూ. 70 కోట్ల ఆదాయం లభించేది.

## త్రిపుర

త్రిపురలోని వామపక్ష ఫ్రంట్ ప్రభుత్వం కలకత్తాకు చెందిన ఓ సంస్థతో కలసి 1978లో లాటరీ నిర్వహణను చేపట్టింది. ఆ తరవాత అనుకోని వివాదాలు తలెత్తడంతో 1983లో లాటరీలను నిలిపివేసింది.

## పశ్చిమ బెంగాల్

స్వాతంత్ర్యానికి పూర్వంనుంచీ పశ్చిమ బెంగాల్‌లో లాటరీలు జరిగిన దాఖలాలు ఉన్నాయి. రోడ్లు, భవంతులు నిర్మించి కలకత్తా నగరాన్ని తీర్చిదిద్దేందుకు 1803లో లార్డ్ వెల్లెస్లీ ఓ అభివృద్ధి కమిటీని నియమించారు. ఈ కమిటీ లాటరీ ద్వారా నిధులు సమకూర్చుకుంది. కమిటీ పేరును 1817లో లాటరీ కమిటీగా మార్చారు. బెంగాల్ లాటరీ నిధుల ద్వారా చేపట్టిన నిర్మాణాలలో టౌన్ హాల్ ఒకటి. 1813లో నిర్మించిన ఈ భవంతి ఇప్పటికీ చెక్కు చెదరకుండా నిలచిఉంది.

మద్రాసుకు 1788లో వచ్చిన థామస్ పారీ బెంగాల్ లాటరీ టిక్కెట్ల విక్రయాన్ని చేపట్టారు. పారీస్ కార్నర్ ఆయన పేరు మీద వెలసినదే.

అప్పట్లో ప్రైవేటు లాటరీలు కూడా ఉండేవి. వాటిలో డాన్‌బాస్కో ఛారిటీస్ నిర్వహించిన లాటరీ ప్రముఖమైనది. సామాజిక సేవా కార్యకలాపాలకోసం డాన్‌బాస్కో ఛారిటీస్ లాటరీ నిర్వహించేది. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం 1970లో లాటరీ నిర్వహణను ప్రారంభించింది. 1984నుంచి అమ్మకం పన్నును విధించడం మొదలుపెట్టింది.

# దేశవిదేశాల్లో లాటరీలు

## ఆస్ట్రేలియా

### ఆస్ట్రేలియా వెస్ట్

లాటరీలను నిర్వహించే పశ్చిమ ఆస్ట్రేలియా ప్రభుత్వ విభాగాన్ని లాటరీవెస్ట్ అంటారు. గతంలో దీనిని లాటరీస్ కమిషన్ ఆఫ్ వెస్టర్న్ ఆస్ట్రేలియా అనేవారు. ఎంటర్‌ప్రైజెస్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో లాటరీ వెస్ట్ పనిచేస్తుంది. లాటరీల ద్వారా సమకూరిన ఆదాయాన్ని లాటరీస్ కమిషన్ చట్టం -1990లోని నిబంధనలను అనుసరించి పంపిణీ చేస్తారు. 2003లో లాటరీవెస్ట్ 491 మిలియన్ డాలర్ల (340 మిలియన్ అమెరికన్ డాలర్లు) ఆదాయాన్ని సంపాదించింది. ఇందులో 143.9 మిలియన్ డాలర్లను (100 మిలియన్ అమెరికన్ డాలర్లు) వెస్టర్న్ ఆస్ట్రేలియన్ కమ్యూనిటీకి, 75.1 మిలియన్ డాలర్లను (52 మిలియన్ అమెరికన్ డాలర్లు) ఆరోగ్య రంగానికి, 9.4 మిలియన్ డాలర్లను (6.5 మిలియన్ అమెరికన్ డాలర్లు) క్రీడారంగానికి, 9.4 మిలియన్ డాలర్లను (6.5 మిలియన్ అమెరికన్ డాలర్లు) కళారంగానికి, 51.4 మిలియన్ డాలర్ల (35.6 మిలియన్ అమెరికన్ డాలర్లు) విలువైన 1509 గ్రాంట్లను వివిధ సామాజిక సేవా సంస్థలకు కేటాయించింది. లాటరీవెస్ట్ నుంచి నిధులు పొందిన సామాజిక సేవా సంస్థల్లో సర్ఫ్ లైఫ్ దీగీ సేవింగ్ వెస్టర్న్ ఆస్ట్రేలియా, రీసెర్చి అండ్ రెస్క్యూ, అబొరిజినల్ కార్పొరేషన్స్, లాండ్‌కేర్ గ్రూప్స్, హెరిటేజ్ కన్జర్వేషన్ ప్రాజెక్ట్ వంటివి ఉన్నాయి.

విక్టోరియా, టాస్మేనియా, నార్తర్న్ టెరిటరీ మినహా మిగిలిన రాష్ట్రాలన్నీ స్వయంగా లాటరీలను నిర్వహిస్తున్నాయి. అవుట్‌బ్యాక్ అడ్వంచర్, సాకర్ పూల్స్, క్యాష్ 3 వంటి ఇన్‌స్టంట్ స్క్రాచ్ గేమ్స్ కూడా జోరుగా నడుస్తున్నాయి.

## సౌత్ ఆస్ట్రేలియా లాటరీస్ (ఎస్.ఎ.ఎల్)

రాష్ట్రం 'కలలను సాకారం చేసుకునే' ధ్యేయంతో దక్షిణ ఆస్ట్రేలియా 1967లో లాటరీలకు శ్రీకారం చుట్టింది. లాటరీ కమిషన్ ఆఫ్ సౌత్ ఆస్ట్రేలియాను ఏర్పాటు చేయాలంటూ పార్లమెంట్ తీర్మానం ఆమోదించిన అనంతరం ప్రభుత్వం లాటరీ వ్యాపారంలోకి అడుగుపెట్టింది. ఆస్ట్రేలియాలో ఇన్‌స్టంట్ గేమ్స్ 1970లో మొదలయ్యాయి. మొట్టమొదటగా వీటిని ప్రారంభించిన ఘనత సౌత్ ఆస్ట్రేలియా, న్యూ సౌత్ వేల్స్ రాష్ట్రాలకు దక్కుతుంది. మిగతా రాష్ట్రాలు 1980లలో ఇన్‌స్టంట్ లాటరీలను ప్రారంభించాయి. ఆస్ట్రేలియాలో ఇన్‌స్టంట్ మనీ గేమ్స్ లేక ఇన్‌స్టంట్ స్క్రాచీస్ నిర్వహణను ఎస్ఎఎల్ చేపట్టింది. 1984లో ఆన్‌లైన్ లాటరీలు ప్రారంభమయ్యాయి. ఆన్‌లైన్ లాటరీ టిక్కెట్ల అమ్మకాలు 1989 జనవరిలో వందకోట్ల డాలర్లకు చేరుకున్నాయి. ఆ తరవాత 1994లో ఎస్ఎఎల్ ఈజీప్లే క్లబ్‌ను ప్రారంభించింది. ఆటగాళ్ళు గెలుచుకునే బహుమతులకు క్లబ్ తగిన రక్షణ కల్పించేది.

## గోల్డెన్ కేస్కట్ లాటరీ కార్పొరేషన్

క్వీన్స్‌లాండ్‌లో ప్రభుత్వం గోల్డెన్ కేస్కట్ లాటరీ కార్పొరేషన్‌ను నెలకొల్పింది. ఇది 85 ఏళ్ళుగా దిగ్విజయంగా నడుస్తోంది. గోల్డెన్ కేస్కట్ వార్షిక టర్నోవర్ 721 మిలియన్ డాలర్లు (సుమారు 499 మిలియన్ అమెరికన్ డాలర్లు). ఇందులో 200 మిలియన్ డాలర్లు (138 మిలియన్ అమెరికా డాలర్లు) ప్రభుత్వ ఖజానాకు జమ అవుతున్నాయి. ఈ డబ్బును సంక్షేమ కార్యక్రమాలకోసం వినియోగిస్తున్నారు. గోల్డెన్ కేస్కట్ లాటరీ 1916లో ప్రారంభమైంది. అప్పట్లో మొదటి ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న సైనికుల సంక్షేమార్థం నిధులు సేకరించేందుకు ఎంటర్‌టైన్‌మెంట్ కమిటీ ఆఫ్ ది క్వీన్స్‌లాండ్ పాట్రియాటిక్ ఫండ్ అనే సంస్థ ఈ లాటరీని నిర్వహించింది. 1917లో డ్రా తీశారు. మొదటి బహుమతిని గెలుచుకున్న విజేతకు 5000 స్టెర్లింగ్ పౌండ్ల విలువ చేసే

బంగారపు పేటికను అందచేశారు. నగదు బహుమతులను ఇవ్వకూడదని నిబంధనలు ఉండేవి. అందువల్ల స్వర్ణ పేటికను బహుమతిగా ఇచ్చారన్నమాట. ఆ తరవాత విజేత దానిని విక్రయించుకుని, నగదు పొందేవారన్నది వేరే సంగతి.

ప్రస్తుతం క్వీన్స్‌లాండ్ ప్రభుత్వం గోల్డ్ లోటో, ఓజ్ లోటో, పవర్ బాల్, ఇన్‌స్టంట్ గేమ్స్, ది పూల్స్ అండ్ కేస్కట్ వంటి లాటరీ గేమ్స్‌ను నిర్వహిస్తోంది. రాష్ట్రాల మధ్య జరిగే బ్లాక్ గేమ్స్‌తో సహా వేటిపైనా ప్రభుత్వం పన్నులు వసూలు చేయడం లేదు.

గోల్డన్ కేస్కట్ లాటరీ అనేక సంక్షేమ పథకాలకు చేయూతనిస్తోంది. లాటరీ ద్వారా సమకూరే నిధుల్లో సింహభాగం మదర్‌హుడ్, చైల్డ్ వెల్‌ఫేర్ అండ్ హాస్పిటల్ ఫండ్ అనే స్వచ్ఛంద సంస్థకు దక్కుతాయి. బుష్ నర్సింగ్ అసోసియేషన్‌తోపాటు  95 మెటర్నిటీ హాస్పిటల్స్, టిబి సోల్జర్స్ హౌసింగ్ స్కీమ్, మాటెర్ చిల్డ్రన్స్ హాస్పిటల్ ట్రస్ట్ కేన్సర్ కేంపయిన్ కమిటీ, ఆస్ట్రేలియన్ సోల్జర్స్ రిపాట్రియేషన్ ఫండ్ వంటి సంస్థలకు, 150 చిల్డ్రన్స్ క్లినిక్స్‌కు, క్రెష్‌లకు, కిండర్‌గార్టన్ స్కూళ్ళకు కూడా ఆర్థిక సహాయం అందుతోంది. గోల్డెన్ కేస్కట్‌నుంచి అందుతున్న విరాళాలతో ప్రభుత్వ ఆస్పత్రులు ఉచిత వైద్య సేవలు అందించగలుగుతున్నాయి. లబ్ధిదారుల్లో క్వీన్స్‌లాండ్ యూనివర్శిటీ, రెడ్‌క్రాస్, సర్ఫ్ లైఫ్ సేవింగ్ అసోసియేషన్, క్వీన్స్‌లాండ్ కంట్రీ ఉమెన్స్ అసోసియేషన్, సిస్టర్ ఎలిజబెత్ కెన్నీ పోలియో క్లినిక్స్, క్వీన్స్‌లాండ్ పెర్‌ఫార్మింగ్ ఆర్ట్స్ కాంప్లెక్స్ వంటి సంస్థలు ఉన్నాయి.

## విక్టోరియా

విక్టోరియాలో టాటెర్‌సాల్ స్వీప్ కన్సల్టేషన్ అనే సంస్థ లాటరీ ఆపరేటర్‌గా వ్యవహరిస్తోంది. ఆస్ట్రేలియాలో అతి పెద్ద ప్రైవేటు కంపెనీగా పేరొందిన టాటెర్‌సాల్ 1881లో ఏర్పడింది. దీనిని స్థాపించిన జార్జి ఆడమ్స్ అనే పెద్ద

మనిషి 1881లో స్వీప్ లాటరీని నిర్వహించారు. బ్యాంక్ ఆఫ్ వాన్ డీమెన్స్‌లాండ్ ఆర్థిక నష్టాలను ఎదుర్కోవడం, టాస్మేనియా ఆర్థిక వ్యవస్థ దిగజారడం వంటి కారణాలవల్ల వ్యాపారపరంగా ఇబ్బందుల్లో పడిన ఆడమ్స్... లాటరీ నిర్వహణ ద్వారా తిరిగి కోలుకోగలిగాడు.

ప్రస్తుతం సాటర్‌డే టాట్స్‌లోటో, వెడ్నస్‌డే టాట్స్‌లోగో, పవర్‌బాల్, ఓజ్ లోటో, సూపర్ 66, ది పూల్స్ టాట్స్ కెనో, ఇన్‌స్టంట్ గేమ్స్ వంటి  రకరకాల లాటరీలను టాటెర్‌సాల్స్ అందిస్తోంది. సాటర్‌డే టాట్స్‌లోటోకు యాడ్-ఆన్ గేమ్‌గా సూపర్ 66ను నిర్వహిస్తారు. డ్రా మెషీన్‌లో ఆరు చిన్న చిన్న గదులు ఉంటాయి. ఒక్కో గదిలో 0 నుంచి 9 వరకూ అంకెలు గల పది బంతులు ఉంటాయి. ప్రతి గదినుంచి ఒక్కో బంతిని వెలికి తీస్తారు. ఇలా బయటకు తీసిన ఆరు బంతులపై ఉన్న ఆరు నెంబర్లను కలిపితే సూపర్ 66 నంబర్ అవుతుంది.

లాటరీ నిధుల్లో 600 మిలియన్ డాలర్లను (415 మిలియన్ అమెరికా డాలర్లు) టాటెర్‌సాల్స్ కంపెనీ విరాళంగా అందిస్తోంది. ఈ నిధులను జార్జి ఆడమ్స్ కోరిక మేరకు  పేదరికంతో అలమటిస్తున్న కుటుంబాలకు ఇళ్ళ నిర్మాణానికి, చిన్నారుల చదువుకోసం , వికలాంగులకు చేయూతనిచ్చేందుకు, అనారోగ్యంతో బాధపడుతున్న చిన్న పిల్లలకు వెచ్చిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా అనేక సంస్థలకు టాటెర్‌సాల్స్ కంపెనీ ఆర్థిక సహాయం అందిస్తోంది. రాయల్ చిల్డ్రన్స్ హాస్పిటల్, వెరీ స్పెషల్ కిడ్స్, రాయల్ డిస్ట్రిక్ట్ నర్సింగ్ సర్వీస్, ఆల్‌ఫ్రెడ్ హాస్పిటల్, వెస్ట్ విమ్మెరా హెల్త్ సర్వీస్, మెంటల్ హెల్త్ ఫౌండేషన్, గండర్రా పల్లియేటివ్ కేర్ యూనిట్, నార్తర్న్ హాస్పిటల్, సెయింట్ విన్సెంట్ హాస్పిటల్, పీటర్ మెక్‌కాలమ్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ వంటి వైద్య సేవా సంస్థలకు ఆస్ట్రేలియన్ రెడ్ క్రాస్, కేర్ ఆస్ట్రేలియా, ఎంఎస్ సొసైటీ ఆఫ్ విక్టోరియా, రైడింగ్ ఫర్ ది డిజేబుల్డ్ అసోసియేషన్, సేవ్ ది చిల్డ్రన్, హార్టిలీ లైఫ్‌కేర్, మాల్లే ఫ్యామిలీ కేర్, టి.ఎల్.సి. ఫర్ కిడ్స్ వంటి స్వచ్ఛంద సేవా సంస్థలకు

టాటెర్‌సాల్స్ కంపెనీ నిధులను అందిస్తోంది.

## న్యూ సౌత్ వేల్స్

ప్రభుత్వ ఆస్పత్రులకు ఆర్థిక సహాయం అందించే ఉద్దేశంతో న్యూ సౌత్ వేల్స్ ప్రభుత్వం 1931లో స్టేట్ లాటరీ ఆఫీస్‌ను ఏర్పాటు చేసింది. జాక్‌లాంగ్ నాయకత్వంలోని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. తొలిసారి ప్రభుత్వం లాటరీ నిర్వహించినప్పుడు దానిలో పాల్గొనేందుకు ప్రజలు బారులు తీరి నిలబడ్డారట. పిట్ నగరంలోని హెర్ మెజెస్టీ థియేటర్‌లో డ్రా తీశారు. అప్పటి అటార్నీ జనరల్ లామరో డ్రా తీశారు. సిడ్నీ ఓపెరా హౌస్ నిర్మాణంకోసం 1957లో మరోసారి లాటరీ నిర్వహించారు. టిక్కెట్ ధర 10 డాలర్లుగా నిర్ణయించారు. మొదటి బహుమతిగా 200,000 డాలర్ల భారీ మొత్తాన్ని ప్రకటించారు. లోటో గేమ్‌ను 1979లో తొలిసారిగా నిర్వహించారు. ఇప్పటికీ అత్యంత ప్రజాదరణ గల లాటరీ గేమ్‌గా దీనికి పేరు ఉంది. ఈ గేమ్ ద్వారా ఇప్పటివరకూ 500 మంది మిలియనీర్లు అయ్యారు. 1982లో ఇన్‌స్టంట్ గేమ్స్ మొదలయ్యాయి. టిక్కెట్ల అమ్మకం ద్వారా లభించిన ఆదాయంలో మూడోవంతు ప్రభుత్వానికి లభిస్తుంది. 60 శాతం నిధులను ప్రైజ్ మనీగా ఇస్తారు. డ్రా తీసేందుకు 1982లో ర్యాండమ్ నంబర్ జనరేటర్‌ను ప్రవేశపెట్టారు. ఆన్‌లైన్ లాటరీలు 1988లో మొదలయ్యాయి.

రాష్ట్రప్రభుత్వం 1600 అవుట్‌లెట్ల ద్వారా లాటరీ టిక్కెట్లను విక్రయిస్తోంది. ఏటా 600 మిలియన్ డాలర్లను ప్రైజ్‌మనీగా అందచేస్తోంది. 'ది స్క్రాచీస్' పేరిట ఫన్ ఫ్లవర్, పింక్ పాంథర్, ఫారో బింగో, మోనోపలీ, విన్ ఫర్ లైఫ్, బ్రిటిష్ ట్రెజర్ వంటి రకరకాల గేమ్స్‌ను నిర్వహిస్తోంది.

## అజర్‌బైజాన్

అజర్‌బైజాన్ రిపబ్లిక్‌లో లాటరీలను నియంత్రించేందుకు దేశాధ్యక్షుడు

2001లో ఓ డిక్రీని జారీ చేశారు. ఈమేరకు 'అజర్‌లోటెరియా' అనే సంస్థ ఆవిర్భవించింది. ఆర్థికాభివృద్ధి మంత్రిత్వ శాఖ అధీనంలో స్టేట్ కమిటీ ఆన్ సెక్యూరిటీస్ విభాగం లాటరీలను నిర్వహిస్తుంది. ఏ గేమ్‌లోనైనా టిక్కెట్ల అమ్మకం ద్వారా లభించిన మొత్తంలో 50 శాతాన్ని ప్రైజ్‌మనీకోసం కేటాయిస్తారు. 50,000 మానట్స్ లోపు బహుమతి మొత్తాలను లాటరీ పంపిణీదారులే చెల్లిస్తారు. అంతకుమించిన బహుమతులను లోటో యావిమ్ కంపెనీ అందచేస్తుంది. డ్రా తీసేందుకు న్యూమెరిక్ కేస్కులు లేదా లోటోట్రోన్ మెషీన్లను ఉపయోగిస్తారు. డ్రా తీయడాన్ని టెలివిజన్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

అజెర్‌లోటెరియా ఆధ్వర్యంలో లాటరీ కిజిల్ కిసె అనే ఇన్‌స్టంట్ లాటరీ, ఐలీ సెవింకి, గిస్మెట్ అచరి, ఉగుర్లు రెజెమ్ వంటి నంబర్ గేమ్స్ నడుస్తున్నాయి. ఈ గేమ్స్‌లో గెలుపొందిన విజేతలకు బహుమతులు వివిధ రూపాల్లో ఉంటాయి. అంటే నగదు బహుమతులే కాకుండా రియల్ ఎస్టేట్ భూములు, కార్లు, ద్విచక్ర వాహనాలు వంటివాటిని కూడా అందచేస్తారు. లాటరీల పట్ల ప్రజల్లో ఆసక్తిని రేకెత్తించేందుకు రకరకాల ఆకర్షణీయమైన బహుమతులను ప్రకటిస్తారు. అలాగే గేమ్స్‌లో జరిపిన మార్పులు చేర్పులను మీడియా ద్వారా ప్రజలకు చేరవేస్తారు.

## బెల్జియం

బెల్జియం అధీనంలో ఉన్న వలస రాజ్యం కాంగో ఆర్థిక సమస్యలనుంచి గట్టెక్కేందుకు లాటరీల బాట పట్టింది. ఆ తరవాత బెల్జియం కూడా అదే మార్గాన్ని ఎంచుకుంది. బడ్జెట్ లోటును పూడ్చుకునేందుకు ఛార్లెస్ డె బ్రోక్‌విల్లె లాటరీ నిర్వహించడమే ఉత్తమమని భావించి, అందుకు అనుగుణంగా 1934లో చట్టం చేశారు. 'కలోనియల్ లాటరీ' పేరుతో లాటరీని నిర్వహించి, కిర్క్ రాయల్ లో అక్టోబర్ 1934న డ్రా తీశారు. అయితే ఈ లాటరీవల్ల

ఆశించిన ప్రయోజనాలు నెరవేరలేదని చెబుతారు. పెద్ద సంఖ్యలో టిక్కెట్లు ముద్రించడంతో వాటిని అమ్మడం మేనేజ్‌మెంట్ కమిటీకి తలకు మించిన భారమైంది. దీనిని గుణపాఠంగా తీసుకుని, ఆ తరవాత నిర్వహించిన లాటరీలో మేనేజ్‌మెంట్ కమిటీ తగిన జాగ్రత్తలు తీసుకుంది. రేడియో, పత్రికలు, సినిమా వంటి ప్రసార సాధనాల ద్వారా లాటరీ గురించి పెద్దయెత్తున ప్రచారం నిర్వహించింది. పేరొందిన గ్రాఫిక్ డిజైనర్లతో పోస్టర్లను, కరపత్రాలను ముద్రించి, కొనుగోలుదార్లను ఆకర్షించేందుకు ప్రయత్నించింది. టిక్కెట్లను తక్కువ సంఖ్యలో ప్రింట్ చేయించడమే కాకుండా, వాటిని సగం ధరకే విక్రయించారు. ఈ చర్యలన్నీ తీసుకోవడంతో ఈసారి లాటరీ విజయవంతమైంది. 1940లో నిర్వహించిన కలోనియల్ లాటరీ ద్వారా 500 మిలియన్ ఫ్రాంకుల డబ్బు సమకూరింది. ఇందులో 60 శాతం మొత్తాన్ని ప్రైజ్ మనీగా ఇచ్చివేశారు. మిగిలిన డబ్బును వికలాంగ సైనికుల సంక్షేమం కోసం కృషి చేసే సంస్థకు, మరో 20 స్వచ్ఛంద సేవా సంస్థలకు విరాళంగా అందచేశారు.

ప్రస్తుతం నేషనల్ లాటరీ టిక్కెట్లను పుస్తకాల షాపుల్లోను, పోస్టాఫీసులు, సర్వీస్ స్టేషన్లు, సూపర్ మార్కెట్లు, న్యూస్ పేపర్ కియోస్కులు వంటి చోట్ల విక్రయిస్తున్నారు. నేషనల్ లాటరీ వివిధ రకాల ఇన్‌స్టంట్ గేమ్స్‌ను కూడా నిర్వహిస్తోంది. ఆస్ట్రో, కేట్రియో, క్లియోపాత్ర, లోక్సో, హెడ్స్ అండ్ టెయిల్స్, ప్రెస్టో, షూట్ గోల్, సుబిటో, విన్ ఫర్ లైఫ్ వంటివి నేషనల్ లాటరీ నిర్వహించే కొన్ని రకాల ఇన్‌స్టంట్ గేమ్స్. ఇక కేసినో ఇన్‌స్టంట్ గేమ్స్‌లో నాలుగు ప్రముఖ రకాలు ఉన్నాయి. అవి బ్లాక్ జాక్, జాక్‌పాట్, క్రాప్స్, రులేట్. ఇవేకాకుండా మూడు రకాల నంబర్ లాటరీలు కూడా జరుగుతూ ఉంటాయి. నేషనల్ లాటరీ టర్నోవర్ వారానికి 18,750,000 ఇ.యు.ఆర్.లు.

నేషనల్ లాటరీ ద్వారా వచ్చిన ఆదాయాన్ని పంపిణీ చేసేందుకు గ్రాంట్స్ డిపార్ట్‌మెంట్ పేరిట ఓ విభాగాన్ని నెలకొల్పారు. మంత్రులు చేసిన ప్రతిపాదనలను బట్టి రాజు ఈ ఆదాయాన్ని ఎలా కేటాయించాలో నిర్ణయిస్తాడు.

లాభాల్లో కొంత మొత్తాన్ని అభివృద్ధి చెందుతున్న దేశాల్లో చేపట్టే సంక్షేమ కార్యక్రమాలకు, వలస పోయినవారు, రాజకీయ శరణార్థుల సహాయార్థం, దారిద్ర్య నిర్మూలనకోసం, శాస్త్ర సాంకేతిక రంగాల్లో పరిశోధనలకోసం కేటాయిస్తారు. లబ్ధిదారుల్లో నేషనల్ డిసాస్టర్ ఫండ్, ది కింగ్ బౌడౌయిన్ ఫౌండేషన్, థర్డ్ వరల్డ్ సర్వైవల్ ఫండ్, స్పెషల్ ఒలింపిక్స్, క్వీన్ ఎలిజబెత్ మ్యూజికల్ కాంపిటీషన్, రెడ్ క్రాస్, చైల్డ్ ఫోకస్ వంటి సంస్థలు ఉన్నాయి.

పబ్లిసిటీకోసం నేషనల్ లాటరీ ఎన్నో కార్యక్రమాలను స్పాన్సర్ చేస్తుంది. గ్రాండ్ ప్రీ, సైక్లింగ్ రేస్ ఆఫ్ వాలూన్, పినో సెరామి గ్రాండ్ ప్రీ, మియూజ్ మారథాన్, వాన్ డమ్మే మెమోరియల్ అథ్లెటిక్స్, క్రాస్ కప్ ఫర్ క్రాస్ కంట్రీ రేస్, మోటోక్రాస్ ఛాంపియన్‌షిప్, బెల్జియన్ వీల్‌చైర్ టెన్నిస్ ఓపెన్, బెల్జియన్ మౌంటైన్ బైకింగ్ కప్, ఇంటర్నేషనల్ ట్రయాథ్లాన్ వంటివి నేషనల్ లాటరీ స్పాన్సర్ చేసే కొన్ని క్రీడలు. సంగీతం, సాహిత్యం, సినిమా, నాటకరంగాలకు చెందిన ఎన్నో కార్యక్రమాలను కూడా నేషనల్ లాటరీ స్పాన్సర్ చేస్తోంది. రచయితలకోసం ఎస్పేస్ జెయునెస్ అటియర్స్ కాంపిటీషన్, చైనీ టేల్ ఫెస్టివల్ వంటి పోటీలను స్పాన్సర్ చేస్తోంది. శాస్త్రీయ, జానపద సంగీత పోటీలతోపాటు జాజ్, రాక్ వంటి పాశ్చాత్య సంగీత పోటీలకూ స్పాన్సరర్‌గా వ్యవహరిస్తోంది.

## కంబోడియా

కంబోడియా లాటరీ కార్పొరేషన్ లిమిటెడ్ (సిఎల్‌సి) 1992లో ఏర్పడింది. విదేశీ పెట్టుబడుల జాతీయ కమిటీ, ఆర్థిక మంత్రిత్వ శాఖల పర్యవేక్షణలో లాటరీలను నిర్వహిస్తూ ఉంటుంది. మాగ్నమ్, సిఎల్‌సి, ఫ్నామ్ పెన్ నంబర్స్, వరిసన్, వియత్నామ్ అండ్ ఫార్ట్యూన్ వంటి సెవెన్ నంబర్ గేమ్స్‌ను కూడా సిఎల్‌సి నిర్వహిస్తోంది. 6 బై 29 గేమ్‌ను, 36 ఫ్లవర్స్ అనే చైనీస్ గేమ్‌కు ఆధునిక వెర్షన్‌ను కూడా నిర్వహిస్తోంది. లాస్‌వేగాస్‌కు చెందిన విన్‌విన్ గేమింగ్ ఇన్‌కార్పొరేషన్‌తో కలసి 2003 జూలైలో పే డే అనే పేరుతో మొట్టమొదటిసారిగా స్క్రాచ్ టిక్కెట్ గేమ్‌ను నిర్వహించింది.

# కెనడా

## అట్లాంటిక్ లాటరీ కార్పొరేషన్

నాలుగు అట్లాంటిక్ ప్రావిన్సులు కలసి 1976లో అట్లాంటిక్ లాటరీ కార్పొరేషన్ (ఎ.ఎల్.సి.)ను నెలకొల్పాయి. ఈ కార్పొరేషన్‌లో న్యూ బ్రన్స్విక్ కమిషన్, నోవా స్కోటియా గేమింగ్ కార్పొరేషన్, ప్రిన్స్ ఎడ్వర్డ్ ఐలాండ్ లాటరీస్ కమిషన్, ప్రావిన్స్ ఆఫ్ న్యూఫౌండ్‌లాండ్, లాబ్రడార్ వంటివి షేర్ హోల్డర్లుగా ఉన్నాయి.

మొదట్లో ఏ-1 అనే ఒకే ఒక్క గేమ్‌ను మాత్రమే ఎ.ఎల్.సి. ఆఫర్ చేసింది. కెనడాలో స్పీల్ గేమ్‌ను మొదటగా నిర్వహించింది ఎ.ఎల్.సి.యే. ఈ గేమ్‌ను స్థానికంగా టిఏజి అంటారు. అలాగే కెనడాలో వీడియో లాటరీని, కాంబో ఇన్‌స్టంట్ లేదా పుల్ టాబ్ టిక్కెట్ వంటి గేమ్స్‌ను ముందుగా నిర్వహించింది కూడా ఎ.ఎల్.సి. మాత్రమే.'ట్విస్ లక్కీ' అనే గేమ్ ఒక వైపు స్క్రాచ్ గేమ్ కాగా మరోవైపు టాబ్ టిక్కెట్ గేమ్. 1983లో తొలిసారిగా టిక్-టాక్-టో అనే ఇన్‌స్టంట్ గేమ్‌ను ప్రవేశపెట్టింది. లోటో 50, ఎ 6 బై 49 లోటో, బాన్‌కో స్క్రాచ్, బింగో, కెనో, సెట్ ఫర్ లైఫ్ స్క్రాచ్, పే డే అనేవి ఎ.ఎల్.సి. నిర్వహిస్తున్న మరికొన్ని గేమ్స్. బ్యాంక్ వాలిడేషన్ లైన్ అనే పథకాన్ని ఎ.ఎల్.సి. ప్రవేశపెట్టింది. ఆటగాళ్లు తమకు వచ్చిన నగదు బహుమతులను బ్యాంక్ ఆఫ్ నోవా స్కోటియానుంచి క్లెయిమ్ చేసుకోవచ్చు. 250 డాలర్ల వరకూ బహుమతులను రిటైల్ అవుట్‌లెట్లనుంచి పొందవచ్చు. 10,000 డాలర్ల లోపు నగదు బహుమతులను బ్యాంక్ ఆఫ్ నోవా స్కోటియానుంచి, అంతకుమించిన బహుమతులను ఎ.ఎల్.సి. కార్యాలయాలనుంచి పొందవలసి ఉంటుంది.

## బ్రిటిష్ కొలంబియా కార్పొరేషన్ (బి.సి.సి.)

బ్రిటిష్ కొలంబియా అంతటా బి.సి.సి. లాటరీలను నిర్వహిస్తోంది. 1974లో

బి.సి.సి. ఏర్పడిన నాటినుంచి ఇప్పటివరకూ వివిధ సామాజిక సంక్షేమ, సేవా కార్యకలాపాలకోసం 600 కోట్ల డాలర్లను విరాళంగా ఇచ్చింది. అనేక కార్యక్రమాలను స్పాన్సర్ చేసింది కూడా. కేసినో గేమింగ్‌ను కూడా బి.సి.సి.యే నిర్వహిస్తోంది. లాటరీలు, కేసినోల ద్వారా లభించిన ఆదాయంలో 132 మిలియన్ డాలర్లను 5800కు పైగా స్వచ్ఛంద సేవా సంస్థలకు విరాళమిచ్చింది. విన్నింగ్ టిక్కెట్లను ఎంపిక చేసేందుకు బి.సి.సి. 1991లో ఆటొమేటెడ్ డ్రా మెషీన్లను ప్రవేశపెట్టింది. 'లివింగ్ లార్జి' అనే విలక్షణమైన లాటరీని కూడా బి.సి.సి. నిర్వహిస్తోంది. టిక్కెట్ ధర 20 డాలర్లు. ఈ టిక్కెట్ మూడు భాగాలుగా ఉంటుంది. స్క్రాచ్ ఏరియా అదనం. ఏ 6 /49 లోటో, బిసి 49, డైలీ 3, సూపర్ 7, కెనో, ఛేజర్ వంటివి బి.సి.సి. ఆఫర్ చేస్తున్న మరికొన్ని లాటరీ గేమ్స్.

## చైనా

1949లో పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా అవతరించినప్పుడు ప్రభుత్వం అన్ని రకాల గాంబ్లింగ్ గేమ్స్‌నూ నిషేధించింది. తిరిగి 1987లో బ్రేక్- ఓపెన్ ఇన్‌స్టంట్ టిక్కెట్లను విక్రయించడం ప్రారంభించింది. చైనీస్ లాటరీ ఇంతై... వటుడింతై అన్న రీతిలో దినదినప్రవర్ధమానమవుతున్నకొద్దీ లాటరీల నిర్వహణలో అధునాతన పోకడలు చోటుచేసుకున్నాయి. చైనీస్ గేమ్స్‌లో ఇప్పుడు సరికొత్త యంత్రాలు, సాఫ్ట్‌వేర్ ప్రవేశించాయి. ఇప్పుడు రష్యాకు, సి.ఐ.ఎస్. (కామన్‌వెల్త్ ఆఫ్ ఇండిపెండెంట్ స్టేట్స్) దేశాలకు చైనీస్ గేమ్స్ విస్తరించాయి.

చైనా రెండు లాటరీలను ఆపరేట్ చేస్తోంది. అవి చైనా సోషల్ వెల్ఫేర్ లాటరీ (సి.ఎస్.డబ్ల్యు,ఎల్.), చైనా స్పోర్ట్స్ లాటరీ (సి.ఎస్.ఎల్). రెండేళ్ళలో 11 బిలియన్ యువాన్ల విలువైన వెల్ఫేర్ లాటరీ టిక్కెట్లు అమ్ముడుపోయినట్లు 2000 సంవత్సరంలో జరిపిన ఓ అధ్యయనంలో వెల్లడైంది. ఇది చైనాలో 1987లో లాటరీలు ప్రారంభమైన ఏడాది అమ్ముడుపోయిన టిక్కెట్ల

విలువకంటే 650 రెట్లు ఎక్కువ. 1987 నుంచి ఇప్పటివరకూ వెల్ఫేర్ లాటరీ సంక్షేమ నిధికి 10 బిలియన్ యువాన్లను జమ చేసింది. దీనివల్ల 81,000 సంక్షేమ పథకాల అమలుకు ఆస్కారమేర్పడింది. చిన్న పిల్లల సంక్షేమానికి కృషి చేసే103 స్వచ్ఛంద సంస్థలకు లబ్ధి చేకూరింది. 2000మంది వికలాంగ చిన్నారులకు వైద్య చికిత్స లభించింది. వృద్ధుల సంక్షేమంకోసం నిధులు సేకరించేందుకు 2001లో దేశవ్యాప్తంగా లాటరీని నిర్వహించింది. ఈ లాటరీ పుణ్యమాని ఉపాధి కోల్పోయిన 15,000మంది కార్మికులకు టిక్కెట్ల అమ్మకం ద్వారా తిరిగి ఉపాధి లభించింది. వెల్ఫేర్ లాటరీ సంస్థ 2001లో స్ప్రింగ్ ఫెస్టివల్, లాంటర్న్ ఫెస్టివల్‌ల నిర్వహణకోసం ప్రత్యేక లాటరీలను కూడా నిర్వహించింది. లాటరీల్లో గెలుపొందినవారికి మొదట్లో కార్లు, ఇతర వస్తువులను బహుమతులుగా ఇచ్చేవారు. వెల్ఫేర్ లాటరీని నిర్వహించే సివిల్ అఫైర్స్ మంత్రిత్వ శాఖ 1999లో బహుమతులుగా నగదునే ఇవ్వాలని నిర్ణయించింది.

క్రీడాకారులకు  శిక్షణ సౌకర్యాలు కోసం నేషనల్ లాటరీ నిధులను అందించింది. తద్వారా ఒలింపిక్స్‌లో చైనా 28 స్వర్ణపతకాలు గెలుచుకునేందుకు నేషనల్ లాటరీ పరోక్షంగా దోహదపడింది. చైనా 2002లో మొదటిసారిగా వరల్డ్ కప్ లాటరీని నిర్వహించింది. ఆన్‌లైన్ లాటరీల నిర్వహణకోసం 1999లో షాంఘై పెంగ్‌కాయ్ లాటరీ సంస్థ ఏర్పడింది. ప్రభుత్వం 2002లో ఎలక్ట్రానిక్ లాటరీస్ అనే కొత్తరకం విధానాన్ని ప్రవేశపెట్టింది. ఆటగాళ్ళు ఫోన్ ద్వారానే టిక్కెట్లు కొనుక్కుని, ఆటలో పాల్గొనవచ్చు. లోకల్ టాక్స్ బ్యూరో ఆఫ్ బీజింగ్ మరో అడుగు ముందుకేసి రిసీట్ లాటరీ అనే కొత్తరకం లాటరీని ప్రవేశపెట్టింది. వినియోగదారులు వస్తువులను కొనుగోలు చేసి, తీసుకున్న రసీదులపై నంబర్లన్నింటినీ వేసి, డ్రా తీసేవారు. వినియోగదారులు రసీదులు పొందే పద్ధతిని ప్రోత్సహించేందుకు ఈ లాటరీని ప్రవేశపెట్టారు. లాటరీల నిర్వహణలో అవకతవకలు చోటు చేసుకోవడంతో 2004 మేలో లాటరీలను సస్పెండ్ చేశారు. అయితే రెండు నెలల తరవాత వాటిని తిరిగి పునరుద్ధరించారు. వాటితోపాటే స్క్రాచ్ టిక్కెట్ల లాటరీలనూ ప్రవేశపెట్టారు.

## సైప్రస్

ఆర్థిక మంత్రిత్వ శాఖ అధీనంలో 1958లో సైప్రస్ ప్రభుత్వ లాటరీ ప్రారంభమైంది. స్వాతంత్ర్య పోరాట సమయంలో 1960-61 మధ్యకాలంలో లాటరీ కార్యకలాపాలను సస్పెండ్ చేసినా, ఆ తరవాత తిరిగి ప్రారంభించారు. ప్రస్తుతం నంబర్ గేమ్స్, ఇన్‌స్టంట్ గేమ్స్ కూడా జోరుగా సాగుతున్నాయి. టిక్కెట్ల అమ్మకాల ద్వారా లభించిన ఆదాయంలో 41 శాతం ప్రభుత్వానికి చెందుతుంది. సాంస్కృతిక కళా రంగాలు, విద్య, క్రీడారంగాల అభివృద్ధికి లాటరీ నిధులు దోహదపడుతున్నాయి.

## చెక్ రిపబ్లిక్

ఆటల పోటీలపై బెట్టింగ్‌లు నిర్వహించేందుకు ఫిజికల్ ఎడ్యుకేషన్ మరియు క్రీడా కమిటీ ఎస్.ఎ.జడ్.కె.ఎను 1956లో నెలకొల్పింది. తద్వారా లభించే ఆదాయాన్ని క్రీడలు, టూరిజం రంగాల అభివృద్ధికి వెచ్చిస్తున్నారు. ఆరంభంలో ఈ కార్యకలాపాలను ప్రభుత్వ బెట్టింగ్ కార్యాలయం ఎస్.టి.ఎ.ఎస్.కె.ఎ నిర్వహించేది. దానిని 1956లో మూసివేశారు. 1992లో కమ్యూనిజం పతనమై, దేశం చెక్ రిపబ్లిక్, స్లోవేక్ రిపబ్లిక్ అనే రెండు దేశాలుగా విడిపోయింది. చెక్ రిపబ్లిక్‌లో ఎస్.ఎ,జడ్.కె.ఎ., స్లోవేక్ రిపబ్లిక్‌లో ఎస్.పి.ఓ.ఆర్.టి.కె.ఎ. లాటరీ గేమ్స్‌ను నిర్వహిస్తున్నాయి.

ఎస్.ఎ.జడ్.కె.ఎ. 1956లో మొట్టమొదటిసారిగా సాజ్కా పేరిట బెట్టింగ్ గేమ్‌ను నిర్వహించింది. 1957లో ఎస్.పి.ఓ.ఆర్.టి.కె.ఎ. పేరుతో నంబర్ లాటరీని నిర్వహించింది. ఈ రెండు గేమ్‌లు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. 2002లో సాజ్కా కెనో గేమ్‌ను ప్రవేశపెట్టింది. ఇందులో ప్రతి ఐదు నిమిషాలకూ డ్రా ఉంటుంది. ఆగస్టు- డిసెంబర్‌ల మధ్య జరిగే కెనో డ్రాల ద్వారా లభించే ఆదాయాన్ని వరద బాధితుల సహాయంకోసం అందించారు. 6/49 స్పోర్ట్‌కా, 5/40 సాన్స్ (జోకర్), స్టాస్టనించ్ 10, శాన్స్ మిలియన్ వంటి నంబర్ లాటరీలు

చెక్ రిపబ్లిక్‌లో నడుస్తున్నాయి. లాటరీల ద్వారా లభించే మొత్తం ఆదాయంలో 88 శాతం నంబర్ లాటరీల ద్వారానే సమకూరుతోంది.

క్రీడలపై బెట్టింగ్ చేయడానికి సంబంధించి సాజ్కా, సాజ్కా సెలెక్ట్, స్కోర్ ప్లస్, సాజ్కా న విటెజె వంటి గేమ్‌లు ఉన్నాయి. ట్రెజర్, స్టాస్ట్‌న సిస్లా, హోరోస్కోపీ, బెరటెలెస్కా, లోటెరీ, పన్నా-ఓరెల్, కేసినో వంటి ఏడు రకాల ఇన్‌స్టంట్ గేమ్స్‌ను కూడా సాజ్కా నిర్వహిస్తోంది. చెక్ దేశపు క్రీడారంగానికి, ఫిజికల్ ఎడ్యుకేషన్‌కు ఆర్థికంగా చేయూతనివ్వడం సాజ్కా ప్రధాన ధ్యేయం. సామాజిక, సాంస్కృతిక, ఆరోగ్య రంగాలకు, వివిధ స్వచ్ఛంద సంస్థలకు కూడా సాజ్కా సహకారం అందిస్తోంది. చెక్ రిపబ్లిక్‌లో విజయవంతంగా నడుస్తున్న 100 కంపెనీల్లో సాజ్కా ఒకటి.

## డెన్మార్క్

లాటరీని ప్రారంభించాలంటూ డేనిష్ పార్లమెంట్ డేనిష్ పూల్స్ యాక్ట్ పేరిట చట్టాన్ని ఆమోదించిన నెలరోజులకు 1948 జూలైలో డాన్స్క్ టిప్పెజెస్టె పేరిట డెన్మార్క్ లాటరీ ప్రారంభమైంది. ఈ లాటరీలో డేనిష్ ప్రభుత్వం 80 శాతం, డేనిష్ క్రీడా సమాఖ్య, డేనిష్ జిమ్నాస్టిక్స్ మరియు స్పోర్ట్స్ సమాఖ్యలకు చెరో పది శాతం వాటాలు ఉన్నాయి. నలభయ్యేళ్ళకు పైగా టిప్స్ 1 ఇంటూ 2- అనే సాకర్ పూల్ గేమ్ లాటరీ ఒక్కటే ఉండేది. చట్టంలో తగిన మార్పులు చేర్పులు చేశాక నంబర్ గేమ్స్, స్పోర్ట్స్ గేమ్స్, స్క్రాచ్ కార్డ్ గేమ్స్, హార్స్, గ్రే హౌండ్ రేస్ గేమ్స్‌లతో పాటు ఆన్‌లైన్ గేమ్స్ కూడా వెలుగు చూశాయి.

డేనిష్ లాటరీ వార్షిక టర్నోవర్ 8 మిలియన్ డేనిష్ క్రోన్లు. డేనిష్ పార్లమెంట్ విధించిన నియమ నిబంధనల ప్రకారం లాటరీ నిధులను క్రీడా, సాంస్కృతిక కార్యకలాపాలకు వెచ్చించారు. అలాగే నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ డేనిష్ ఆర్గనైజేషన్స్ ఫర్ డిజేబుల్డ్ పర్సన్స్, ఛారిటబుల్ ఆర్గనైజేషన్స్, నేషనల్ ఆర్గనైజేషన్స్ ఫర్ కంబాటింగ్ డిసీజెస్ వంటి సంస్థలకు, యువజన కార్యకలాపాలకు, లాభాపేక్ష

రహిత స్వచ్ఛంద సంస్థలకు, టీమ్ డెన్మార్క్, డెన్మార్క్ ఒలింపిక్ కమిటీ, నేషనల్ ఎడ్యుకేషనల్ అసోసియేషన్లకు కేటాయించారు.

ప్రస్తుతం డేనిష్ లాటరీ నిర్వహిస్తున్న వివిధ రకాల గేమ్స్‌కోసం 4000మంది రిటైలర్లు టిక్కెట్లు విక్రయిస్తున్నారు. డెన్మార్క్ లాటరీలలో నంబర్ గేమ్స్‌కే ఆదరణ ఎక్కువ. లాటరీల ద్వారా లభించే ఆదాయంలో 70 శాతం వీటిద్వారానే వస్తోంది. సోర్ట్స్ గేమ్స్ ద్వారా 18శాతం, స్క్రాచ్ కార్డ్ గేమ్స్ ద్వారా 14 శాతం ఆదాయం లభిస్తోంది. స్పోర్ట్స్ గేమ్స్‌లో టిప్స్ అనే సాకర్ పూల్ గేమ్, ఆడ్ సెట్ అనే రేస్ బెట్టింగ్ గేమ్, మల్లగ్ట్ అనే ఫుట్‌బాల్ /ఐస్ హాకీ గేమ్ ఉన్నాయి. డాన్స్క్ టిప్స్‌జెనెస్టె 1992లో తొలిసారిగా క్విక్ అనే స్క్రాచ్ కార్డ్ గేమ్‌ను ప్రవేశపెట్టింది. డెన్మార్క్ ఆన్‌లైన్ లాటరీ 1990లో ప్రారంభమైంది. గేమింగ్ మెషీన్లతో ఆడే గేమ్ షాప్ విధానం 2001లో మొదలైంది. ఈ విధానాన్ని పిట్‌స్టాప్ అంటారు. దేశవ్యాప్తంగా దాదాపు 30 పిట్‌స్టాప్ కెఫెలు నడుస్తున్నాయి.

## ఫ్రాన్స్

రాజు ఫ్రాంక్వా 1505లో లాటరీ ఆఫ్ ఫ్రాన్స్‌ను నిర్వహించారు. ఆ తరవాత రెండు శతాబ్దాల వరకూ లాటరీలపై నిషేధం కొనసాగింది. 17వ శతాబ్దంలో లాటరీలు మళ్ళీ వెలుగుచూశాయి. పారిస్ మున్సిపాలిటీకోసం లోటెరీ డె ఎల్ హోటెల్ డె విల్లె పేరిట లాటరీని నిర్వహించారు. మతపరమైన సమావేశాలకు కావలసిన నిధుల సేకరణకు 18వ శతాబ్దంలో లాటరీలను నిర్వహించిన దాఖలాలు ఉన్నాయి. విశిష్టమైన సెయింట్ సల్‌పైస్‌తోసహా 15కు పైగా చర్చిల పునరుద్ధరణకు లాటరీ నిధులు దోహదపడ్డాయి. మతపరమైన కార్యకలాపాలకు రాజు నిధులను అందించడం నిలిపివేసి, లాటరీల ద్వారా సమకూర్చుకోవలసిందిగా మతపెద్దలను ఆదేశించాడు. లాటరీల ద్వారా లాభాల పంట పండటంతో వాటిపై నియంత్రణాధికారాల కోసం రాజుకు, చర్చిల

నిర్వాహకులకు మధ్య వివాదాలు రాచుకున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో రాజు 1774లో లోటెరీ డె ఎల్ ఎకోల్ మిలిటెరీ పేరిట ఒక లాటరీని నెలకొల్పాడు. ప్రైవేటుగా నడిచే కొన్ని మినహా మిగిలిన లాటరీలన్నింటినీ నిషేధించాడు. ఇప్పుడు పారిస్‌లో ఛాంప్ డె మార్స్‌గా ప్రసిద్ధి పొందిన కట్టడాన్ని కొనుగోలు చేసేందుకు మేడమ్ డె పాంపడోర్ మొదట లోటెరీ డె ఎల్ ఎకోల్ మిలిటెరీని నిర్వహించింది. ఛాంప్ డె మార్స్‌లో మిలిటరీ అకాడెమీని స్థాపించింది. నెపోలియన్ ఈ అకాడెమీ విద్యార్థే. కొన్నేళ్ళ తరవాత లాటరీలు లోటెరీ రోయేల్ డె ఫ్రాన్స్‌గా ప్రాచుర్యంలోకి వచ్చాయి. 1789 ఫ్రెంచ్ విప్లవం తరవాత 1791లో అన్ని ప్రభుత్వ లాటరీలపై నిషేధం వేటు పడింది. సోషలిస్టుల పాలనా కాలంలో ప్రభుత్వ ఖజనాను నింపేందుకు 'లోటో'ను ప్రవేశపెట్టారు. ప్రభుత్వం ఆధ్వర్యంలోని లాటరీ సంస్థకు  లా ఫ్రాంక్వా డెస్ జియోక్స్ అనే పేరుతో కొత్త వన్నెలద్దారు. ఇదో సెమీ పబ్లిక్ కంపెనీ. ఇందులో ప్రభుత్వానికి 72 శాతం వాటాలు ఉన్నాయి. లాటరీని ఇష్యూ చేసేవారికి 20 శాతం, ఏజెంట్లకు మూడు శాతం, కంపెనీలోని ఉద్యోగులకు 5 శాతం వాటాలు ఉంటాయి. ప్రభుత్వ నియంత్రణలో లాటరీ గేమ్స్ జరుగుతాయి. కంపెనీ బడ్జెట్‌కు ఆమోదముద్ర వేయడం, లాటరీ అమ్మకాలపై సుంకాలు, పన్నులు విధించడం వంటి వాటిని ప్రభుత్వమే నిర్వర్తిస్తుంది.

## ఘనా

ఘనాలో నేషనల్ లాటరీల విభాగం 1958లో ఏర్పాటైంది. ఇది లోటో తరహా గేమ్స్‌ను, 'పెనాల్టీ' అనే పేరుతో స్క్రాచ్ టిక్కెట్ గేమ్‌ను ఆఫర్ చేస్తోంది. ప్రైవేటు లాటరీలను నిషేధించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే ప్రైవేటు లాటరీ ఆపరేటర్లనుంచి నిరసనలు పెల్లుబుకడంతో గేమింగ్ బిల్లును 2003లో ప్రభుత్వం ఉపసంహరించుకుంది. అదే ఏడాది  నేషనల్ లాటరీస్ 'సోషల్ రాఫెల్' పేరట కొత్త గేమ్‌ను ప్రారంభించింది. దీంతోపాటే వినూత్నమైన ఓ పథకాన్ని కూడా ప్రారంభించింది. ఈ పథకం ప్రకారం తీసిన ప్రతి డ్రాపై

లభించిన ఆదాయాన్ని నిర్దిష్టమైన సామాజిక పథకాలకోసం ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఏ పథకానికి  డబ్బును వెచ్చించాలో విజేత నిర్ణయిస్తాడు. లాటరీ ఆదాయంతో నిర్మించిన పథకానికి విజేత పేరును పెడతారు.

## హాంగ్‌కాంగ్

హాంగ్‌కాంగ్ లాటరీని రాయల్ హాంగ్‌కాంగ్ జాకీ క్లబ్ నిర్వహిస్తుంది. హాంగ్‌కాంగ్ లాటరీస్ బోర్డ్ నుంచి లైసెన్స్ పొందిన ఈ క్లబ్ 1915 నుంచి లాటరీలను నిర్వహించడం ప్రారంభించింది. అప్పటినుంచీ  సామాజిక సేవా కార్యకలాపాలకు క్లబ్ పెద్ద మొత్తంలో విరాళాలు అందిస్తోంది. 'సేవకోసం రేసులు' అనే లక్ష్యంతో లాటరీల నిర్వహణ చేపట్టిన క్లబ్ ఒక ఛారిటీస్ ట్రస్ట్‌ను కూడా ఏర్పాటు చేసింది.  క్రీడలు, సాంస్కృతిక కార్యకలాపాలు, విద్య, శిక్షణ, సామాజిక,   వైద్య, ఆరోగ్య సేవలకోసం విరాళాలను ఇస్తోంది.. 2003లో సార్స్ వ్యాధి ప్రబలినప్పుడు వ్యాధి నిరోధక జాగ్రత్తలు చేపట్టేందుకు పాఠశాలలకు, వైద్య ఆరోగ్య కేంద్రాలకు 125 మిలియన్ల హాంగ్‌కాంగ్ డాలర్లను, రుట్టోన్‌జీ అండ్ టాంగ్ షీయుకిన్ హాస్పిటల్‌కు 16 మిలియన్ల హాంగ్‌కాంగ్ డాలర్లను అందచేసింది. వికలాంగుల్లో దాగిఉన్న సృజనాత్మక, కళాత్మక ప్రతిభను వెలికితీసేందుకు 2003లో 'జాకీక్లబ్ ఆర్ట్స్ ఫర్ ది డిజేబుల్డ్' అనే సంస్థను నెలకొల్పింది. హాంగ్‌కాంగ్ లాటరీ వార్షిక విక్రయాలు 582 మిలియన్ అమెరికా డాలర్ల పైచిలుకే.

## హంగరీ

రెండు వందల ఏళ్ళుగా లాటరీలను నిర్వహిస్తున్న చరిత్ర హంగరీ సొంతం. మొట్టమొదటిసారిగా 1770లో బుదా నగరంలో లాటరీ నిర్వహించారు. ఆ తరవాత లాటరీలకు పలుమార్లు అంతరాయాలు, అవాంతరాలు ఏర్పడ్డాయి. 1947లో 'పూల్స్' గేమ్‌తో హంగరీ ఆధునిక లాటరీలకు తెరతీసింది. పూల్స్ గేమ్‌కు విశేష ఆదరణ లభించింది. తదనంతరం 1957లో ఐదు అంకెల డ్రా

లాటరీని ప్రవేశపెట్టారు. మొదట్లో ఆర్స్‌జగాస్ టకారెక్‌పెంజ్‌టర్ అనే జాతీయ పొదుపు మొత్తాల బ్యాంక్ లాటరీలను నిర్వహించేది. 1991లో ప్రభుత్వం స్వయంగా జెరెంక్సెజటెక్ పేరిట ఓ గేమింగ్ కంపెనీని నెలకొల్పింది. 2001లో లక్జర్ పేరిట కెనో తరహా లాటరీని ప్రవేశపెట్టింది. పోస్టాఫీసులు, వాణిజ్య సంస్థలు, వార్తా పత్రికలు విక్రయించే కియోస్క్‌లు, సహకార సంస్థల ద్వారా టిక్కెట్ల అమ్మకం జరుగుతుంది. ఎక్కువగా పోస్టాఫీసుల ద్వారానే టిక్కెట్లు అమ్ముడుపోతుంటాయి. 5/90 తరహా టోటో పూల్స్ గేమ్‌ను, 6/45 లోటో గేమ్‌ను, ఇతర ఇన్‌స్టంట్ గేమ్స్‌ను కంపెనీ నిర్వహిస్తుంది.

లాటరీలద్వారా సేకరించిన డబ్బును క్రీడలకు, ఒలింపిక్స్‌లో పాల్గొనే ఆటగాళ్ళకోసం, సాంస్కృతిక కార్యక్రమాలకోసం, సంక్షేమ కార్యకలాపాలకోసం ఖర్చు చేస్తుంది. గ్రామాల పునర్నిర్మాణం కోసం, వరద బాధితుల సహాయార్థం కూడా ఈ నిధులను వెచ్చిస్తుంది.

## ఐర్లాండ్

దేశవ్యాప్తంగా 19వ శతాబ్దం తొలినాళ్ళలో ఆస్పత్రులకు భవనాలు నిర్మించవలసి వచ్చినప్పుడు ఐరిష్ ప్రభుత్వం నిధుల సేకరణకోసం లాటరీలను ఎంచుకుంది ఐరిష్ స్వీప్‌స్టేక్స్ పేరిట ఓ సంస్థను ఏర్పాటు చేసింది. ఐరిష్ ప్రభుత్వం లాటరీలకు తెర తీసిన రోజుల్లో అమెరికా, కెనడాలతో సహా అనేక దేశాల్లో గాంబ్లింగ్‌ను నేరంగా పరిగణించేవారు. అయితే గుర్రపు పందేలు మాత్రం  ఉండేవి. దాంతో ఐరిష్ ప్రజలు కూడా గుర్రపు పందేల పట్ల మక్కువ చూపేవారు.  ప్రభుత్వం గుర్రపు పందేల ఫలితాలను లాటరీలతో ముడిపెడుతూ పోటీలు నిర్వహించేది. ఇలా ఏడాదికి నాలుగుసార్లు ఈ పోటీలు జరిపేది. గుర్రాలకు సంబంధించి టిక్కెట్లు విక్రయించేవారు. పందెంలో గెలిచిన గుర్రాలకు సంబంధించిన టిక్కెట్లు ఎవరు కొంటారో వారు గెలిచినట్టు అర్థం. ఈ గేమ్ ఎంత ఆదరణ పొందిందంటే, కొన్నిసార్లు లాటరీ టిక్కెట్లు బ్లాక్‌లో

కూడా అమ్ముడుపోయేవి. టిక్కెట్లను ఐర్లాండ్‌లోనే కాకుండా, విదేశాల్లో కూడా విక్రయించేవారు. మొదట్లో ఈ గేమ్‌కు విపరీతమైన ఆదరణ లభించినా, చుట్టుపక్కల దేశాల్లో గేంబ్లింగ్‌ను చట్టబద్ధం చేశాక క్రమేణా ఈ గేమ్ ఆదరణ కోల్పోయింది. 1997లో ఐరిష్ స్వీప్‌స్టేక్స్‌ను నిలిపివేశారు. ఆ సమయానికి ఐరిష్ స్వీప్‌స్టేక్స్ ఆస్పత్రుల సహాయార్ధం 135 మిలియన్ పౌండ్ల విరాళాలను అందించింది. అలాగే 265 మిలియన్ పౌండ్లను బహుమతి మొత్తాలుగా అందచేసింది. ప్రభుత్వం 1988లో 6/42 లోటో గేమ్‌ను ప్రవేశపెట్టింది. ఐరిష్ లోటో జాక్‌పాట్ గేమ్ ద్వారా జరిగే చెల్లింపులకు పన్ను మినహాయింపు సౌకర్యం కూడా ఉంది.

## ఇజ్రాయెల్

ఇజ్రాయెల్ జాతీయ లాటరీ పేరు మిఫల్ హాపయిస్. 1951లో ప్రైవేటు రంగంలో లాభాపేక్ష రహిత లాటరీగా ప్రారంభమైంది. 1940లలో వేల సంఖ్యలో జనం ఇజ్రాయెల్‌కు వలస వచ్చారు. దీంతో దేశ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో పడింది. ఆర్థిక ఇబ్బందులను తట్టుకునేందుకు టెల్ అవీవ్ మేయర్ ఇజ్రాయెల్ రోకా మున్సిపల్ లాటరీని నిర్వహించాలని భావించారు. దీని ద్వారా వచ్చిన డబ్బును ఆరోగ్యరంగంపై వెచ్చించాలన్నది ఆయన ఆలోచన. రోకా యోచనకు ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. 1951లో ప్రారంభమైన మిఫల్ హాపయిస్ విద్య, వైద్య, సామాజిక రంగాలకు ఇప్పటివరకూ సుమారు 500 కోట్ల డాలర్లకు పైగా అందచేసింది. ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలో ఉన్న ఈ లాటరీని పదకొండు మున్సిపల్ సంస్థలు నిర్వహిస్తున్నాయి. లాటరీపై 2.8 బిలియన్ ఎన్ఐఎస్ వార్షికాదాయం లభిస్తోంది.

మిఫల్ హాఫయిస్ లాటరీ టిక్కెట్లను విదేశాల్లో ముద్రిస్తున్నారు. నకిలీ టిక్కెట్లను నిరోధించేందుకే ఇలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇజ్రాయెల్ నేషనల్ లాటరీ టిక్కెట్ల విక్రయం పది ప్రధాన పంపిణీదారుల ఆధ్వర్యంలో,

2500 అవుట్‌లెట్లు ద్వారా జరుగుతుంది. వీటిలో 800 అవుట్‌లెట్లు కేవలం లాటరీ టిక్కెట్లను మాత్రమే విక్రయించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటుచేసినవి కావడం విశేషం. ఈ లాటరీ బూత్‌లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతారు. బూత్‌ను అందంగా రూపొందించుకున్న పంపిణీదారులకు బహుమతులు కూడా అందిస్తారు. లాటరీల నిర్వహణకు పకడ్బందీగా, సజావుగా సాగేందుకు ఇజ్రాయెల్ నేషనల్ లాటరీ విక్రయందారులు, పంపిణీదారులు, మార్కెటింగ్ సిబ్బంది కోసం అనేక శిక్షణ కార్యక్రమాలను, వర్క్‌షాపులను కూడా నిర్వహిస్తుంది.

లాటరీపై వచ్చిన ఆదాయాన్ని విద్య, వైద్య, సాంస్కృతిక, సామాజిక, సంక్షేమ రంగాలపై వెచ్చిస్తారు. మిఫల్ హాఫయిస్ వందలాది కిండర్‌గార్టెన్స్‌ను, ప్రాథమిక పాఠశాలలను, కమ్యూనిటీ సెంటర్లను, క్లినిక్కులను, డెంటల్ కేర్ క్లినిక్కులను, గ్రంథాలయాలను, కార్మిక సంక్షేమ సంస్థలను, పునరావాస కేంద్రాలను, కళలు, సాంస్కృతిక కార్యక్రమాలకోసం మెట్రోపాలిటన్ కేంద్రాలను నెలకొల్పింది. నేషనల్ లాటరీ 1988నుంచి 'ప్రతి చిన్నారికీ ఓ కంప్యూటర్' పథకం కోసం నిధులు అందజేస్తోంది. అంధులకోసం ప్రత్యేక విభాగం గల ఓ సెంట్రల్ లైబ్రరీని, బీట్ హాసోఫెర్ పేరు మీదుగా ఓ రైటర్స్ హౌస్‌ను, ఓ క్రీడా ప్రాంగణాన్ని నెలకొల్పుతోంది.

## జమైకా

జమైకా ప్రభుత్వ అధీనంలోని బెట్టింగ్, గేమింగ్ లాటరీస్ కమిషన్ 1991లో స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఏజెన్సీకి గేమింగ్ ఆపరేటర్‌గా బాధ్యతలు అప్పగించడం ద్వారా లాటరీలకు శ్రీకారం చుట్టింది. ఏజెన్సీ మొదట్లో స్క్రాచ్ అండ్ విన్ టిక్కెట్లను విక్రయించేది. 1994లో జమైకా లాటరీ కంపెనీకి ప్రభుత్వపరంగా లాటరీల నిర్వహణ బాధ్యతలను అప్పగించింది. లోటో గేమ్ టిక్కెట్ల విక్రయం ద్వారా లభించిన ఆదాయంలో 7.5 శాతాన్ని క్రీడల అభివృద్ధికోసం పనిచేసే

స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్‌కు కేటాయిస్తుంది. కాలక్రమేణా రకరకాల లాటరీ గేమ్‌లు మొదలయ్యాయి. ప్రస్తుతం లోటో, పిక్ 3, స్క్రాచెస్, టిక్ టాక్ టో, 3 వే డ్రాప్ పాన్, వరల్డ్ ఫుట్‌బాల్ వంటి గేమ్‌లు నడుస్తున్నాయి. జమైకా 2003లో లాటరీలో గెలుపొందిన బహుమతులపై పన్నును ప్రవేశపెట్టింది. లాటరీలపై లభించిన ఆదాయంలో కొంత మొత్తాన్ని డయాబెటెస్ అసోసియేషన్‌కు, శారీరిక, మానసిక వికలాంగుల సంక్షేమ సంస్థ - 'మై ఫాదర్స్ హౌస్'కు, రెడ్ క్రాస్‌కు, విద్యాసంస్థలకు విరాళంగా అందజేస్తోంది. ఏటా జమైకా 20 మిలియన్ డాలర్లను ఇలా సంక్షేమ, సేవా కార్యక్రమాలకోసం వెచ్చిస్తోంది.

## జపాన్

జపాన్‌లో 1630నుంచీ లాటరీలు నిర్వహిస్తున్న దాఖలాలు ఉన్నాయి. అనేక సందర్భాల్లో లాటరీలను నిషేధించడం, పునరుద్ధరించడం జరిగింది. అయితే 1842లో లాటరీలను పూర్తిగా నిషేధించారు. రెండో ప్రపంచ యుద్ధం ముగిశాక 1945లో లాటరీలను పునరుద్ధరించారు. యుద్ధం వల్ల కలిగిన నష్టాన్ని భర్తీ చేసుకునేందుకు లాటరీని ప్రారంభించారు. టిక్కెట్ల అమ్మకం 1945 అక్టోబర్‌లో ప్రారంభమైంది. తొలి లాటరీకి తకరకుజి అని పేరు పెట్టారు. అదృష్టం లేదా పెన్నిధి అని దానికి అర్థం. ఆ మరుసటి సంవత్సరం లాటరీలను నిర్వహించుకునేందుకు స్థానిక ప్రభుత్వాలను అనుమతించారు. ఇప్పటికీ స్థానిక ప్రభుత్వాల బడ్జెట్లకు లాటరీలు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి.

టిక్కెట్ల విక్రయం మొదలుకుని బహుమతుల పంపకం వరకూ లాటరీ కార్యకలాపాలన్నీ బ్యాంక్ ద్వారా మాత్రమే జరగాలని జపాన్ చట్టాలు నిర్దేశిస్తున్నాయి. ఈమేరకు లాటరీల నిర్వహణలో బ్యాంకులన్నీ పాలుపంచుకుంటున్నా దాయ్-ఇచి కాంగ్యో బ్యాంక్ మాత్రమే ప్రధాన పాత్ర పోషిస్తోంది. జపాన్ లాటరీలు ప్రధానంగా రెండు రకాలు. ముందుగానే

టిక్కెట్లను ముద్రించి నిర్వహించే లాటరీని ట్రాడిషనల్ లాటరీలని, ఆటగాళ్ళు అంకెలను ఎంచుకునే లాటరీలను మోడర్న్ లాటరీలని అంటారు. ఇన్‌స్టంట్ లాటరీ, డబుల్- ఛాన్స్ లాటరీ వంటి గేమ్స్ ఇటీవలే ప్రవేశించాయి.

జపాన్‌లో ఆరు ప్రధాన లాటరీలు ఉన్నాయి. ఆల్ జపాన్ లాటరీ టిక్కెట్లు దేశమంతటా విక్రయిస్తారు. దీనిలో ప్రతి నెలా డ్రా తీస్తారు. బ్లాక్ లాటరీలను వారానికోసారి చొప్పున నిర్వహిస్తారు. ఈ లాటరీ టిక్కెట్లను కాంటో- చుబు- టోహోకు, టోక్యో మెట్రోపాలిటన్ జిల్లా, కింకి, వెస్ట్ జపాన్ ప్రాంతాల్లో మాత్రమే అమ్ముతారు. లోకల్ మెడికల్ కేర్ ప్రమోషన్ లాటరీలు మరో రకం. వీటినే రెయిన్‌బో లాటరీలని కూడా అంటారు. వీటి టిక్కెట్లను కూడా కొన్ని ప్రాంతాల్లో మాత్రమే విక్రయిస్తారు. రెయిన్‌బో లాటరీ ద్వారా లభించిన ఆదాయాన్ని జిచి మెడికల్ స్కూల్ అభివృద్ధికి, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సౌకర్యాల మెరుగుదలకు ఖర్చు చేస్తారు. రెయిన్‌బో లాటరీని ఏడాదికి తొమ్మిదిసార్లు నిర్వహిస్తారు. ఇవికాకుండా 1989లో 'ఈవెంట్ లాటరీ'ని ఏర్పాటు చేశారు. ఇది ఇన్‌స్టంట్ రకం లాటరీ గేమ్. ఎగ్జిబిషన్లలోనూ, స్థానిక ప్రభుత్వాలు ఏర్పాటు చేసే కార్యక్రమాలలోనూ ఈవెంట్ లాటరీని నిర్వహిస్తారు. జపాన్‌లో అక్రమ బెట్టింగులు, అలాంటి ఇతర గేమ్‌ల ద్వారా కొందరు సంపాదిస్తున్న మొత్తం జపాన్ ఆటో పరిశ్రమ ద్వారా ఒనగూడుతున్న లాభాలను మించిపోవడాన్ని గమనించిన ప్రభుత్వం గుర్రపు పందేలు, పడవ, సైకిల్ పందేలను 2001లో చట్టబద్ధం చేసింది. ప్రొఫెషనల్ సాకర్ గేమ్‌పై 'టోటో' అనే బెట్టింగ్ గేమ్‌ను ప్రవేశపెట్టింది. టోటోను ఇంటర్నెట్‌పై కూడా ఆడవచ్చు. మొదటి ఏడాదే 64.2 బిలియన్ల యెన్‌ల విలువైన టోటో టిక్కెట్లు అమ్ముడుపోవడం విశేషం.

## కజక్‌స్థాన్

నేషనల్ లాటరీ ఆఫ్ కజక్‌స్థాన్‌ను 1998లో ఏర్పాటు చేశారు. కజక్‌స్థాన్‌లో ప్రైవేటు లాటరీలు కూడా జోరుగా సాగుతున్నాయి. ప్రభుత్వం నిర్వహించే

లాటరీల ద్వారా లభించే ఆదాయాన్ని సామాజిక పథకాల అమలుకు వినియోగిస్తున్నారు. 5/36 లోటో, 6/40 లోటో, పిక్ -5 వంటి లాటరీలు కజక్‌స్థాన్‌లో ప్రజాదరణ పొందాయి.

## లెబనాన్

లెబనాన్‌లో 1950లలో యా నసీబ్ అనే లాటరీ నడిచేది. ప్రజల ఆదరాభిమానాలను చూరగొన్న ఈ 4డి గేమ్‌ను నేషనల్ లాటరీ డైరెక్టరేట్ ఇప్పటికీ నిర్వహిస్తోంది. డైరెక్టరేట్ వారానికి 200,000 యా నసీబ్ టిక్కెట్లను ముద్రిస్తోంది. లెబనీస్ లోటో, స్క్రాచ్ గేమ్స్, మలయీన్, టోర్రా నచె, నౌన్ వంటి గేమ్‌లు కూడా డైరెక్టరేట్ ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. మలయీన్‌ను 2003 ఫిబ్రవరిలో ప్రారంభించారు. ఈ గేమ్ విజయవంతం కావడంతో 2003 అక్టోబర్‌లో మరో మూడు స్క్రాచ్ గేమ్స్‌ను ప్రారంభించింది. మలయీన్ టిక్కెట్ ధర 2500 ఎల్.ఎల్. ఇందులో ఆరు చతురస్రాలు ఉంటాయి. ఒక్కొక్క స్క్వేర్‌ను స్క్రాచ్ చేస్తే వస్తువుల పేర్లో లేక నగదు మొత్తాలో బయటపడతాయి. ఉదాహరణకు టీవీ బొమ్మలు ఉంటే ఆటగాడు టీవీ షోలో పాల్గొనేందుకు అవకాశం లభిస్తుంది. ఆ షోలో లాటరీ వీల్‌ను తిప్పే అవకాశం ఆటగాడికి లభిస్తున్నందన్న మాట. అతను ఎంచుకున్న నెంబర్‌పై వీల్ ఆగితే అందులో ఉన్న అంకె ప్రకారం డబ్బును గెలుచుకుంటాడు. అలాకాకుండా స్క్రాచ్ చేసినప్పుడు అందులో డబ్బును పేర్కొని ఉంటే ఆ డబ్బంతా ఆటగాడికి లభిస్తుంది. టోరా న చె గేమ్‌లో టోరా లేదా నచె కార్డుపై ఆటగాడు బెట్ చేస్తాడు. అతను ఏ నంబర్‌పై బెట్ చేశాడో అదే నంబర్ అతని స్క్రాచ్ కార్డుపై ఉంటే ఆ నంబర్‌పై పేర్కొన్న డబ్బు మొత్తాన్ని ఆటగాడికి అందచేస్తారు. నౌన్ గేమ్‌లో స్క్రాచ్ కార్డు ఎడమ వైపున ఆరు స్క్వేర్లు, కుడి వైపున ఓ స్క్వేర్ ఉంటాయి. ఆటగాడు ఎంచుకున్న నంబర్ కార్డుపై ఎడమ వైపున ఉన్న ఆరు స్క్వేర్లలో ఏ ఒక్క స్క్వేర్‌లో ఉన్న నంబర్‌తో మ్యాచ్ అయినా బహుమతిని గెలుచుకున్నట్టే.

యా నసీబ్ పేపర్ లాటరీ. ఒక్కో టిక్కెట్‌పై ఐదేసి అంకెలతో కూడిన సంఖ్య ఉంటుంది. ఈ సంఖ్యలు సీరీస్‌లో ఉంటాయి. వారానికోసారి చొప్పున నిర్వహించే యా నసీబ్ లాటరీ టిక్కెట్ ధర 6000 ఎల్.ఎల్. ఆటగాడు 3000 ఎల్.ఎల్. చెల్లించి సగం టిక్కెట్‌ను కూడా ఖరీదు చేయవచ్చు. గెలిస్తే బహుమతి మొత్తంలో సగం లభిస్తుంది. 400,000 ఎల్,ఎల్. కంటే తక్కువ మొత్తాలను విజేతలు రిటైల్ అవుట్‌లెట్లనుంచే వసూలు చేసుకోవచ్చు. అంతకు మించిన బహుమతి మొత్తాలను  లెబనీస్ నేషనల్ లాటరీయే నేరుగా చెల్లిస్తుంది. ఆర్థిక మంత్రిత్వ శాఖ అనుమతితోనే కొత్త లాటరీ గేమ్‌లను ప్రారంభిస్తారు.

## మలేసియా

మలేసియా ప్రభుత్వం స్పోర్ట్స్ టోటో మలేసియా ఎస్‌డిఎన్ బిహెచ్‌డి అనే లాటరీ సంస్థను 1969లో నెలకొల్పింది. తరవాత 1985లో ఈ సంస్థ ప్రభుత్వ అధీనంలోంచి బయటకు వచ్చి, ప్రస్తుతం ప్రైవేటు సంస్థగా కార్యకలాపాలు నిర్వహిస్తోంది. స్పోర్ట్స్ టోటో సంస్థ 4డి, 5డి, 6డి వంటి అంకెలతో కూడిన గేమ్‌లను, టోటో 4/49, టోటో 6/42, జాక్‌పాట్, సూపర్ టోటో 6/49 వంటి లోటో తరహా గేమ్‌లను నిర్వహిస్తోంది. ఆరంభంనుంచీ ఈ సంస్థ క్రీడలు, యువజన వ్యవహారాలు, సాంస్కృతిక కార్యకలాపాలకోసం విరాళాలను ఇస్తోంది. వృద్ధులు, అనారోగ్య పీడితుల సహాయార్థం కూడా నిధులు అందజేస్తోంది. 10,000 ఆర్.ఎం.లలోపు బహుమతి మొత్తాలను రిటైలర్లే చెల్లిస్తారు. మలేసియాలో లాటరీలపై గెలిచిన బహుమతులకు పన్నులు వర్తించవు.

## నెదర్లాండ్స్

నెదర్లాండ్స్ ప్రభుత్వం నిర్వహించే 'స్టాట్స్‌లోటెరిజ్' ప్రపంచంలోనే అతి పెద్ద లాటరీగా పేరొందింది. 1726లో మొదలైన ఈ లాటరీ ఇప్పటికీ

దిగ్విజయంగా నడుస్తోంది. దీంతోపాటు ఎన్నో ప్రైవేటు లాటరీలు కూడా నడుస్తున్నాయి. ప్రభుత్వం 1848లో ప్రైవేటు లాటరీ ఆపరేటర్లపై నిషేధం విధించింది. 1905లో లాటరీ చట్టం రూపొందాక సేవా కార్యకలాపాలకోసం లాటరీలను నిర్వహించేందుకు అనుమతి లభించింది. అయితే ఇలా నిర్వహించే లాటరీల్లో విజేతలకు నగదును కాకుండా వస్తువులను మాత్రమే బహుమతులుగా అందించాలని షరతు ఉండేది. టోటలిసేటర్ చట్టం 1948లో గుర్రపు పందేలను చట్టబద్ధం చేసింది. లాటరీ చట్టాన్ని 1961లో సవరించి, ఆటలపై బెట్టింగ్ చేయడాన్ని చట్టబద్ధం చేశారు. సేవా కార్యక్రమాలకోసం నిర్వహించే లాటరీల్లోనూ విజేతలకు నగదు రూపంలో బహుమతులు ఇచ్చేందుకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. ఇన్‌స్టంట్ లాటరీలు 1994లో ప్రవేశించాయి.

ఒక్కో గేమ్‌నూ ఒక్కో ఆపరేటర్‌కు ప్రభుత్వం అప్పగిస్తుంది. ఉదాహరణకు ఇన్‌స్టంట్ లాటరీని స్టిచ్‌టింగ్ నేషనల్ ఇన్‌స్టంట్ లోటెరిజ్ (నేషనల్ ఇన్‌స్టంట్ లాటరీ ఫౌండేషన్)కు, లోటో గేమ్‌ను నేషనల్ స్పోర్ట్ టోటలిసేటర్ ఫౌండేషన్‌కు ఇచ్చింది. ఇన్‌స్టంట్ లాటరీలో టిక్కెట్ల అమ్మకం ద్వారా వచ్చిన డబ్బులో 47.5 శాతాన్ని బహుమతులుగా చెల్లిస్తారు. లోటో గేమ్‌లో బహుమతి మొత్తం 47.5 శాతంనుంచి 50 శాతం వరకూ ఉంటుంది. లోటో గేమ్‌లపై లభించిన ఆదాయంలో కొంత భాగాన్ని డచ్ ఒలింపిక్ కమిటీ అసోసియేషన్‌కు, డచ్ స్పోర్ట్స్ ఫెడరేషన్‌కూ అందచేస్తారు. డచ్, డచ్‌యేతర గేమ్‌లపై స్టాట్స్‌లోటెరిజ్ 25 శాతం పన్ను వసూలు చేస్తుంది. ప్రభుత్వం మార్చి 2003లో న్యూ గేమింగ్ ఏక్ట్‌ను ఆమోదించింది. దీని ప్రకారం సేవా కార్యక్రమాలకోసం నిర్వహించే లాటరీలకు ఇచ్చే లైసెన్సుల సంఖ్యను పెంచారు. లాటరీలను నిర్వహించే సంస్థలను ప్రభుత్వం సర్టిఫై చేస్తుంది. అవి మాత్రమే లాటరీలను నిర్వహిస్తాయి.

## న్యూజీలాండ్

న్యూజీలాండ్ లాటరీస్ కమిషన్ 1987లో ఏర్పాటైంది. గేమింగ్ అండ్ లాటరీస్ చట్టానికి లోబడి ఈ సంస్థ లాటరీలను నిర్వహిస్తుంది. సామాజిక ప్రయోజనాలకోసం నిధుల సేకరణను లక్ష్యంగా చేసుకుని లాటరీలను నిర్వహిస్తారు. లాటరీల ద్వారా లభించిన ఆదాయాన్ని న్యూజీలాండ్ లాటరీ గ్రాంట్స్ బోర్డు వివిధ సేవా కార్యక్రమాల అమలుకోసం పంపిణీ చేస్తుంది. లోటో గేమ్ ద్వారా అధికమొత్తంలో ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చని 'స్పోర్ట్ ఆన్ ది మూవ్' పేరిట 1985లో స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఎంక్వయిరీ ఓ నివేదికను అందచేసింది. ఈమేరకు న్యూజీలాండ్ లాటరీస్ కమిషన్ లోటోను ప్రవేశపెట్టింది. ఇదికాక గోల్డెన్ కివీ, ఇన్‌స్టంట్ కివి, లోటో స్ట్రైక్, కెనో, పవర్‌బాల్ వంటి గేమ్‌లు కూడా నడుస్తున్నాయి. న్యూజీలాండ్ దేశస్థులు లాటరీని జూదంలా కాకుండా వినోదాత్మకమైన క్రీడగా భావిస్తారు. లాటరీల ద్వారా పెద్దయెత్తున సేవా కార్యక్రమాలు జరుగుతూండటమే దీనికి కారణం. ప్రభుత్వరంగ సంస్థలపై జరిగిన ఓ సర్వేలో ఫైర్ సర్వీస్, పోలీస్ సర్వీస్, ఆర్మ్‌డ్ సర్వీస్‌ల తరవాతి స్థానంలో న్యూజీలాండ్ లాటరీస్ కమిషన్ ఉన్నట్లు తేలింది. 1987నుంచి ఇప్పటివరకూ లాటరీ గ్రాంట్స్ బోర్డుకు కమిషన్ 1.7 బిలియన్ డాలర్ల సహాయాన్ని అందించింది.

## నార్వే

నార్వేలో లాటరీ కార్యకలాపాలను ప్రభుత్వ అధీనంలోని నార్స్క టిప్పింగ్ అనే సంస్థ నిర్వహిస్తుంది. ఇది 7/34 లోటో, 6/48 వైకింగ్ లోటో, జోకర్ అనే మూడంకెల లాటరీలను మాత్రమే నడుపుతుంది. టిప్పింగ్ అనేది సాకర్ పూల్ గేమ్. సాకర్ పోటీల్లో విజేతలను ముందుగానే ఊహించి బెట్ చేయడంపై విజయావకాశాలు ఆధారపడి ఉంటాయి. ఆడ్‌సెన్, లాంగోడ్‌సెన్, ఆడ్స్‌బాంబెన్, విన్నెరొడ్‌సెన్ అనే గేమ్‌లు కూడా నార్వేలో నడుస్తున్నాయి.

‘ఫ్లాక్స్’ పేరిట స్క్రాచ్ టిక్కెట్ గేమ్‌లను నిర్వహిస్తారు. లాటరీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని క్రీడా, సాంస్కృతిక రంగాలపై వెచ్చిస్తారు. పరిశోధనరంగానికి కూడా లాటరీ నిధులను అందజేస్తారు.

## సింగపూర్

సింగపూర్‌కు 1960లో స్వాతంత్ర్యం లభించాక ప్రభుత్వం అక్రమ గాంబ్లింగ్ సిండికేట్లపై వేటు వేసేందుకు నడుం బిగించింది. ఇందులో భాగంగా 1968లో సింగపూర్ పూల్స్ పేరిట ఓ లాటరీ ఆపరేటర్‌ను ఏర్పాటు చేసింది. మొదటగా టోటో గేమ్‌ను ప్రవేశపెట్టింది. ఆ తరవాత వరుసగా సింగపూర్ స్వీప్స్, 4డి గేమ్‌లు, 4 డి స్వీప్‌లతోపాటు స్కోర్ అనే గేమ్ ప్రవేశించాయి. స్థానిక క్లబ్‌ల మధ్య జరిగే ఫుట్‌బాల్ పోటీలపై బెట్టింగ్ నిర్వహించడం ద్వారా జరిపే లాటరీయే స్కోర్. అంతర్జాతీయ ఫుట్‌బాల్ పోటీలపై బెట్టింగ్‌లు నిర్వహించే గేమ్‌ను స్ట్రైక్ అంటారు.

సింగపూర్ లాటరీ నిధులను సామాజిక సేవా కార్యకలాపాలకోసం, క్రీడల అభివృద్ధికి వినియోగిస్తున్నారు. ఈ నిధుల్లో అధికభాగం నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సర్వీసెస్ (ఎన్.సి.ఎస్.ఎస్)కు అందుతున్నాయి. ఎన్.సి.ఎస్.ఎస్ అధీనంలో 200కు పైగా స్వచ్ఛంద సేవా సంస్థలు పనిచేస్తున్నాయి. వికలాంగులు, నిరాశ్రయులు, వృద్ధుల సంక్షేమం కోసం ఇవి శ్రమిస్తున్నాయి. మాదక ద్రవ్యాలకు బానిసలైనవారిని జనజీవన స్రవంతిలోకి తీసుకువచ్చేందుకు, జంతుహింసను నిరోధించేందుకు, లాభాపేక్ష రహితంగా వైద్య రంగంలో పరిశోధనలు నిర్వహించేందుకు కృషి చేస్తున్న సంస్థలకు కూడా లాటరీ నిధులు అందుతున్నాయి. జురోంగ్ పక్షుల కేంద్రానికి, రోడ్డు భద్రతా కార్యక్రమాలకు, అనేక ఇతర ప్రాజెక్టులకు కూడా సింగపూర్ ప్రభుత్వం లాటరీ నిధులను అందజేస్తోంది. ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, హాకీ, రగ్బీ, స్విమ్మింగ్, స్క్వాష్, సెయిలింగ్, చెస్, పర్వతారోహణ వంటి క్రీడలకోసం కూడా ఈ నిధులను

వెచ్చిస్తోంది. నేషనల్ స్టేడియం నిర్మాణానికి 1968-1976 మధ్య కాలంలో 14.5 మిలియన్ సింగపూర్ డాలర్లను, సింగపూర్ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి 1986-89 మధ్యకాలంలో 45 మిలియన్ సింగపూర్ డాలర్లను అందజేసింది. ఒలింపిక్స్‌కు, శాఫ్, కామన్‌వెల్త్ వంటి అంతర్జాతీయ క్రీడలకు ఆటగాళ్ళను పంపేందుకుగాను సింగపూర్ ఒలింపిక్ కౌన్సిల్‌కు కూడా ఆర్థిక సహాయం అందచేస్తూ ఉంటుంది.

## దక్షిణాఫ్రికా

దక్షిణాఫ్రికా నేషనల్ లాటరీనీ నేషనల్ లాటరీస్ బోర్డు క్రమబద్ధీకరిస్తుంది. ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఉతింగో లైసెన్డ్ ఆపరేటర్. ఉతింగోలో అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియాలు ప్రధాన లాటరీ ఆపరేటర్లుగా అధికభాగం వాటాలను కలిగిఉన్నాయి. వీటిలో ఎన్నో సంస్థలు, వ్యక్తులు వాటాదారులుగా ఉన్నారు. దక్షిణాఫ్రికా పార్లమెంట్ 1997లో నేషనల్ లాటరీ చట్టాన్ని ఆమోదించింది. అప్పటి అధ్యక్షుడు నెల్సన్ మండేలా దీనికి ఆమోదముద్ర వేశారు. లాటరీ నిర్వహణకు రిటైలర్లను ఎంపిక చేస్తారు. వారికి శిక్షణ కూడా ఇస్తారు. దీనికోసం వారు రిటైలర్ అగ్రిమెంట్ మీద సంతకం చేయాల్సి ఉంటుంది. ఆ తరవాత మాత్రమే లాటరీ టిక్కెట్ల విక్రయానికి, విజేతలకు బహుమతులు అందించేందుకు వారికి అనుమతి లభిస్తుంది. విజేతలు సంబంధిత క్లెయిమ్ ఫారాలను అధీకృత బహుమతి చెల్లింపు కేంద్రాల్లో సమర్పించి, తమకు లభించిన బహుమతులను క్లెయిమ్ చేసుకోవచ్చు. 2001నుంచి 50,000ఆర్‌లలోపు బహుమతులను ఇలా క్లెయిమ్ చేసుకోవచ్చు. అంతకుమించి విలువ కలిగిన బహుమతులను నేషనల్ లాటరీ కార్యాలయంనుంచి పొందవలసి ఉంటుంది. 500,000 ఆర్‌లకు మించిన బహుమతిని విజేత క్లెయిమ్ చేసుకోకపోతే ప్రసార సాధానాల ద్వారా అప్రమత్తం చేస్తారు. లాటరీ నిధులను నేషనల్ లాటరీ డిస్ట్రిబ్యూషన్ ట్రస్ట్ ఫండ్ పంపిణీ చేస్తుంది. పునర్నిర్మాణ- అభివృద్ధి పథకాలకు 15 శాతం నిధులను, సేవా

సంస్థలకు 36 శాతం, కళలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వారసత్వ సంపద పరిరక్షణకోసం 22 శాతం, క్రీడలు, రిక్రియేషన్‌కోసం 22 శాతం, మిగిలిన నిధులను ఇతర పథకాలకోసం కేటాయిస్తారు. 2002లో వృద్ధాశ్రమాలు, పిల్లల సంరక్షణ కేంద్రాలు, బేబీ కేర్ సెంటర్లు సహా 853 స్వచ్ఛంద సంస్థలకు లాటరీ నిధుల ద్వారా లబ్ధి చేకూరింది. కళల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న 139 సంస్థలకు, క్రీడాభివృద్ధి కోసం శ్రమిస్తున్న 250 సంస్థలకు కూడా నిధులు అందాయి.

లాటరీలకు సంబంధించి అనుమానాలు నివృత్తి చేసుకునేందుకు, అభ్యర్థనలు పంపేందుకు ప్లేయర్ తుసొంగ్ అనేది టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్. లోటో, లోటో ప్లస్, వినా మంజే (విన్ నౌ) వంటివి బోర్డు నిర్వహిస్తున్న కొన్ని స్క్రాచ్ గేమ్‌లు. దక్షిణాఫ్రికాలో బహుళ ప్రజాదరణ పొందుతున్న వాటిలో టిక్-టాక్-టో, జాన్సీ గోల్డ్, స్కోర్ ఏ గోల్, బొనాన్జా బక్, క్యాష్ ఎక్స్‌ప్లోజన్ వంటి గేమ్స్ ఉన్నాయి. బహుమతులు రాని టిక్కెట్లకోసం విన్ ఎ లాట్ అనే లాటరీని నిర్వహించి, గెలుపొందినవారికి దుస్తులు, పప్పులు మొదలుకుని కార్ల వరకూ బహుమతులుగా ఇచ్చే గేమ్ కూడా ఉంది.

## స్పెయిన్

స్పెయిన్‌లో 1763లో లాటరీలకు అనుమతినిస్తూ రూపొందించిన చట్టంపై కార్లోస్ -3 సంతకం చేశాక అదే ఏడాది సెప్టెంబర్ 30న నేషనల్ లాటరీ ఆవిర్భవించింది. మాడ్రిడ్‌లో లాటరీని ఏర్పాటు చేయాలని మంత్రివర్గ సభ్యులంతా అభిప్రాయపడిన మీదట అందుకు తగినట్లుగా చట్టాన్ని రూపొందించారు. ఈ చట్టానికి మార్కిస్ తుదిమెరుగులు దిద్దారు. లాటరీ ద్వారా ఆశించిన నిధులు సమకూరక నష్టాల్లో పడితే ఆదుకునేందుకు మార్కిస్ తన ఆస్తులను పూచీకత్తుగా పెట్టడం విశేషం. లాటరీపై వచ్చిన లాభాలను ఆస్పత్రులు, అనాథ శరణాలయాలు వంటి ప్రజా ప్రయోజనాలకోసమే

వినియోగించాలని చట్టం నిర్దేశిస్తోంది. ట్రెజరీ డిపార్ట్‌మెంట్‌లోని ప్రభుత్వ హాల్‌లోనే డ్రా తీయాలని కూడా నిబంధనలు సూచిస్తున్నాయి. 1771 మార్చి 9న జరిగిన డ్రాలో శాన్ ఇల్డెఫెన్సో పాఠశాలకు చెందిన డీగో లోపెజ్ అనే ఏడేళ్ళ విద్యార్థి బహుమతులను గెలుచుకునే నంబర్లను ఎంపిక చేశాడు. అప్పటినుంచీ ఇదో సాంప్రదాయంగా మారింది. అదే పాఠశాలకు చెందిన విద్యార్థులే గెలుపు టిక్కెట్లను డ్రా తీస్తున్నారు.

ప్రస్తుతం స్పెయిన్‌లో కొనసాగుతున్న లాటరీకి 1811లో బీజం పడింది. కేడిజ్‌లో 1812లో మొదటి డ్రా తీశారు. దీనికోసం 20.000 టిక్కెట్లను జారీ చేశారు. ఇప్పుడు స్పెయిన్‌లో నేషనల్ లాటరీ, లా ప్రిమిటివ, 6/49 యూరో మిలియనెస్, ఎల్ గోర్డో డెల్ వెరానో/ సమ్మర్ ఫ్యాట్ వన్, లాక్వినీల, ఎల్ గోర్డో డె నావిడాడ్ / ది ఫాట్ వన్ ఆఫ్ క్రిస్మస్, బోనోటోటో, క్వినిగోల్ వంటి లాటరీలు నడుస్తున్నాయి. వీటన్నింటిలో ఫ్యాట్ వన్ ఆఫ్ క్రిస్మస్ అనే లాటరీ గేమ్ విలక్షణమైనదీ, సాంప్రదాయమైనదీను. డిసెంబర్ 22న ఈ గేమ్‌ను దేశప్రజలంతా ఆడతారు. ఈ గేమ్ 1812లో ప్రారంభమైంది. 1892నుంచి దీనికి ఆదరణ లభించడం మొదలైంది. ఈ లాటరీ కోసం స్పానిష్ నేషనల్ ఫ్యాక్టరీ ఆఫ్ కాయిన్ అండ్ స్టాంప్‌లో టిక్కెట్లను ముద్రిస్తారు. బహుమతి మొత్తాలను, సీరీస్‌ను ఫిబ్రవరి, మార్చి నెలల్లో నిర్ణయిస్తారు. డ్రా సమయాన ఇల్డెఫెన్సో పాఠశాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు విజేతల టిక్కెట్లను, బహుమతులను ప్రకటిస్తారు. స్పెయిన్‌కు వెలుపల ఉన్న స్వదేశీయులు కూడా ఈ డ్రాలో పాల్గొనవచ్చు. నగదు బహుమతులకు పన్ను మినహాయింపు ఉంది.

## శ్రీలంక

శ్రీలంకలో 1900ల తొలినాళ్ళలో ప్రైవేటు లాటరీలు నడుస్తూ ఉండేవి. కె.ఎం. చెల్లప్ప అనే వ్యక్తి 1933లో తన ఇంట్లోనే ఓ గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఆ మరుసటి సంవత్సరమే అది ప్రజా గ్రంథాలయంగా

రూపాంతరం చెందింది. ప్రజల తాకిడి కూడా ఎక్కువైంది. దానికి ఓ సొంత భవనం ఏర్పాటు చేయాలని జాఫ్నా మేయర్ శామ్ సభాపతి భావించారు. భవన నిర్మాణానికి కావలసిన నిధులకోసం లాటరీని నిర్వహించారు. ఇలా సమకూరిన నిధులతో జాఫ్నా లైబ్రరీ భవనాన్ని నిర్మించారు.

ప్రస్తుతం శ్రీలంకలో లాటరీల నిర్వహణ నాలుగు దశాబ్దాలుగా ప్రభుత్వ అధీనంలో ఉంది. నేషనల్ లాటరీస్ బోర్డు, డెవలప్‌మెంట్ లాటరీస్ బోర్డు అనే రెండు ప్రభుత్వ రంగ సంస్థలు లాటరీ వ్యాపారాన్ని నియంత్రిస్తున్నాయి. నేషనల్ లాటరీస్ బోర్డు ఆరు డ్రా ఆధారిత లాటరీలను నిర్వహిస్తోంది. వారంలో ఏడు రోజులూ వీటి డ్రాలు ఉంటాయి. సెవన స్క్రాచ్ లాటరీ వంటి స్క్రాచ్ కార్డ్ గేమ్స్‌ను కూడా బోర్డు నిర్వహిస్తోంది. లాటరీ బోర్డుల నియమ నిబంధనలకు లోబడి లాటరీలు నిర్వహించుకునేందుకు 2002లో ప్రైవేటు సంస్థలకూ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ప్రభుత్వం ఎంపిక చేసిన ప్రైవేటు లాటరీ ఆపరేటర్ ముందుగా 300 కోట్ల రూపాయలను చెల్లించాలి. ప్రభుత్వం విధించిన నియమ నిబంధనలకు లోబడి వ్యాపారం నిర్వహించాలి. ఏడేళ్ళ కాంట్రాక్టు కాల పరిమితి ఉంటుంది. లాటరీ ద్వారా సంపాదించిన మొత్తంలో ఏడాదికి కొంతమొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించాలి. సాటర్ డే ఫార్చ్యూన్ అనేది శ్రీలంకలో అతి పురాతన లాటరీ. ఈ లాటరీ డ్రాలను 1987నుంచి టెలివిజన్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నారు. డెవలప్‌మెంట్ లాటరీస్ బోర్డు షనిదా వాసనా, శాన్‌వర్దెనా వాసనా అనే లాటరీలను నిర్వహిస్తోంది. 2004 జనవరిలో వీటి జాక్‌పాట్ల సంఖ్యను పెంచారు. అలాగే జయోదా అనే కొత్త లాటరీకి శ్రీకారం చుట్టారు. డెవలప్‌మెంట్ లాటరీస్ బోర్డు 2003లో అధ్యక్ష నిధికి 750 మిలియన్ రూపాయలు అందజేసింది. జయోదా లాటరీలో జాక్‌పాట్ గెలుచుకున్నవారికి ఒక మిలియన్ రూపాయల బహుమతి ఉంటుంది. ఆటగాళ్ళను ఆకట్టుకునేందుకు గృహోపకరణ వస్తువులను కూడా బహుమతులుగా ఇస్తూంటారు. జయోదా లాటరీ డ్రాలను జిల్లాలవారీగా తీస్తారు.

ప్రభుత్వం 1980లో మహాపోలా లాటరీని ప్రవేశపెట్టింది. ప్రతిభాపాటవాలు గల నిరుపేద పిల్లలు ఉన్నత చదువులు చదువుకునేందుకు ఆర్థిక సాయం అందించేందుకై ఈ లాటరీని ప్రారంభించింది. అనివార్య కారణాల వల్ల మధ్యలో ఆగిపోయిన ఈ లాటరీ 2004లో తిరిగి ప్రారంభమైంది. అప్పటి వాణిజ్య, షిప్పింగ్ శాఖ మంత్రి లలిత్ అతులిత మొదలి ఈ లాటరీకి రూపకల్పన చేశారు. మహాపోలా లాటరీ ద్వారా లభించే ఆదాయంతో ఏటా 7000నుంచి 8000 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు అందిస్తున్నారు.

## స్విట్జర్లాండ్

స్విట్జర్లాండ్‌లో ఫ్రెంచ్ మాట్లాడే స్విట్జర్లాండ్ సొసైటీ తరపున 1973లో లాటరీ ప్రారంభమైంది. వాద్, వలైస్, ఫ్రిబౌర్గ్, న్యూఛాటెల్, జెనీవా జిల్లా ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఈ లాటరీ నడిచేది. 1979లో జురా జిల్లా ప్రభుత్వం కూడా ఈ బృందంలో కలిసింది.  జీలాటరీని లోటెరీ రొమండె లేదా లోరో అంటారు. లోటెరీ రొమండె 1978లో మొదటి స్క్రాచ్ గేమ్‌ను ప్రారంభించింది. 1978నుంచి 2004లో వివిధ రకాల బహుమతులతో ఎన్నో స్క్రాచ్ గేమ్‌లు ప్రవేశించాయి. ప్రస్తుతం పద్నాలుగు స్క్రాచ్ గేమ్‌లు నడుస్తున్నాయి. వాటిలో కాడో, డ్రాపో, లెమాగోట్, పిరమిడో, రెంటో, ట్రిబోలో ప్రముఖమైనవి. కార్టన్‌లో ఐదు ఫ్రాంకులనుంచి 500,000 ఫ్రాంకులవరకూ బహుమతులు ఉన్నాయి. రెంటోలో అత్యధిక బహుమతి మొత్తం 650,000 ఫ్రాంకులు. ఇవి స్క్రాచ్ గేమ్‌లు కాగా లె టిక్కెట్ అనేది ఇన్‌స్టంట్ గేమ్. మొజాయిక్ అనే లాటరీ గేమ్ 2002లో ప్రవేశించింది. స్క్రాచ్ టిక్కెట్‌పై కనిపించే నంబర్ కేవలం కోడ్ మాత్రమే. ఈ కోడ్‌ను కంప్యూటర్‌లో ఎంటర్ చేసి, సిడి-రోమ్ ఆధారంగా నిబంధనలకు లోబడి గేమ్‌లో పాల్గొనవలసి ఉంటుంది.

స్విట్జర్లాండ్ ప్రభుత్వం 1989లో ఆన్‌లైన్ లాటరీ గేమ్‌లనూ ప్రారంభించింది. స్విస్, ఫ్రెంచ్ గుర్రపు పందేలపై బెట్టింగ్‌లు నిర్వహించేందుకు ఉద్దేశించిన

పిఎంయు రొమాండ్ అనే లాటరీ గేమ్ 1991లో మొదలైంది. బ్రిటన్, అమెరికాల్లో జరిగే గుర్రపు పందేలపై బెట్టింగ్‌లకు అవకాశం కల్పించే గేమ్‌లు కూడా ఉన్నాయి. మొత్తం 36 కార్డులలో ఆటగాడు 1నుంచి 9 కార్డులను ఎంచుకోవాలి. ఇక బాంకో, లోటో ఎక్స్‌ప్రెస్ అనే లాటరీ గేమ్‌లు కెనో లాటరీను పోలి ఉంటాయి. లోటో ఎక్స్‌ప్రెస్ గేమ్‌లో ప్రతి ఐదు నిమిషాలకూ ఓ డ్రా ఉంటుంది. స్విస్ లోటో గేమ్ 1997నుంచి ఉంది. స్క్రాచ్ టిక్కెట్ పద్ధతిలో టాక్టిలో అనేది ఆధునికమైన గేమ్.

స్విట్జర్లాండ్‌లో లాటరీల ద్వారా లభించే ఆదాయాన్ని సామాజిక సేవకు, పర్యావరణ పరిరక్షణ, సాంస్కృతిక కార్యకలాపాలు, పర్యాటక, పరిశోధనారంగాలకోసం వ్యయం చేస్తారు. ఇప్పటివరకూ లోటెరీ రొమండెద్వారా లభించిన ఆదాయంలో 1.3 బిలియన్ ఫ్రాంకులను వీటికోసం ఖర్చు చేశారు. లాటరీ టిక్కెట్ల విక్రయం ద్వారా వచ్చే డబ్బులో 50 శాతాన్ని బహుమతులకోసం కేటాయించాలని చట్టాలు చెబుతున్నాయి.

## థాయ్‌లాండ్

థాయ్‌లాండ్‌లో 1917లో రాజు రామ వి. పుట్టినరోజున తొలిసారిగా లాటరీ నిర్వహించారు. మొదటి ప్రపంచ యుద్ధం సందర్భంగా సైనిక కార్యకలాపాలకు అవసరమైన నిధుల సేకరణకోసం ఈ లాటరీని నిర్వహించారు. థాయ్ రెడ్‌క్రాస్ చేపట్టిన సహాయ కార్యక్రమాలకు చేయూతనిచ్చేందుకు 1932లో మరోసారి లాటరీ జరిపారు. థాయ్‌లాండ్‌లో సైన్యంలో చేరేందుకు నిరాకరించే పురుషులపై డ్రాఫ్టీ పన్నును విధించేవారు. దీనిని 1934లో రద్దు చేశారు. దాంతో ప్రభుత్వం ఆర్థికపరంగా ఇబ్బందుల్లో పడింది. ఈ లోటును భర్తీ చేసుకునేందుకు లాటరీలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రావిన్షియల్ మున్సిపాలిటీలు చేపట్టే పథకాలకోసం 1934లో లాటరీల నిర్వహణకు అనుమతి ఇచ్చింది. ఆ తరవాత 1939లో లాటరీల నిర్వహణను

రెవిన్యూ శాఖ నుంచి ఆర్థిక శాఖకు బదలాయించారు. రెండు నెలలకోసారి నిర్వహించే లాటరీ కోసం పద్నాలుగు మిలియన్ల టిక్కెట్లను ముద్రిస్తారు. అదే డ్రా కోసం లాటరీ ఆఫీస్ క్రీడల అభివృద్ధికోసం రెండు మిలియన్ టిక్కెట్లను, సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు మరో ఏడు మిలియన్ టిక్కెట్లను ప్రింట్ చేస్తుంది. లాటరీ ఆఫీస్ ప్రతి ఏడాది 4,000 మిలియన్ బహ్తలను ప్రభుత్వానికి జమ చేస్తుంది. ఈ డబ్బుతో ప్రభుత్వం 440మంది అండర్‌గ్రాడ్యుయేట్లకు 20,000 బహ్తల విలువైన స్కాలర్‌షిప్‌లను అందజేస్తుంది. మరో 8 మిలియన్ బహ్తలను సేవా కార్యక్రమాలకోసం, 20 మిలియన్ బహ్తలను సివిల్ సర్వీస్, మిలటరీ సిబ్బంది సంక్షేమ నిధికోసం, థాయ్‌లాండ్ సంక్షేమ మండలి, మాజీ సైనికుల సంఘాల కోసం కేటాయిస్తుంది.

లాటరీ కార్యకలాపాలను కంప్యూటరైజ్ చేసేందుకు ప్రభుత్వం నడుం బిగించింది. దీనివల్ల ఆటగాళ్ళు టిక్కెట్లను కొనుక్కోవడం, బహుమతులను క్లెయిమ్ చేసుకోవడం వంటివన్నీ బ్యాంక్ ఎటిఎంల ద్వారానే జరిగిపోతాయి.

## ట్రినిడాడ్ అండ్ టొబాగో

ట్రినిడాడ్ అండ్ టొబాగోలో నేషనల్ లాటరీస్ కంట్రోల్ బోర్డ్ (ఎన్.ఎల్.సి.బి.) 1968లో ఏర్పాటైంది. తొలుత ఇది వాణిజ్యం, పరిశ్రమల మంత్రిత్వ శాఖ అధీనంలో ఉండేది. ఆ తరవాత ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోకి వచ్చింది. ఎన్.ఎల్.సి.బి. నిర్వహించే లాటరీ గేమ్‌లలో ప్లే వె, లోటో ప్లస్, క్యాష్ పాట్, లోటో క్లాసిక్, డోన్సలియ్, పిక్ టూ వంటివి ఉన్నాయి. ప్లే వె గేమ్‌ను వె వె లేదా చినపూ అనికూడా అంటారు. చైనానుంచి వలస వచ్చిన ప్రజలు ఈ గేమ్‌ను ట్రినిడాడ్ వాసులకు పరిచయం చేశారు. ఇది 1/36 గేమ్. లోటో ప్లస్ కూడా 1/36 గేమే అయినా ఇందులో అదనంగా పవర్‌బాల్ నంబర్ ఉంటుంది. క్యాష్ పాట్ అనే గేమ్ బింగో గేమ్‌ను పోలి ఉంటుంది. లోటో క్లాసిక్ ప్రాచీన పేపర్ లాటరీ గేమ్. ఈ గేమ్ డ్రాను 1969లో టెలివిజన్‌లో

ప్రత్యక్ష ప్రసారం చేశారు. లోటో క్లాసిక్ ద్వారా వచ్చిన లాభాలను సంచిత నిధి (కన్సాలిడేటెడ్ ఫండ్)లో జమ చేస్తారు. లోటో క్లాసిక్ టిక్కెట్లను వెనెజులాకు చెందిన ఇంప్రెస్సొరా టెక్నికా అనే సంస్థ సరఫరా చేసేది. విదేశీమారక ద్రవ్యంపై 1983లో విధించిన నిబంధనల కారణంగా ఎన్.ఎల్.సి.బి. స్వయంగా టిక్కెట్లను ముద్రించుకోవడం మొదలుపెట్టింది.

ట్రినిడాడ్ అండ్ టొబాగోలో ఇన్‌స్టంట్ లాటరీలు 1988లో ప్రారంభమయ్యాయి. వీటిద్వారా లభించిన ఆదాయాన్ని క్రీడలు, సాంస్కృతిక నిధిలో జమ చేస్తారు. ఇన్‌స్టంట్ టిక్కెట్లను ఓ ఇంగ్లీష్ కంపెనీ సరఫరా చేసేది. విదేశీ మారక ద్రవ్య సమస్యల కారణంగా ఇన్‌స్టంట్ గేమ్‌ల నిర్వహణకు ఆటంకం వాటిల్లింది. అయితే అవి 1995లో మళ్ళీ ప్రారంభమయ్యాయి. అమ్మకాలు పుంజుకునేందుకు లూజర్స్ డ్రా, సెకండ్ ఛాన్స్ డ్రా, ఎర్లీ బర్డ్ డ్రా వంటి స్కీమ్‌లను ప్రవేశపెట్టారు. ఆన్‌లైన్ గేమ్‌లు 1994లో మొదలయ్యాయి.

ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చడమే లక్ష్యంగా ఎన్.ఎల్.సి.బి. లాటరీలను నిర్వహిస్తోంది. ఏజెంట్లను, రిటైలర్లను, ఉద్యోగులను నియమించుకోవడం ద్వారా నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ఇతోధికంగా దోహదపడుతోంది. ట్రినిడాడ్ అండ్ టొబాగోలో బంపర్ లాటరీని ఎక్స్‌ట్రా ఆర్డినరీ డ్రా పేరిట 1970లో నిర్వహించారు. బహుమతి మొత్తాన్ని 100,000 డాలర్లుగా నిర్ణయించారు. టిక్కెట్లన్నీ వారం రోజుల్లోనే హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి. దీంతో ఉత్సాహం పొందిన ఎన్.ఎల్.సి.బి. 1,000,000 డాలర్ల బహుమతి మొత్తాన్ని ప్రథమ బహుమతిగా మరో ఎక్స్‌ట్రా ఆర్డినరీ లాటరీని, అలాగే 250, 000 డాలర్లతో జెయింట్ స్పెషల్ డ్రాను, 500.000 డాలర్లతో సూపర్ జెయింట్ డ్రాను నిర్వహిస్తోంది. కార్నివాల్, ఈస్టర్, స్వాతంత్ర్య దినోత్సవం, క్రిస్మస్ వంటి పర్వదినాల్లో 1,000,000 డాలర్లతో స్పెషల్ మిలియన్ డాలర్ డ్రాను నిర్వహిస్తోంది. లాటరీల్లో ఊహించని విజయాలు

కలగడంతో ఏజెంట్లకిచ్చే కమిషన్‌ను ఎన్.ఎల్.సి.బి. 15నుంచి 17 శాతానికి పెంచింది.

## యునైటెడ్ కింగ్‌డమ్

లాటరీరంగంలోకి యునైటెడ్ కింగ్‌డమ్ కాస్త ఆలస్యంగా ప్రవేశించింది. అయితేనేం, లాటరీలను నిర్వహిస్తున్న దేశాలన్నింటికంటే అగ్రస్థానంలో ఉంది. నేషనల్ లాటరీ ఆఫ్ ది యునైటెడ్ కింగ్‌డమ్ పనితీరుకు ఇది నిదర్శనం. నేషనల్ లాటరీని నేషనల్ లాటరీ కమిషన్ నియంత్రిస్తుంది. లాటరీలను క్రమబద్ధీకరించేందుకు 1999వరకూ ఆఫీస్ ఆఫ్ ది నేషనల్ లాటరీ ఇన్‌చార్జిగా వ్యవహరించేది. లాటరీ ఆపరేటర్ కేమ్‌లాట్ పనితీరును పర్యవేక్షించడం, లాటరీలు సవ్యంగా సాగేలా చూడటం, ఆటగాళ్ళ పరిరక్షణకోసం కృషి చేయడం...ఇవీ నేషనల్ లాటరీ కమిషన్ విధులు. 2009 వరకూ లాటరీలను నిర్వహించేందుకు ఆపరేటర్‌కు లైసెన్స్ ఉంది. యునైటెడ్ కింగ్‌డమ్‌లో లాటరీ ఆపరేటర్‌గా వ్యవహరిస్తున్న ప్రైవేటు సంస్థకు ఐదుగురు వాటాదారులు అధిపతులుగా ఉన్నారు. గాంబ్లింగ్‌కు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ఈ సంస్థ కృషి చేస్తుంది. గాంబ్లింగ్ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం పనిచేసే గేమ్‌కేర్ సంస్థకు ఈ లాటరీ ఆపరేటర్ 250,000 పౌండ్లను విరాళంగా ఇచ్చింది. లాటరీలు ఆడే  అంధులు, అంగవికలురకు చేయూతను అందిస్తోంది. లాటరీలకు సంబంధించిన సమాచారాన్ని బ్రెయిలీ లిపిలో అందించడం, ప్లే స్టేషన్లలో తక్కువ ఎత్తులో ఉన్న టేబుళ్ళను ఏర్పాటు చేయడం, వికలాంగులకు సహకరించేవిధంగా రిటైలర్లకు శిక్షణనివ్వడం వంటి కార్యక్రమాలను ఈ సంస్థ చేపడుతోంది.

లాటరీ ఉత్పత్తులను విక్రయించేందుకు 33,000 మంది రిటైలర్లు పనిచేస్తున్నారు. 200 పౌండ్ల వరకూ విలువైన బహుమతి మొత్తాలను రిటైలర్లే చెల్లిస్తారు. 50,000 బహుమతి మొత్తాలను చెల్లించేందుకు కొన్ని పోస్టాఫీసులకు

అనుమతి ఉంది. భారీ మొత్తాలను గెలుచుకున్న విజేతలకు తగిన సూచనలు, సలహాలను కూడా ఇస్తారు. లాటరీలద్వారా వచ్చిన ఆదాయాన్ని నేషనల్ లాటరీ పంపిణీ సంస్థ కేటాయింపులు జరుపుతుంది. పదేళ్ళ కాలవ్యవధిలో 15.6 బిలియన్ పౌండ్ల లాటరీ నిధులను సత్కార్యాలకోసం వెచ్చించింది. దాదాపు 165,000 ప్రాజెక్టులకు లబ్ధి చేకూరింది. యు.కె.లో లాటరీలు 1600మందిని మిలియనీర్లను చేశాయి.

లోటో తరహా గేమ్‌లలో ముందుగా 6/49 గేమ్‌ను ప్రవేశపెట్టారు. ఇప్పటికీ దానిదే ఆధిపత్యం. లోటో ఎక్స్‌ట్రా గేమ్‌లో 50 మిలియన్ పౌండ్లకు చేరుకునే వరకూ జాక్‌పాట్ కొనసాగుతూనే ఉంటుంది. నవంబర్ 1999లో క్రిస్మస్ మిలియనీర్ మేకర్ అనే గేమ్ మిలీనియంను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన గేమ్. దీనికి అనూహ్యమైన స్పందన లభించడంతో 2001లో క్రిస్మస్ పండుగ సందర్భంగా మళ్ళీ ప్రవేశపెట్టారు. ఈ గేమ్ ద్వారా 33 మంది మిలియనీర్లు అయ్యారు. 2001లో ఈ గేమ్ ద్వారా లభించిన ఆదాయంలో 40 మిలియన్ పౌండ్లను సామాజిక సేవా కార్యకలాపాలకోసం వెచ్చించారు.

నేషనల్ లాటరీ ఏటా 28 స్క్రాచ్ కార్డ్ గేమ్‌లను నిర్వహిస్తుంది. ఏడాది పొడవునా ఎప్పుడు చూసినా 12 గేమ్‌లకు సంబంధించిన టిక్కెట్ల అమ్మకాలు జరుగుతూనే ఉంటాయి. మోనోపలీ, క్యాష్ ఫర్ లైఫ్, గ్రాండ్ నేషనల్ వంటివి ప్రాచుర్యం పొందిన కొన్ని ఇన్‌స్టంట్ గేమ్స్.

## యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా

ప్రస్తుతం అమెరికాలోని 38 రాష్ట్రాల్లో లాటరీలు నడుస్తున్నాయి. లాటరీల నిర్వహణకు ప్రజలనుంచి అనుమతి లభించాకే ఆయా రాష్ట్రాలన్నీ లాటరీలకు శ్రీకారం చుట్టడం విశేషం.

## ఆరిజోనా లాటరీ

ఆరిజోనా ప్రజలు 1980లో లాటరీలకు అనుకూలంగా తీర్పు ఇచ్చారు. లాటరీలను కొనసాగించాలంటూ 2002లో 73 శాతంమంది అభిప్రాయపడ్డారు. లాటరీల్లో పాల్గొనడానికి కనీస వయో పరిమితిని 18నుంచి 21 ఏళ్ళుగా 2003 జూన్‌లో నిర్ణయించారు. లాటరీ టిక్కెట్లను 2500 రిటైలర్ల ద్వారా విక్రయిస్తారు. ఒక్కో గేమ్ ద్వారా వచ్చే ఆదాయాన్ని ఒక్కో లబ్ధిదారుకు కేటాయిస్తారు. హెరిటేజ్ ఫండ్, క్లీన్ ఎయిర్ ఫండ్, ఆర్థికాభివృద్ధి నిధి వంటి వాటికి కూడా నిధుల్ని అందజేస్తారు.

## కాలిఫోర్నియా లాటరీ

కాలిఫోర్నియా రాష్ట్రంలో 54 శాతం మంది ప్రజలు కాలిఫోర్నియా స్టేట్ లాటరీ చట్టానికి అనుకూలంగా ఓటు వేశారు. లాటరీల ఆదాయంలో 34 శాతాన్ని విద్యారంగానికి కేటాయించాలని కాలిఫోర్నియా లాటరీల చట్టం చెబుతోంది.

## కొలరాడో లాటరీ

కొలరాడో రాష్ట్ర ప్రభుత్వం తరపున 1983లో లాటరీలు ప్రారంభమయ్యాయి. 50 శాతం లాటరీ నిధుల్ని గ్రేట్ అవుట్‌డోర్ కొలరాడో ట్రస్టుకు, 40 శాతం నిధుల్ని కన్జర్వేటివ్ ట్రస్ట్ ఫండ్‌కు, 10 శాతం నిధుల్ని స్టేట్ పార్క్స్‌కు కేటాయిస్తారు. గ్రేట్ అవుట్‌డోర్ కొలరాడో ట్రస్టుకు ఇచ్చే నిధులు 35 మిలియన్ డాలర్లకు మించరాదని సీలింగ్ ఉంది. ఒకవేళ పరిమితికి మించి నిధులు అందజేస్తే, అదనపు నిధుల్ని ప్రభుత్వ పాఠశాలలకు మళ్లించవలసి ఉంటుంది. 35 మిలియన్ డాలర్ల నిధుల్ని బహిరంగ స్థలాలు, పార్కులు, వన్యమృగ సంరక్షణ వంటివాటికోసం ఖర్చు చేయాల్సి ఉంటుంది. నగరాలు, పట్టణాల అభివృద్ధికి కన్జర్వేషన్ ఫండ్ నిధుల్ని వెచ్చిస్తారు.

## కనెక్టికట్ స్టేట్ లాటరీ

రాష్ట్ర ప్రభుత్వం నిధుల సేకరణకు 1971లో కనెక్టికట్ స్టేట్ లాటరీని ప్రారంభించింది. ఆరంభంలో 'ది లాటరీ' పేరిట ఒకే ఒక లాటరీని ప్రభుత్వం నిర్వహించేది. దానిపై వచ్చిన లాభాలను ప్రభుత్వ జనరల్ ఫండ్‌లో జమ చేసేది. 1975లో ఇన్‌స్టంట్ స్క్రాచ్ గేమ్‌లను ప్రవేశపెట్టింది. లాటరీని ఖాసీ-పబ్లిక్ కార్పొరేషన్‌గా మార్చిన తొలి రాష్ట్రంగా 1996లో కనెక్టికట్ చరిత్ర సృష్టించింది. కనెక్టికట్ లాటరీ కార్పొరేషన్ 2004లో 538.3 మిలియన్ డాలర్లను బహుమతులుగా అందజేసింది. 281 మిలియన్ డాలర్లను జనరల్ ఫండ్‌కు జమ చేసింది. జనరల్ ఫండ్ నిధులను ప్రజారోగ్యానికి, గ్రంథాలయాల నిర్మాణానికి విద్యాభివృద్ధికి ఖర్చు చేస్తున్నారు. ఇప్పటివరకూ కార్పొరేషన్ 5.3 బిలియన్ డాలర్లను జనరల్ ఫండ్‌కు అందజేసింది.

## డిసి లాటరీ, ఛారిటబుల్ గేమ్స్ కంట్రోల్ బోర్డ్

డిస్ట్రిక్ట్ ఆఫ్ కొలంబియా 1982లో లాటరీ వ్యాపారాన్ని ప్రారంభించింది. ఇప్పటి వరకూ లాటరీ ద్వారా 1.1 బిలియన్ డాలర్లు రాష్ట్ర జనరల్ ఫండ్‌లో జమ అయ్యాయి. ఈ నిధులతో నిరుపేదలకు ఇళ్ళ నిర్మాణం, బాలల సంక్షేమం, పార్కుల అభివృద్ధి, విద్యాసౌకర్యాల కల్పన వంటి వసతులు కల్పిస్తున్నారు.

## డెలావేర్ లాటరీ

డెలావరె లాటరీ 1975లో ఏర్పాటైంది. ఈ లాటరీ ద్వారా రాష్ట్ర జనరల్ ఫండ్‌కు 1.8 బిలియన్ డాలర్లు జమ అయ్యాయి. 2004 ఆర్థిక సంవత్సరంలో డెలావరె లాటరీ 222 మిలియన్ డాలర్లను అందజేసింది. ఉన్నత విద్యాసౌకర్యాల కల్పనకు, సామాజిక సేవా కార్యక్రమాల అమలుకు, ప్రజారోగ్యానికి, సహజ వనరుల వెలికితీతకు, పర్యావరణ పరిరక్షణకు,

చిన్నారుల సంక్షేమానికి జనరల్ ఫండ్ నిధుల్ని వినియోగిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వీడియో లాటరీని కూడా నిర్వహిస్తోంది.

## ఫ్లోరిడా

ఫ్లోరిడాలో లాటరీ ద్వారా సమకూరే నిధులను విద్యాభివృద్ధికి వెచ్చిస్తున్నారు. ఫ్లోరిడా చట్టసభ 1997లో ఫ్లోరిడా బ్రైట్ ఫ్యూచర్స్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్ ఏర్పాటుకు తీర్మానించింది. ఉన్నత పాఠశాల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఈ పథకం చేయూతనందిస్తుంది. 2003లో 110,000 మంది ఫ్లోరిడా విద్యార్థులకు ఈ పథకం ద్వారా స్కాలర్‌షిప్‌లు లభించాయి. క్లెయిమ్ చేసుకోని బహుమతి మొత్తాలను స్క్రాచ్ గేమ్‌లు, ఆన్‌లైన్ గేమ్‌లకు మళ్ళిస్తారు, అలా స్క్రాచ్ గేమ్‌లు, ఆన్‌లైన్ గేమ్‌ల ప్రైజ్ మనీ పెరుగుతుంది.

## జార్జియా లాటరీ కార్పొరేషన్

జార్జియాలో లాటరీలు 1784నుంచీ జరిగిన దాఖలాలు ఉన్నాయి. అయితే ఆధునిక జార్జియా లాటరీ కార్పొరేషన్ మాత్రం 1992లో ఏర్పాటైంది. దీనిద్వారా లభించే ఆదాయాన్ని విద్యాభివృద్ధికి ఖర్చు చేస్తున్నారు. లాటరీ నిధుల ద్వారా అందించే 'హోప్' స్కాలర్‌షిప్‌లతో 775,000 మంది విద్యార్థులు కాలేజీ చదువులు చదువుకోగలిగారు. నాలుగేళ్ళ లోపు వయసున్న సుమారు 560,000 మంది చిన్నారులు ప్రీ కిండర్‌గార్టెన్‌లో చేరి, చదువులకు శ్రీకారం చుట్టారు. మార్కెటింగ్‌లో అత్యున్నత ప్రతిభాపాటవాలు కనబరిచినందుకు జార్జియా లాటరీ కార్పొరేషన్‌కు జార్జియా ట్రెండ్ మ్యాగజైన్ ఇచ్చే డొనాల్డ్ ఆర్ కీఫ్ వార్షిక అవార్డు లభించింది. అట్లాంటాలో జరిగిన 1996 ఒలింపిక్స్‌లో కార్పొరేషన్ ఆటగాళ్ళకోసం ఒలింపిక్ రింగ్ లోపల మూడు లాటరీ కియోస్క్‌లను ఆపరేట్ చేసింది.

## హూసియర్ ఇండియానా లాటరీ (హెచ్.ఐ.ఎల్.)

హెచ్.ఐ.ఎల్ 1989లో ఏర్పాటైంది. ఇంతవరకూ ఈ సంస్థ 383మందిని మిలియనీర్లను చేసింది. హెచ్.ఐ.ఎల్. ఆదాయాన్ని పోలీసు అధికారులు, అగ్నిమాపక నిరోధక సిబ్బంది పెన్షన్ రిలీఫ్ ఫండ్‌కు, టీచర్ల రిటైర్‌మెంట్ ఫండ్‌కు, రోడ్డు పనులకు, పాఠశాలల అభివృద్ధికి, ప్రాపర్టీ టాక్స్ రీప్లేస్‌మెంట్ ఫండ్, జనరల్ ఫండ్‌లకు కేటాయిస్తారు. 5000 డాలర్లకు మించిన బహుమతి మొత్తాలపై ప్రభుత్వం 3.4 శాతం స్థానిక పన్నును, 25 శాతం ఫెడరల్ పన్నును వసూలు చేస్తుంది.

## ఇడాహో లాటరీ

ఇడాహో లాటరీ 1989లో ఏర్పాటైంది. ఈ లాటరీ ద్వారా లభించిన ఆదాయంలో 250 మిలియన్ డాలర్లను ఇడా హో రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలు, యూనివర్శిటీల అభివృద్ధికి వెచ్చించారు. విద్యాసంస్థలకోసం ఏర్పాటు చేసిన శాశ్వత భవన నిర్మాణ నిధికి కూడా ఇడాహో లాటరీ నిధులను కేటాయిస్తున్నారు.

## ఇల్లినాయిస్ లాటరీ

ఇల్లినాయిస్ రాష్ట్ర ప్రభుత్వం 1975లో లాటరీ కార్యకలాపాలను ప్రారంభించింది. లాటరీ ద్వారా సమకూరిన నిధులను కామన్ స్కూల్ ఫండ్ (సి.ఎస్.ఎఫ్.)లో జమ చేయాలంటూ 1985లో ఓ చట్టాన్ని రూపొందించారు. ఈ నిధిని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికోసం ఖర్చు చేస్తారు. 1000 డాలర్లకంటే ఎక్కువ బహుమతి మొత్తాలపై మూడు శాతం పన్నును, 5000 డాలర్ల కంటే ఎక్కువ ప్రైజ్ మనీపై 25 శాతం ఫెడరల్ టాక్స్ ఉంటాయి. 2003వ సంవత్సరంలో  లాటరీలపై 1.59 బిలియన్ డాలర్ల మొత్తం రాగా ఇందులో 881 మిలియన్ డాలర్లను ప్రైజ్‌మనీగా ఇవ్వడం విశేషం.

## అయోవా లాటరీ

అయోవా రాష్ట్ర లాటరీ 1985లో మొదలైంది. 'స్క్రాచ్, మాచ్ అండ్ విన్' అనే గేమ్‌ను ముందుగా ప్రవేశపెట్టారు. ఈ లాటరీ టిక్కెట్ల ధర 1992 వరకూ కేవలం ఒక్క డాలర్ మాత్రమే. ఆ తరవాత రెండు డాలర్ల టిక్కెట్ ధరతో బింగోను ప్రవేశపెట్టారు. వీటిద్వారా 2003లో రాష్ట్ర జనరల్ ఫండ్‌కు 48 మిలియన్ డాలర్లు జమ అయ్యాయి.

## కాన్సాస్ లాటరీ

కాన్సాస్ లాటరీ చట్టం 1984లో ఆమోదం పొందింది. ఈ లాటరీ ద్వారా లభించే ఆదాయంలో 50 మిలియన్ డాలర్లు రాష్ట్ర జనరల్ ఫండ్‌కు వెళుతుంది. జనరల్ ఫండ్ నిధుల్లో 85 శాతం ఎకనామిక్ డెవలప్‌మెంట్ ఇనీషియేటివ్స్ ఫండ్ (ఇ.డి.ఐ.ఎఫ్)కు కేటాయిస్తారు. పది శాతం నిధులను కరెక్షనల్ ఇన్‌స్టిట్యూషన్స్ బిల్డింగ్ ఫండ్‌కు, ఐదు శాతం నిధులను జువైనైల్ డిటెన్షన్ ఫెసిలిటీస్ ఫండ్‌కు అందజేస్తారు.

## కెంటకీ లాటరీ కార్పొరేషన్

కెంటకీ లాటరీ కార్పొరేషన్ 1989లో ఏర్పడింది. ఈ కార్పొరేషన్ ఇంతవరకూ 200 కోట్ల డాలర్లను ప్రభుత్వ ఖజనాకు జమ చేసింది. లాటరీలపై వచ్చిన ఆదాయాన్ని కాలేజి గ్రాంట్లు, స్కాలర్‌షిప్పులు, జనరల్ ఫండ్ వంటివాటికోసం వినియోగిస్తారు. కార్పొరేషన్ 1999నుంచి ఇప్పటివరకూ స్కాలర్‌షిప్‌లుగా 400 మిలియన్ డాలర్లను విరాళంగా ఇచ్చింది. ఈ డబ్బుతో 365,000 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరింది. కార్పొరేషన్ అందజేసిన నిధుల్లో 15 మిలియన్ డాలర్లు కెంటకీ ఎర్లీ చైల్డ్‌హుడ్ రీడింగ్ ఇన్సెంటివ్ ఫండ్‌కు, సెంటర్ ఫర్ లిటరసీ డెవలప్‌మెంట్‌కు, 32 మిలియన్ డాలర్లు వియత్నాం యుద్ధంలో పాల్గొన్న సైనికుల సంక్షేమం కోసం, 1.4 బిలియన్ డాలర్లు జనరల్ ఫండ్‌కు,

21 మిలియన్ డాలర్లు కెంటకీ హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలోని అఫోర్డబుల్ హౌసింగ్ ట్రస్ట్ ఫండ్‌కు అందాయి. హౌసింగ్ ట్రస్ట్ ఫండ్ ద్వారా ప్రభుత్వం 2770 ఇళ్ళను నిర్మించి లబ్ధిదారులకు కేటాయించింది.

## లూసియానా లాటరీ కార్పొరేషన్

లూసియానాలో లాటరీలు 1990లో ప్రారంభమయ్యాయి. ముందుగా ఇన్‌స్టంట్ లాటరీని ప్రవేశపెట్టారు. 2004లో ఈ లాటరీ టిక్కెట్ల అమ్మకం ద్వారా 84 మిలియన్ డాలర్లు సమకూరాయి.

## మైనె స్టేట్ లాటరీ

మైనె స్టేట్ లాటరీ పథకాల ద్వారా రాష్ట్ర జనరల్ ఫండ్‌కు 600 మిలియన్ డాలర్లు జమ అయ్యాయి. జనరల్ ఫండ్ 250కి పైగా ఏజెన్సీలకు, పథకాలకు ఆర్థికంగా చేయూతనందిస్తోంది. 5000 డాలర్లకు మించిన బహుమతులపై ప్రభుత్వం 5 శాతం పన్నును వసూలు చేస్తోంది.

## మేరీలాండ్ స్టేట్ లాటరీ

మేరీలాండ్ స్టేట్ లాటరీ 2004లో 1.395 బిలియన్ డాలర్ల అమ్మకాలను నమోదు చేసింది. పిక్ 3, లోటో, కెనో, మెగా మిలియన్స్ వంటి గేమ్‌లతోపాటు స్క్రాచ్ టిక్కెట్ గేమ్‌ల ద్వారా కూడా అధికాదాయం లభిస్తోంది. కెనో, పిక్ 3, పిక్ 4 వంటి ఇతర లాటరీ గేమ్‌లకు కూడా జనాదరణ బాగానే ఉంది.

## మసాచుసెట్స్ స్టేట్ లాటరీ కమిషన్

మసాచుసెట్స్ స్టేట్ లాటరీ కమిషన్ 1971లో ప్రారంభమైంది. తొలుత ఇది ఇన్‌స్టంట్ లాటరీ గేమ్‌లను మాత్రమే నిర్వహించేది. చట్టసభ రూపొందించిన లోకల్ ఎయిడ్ ఫార్ములా ప్రకారం లాటరీలపై వచ్చిన

ఆదాయాన్ని 351కి పైగా కామన్‌వెల్త్ నగరాలు, పట్టణాలకు కేటాయించేవారు. ఈ నిధులను నగరాలు, పట్టణాలు తమ అవసరాల మేరకు స్వేచ్ఛగా వినియోగించుకోవచ్చు. ఉదాహరణకు ఛెస్టర్ ఈ నిధులను ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి ఖర్చు చేస్తే, హాలిఫాక్స్ ఫైర్ స్టేషన్ పునర్నిర్మాణానికి, ఆరెంజ్ రీజనల్ స్కూల్ వ్యవస్థకు చేయూతనిచ్చేందుకు వినియోగించాయి. 2003లో కమిషన్ 705 మిలియన్ డాలర్లను కామన్‌వెల్త్‌కోసం విరాళంగా అందించింది. కొత్త సహస్రాబ్దిలోకి ప్రవేశిస్తున్న సందర్భాన్ని పురస్కరించుకుని కమిషన్ 1999 నవంబర్‌లో మిలీనియం స్పెక్టాక్యులర్ గేమ్‌ను నిర్వహించింది. టిక్కెట్ల అమ్మకం ద్వారా వచ్చిన డబ్బులో 80 శాతాన్ని ప్రైజ్‌మనీగా ప్రకటించింది. కమిషన్ 2001లో ఎక్కడపడితే అక్కడ చెత్తను పారవేయడాన్ని నిరసిస్తూ 'ది క్లీన్ ఫన్ స్వీప్‌స్టేక్స్' అనే కొత్త గేమ్‌ను ప్రవేశపెట్టింది. ఈ గేమ్‌లో గెలుపొందనివారు పది డాలర్ల విలువైన తమ టిక్కెట్లతో 100,000 డాలర్ల బహుమతిని గెలుచుకునేందుకు మరోసారి లాటరీలో పాల్గొనవచ్చు.

## మిచిగన్ బ్యూరో ఆఫ్ స్టేట్ లాటరీ

ఈ లాటరీ 1972లో ప్రారంభమైంది. మొదటిసారి లాటరీ నిర్వహించినప్పుడు టిక్కెట్ ధరను 50 సెంట్లుగా నిర్ణయించారు. బ్యూరో 1975లో మొదటి ఇన్‌స్టంట్ గేమ్‌ను ప్రారంభించింది. ఆ తరవాత డైలీ 3, డైలీ 4, 6/40 లోటో, 6/47 లోటో, కెనో వంటి గేమ్‌లను ప్రవేశపెట్టి, విజయవంతంగా నిర్వహిస్తోంది. టిక్కెట్ల అమ్మకాలు 1987లో ఒక బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. 1997లో ఈ సంస్థ 25వ వార్షికోత్సవం సందర్భంగా ఐదు ఇన్‌స్టంట్ గేమ్స్‌ను ప్రవేశపెట్టింది. 25వ వార్షికోత్సవ బహుమతిగా 250,000 డాలర్లను ప్రకటించింది. లాటరీ ద్వారా వచ్చిన ఆదాయాన్ని విద్యాభివృద్ధికోసం స్కూల్ ఎయిడ్ ఫండ్‌కు ఇస్తోంది. మిచిగన్ స్టేట్ లాటరీ 1972నుంచి ఇప్పటివరకూ ప్రభుత్వ పాఠశాలలకు 11.3 బిలియన్ డాలర్లను విరాళంగా ఇచ్చింది.

## మిన్నెసోటా స్టేట్ లాటరీ (ఎం.ఎస్.ఎల్.)

మిన్నెసోటాలో లాటరీలు 1988లో ప్రారంభమయ్యాయి. లాటరీలను ప్రారంభించేందుకు 57 శాతం మంది రాష్ట్ర ప్రజలు పచ్చజెండా ఊపారు. లాటరీ ద్వారా వచ్చిన నిధులను పర్యావరణం-సహజ వనరుల ట్రస్ట్ ఫండ్‌కు, గ్రేటర్ మిన్నెసోటా కార్పొరేషన్‌కు సమానంగా కేటాయించాలంటూ నిబంధనలు ఉన్నాయి. ఎం.ఎస్.ఎల్. 1990లో ఇన్‌స్టంట్ గేమ్‌లను, డైలీ 3 అనే గేమ్‌ను ప్రారంభించింది. లాటరీల ద్వారా సమకూరుతున్న ఆదాయాన్ని పంపిణీ చేసే విధానంలో చట్ట సభ మార్పులు చేర్పులు చేసింది. ట్రస్ట్ ఫండ్‌కు 40 శాతం, జనరల్ ఫండ్‌కు 60 శాతం ఇవ్వాలని కొత్తగా నిబంధనలు విధించింది. ఎం.ఎస్.ఎల్. 1993లో లాటరీ టిక్కెట్ల అమ్మకాల ద్వారా బిలియన్ డాలర్ల ఆదాయాన్ని సంపాదించింది. 1997లో సిన్నమోన్ టోస్ట్ అనే స్క్రాచ్ అండ్ స్నిఫ్ గేమ్‌ను ప్రవేశపెట్టింది. 2000లో రోల్‌డౌన్ అనే గేమ్‌ను మొదలుపెట్టింది. ఇది వివిధ రాష్ట్రాల మధ్య జరుగుతుంది.

రాష్ట్రంలో సహజ వనరుల పరిరక్షణకు కృషి చేసే ప్రాజెక్టులకు పర్యావరణం-సహజ వనరుల ట్రస్ట్ ఫండ్ నిధులు అందిస్తుంది. ఈ ట్రస్ట్ మొదలైనప్పటినుంచి 239 ప్రాజెక్టులకు 141 మిలియన్ డాలర్ల ఆర్థిక సహాయం అందించింది. విద్య, వైద్య సౌకర్యాల కల్పనకోసం జనరల్ ఫండ్ నిధులు కేటాయిస్తుంది. లాటరీలపై అమ్మకం పన్ను ద్వారా లభించే ఆదాయాన్ని కూడా సంక్షేమ కార్యక్రమాలకే వినియోగిస్తారు. అమ్మకం పన్నుద్వారా సమకూరే మొత్తం ఆదాయంలో 87 శాతాన్ని ట్రస్ట్ ఫండ్‌కు, 13 శాతం నిధులను జనరల్ ఫండ్‌కు కేటాయిస్తారు. ఇలా లబ్ధి పొందిన సంస్థల్లో ఫిష్ అండ్ వైల్డ్‌లైఫ్ కారిడార్స్, మెట్రో గ్రీన్‌వేస్, గిచి గామి స్టేట్ ట్రయల్, బయొలాజికల్ సర్వే, సాయిల్ సర్వే వంటివి ఉన్నాయి. ఎం.ఎస్.ఎల్. ఆధ్వర్యంలో వారానికోసారి 30 నిమిషాల టివీ షో ప్రసారమవుతుంది. సహజ వనరుల పరిరక్షణ ధ్యేయంగా ఈ టీవీ షో కార్యక్రమాలు రూపొందుతాయి.

## మిస్సోరీ లాటరీ

మిస్సోరీ జనాభాలో 70 శాతం మంది లాటరీలకు అనుకూలంగా ఓటు వేశాక, ప్రభుత్వం 1985లో లాటరీలకు తెరతీసింది. ముందుగా జాక్‌పాట్ అనే ఇన్‌స్టంట్ గేమ్‌ను ప్రారంభించారు. ప్రభుత్వం 1990లో పుల్ టాబ్ గేమ్స్‌కు శ్రీకారం చుట్టింది. లాటరీ నిధులను విద్యాభివృద్ధికోసం కేటాయించేందుకు వీలుగా 1992లో లాటరీ చట్టాన్ని సవరించారు. మిస్సోరీలో లాటరీలు ప్రారంభించి పదేళ్ళయిన సందర్భంగా 1996లో ఫన్ అండ్ ఫార్చ్యూన్ అనే టెలివిజన్ గేమ్‌ను కూడా ప్రారంభించారు.

## మోంటానా లాటరీ

మోంటానాలో లాటరీలు 1986లో మొదలయ్యాయి. అమెరికాలో లాటరీల బాట పట్టిన 23వ రాష్ట్రం మోంటానా. మొదటగా పాట్ ఆఫ్ గోల్డ్ పేరిట ఓ ఇన్‌స్టంట్ గేమ్‌ను ప్రారంభించారు. లాటరీల ద్వారా వచ్చే ఆదాయాన్ని టీచర్ల రిటైర్‌మెంట్ ఫండ్‌కు విరాళంగా ఇచ్చేవారు. అయితే ఈ నిధుల్ని పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్ స్కూల్ ఈక్విలైజేషన్ అకౌంట్ కార్యాలయానికి అందజేయాలంటూ సంబంధిత చట్టాన్ని 1990లో సవరించారు. ఆ మరుసటి సంవత్సరమే ఈ నిధుల్లో 1..6 శాతాన్ని బోర్డ్ ఆఫ్ క్రైమ్ కంట్రోల్‌కు ఇవ్వాలని మరో సవరణ చేశారు. బాల నేరస్థుల నిర్బంధ గృహాల నిర్వహణకోసం ఈ నిధులు ఉపయోగపడుతున్నాయి. ఆ తరవాత ఈ నిధుల్ని 9.1 శాతానికి పెంచుతూ మళ్ళీ నిబంధనలను మార్చారు. అయితే మొత్తం నిధుల్ని స్టేట్ ఆఫ్ మోంటానా జనరల్ ఫండ్‌కు మాత్రమే అందజేయాలంటూ 1995లో నిర్ణయించారు.. 5000 డాలర్లకు మించిన బహుమతి మొత్తాలకు 10 శాతం రాష్ట్ర ప్రభుత్వ పన్ను, 25 శాతం ఫెడరల్ టాక్స్ వర్తిస్తాయి. రాష్ట్రేతరులపై 39 శాతం పన్ను విధిస్తున్నారు.

## నెబ్రాస్కా లాటరీ

అమెరికాలో లాటరీలకు అనుమతి ఇచ్చిన 37వ రాష్ట్రం నెబ్రాస్కా. 1992లో ఈ రాష్ట్రంలో లాటరీలు మొదలయ్యాయి. పవర్‌బాల్, నెబ్రాస్కా పిక్ 5 అనే గేమ్‌లు ఎంతో ప్రాచుర్యం పొందాయి. నెబ్రాస్కా ప్రభుత్వం ఎం.వి.పి. క్లబ్ (మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ క్లబ్) ను నెలకొల్పింది. క్లబ్‌లో సభ్యులకు కొత్త లాటరీ గేమ్‌లు, పోటీలు, పరిశోధనలు, వాటి ఫలితాలు వంటి ప్రత్యేక సమాచారం లభిస్తుంది. లాటరీల ద్వారా ఒనగూడే నిధుల్లో ఎడ్యుకేషన్ ఇన్నొవేటివ్ ఫండ్, నెబ్రాస్కా స్కాలర్‌షిప్ ఫండ్‌లకు చెరో 24.75 శాతం నిధులు అందుతాయి. నెబ్రాస్కా ఎన్విరాన్‌మెంటల్ ట్రస్ట్ ఫండ్‌కు 49.5 శాతం. కంపల్సివ్ గేంబ్లర్స్ అసిస్టెన్స్ ఫండ్‌కు 11 శాతం నిధులు కేటాయిస్తారు. లాటరీల ద్వారా ఇప్పటివరకూ రాష్ట్ర ప్రభుత్వానికి 198 మిలియన్ డాలర్లు సమకూరాయి. నెబ్రాస్కా గేమ్ అండ్ పార్క్స్ కమిషన్స్ ఆక్వాటిక్ రిహాబిలిటేషన్ ప్రోగ్రామ్, లెవీస్ అండ్ క్లార్క్ రిజర్వాయర్, రాక్ క్రీక్ లేక్ ప్రాజెక్ట్ వంటి సంస్థలకు ఎన్విరాన్‌మెంటల్ ట్రస్ట్ ఫండ్ నిధులు అందిస్తుంది.

## న్యూ హాంప్‌షైర్ లాటరీ (ఎన్.హెచ్.ఎల్)

అమెరికాలో తొలి ఆధునిక లాటరీగా న్యూ హాంప్‌షైర్ లాటరీని చెప్పుకోవచ్చు. లాటరీలను 1800లో నిషేధించాక, మళ్ళీ తొలిసారిగా లాటరీలను ప్రారంభించిన మొదటి రాష్ట్రం న్యూహాంప్‌షైరే. ఆ రాష్ట్రంలో 1963లో లాటరీలు మళ్ళీ మొదలయ్యాయి. విద్యావసరాలకు కావలసిన నిధులను స్వీప్‌స్టేక్స్‌ద్వారా సమకూర్చుకోవచ్చని భావించిన లాటరీ ప్రతినిధి లారీ పికెట్ 1953-63 మధ్యకాలంలో ఐదుసార్లు స్వీప్‌స్టేక్స్ బిల్లును ప్రతిపాదించారు. 1963లో ఈ బిల్లును గవర్నర్ జాన్ కింగ్ ఆమోదించారు. న్యూహాంప్‌షైర్‌లో లాటరీల ద్వారా ప్రభుత్వానికి ఇంతవరకూ 856 మిలియన్ డాలర్లు సమకూరాయి. ఎన్.హెచ్.ఎల్. ఓ ప్లేయర్స్ క్లబ్‌ను కూడా నిర్వహిస్తోంది.

ఇందులోని సభ్యులకు లాటరీ గేమ్‌లకు సంబంధించిన సమాచారం ఇ-మెయిల్ ద్వారా అందుతుంది. రాష్ట్రప్రభుత్వం ప్రతి సంవత్సరం 40 నుంచి 555 ఇన్‌స్టంట్ గేమ్‌లను పరిచయం చేస్తుంది.

## న్యూ మెక్సికో లాటరీ

సెనెట్ బిల్ 853 ద్వారా 1995లో న్యూ మెక్సికో లాటరీ అథారిటీ ఏర్పాటైంది. ముందుగా స్క్రాచ్ టిక్కెట్‌లను ప్రవేశపెట్టారు. ప్రభుత్వం 1997లో రాష్ట్రవ్యాప్తంగా 200 ఇన్‌స్టంట్ టిక్కెట్ వెండింగ్ మెషీన్లను నెలకొల్పింది. లాటరీ నిధుల్లో 60 శాతం పెట్టుబడి మూలధనానికి, 40 శాతం లాటరీ ట్యూషన్ ఫండ్‌కు కేటాయించాలని నిర్ణయించారు. 2001లో లాటరీ ట్యూషన్ ఫండ్ పేరును లాటరీ సక్సెస్ స్కాలర్‌షిప్‌గా మార్చి, మొత్తం లాటరీ నిధుల్ని దీనికే ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ తరవాత ఏడాది తిరిగే సరికి లాటరీ సక్సెస్ స్కాలర్‌షిప్ 22,000మంది విద్యార్థులకు లబ్ధి చేకూర్చింది. కాలేజీ లేదా యూనివర్శిటీలో చదువుకోవాలనుకునే న్యూ మెక్సికో విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్‌లు అందుతున్నాయి.

## న్యూయార్క్ లాటరీ

న్యూయార్క్ లాటరీ ద్వారా వచ్చిన ఆదాయాన్నంతా విద్యాభివృద్ధికే ఖర్చు చేయాలని న్యూయార్క్ రాజ్యాంగం ఆదేశిస్తోంది. లాటరీ ఆదాయం జనరల్ ఫండ్‌కు వెళుతుంది. ప్రభుత్వ అధీనంలోని పాఠశాలలకు జనరల్‌ఫండ్ నిధులను కేటాయిస్తుంది. న్యూయార్క్‌లోని కాలేజీలు, యూనివర్శిటీల్లో ఉన్నత విద్యాభ్యాసం చేయాలనుకునే గ్రాడ్యుయేట్లకు 'రేపటి న్యూయార్క్ నాయకుల స్కాలర్‌షిప్‌లు' పేరిట ఆర్థిక సహాయం అందజేస్తుంది. అలాగే ఎంపైర్ స్టేట్ గేమ్‌ల నిర్వహణకు కూడా న్యూయార్క్ లాటరీ ఆర్థికంగా చేయూతనిస్తుంది. సబ్‌స్క్రిప్షన్‌పై లోటో గేమ్ ఆడే అవకాశాన్ని కూడా ప్రభుత్వం కల్పిస్తోంది. దీనిపై 7.7 శాతం రాష్ట్ర ప్రభుత్వ పన్ను, 25 శాతం ఫెడరల్ పన్ను వర్తిస్తాయి.

రాష్ట్రేతరులు 30 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వం నిర్వహించే లాటరీల్లో క్విక్ డ్రా మినహా దేనిలో పాల్గొనాలన్నా 18 ఏళ్ళకు మించి వయసున్న వారే అర్హులు. క్విక్ డ్రాలో పాల్గొనేందుకు కనీస వయోపరిమితి 21 ఏళ్ళు.

## నార్త్ డకోటా లాటరీ (ఎన్.డి.ఎల్.)

వివిధ రాష్ట్రాలు నిర్వహించే లాటరీ గేమ్‌లలో రాష్ట్ర ప్రజలు పాల్గొనేందుకు వీలు కల్పిస్తూ నార్త్ డకోటా ప్రభుత్వం 2002లో రాజ్యాంగాన్ని సవరించింది. ఎన్.డి.ఎల్. లోగోను డిజైన్ చేసేందుకు ప్రభుత్వం కాలేజీలు, యూనివర్శిటీలకు చెందిన విద్యార్థులమధ్య పోటీ నిర్వహించింది. అత్యుత్తమంగా రూపొందించిన కొందరు విద్యార్థుల లోగోల ఆధారంగా ఓ లోగోను తయారు చేసింది. ఎన్.డి.ఎల్. ముందుగా 2004లో పవర్‌బాల్ గేమ్‌ను ప్రవేశపెట్టింది. ఈ గేమ్‌ను ప్రవేశపెట్టిన 30 నిమిషాలకే సెకనుకు రెండు చొప్పున మొత్తం టిక్కెట్లన్నీ అమ్ముడుపోయాయి. రెండు నెలల తరవాత హాట్ లోటో గేమ్‌ను ప్రారంభించారు. ఒకే ఆటగాడు అనేక డ్రాలకోసం టిక్కెట్‌ను కొనుగోలు చేసే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. ఉదాహరణకు వరుసగా తొమ్మిది డ్రాలకు పనికొచ్చే టిక్కెట్‌ను ఆటగాడు కొనుగోలు చేయవచ్చు. మార్చి 2004నుంచి ఇప్పటివరకూ ఎన్.డి.ఎల్. 5.3 మిలియన్ డాలర్ల ఆదాయాన్ని సంపాదించింది.

## ఓరెగాన్ లాటరీ

ఓరెగాన్ లాటరీ 1984లో ప్రారంభమైంది. తమ రాష్ట్రంలో లాటరీ ప్రారంభించాలన్న ప్రభుత్వ నిర్ణయానికి 66 శాతం మంది ప్రజలు ఆమోదం తెలిపారు. తొలుత బ్రేక్ ఈవెన్ గేమ్‌లను ప్రభుత్వం ప్రారంభించింది. వాటికి లభించిన ఆదరణను చూశాక బ్రేక్ ఈవెన్ గేమ్స్ సంఖ్యను 30 వరకూ పెంచింది. ఆ తరువాత కెనో, మెగాబక్స్, స్క్రాచెస్, పవర్‌బాల్, విన్ ఫర్ లైఫ్‌వంటి గేమ్‌లను ప్రవేశపెట్టింది. 1989లో ఫుట్‌బాల్ స్పోర్ట్స్ ఏక్షన్ టిక్కెట్ల అమ్మకాలను ప్రారంభించింది. దేశంలోనే క్రీడలపై నిర్వహించిన మొట్టమొదటి

లాటరీ గేమ్ ఇది. దీనిపై వచ్చిన లాభాల్లో 12 శాతం నిధులను చదువులో ప్రతిభ కనబరిచిన వారికి, 88 శాతం నిధులను ఆటల్లో ప్రతిభ కనబరిచిన వారికి స్కాలర్‌షిప్‌లుగా అందజేస్తున్నారు. రాష్ట్రంలో 1992లో వీడియో లాటరీ ప్రారంభమైంది. మొదట్లో లాటరీల ద్వారా వచ్చిన లాభాలను ఓరెగాన్ పాఠశాలలకే కేటాయించేవారు. ఆ తరవాత ఈ నిధులను విద్యాభివృద్ధితోపాటు ఆర్థికాభివృద్ధికీ  కేటాయిస్తున్నారు. ఇందులోభాగంగా స్టేట్ స్కూల్ ఫండ్, ఎడ్యుకేషన్ ఎండోమెంట్/ స్టెబిలిటీ ఫండ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ఇంటర్‌కాలేజియేట్ అథ్లెటిక్స్/ అకడెమిక్ స్కాలర్‌షిప్స్ వంటివాటికి లబ్ధి చేకూరుతోంది. 1990లో నిర్వహించిన క్రీడలు, పబ్లిక్ గేమింగ్ ఎక్స్‌పోలో ఓరెగాన్ లాటరీ నిర్వహణకు పయొనీర్ అవార్డు లభించింది.

## పెన్సిల్వేనియా లాటరీ

పెన్సిల్వేనియా లాటరీ 1971లో ఏర్పాటైంది. ఆ మరుసటి సంవత్సరం 50 సెంట్ల టిక్కెట్ ధరతో మొదటి లాటరీ గేమ్‌ను ప్రవేశపెట్టారు. రబ్ ఆఫ్ పేరిట ఓ ఇన్‌స్టంట్ గేమ్‌ను 1975లో మొదలుపెట్టారు. జనాలు ఎగబడి టిక్కెట్లు కొనడాన్ని గమనించిన ప్రభుత్వం ఆ తరవాత వరుసగా 30కి పైగా స్క్రాచ్ గేమ్‌లను ప్రవేశపెట్టింది. డైలీ నంబర్, 3డి గేమ్‌లు 1977లో మొదలయ్యాయి. బిగ్ 4, పెన్సిల్వేనియా లోటో, కీస్టోన్ జాక్‌పాట్ వంటి గేమ్‌లకు పెన్సిల్వేనియాలో ఆదరణ లభిస్తోంది. వారం వారం రిటైలర్ల అకౌంట్లను సెటిల్ చేసే ఉద్దేశంతో ప్రభుత్వం 1985లో నిధుల బదలాయింపునకు ఎలక్ట్రానిక్ వ్యవస్థను నెలకొల్పింది. ఇన్‌స్టంట్ టిక్కెట్ వెండింగ్ మెషీన్లను 1993లో నెలకొల్పింది. దీంతో టిక్కెట్ల అమ్మకాలు ఊపందుకున్నాయి.

పెన్సిల్వేనియా లాటరీ సంస్థ మొదలయ్యాక  ఇంతవరకూ వివిధ అభివృద్ధి కార్యక్రమాల అమలుకోసం 13.8 బిలియన్ డాలర్లను అందజేసింది. సీనియర్

సిటిజన్లకోసం మాస్ ట్రాన్సిట్ ప్రోగ్రామ్‌ను అమలు చేసేందుకు రవాణా శాఖకు 120. 82 మిలియన్ డాలర్లను అందజేసింది. తక్కువ ధరలకు ఔషధాలను అందించే 'పేస్', 'పేస్‌నెట్' పథకాల అమలుకోసం 395 మిలియన్ డాలర్ల సహాయాన్ని అందించింది. సీనియర్ సిటిజన్లకోసం ఉద్దేశించిన 650 కమ్యూనిటీ సెంటర్ల నిర్వహణకోసం 204. 98 మిలియన్ డాలర్లను వెచ్చించింది. ఈ సెంటర్లలో 200,000 మంది వృద్ధులకు ఉచిత భోజనం లభిస్తోంది.

## సౌత్ కరొలినా ఎడ్యుకేషన్ లాటరీ (ఎస్.సి.ఇ.ఎల్.)

సౌత్ కరోలినా ప్రభుత్వం లాటరీల ద్వారా లభించే మొత్తం ఆదాయాన్ని విద్యాసౌకర్యాల కల్పనకే వినియోగిస్తోంది. అందువల్లనే ఈ లాటరీకి ఎడ్యుకేషన్ లాటరీ అని పేరు పెట్టింది. లాటరీని నిర్వహించేది ఎస్.సి.ఇ.ఎల్. అయితే, లాటరీల ద్వారా లభించే వనరులను సౌత్ కరొలినా ఉన్నత విద్యా కమిషన్ పంపిణీ చేస్తుంది. పాల్మెటో ఫెలోస్ స్కాలర్‌షిప్‌లు, లైఫ్ స్కాలర్‌షిప్‌లు, సౌత్ కరొలినా హోప్ స్కాలర్‌షిప్‌లు వంటివి ఈ కమిషన్ అందిస్తుంది. టీచర్ల జీతభత్యాలకోసం, కొత్త టీచర్ల నియామకాలకోసం ఈ నిధుల్ని వెచ్చించరాదని చట్టాలు స్పష్టం చేస్తున్నాయి. సౌత్ కరొలినా ఎడ్యుకేషన్ లాటరీ ష్రింప్ అండ్ గ్రిట్స్, కరొలినా మిలియనీర్, క్యాష్ బొనాంజా వంటి ఇన్‌స్టంట్ గేమ్‌లను ఆఫర్ చేస్తోంది. క్యాష్ బొనాంజా గేమ్‌లో రెండో ఛా న్స్ డ్రాలు కూడా ఉంటాయి. ఇటీవల స్థానిక కళాకారులతో కలసి ప్రభుత్వం ఆర్టిస్ట్ సీరీస్ అనే పేరుతో ఇన్‌స్టంట్ టిక్కెట్ల సీరీస్‌ను ప్రవేశపెట్టి విక్రయించింది.

## సౌత్ డకోటా లాటరీ

తమ రాష్ట్రంలో లాటరీలకోసం 60 శాతంమంది సౌత్ డకోటా ప్రజలు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో 1987లో సౌత్ డకోటా లాటరీ మొదలైంది. ప్రభుత్వం 1989లో వీడియో లాటరీని మొదలుపెట్టింది. ఇప్పటికీ ఈ లాటరీ దిగ్విజయంగా నడుస్తోంది. స్క్రాచ్ గేమ్‌ల ద్వారా 55 మిలియన్ డాలర్ల

ఆదాయం సమకూరింది. ఈ డబ్బు స్టేట్ జనరల్ ఫండ్‌లో జమ అయింది. పాఠశాలల నిర్వహణ, వైద్య, ఆరోగ్య సేవలకోసం, సామాజిక పథకాల నిర్వహణకోసం ఈ నిధులు ఉపయోగపడుతున్నాయి. వీడియో లాటరీ ద్వారా 1989నుంచి ఇప్పటివరకూ లభించిన మొత్తం ఆదాయం 990 మిలియన్ డాలర్లు. లోటో గేమ్‌ను 1990లో ప్రవేశపెట్టారు. ఈ గేమ్ ద్వారా 43 మిలియన్ డాలర్లు ఇప్పటివరకూ సమకూరాయి. ఈ నిధులను కేపిటల్ కన్‌స్ట్రక్షన్ ఫండ్‌లో జమ అవుతాయి. ఈ నిధులను అభివృద్ధి పథకాలకు, ఇథనాల్ ఉత్పత్తికి, హైవే ప్రాజెక్టులకు వెచ్చిస్తారు. ప్రభుత్వం నాలుగు లోటో గేమ్‌లను నిర్వహిస్తోంది. అలాగే పవర్‌బాల్, వైల్డ్ కార్డ్ 2, హాట్ లోటో అనే మూడు బహుళ రాష్ట్రాల లాటరీ గేమ్‌లను కూడా నిర్వహిస్తోంది. డకోటా క్యాష్ పేరుతో 5/35 లోటో కూడా నడుస్తోంది. ఇన్‌స్టంట్ గేమ్‌ల ధరలు ఒక డాలర్‌నుంచి 10 డాలర్ల వరకూ ఉంటాయి. బహుమతులు ఒక డాలర్‌నుంచి 150,000 డాలర్ల వరకూ ఉంటాయి.

## టెన్నెసీ లాటరీ

లాటరీలపై టెన్నెసీ రాష్ట్రంలో 2002లో జరిగిన ఓ రెఫరెండంలో 58 శాతం మంది ప్రజలు లాటరీలకు అనుకూలంగా తీర్పునిచ్చారు. లాటరీ ఆపరేటర్‌గా టెన్నెసీ ఎడ్యుకేషన్ లాటరీ కార్పొరేషన్ వ్యవహరిస్తోంది. లాటరీ నిధులను ఉన్నత విద్యాభ్యాసం చేయాలనుకునే విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లుగా అందిస్తున్నారు.

## టెక్సాస్ లాటరీ

టెక్సాస్ లాటరీ సంస్థను 1991లో నెలకొల్పారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ రకాల లాటరీ గేమ్‌లను నడుపుతున్నా, బింగో అనే గేమ్‌ను మాత్రం ప్రత్యేకంగా సామాజిక కార్యక్రమాలకు నిధులు సేకరించే నిమిత్తం నిర్వహిస్తున్నారు. ఈ గేమ్ నిర్వహణకు ఛారిటబుల్ బింగో డివిజన్ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తోంది.

టెక్సాస్‌లో లాటరీలు మొదలయ్యాక ఇప్పటివరకూ వివిధ రకాల గేమ్‌ల నిర్వహణ ద్వారా సమకూరిన నిధుల్లో 6 బిలియన్ డాలర్లను ఫౌండేషన్ స్కూల్ ఫండ్‌కు జమ చేయడం విశేషం.

## ఆఫ్రికన్ దేశాలు

మొజాంబిక్‌లో ఎంప్రెసా డె లోటరియాస్ ఎ అపోస్టాస్ మ్యుటుయాస్ డె మొకాంబిక్ టోటో- లోటో అనే సంస్థ స్పోర్ట్స్ టోటో అనే లాటరీ గేమ్‌ను నిర్వహిస్తోంది.

ఉగాండాలో డెఫారీ టెక్నాలజీ అండ్ డెవలప్‌మెంట్ కంపెనీ ఆఫ్ బీజింగ్ అనే సంస్థతో కలసి ప్రభుత్వం సంయుక్తంగా లాటరీల నిర్వహణకోసం ఉగాండ లాటరీ సంస్థను 2003లో ప్రారంభించింది. ఏడాది తరవాత నష్టాలు వస్తున్నాయనే కారణంతో సదరు కంపెనీ సంయుక్త భాగస్వామ్యంనుంచి తప్పుకుంది. దరిమిలా ప్రభుత్వం 2004లో వీడియో లాటరీని మొదలుపెట్టింది.

జాంబియాలో లాటరీ మేనేజ్‌మెంట్ కంపెనీ ఆఫ్ జాంబియా 2001లో ఏర్పాటైంది. ఆరంభంలో క్వచామానియా బిగ్ బాంగ్ పేరిట లోటో గేమ్‌ను ప్రవేశపెట్టింది. జాంబియా మార్కెట్‌కు తగినట్టుగా ఈ గేమ్‌లో మార్పులు చేర్పులు చేశారు.

అల్జీరియాలో లాటరీ పేరు కూడా అల్జీరియానే. దీనిని పారి స్పోర్టిఫ్ అల్జీరియన్ అనే లాటరీ ఆపరేటర్ నిర్వహిస్తోంది. అనేక రకాల ఇన్‌స్టంట్ గేమ్‌లను, లోటో / స్పీల్ గేమ్‌లను, స్పోర్ట్స్ టోటోను ఈ సంస్థ ఆఫర్ చేస్తోంది.

మొరాకోలో నేషనల్ లాటరీ ఆఫ్ మొరాకో లోటో / స్పీల్ గేమ్‌లను, నంబర్ గేమ్‌లను, కెనో గేమ్‌ను ఆఫర్ చేస్తోంది. 'టోటో పారి స్పోర్టిఫ్' అనే స్పోర్ట్స్

లాటరీని 1962లో ప్రారంభించింది. ఆ తరవాత 1995లో ఈ గేమ్ పేరును 'లా టోటో ఫుట్ మర్కైన్ డెస్ జియుక్స్ ఎట్ డెస్ స్పోర్ట్స్'గా మార్చింది. మొరాకోలో సూపర్‌మ్యాచ్, ఫూజ్, ఫార్చ్యూన్, ఖ్మోయిసా, బ్రేవో వంటి గేమ్‌లు నడుస్తున్నాయి. 2001లో లాటరీ టిక్కెట్ల అమ్మకాల ద్వారా 231.3 మిలియన్ దిర్‌హామ్‌ల ఆదాయం లభించింది.

బెనిన్‌లో లోటెరీ నేషనేల్ డు బెనిన్ పేరిట లాటరీల నిర్వహణకు ఓ సంస్థను 1967లో స్థాపించారు. ఇది ఇన్‌స్టంట్ గేమ్‌లను, స్పోర్ట్స్ టోటో గేమ్‌ను ఆఫర్ చేస్తోంది. 2001లో ఈ సంస్థ ఎనిమిది బిలియన్ ఫ్రాంక్‌ల ఆదాయాన్ని సముపార్జించింది.

బుర్కినా ఫాసోలో లోటెరీ నేషనేల్ బుర్కినబె అనే సంస్థను 1967లో నెలకొల్పారు. ఇది ఇన్‌స్టంట్ గేమ్‌లను, స్పీల్, స్పోర్ట్స్ టోటోను ఆఫర్ చేస్తోంది. 2001లో ఈ సంస్థ 2.5 బిలియన్ స్థానిక కరెన్సీని సంపాదించింది.

ఐవరీ కోస్ట్‌లో లాటరీల నిర్వహణకు నేషనేల్ డె కోటె డి ఐవరీ అనే సంస్థ 1970లో ఏర్పాటైంది. 2002లో ఈ సంస్థ ఆదాయం సి.ఎఫ్.ఎ. 5.5 బిలియన్ ఫ్రాంకులు.

గాంబియాలో లాటరీ ఆపరేటర్ పేరు గాంబియా నేషనల్ లాటరీ. ఇది అభివృద్ధి కార్యక్రమాల అమలులో ప్రభుత్వానికి అండదండలు అందిస్తోంది. లాటరీలపై వచ్చిన లాభాలను అభివృద్ధి పథకాలకు కేటాయిస్తోంది.

నైజెర్‌లో లాటరీలు 1993లో ప్రారంభమయ్యాయి. లాటరీ ఆపరేటర్‌గా ఉన్న లోటెరీ నేషనేల్ డు నైజర్ (లొనాని) రకరకాల ఇన్‌స్టంట్ గేమ్‌లను ఆఫర్ చేస్తోంది.

నైజీరియాలో నేషనల్ స్పోర్ట్స్ లాటరీని 2001లో స్థాపించారు. దేశంలో

క్రీడలను అభివృద్ధి చేసే లక్ష్యంతో లాటరీలకు శ్రీకారం చుట్టారు. నేషనల్ స్పోర్ట్స్ లాటరీ తరపున ఏకైక ఏజెంట్‌గా కింగ్ అండ్ జార్జి (నైజీరియా) లిమిటెడ్ అనే ఫుట్‌బాల్ పూల్స్ కంపెనీ వ్యవహరిస్తోంది.

సెనెగల్ 1982లో లాటరీ కార్యకలాపాలను ప్రారంభించింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన లోటెరీ నేషనల్ సెనెగలైజ్ అనే ఆపరేటర్ వివిధ ఇన్‌స్టంట్ గేమ్‌లను, లోటో / స్పీల్ గేమ్‌లను, స్పోర్ట్స్ టోటో వంటి గేమ్‌లను ఆఫర్ చేస్తోంది. ఈ సంస్థ టర్నోవర్ 2003లో 52 మిలియన్ డాలర్లు. ఈ సంస్థను ప్రైవేటీకరించాలని ప్రభుత్వం యోచిస్తోంది.

సియర్రా లియోన్ 2001లో బింగో గేమ్‌ను ప్రవేశపెట్టింది. తద్వారా వచ్చిన లాభాలను 2002లో కన్నాట్ అండ్ ప్రిన్స్ క్రిస్టియన్ మెటర్నిటీ ఆస్పత్రికి, నేషనల్ స్కూల్ ఆఫ్ నర్సింగ్‌కు అందజేసింది. అలాగే కాలేజ్ ఆఫ్ మెడిసిన్ అండ్ అలైడ్ హెల్త్ సైన్స్ సంస్థకు 30,500,000 లియోన్లను విరాళంగా ఇచ్చింది.

## ఆసియా దేశాలు

కొరియాలో ఆన్‌లైన్ లాటరీ గేమ్‌ల ఆపరేటర్‌గా కొలొట్టొ అనే సంస్థ వ్యవహరిస్తోంది. ఇది స్ట్రైక్ ఇట్ రిచ్, బ్లాక్‌జాక్, స్లాట్, పోకర్ అనే నాలుగు ఇన్‌స్టంట్ గేమ్‌లను ఆఫర్ చేస్తోంది. కొరియా లాటరీలకు ఆపరేటర్‌గా ఉన్న కొరియా లాటరీ సర్వీసెస్ లాటరీలపై వచ్చిన ఆదాయాన్ని నిర్మాణం, రవాణా మంత్రిత్వ శాఖకు, సాంస్కృతిక మంత్రిత్వ శాఖకు అందజేస్తోంది. సంక్షేమ పథకాల అమలుకు కూడా నిధులను వెచ్చిస్తోంది.

1989లో ఏర్పాటైన సియోల్ ఒలింపిక్ స్పోర్ట్స్ ప్రమోషన్ ఫౌండేషన్ లాటరీల ద్వారా లభించిన ఆదాయాన్ని నేషనల్ స్పోర్ట్స్ ప్రమోషన్ ఫండ్‌కు అందజేస్తోంది. స్పోర్ట్స్ టోటోతోపాటు ఇతర స్పోర్ట్స్ గేమ్‌లను, ఇన్‌స్టంట్ అథ్లెటిక్ గేమ్‌లను

ఈ సంస్థ ఆఫర్ చేస్తోంది. బుసాన్ ఆసియా క్రీడలు, ప్రపంచ కప్ నిర్వహణకు లాటరీ నిధులు ఉపయోగపడ్డాయి. సుమారు పది ప్రభుత్వ, ప్రైవేటు లాటరీ ఆపరేటర్లు కలసి 2002లో కన్సార్టియమ్‌గా ఏర్పడ్డాయి. దీనికి కూక్‌మిన్ బ్యాంక్ నాయకత్వం వహిస్తోంది. క్రీడలపై బెట్టింగ్ గేమ్‌లను టైగర్ పూల్స్ అనే ఆపరేటర్ నిర్వహిస్తోంది.

తైవాన్‌లో 'పబ్లిక్ - ఇంటరెస్ట్ ' పేరిట లాటరీ సంస్థ 2002లో ఏర్పాటైంది. ఆర్థిక మంత్రిత్వ శాఖ తరపున తైపీ బ్యాంక్ లాటరీ గేమ్‌లను నిర్వహిస్తోంది. ప్రభుత్వం పాసివ్ గేమ్‌లను, ఇన్‌స్టంట్ గేమ్‌లను, 6/42 ఆన్‌లైన్ లోటోను నిర్వహిస్తోంది. స్పోర్ట్స్ లాటరీలను ప్రారంభించాలని ప్రభుత్వం యోచిస్తోంది. 174కు పైగా ప్రధాన బహుమతి విజేతలు ఇప్పటివరకూ 98కి పైగా స్వచ్ఛంద సంస్థలకు 257 మిలియన్ డాలర్ల ఆర్థిక సహాయాన్ని అందించాయి. చిన్న మొత్తాల్లో బహుమతులు గెలుచుకున్న విజేతలు కూడా ఎంతోకొంత డబ్బును స్వచ్ఛంద సంస్థలకు విరాళంగా ఇవ్వడం ఆనవాయితీ.

ఫిలిప్పీన్స్‌లో 1935లో ఫిలిప్పీన్స్ ఛారిటీ స్వీప్‌స్టేక్స్ ఆఫీస్ (పి.సి.ఎస్.ఓ.) ఏర్పాటైంది. ఇది పాసివ్‌గేమ్‌లను ఆఫర్ చేస్తోంది. లాటరీలపై వచ్చే ఆదాయంలో 30 శాతం స్వచ్ఛంద సంస్థలకు కేటాయిస్తారు. ఫిలిప్పీన్స్ అమ్యూజ్‌మెంట్ అండ్ గేమింగ్ కార్పొరేషన్ (పి.ఏ.జి.ఓ.) 1984లో ప్రారంభమైంది. దీనిపై వచ్చే లాభాల్లో అధిక మొత్తాన్ని ప్రెసిడెంట్స్ సోషల్ ఫండ్, ఫిలిప్పీన్స్, స్పోర్ట్స్ కమిషన్‌లతోపాటు విద్య, వైద్య, శాస్త్ర, సాంకేతిక రంగాలకు కేటాయిస్తున్నారు. పి.సి.ఎస్.ఓ, పి.ఏ.జి.ఓ.లు రెండూ ప్రభుత్వ అధీనంలోనే ఉన్నాయి. వీటిని 2002లో సాంఘిక సంక్షేమ, అభివృద్ధి శాఖ కార్యదర్శి పరిధిలోకి తీసుకువచ్చారు. మొదట్లో ఇవి నేరుగా అధ్యక్షుడి నియంత్రణలో ఉండేవి.

వియత్నాంలో లాటరీ గేమ్‌లను కన్‌స్ట్రక్షన్ లాటరీ ఆఫ్ ది కేపిటల్ - హనోయి

వియత్నాం ( సి.ఎల్.సి.హెచ్), సాంగ్ బె లాటరీ కంపెనీ (ఎస్.బి.ఎల్.సి.) నిర్వహిస్తున్నాయి. వియత్నాం సి.ఎల్.సి. హెచ్. పిక్ 2, పిక్ 3తోపాటు ఇన్‌స్టంట్ గేమ్‌లను కూడా నిర్వహిస్తోంది. ఈ సంస్థ 220 ట్రిలియన్ డాంగ్‌లు సముపార్జించినట్లు అంచనా. ఎస్.బి.ఎల్.సి. ఆన్‌లైన్ లాటరీల నిర్వహణకోసం కెనడాకు చెందిన ఓ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంది.

టర్కీలో ప్రభుత్వం టర్కిష్ నేషనల్ లాటరీని నడుపుతోంది. దీనినే స్థానిక భాషలో మిల్లీ పియాంగో ఇదరెసి అంటారు. దీనిని త్వరలో ప్రైవేటీకరించనున్నారు.

## ఐరోపా లాటరీలు

బల్గేరియాలో లాటరీ ఆపరేటర్ పేరు స్పోర్ట్స్ టోటలైజేటర్. దీని ఆధ్వర్యంలో లోటో, స్పోర్ట్స్ బెట్టింగ్, ఇతర గేమ్‌లు నడుస్తున్నాయి. ఇవన్నీ క్రీడల అభివృద్ధికోసం ఉద్దేశించినవే కావడం విశేషం.

లిథువేనియాలో లాటరీ ఆపరేటర్ అయిన ఒలిఫెగా ఇన్‌కార్పొరేషన్ టెలెలోటో, టుజినాస్, కెనొలాటో, కాస్ లైమెస్ మిలిజోనా, జెగా -2 అనే లాటరీ గేమ్‌లను నిర్వహిస్తోంది.

పోలండ్‌లో టోటలైజేటర్ స్పోర్టొ వీస్పోల్కా పేరిట లాటరీ ఆపరేటర్ డూజీ లోటెక్, ఎక్స్‌ప్రెస్ లాటరీ, జక్లడీ స్పెక్జల్నె, మల్టీ లోటెక్, ట్వోజ్ జెస్లివీ న్యుమెరిక్ వంటి గేమ్‌లను నడుపుతోంది. ప్రభుత్వ అధీనంలోనే పనిచేస్తున్న పోల్స్కీ మోనోపోన్ లాటెరిజ్నీ స్పోల్కా ఆధ్వర్యంలో బ్రేక్- ఓపెన్, స్క్రాచ్ గేమ్‌లు నడుస్తున్నాయి.

రష్యన్ ఫెడరేషన్‌లో ప్రెస్ లోటో సంస్థకు లాటరీలను నిర్వహించేందుకు నేషనల్ లాటరీ లైసెన్స్ ఉంది. ఈ సంస్థలో యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్‌కు,

రగ్బీ నేషనల్ కార్పొరేషన్‌కు సమాన వాటాలు ఉన్నాయి. లాటరీల ద్వారా పది బిలియన్ రూబుళ్ళ వార్షికాదాయం లభిస్తోంది.

స్లొవేనియాలో స్పోర్ట్‌నా లాటెరిజా అనే ఆపరేటర్ లాటరీలను నిర్వహిస్తోంది.

ఉక్రెయిన్‌లో ఉక్రెనియన్ నేషనల్ లాటరీ, మొలొడ్‌స్పోర్ట్‌లోటో అనే రెండు ఆపరేటర్ల ఆధ్వర్యంలో లాటరీలు నడుస్తున్నాయి.

ఎస్టోనియాలో ప్రభుత్వ ఆధ్వర్యంలో లాటరీలు నడుస్తున్నాయి. యుఎస్ఎస్ఆర్ స్టేట్ కమిటీ ఫర్ ఫిజికల్ కల్చర్ అండ్ స్పోర్ట్స్ నేతృత్వంలో 1971నుంచీ లాటరీలను నిర్వహిస్తున్నారు. యుఎస్ఎస్ఆర్ విచ్ఛిన్నమయ్యాక 1991లో ఎస్టోనియన్ లాటరీ ఏర్పాటైంది. ఇది ఇన్‌స్టంట్ గేమ్‌లను, లోటో, కెనో, బింగో వంటి అనేక గేమ్‌లను ఆఫర్ చేస్తోంది. కళలు, విద్య, క్రీడా, విజ్ఞాన రంగాలకు లాటరీ నిధులు అందుతున్నాయి.

ఫిన్‌లాండ్‌లో ఓయె వీక్కాస్ ఎబ్ అనే లాటరీ సంస్థ 1940 లో ఏర్పడింది. ఈ లాటరీ ఆపరేటర్ లోటో, బింగో, టీవీ గేమ్‌లు, ఫుట్‌బాల్ పూల్స్, బెట్టింగ్ గేమ్స్, అఫ్‌ట్రాక్ హార్స్ బెట్టింగ్ గేమ్‌లు, ఇన్‌స్టంట్ గేమ్‌లను ఆఫర్‌చేస్తోంది. కళలు, క్రీడలు, యువజన వ్యవహారాలు, శాస్త్ర, సాంకేతిక రంగాలకు లాటరీ నిధులు అందుతున్నాయి.

ఐస్‌లాండ్‌లో లాటరీలను మూడు ప్రధాన ఆపరేటర్లు నిర్వహిస్తున్నాయి.

లాట్వియాలో లాట్విజాస్ లోటో అనే ఆపరేటర్ లాటరీలను నడుపుతోంది.

స్వీడన్‌లో ఒకప్పుడు ఎబి టిప్స్‌జాన్స్టట్, స్వెన్‌స్కా పెన్నింగ్‌లాటెరేట్ అనేవి అతి పెద్ద లాటరీ నిర్వహణా సంస్థలు. ఇవి 1997లో విలీనమై ఎబి స్వెన్‌స్కా స్పెల్ అనే కొత్త కంపెనీగా అవతరించాయి. ఈ సంస్థ ఇన్‌స్టంట్ లాటరీలు, డ్రా లాటరీలు, స్పీల్ గేమ్‌లు, స్పోర్ట్స్ బెట్స్, లోటో, కెనో, వీడియో లాటరీలను

నిర్వహిస్తోంది. స్వెన్స్కా స్పెల్ నిర్వహిస్తున్న గేమ్‌లలో స్ట్రిక్‌టిప్‌సెట్ అనేది అతి పురాతన స్పోర్ట్స్ గేమ్. పూల్స్ గేమ్ 1934లో ప్రారంభమైంది. ఈ గేమ్ మొదలై 70 ఏళ్ళు గడచినా పెద్దగా మార్పులు చేర్పులు జరగకపోవడం విశేషం.

క్రొయేషియాలోనూ లాటరీలు నడుస్తున్నాయి. ప్రభుత్వం తరపున వాట్స్‌కా లుట్రిజా అనే సంస్థ లాటరీలను నిర్వహిస్తుంది.

జిబ్రాల్టర్ ప్రభుత్వ లాటరీ 1947లో ఏర్పాటైంది. రెండో ప్రపంచ యుద్ధంలో అనేకమంది దేశప్రజలు ఇళ్ళను ఖాళీ చేసి తరలిపోవలసి వచ్చింది. యుద్ధానంతరం వారికోసం ఇళ్ళను నిర్మించేందుకు లాటరీల ద్వారా నిధులు సేకరించాలని ప్రభుత్వం భావించి, ఆ దిశగా వాట్స్‌కా లుట్రిజాను ప్రారంభించింది.

గ్రీస్‌లో గ్రీక్ స్టేట్ లాటరీ 1862లో మొదలైంది. సాంప్రదాయబద్ధమైన లాటరీ గేమ్‌లతోపాటు ఇన్‌స్టంట్ లాటరీలను కూడా నిర్వహిస్తోంది. గ్రీక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఫుట్‌బాల్ ప్రోగ్నోస్టిక్స్ 1959లో ప్రారంభమైంది. ఈ సంస్థ లోటో, టోటో, కెనో వంటి గేమ్‌లను, స్పోర్ట్ బెట్టింగ్ గేమ్‌లను నిర్వహిస్తోంది. ఈ సంస్థ నిర్వహించే లాటరీలపై వచ్చే ఆదాయాన్ని దేశంలో ఫుట్‌బాల్ క్రీడ అభివృద్ధికి వెచ్చిస్తారు.

ఇటలీలో లాటరీ నిర్వహణ సంస్థ కమిటటో ఒలింపికో నజియోనేల్ ఇటాలియానో (సి.ఓ.ఎన్.ఐ.) క్రీడల ఆధారిత గేమ్‌లను నిర్వహిస్తోంది. వాటిపై వచ్చే ఆదాయాన్ని వివిధ క్రీడల అభివృద్ధికి వ్యయం చేస్తోంది. లోటోమాటికా ఎస్.పి.ఎ. అనే మరో లాటరీ ఆపరేటర్‌ను 1990ను ఏర్పాటు చేశారు. ఇది లోటోతోపాటు గుర్రపు పందేలు, ఫార్ములా 101 కార్ రేసింగ్‌ల ఆధారంగా జరిగే ట్రిస్ అనే గేమ్‌ను నిర్వహిస్తోంది. అలాగే 1946లో ఏర్పాటైన సిసాల్ స్పోర్ట్ ఇటాలియా ఎస్.పి.ఎ. అనే మరో లాటరీ ఆపరేటర్ 1946లో తన

కార్యకలాపాలు ప్రారంభించింది. ఈ సంస్థ ఆధ్వర్యంలో జరిగే ఎనలోటో అనే గేమ్ ఇటలీలో ఎంతో ఆదరణ పొందింది.

మాల్టాలో ప్రభుత్వం తరపున ఏర్పాటైన లాటరీ సంస్థ ద్వారా ఆశించిన లాభాలు రాకపోవడంతో దానిని ప్రైవేటీకరించారు. నేషనల్ లాటరీ 1948లో ప్రారంభమైంది. దీనికే బిగ్ లాటరీ అని కూడా పేరు. ప్రభుత్వం లాటరీల నిర్వహణకు మాల్టికా అనే ప్రైవేటు సంస్థకు ఏడేళ్ళకు లైసెన్స్ ఇచ్చింది.

పోర్చుగల్‌లో నేషనల్ లాటరీ ఆఫ్ పోర్చుగల్ 1493లో మొదలైంది. ఐరోపాలోనే అతి ప్రాచీనమైన లాటరీగా పేరొందిన శాంటా కాసా డా మిసెరికార్డియాను నిర్వహిస్తున్నది పోర్చుగలే. లాటరీలపై వచ్చే లాభాలాను సామాజిక ప్రయోజనాలకోసం చేపట్టే పథకాలకోసం, ఆస్పత్రులు, చర్చిల నిర్మాణంకోసం వినియోగిస్తారు.

మాసిడోనియాలో లాటరీలను లోటరిజా న మాకెడోనిజా నిర్వహిస్తోంది.

ఆస్ట్రియన్ లాటరీ పేరు ఆస్టెరెష్ లాటెరీమ్ గెసింబ్. ఇది 1986లో ప్రారంభమైంది. ఫుట్‌బాల్ వంటి వివిధ క్రీడలపై బెట్టింగులను, కొన్ని రకాల నంబర్‌గేమ్‌లను, క్లాసెన్‌లోటెరీ (ఆస్ట్రియిన్ క్లాసిక్ లాటరీ), ఇన్‌స్టంట్ రబ్బెల్లోస్, బ్రేక్ ఓపెన్ బ్రీఫ్లోస్, బింగోలతోపాటు ఆన్‌లైన్ గేమ్‌లను ఈ సంస్థ నిర్వహిస్తోంది. లాటరీ ద్వారా సేకరించిన మొత్తంలో 42 శాతాన్ని బహుమతి మొత్తాలుగా అందజేస్తారు. 2002లో లాటరీ టిక్కెట్ల అమ్మకాల ద్వారా 1.3 బిలియన్ యూరోలు లభించాయి.

జర్మనీలో డచ్ క్లాసెన్‌లాటెరీ బెర్లిన్ అనే లాటరీ ఆపరేటర్ బెర్లిన్ ప్రాంతంలో అనేక రకాల డ్రా గేమ్‌లు, ఇన్‌స్టంట్ గేమ్‌లు, లోటో స్పీల్, స్పోర్ట్స్ టోటో వంటి గేమ్‌లను నిర్వహిస్తోంది. లాటరీలపై వచ్చే ఆదాయాన్ని విద్యా, శాస్త్ర,సాంకేతిక, సాంస్కృతిక క్రీడారంగాలకు అందజేస్తారు. బ్రెమెన్ ప్రాంతంలో

ఆపరేటర్ ప్రెమెర్ టోటో లాటరీల ద్వారా గడించిన ఆదాయాన్ని కళలు, సాంస్కృతిక రంగాల అభివృద్ధికి, స్వచ్ఛంద సంస్థలకు, క్రీడారంగానికి కేటాయిస్తుంది. నార్త్ రైన్‌కు చెందిన వెస్ట్‌డచ్ లాటరీ జిఎంబిహెచ్ అండ్ కో కంపెనీ లోటో, ఇన్‌స్టంట్ గేమ్‌లను ఆఫర్ చేస్తోంది. రీన్‌లాండ్‌కు చెందిన లోటో రీన్‌లాండ్-ఫాల్జ్ జిఎంబిహెచ్... లోటో, కెనో, ఆడ్‌సెట్, స్పీల్, సూపర్బ్, గ్లక్‌స్పైరల్ వంటి గేమ్‌లను నిర్వహిస్తోంది.

లక్సెంబర్గ్‌లో లాటరీ నేషనల్ ఆఫ్ లక్సెంబర్గ్ 1945లో ప్రారంభమైంది. ఇది డ్రా లాటరీలను, ఇన్‌స్టంట్ గేమ్‌లను నిర్వహిస్తూ అపారమైన లాభాలను గడిస్తోంది. ఈ లాభాలను రెడ్‌క్రాస్‌తోపాటు పలు స్వచ్ఛంద సంస్థలకు, నేషనల్ ఎమర్జెన్సీ ఫండ్‌కూ కేటాయిస్తోంది.

## లాటిన్ అమెరికా దేశాలు

అర్జెంటీనాలో రెండు లాటరీ ఆపరేటర్లు లాటరీ కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయి. వాటి పేర్లు అసోసియేషన్ డె లోటెరియాస్ క్వినీయెలాస్ వై కేసినోస్ ఎస్టేటలెస్, లోటెరియా నాసియోనల్ సొసీడాడ్ డెల్ ఎస్టడో. ఇవి స్పీల్ గేమ్‌లను, నంబర్ గేమ్‌లను, పాసివ్ గేమ్‌లను, స్పోర్ట్స్ గేమ్‌లను, ఓ లోటో గేమ్‌నూ, ఇన్‌స్టంట్ గేమ్స్‌ను ఆఫర్ చేస్తున్నాయి.

అరూబా లాటరీ 1992లో మొదలైంది. ఇది 1999లో ఆన్‌లైన్ గేమ్‌లను ప్రవేశపెట్టింది. లోటో పా డెపోర్ట్, కటోచి ప్రో డిపోర్ట్, లోటో డి డియా, రాస్పా వంటి గేమ్‌లను కూడా ఆఫర్ చేస్తోంది. అరూబాలో క్రీడారంగానికి మాత్రమే లాటరీ నిధులు గుండుగుత్తగా దక్కుతున్నాయి.

బార్బడోస్‌లో లాటరీస్ ఆఫ్ ఒలింపియో, బార్బడోస్ టర్ఫ్ క్లబ్ విలీనమై బార్బడోస్ లాటరీగా ఏర్పడ్డాయి. ఇది డబుల్ డ్రా, మెగా 6, నఫ్ క్యాష్, పవర్ ప్లే, లోటో, ఈజీ పికిన్, క్విక్ డ్రా అనే గేమ్‌లను ఆఫర్ చేస్తోంది.

బార్బడోస్ ఒలింపిక్ అసోసియేషన్, బార్బడోస్ టర్ఫ్ క్లబ్, బార్బడోస్ నేషనల్ స్పోర్ట్స్ కౌన్సిల్, నేషనల్ కల్చరల్ ఫౌండేషన్ వంటి సంస్థలకు లాటరీ నిధుల రూపేణా ఆర్థిక సహాయం అందుతోంది.

బొలీవియాలో లోటెరియా నేసియోనల్ డె బెన్‌ఫిసెన్సియా వై సాలుబ్రిడాడ్ అనే లాటరీ ఆపరేటర్ లోటో, పాసివ్, నంబర్ గేమ్‌లను ఆఫర్ చేస్తోంది.

బ్రెజిల్‌లో లాటరీని కైక్సా ఎకనోమికా ఫెడరల్ డిపార్ట్‌మెంటో డె అడ్మినిస్ట్రాకే డె లోటరియాస్ అనే ఆపరేటర్ నిర్వహిస్తోంది. ఈ సంస్థ లోటో, ఇన్‌స్టంట్ గేమ్‌లు, డ్రా గేమ్‌లు, స్పోర్ట్ బెట్టింగ్ గేమ్‌లను ఆఫర్ చేస్తోంది. లాటరీ నిధులు విద్య, కళా, సాంస్కృతిక, క్రీడా రంగాలకు చేయూతనందిస్తున్నాయి.

చిలీలో లోటెరియా డె కాన్సెప్సియాన్ అనే సంస్థ పాసివ్, ఇన్‌స్టంట్ లాటరీ గేమ్‌లను నడుపుతోంది. కెనో, లోటో వంటి గేమ్‌లకు కూడా చిలీలో విశేష ఆదరణ లభిస్తోంది.

కొలంబియాలో ఫెడెల్కో, కొలంబియా లోటెరియా డె బోగోటా, లాటెరియా డె మెడెల్లిన్ అనేవి లాటరీ ఆపరేటర్లు.

కోస్టారికాలో జుంటా డె ప్రొటెక్షన్ డె శాన్‌జోస్ అనే లాటరీ నిర్వాహక సంస్థ ఆధ్వర్యంలో లాటరీలు నడుస్తున్నాయి. 2002లో ఈ సంస్థ 41.9 బిలియన్ కాలాన్ల ఆదాయాన్ని సంపాదించింది.

ఈక్వడార్‌లో జుంటా డె బెనిఫిసెన్సియా డె గుయాక్విల్, ఎల్ సాల్వడార్ సోటెరియా నేషనల్ డె బెనిఫిసెన్సియా అనే ఆపరేటర్ల నేతృత్వంలో ప్రభుత్వ లాటరీలు నడుస్తున్నాయి.

ప్యూర్టోరికాలో లాటరీ నిర్వాహక సంస్థ లోటెరియా ఎలక్ట్రానికా లేదా ఎలక్ట్రానిక్ లాటరీ ఆఫ్ ప్యూర్టోరికా 1989లో ఏర్పాటైంది. ఇది 3డి, లోటో

గేమ్‌లను ఆఫర్ చేస్తోంది. ఆర్థికంగా వెనుకబడిన వృద్ధులకు లాటరీ నిధుల ద్వారా సహాయం అందిస్తోంది. మున్సిపాలిటీలకు, అనేక ప్రభుత్వ పథకాలకు కూడా లాటరీలు అండదండగా నిలుస్తున్నాయి.

ఉరుగ్వేలో లాటరీ ఆపరేటర్ పేరు బంకా క్యుబీర్టా కలెక్టివా డె క్వినీలాస్ డె మోంటెవిడియో (బి.సి.సి.క్యు.). ఇది ప్రభుత్వ నియంత్రణలో పనిచేసే ప్రైవేటు సంస్థ. అమ్మకాలపై కొంత నిర్దిష్ట మొత్తం ఈ సంస్థకు వెళుతుంది. ఇది 5/36 లోటో, 5/44 లోటో, క్వినీలా అనే నంబర్ గేమ్‌ను, తొంబోలా అనే కెనో గేమ్‌ను నిర్వహిస్తోంది.

వర్జిన్ ఐలాండ్స్ లాటరీ 1957లో ఏర్పాటైంది. ఇది పాసివ్, ఇన్‌స్టంట్ గేమ్‌లను ఆఫర్ చేస్తోంది. వికలాంగ బాలల నిధి, జనరల్ ఫండ్‌లకు లాటరీ నిధులు అందుతున్నాయి.

# సంక్షేమ లాటరీలు

## ఛారిటీ లాటరీలు

ప్రధానంగా వినోదం కోసం నిర్వహించే లాటరీల గురించి మనం ఇంతవరకూ తెలుసుకున్నాం. వాటిపై వచ్చే ఆదాయాన్ని వివిధ సామాజిక ప్రయోజనాలకోసం వినియోగిస్తున్నారన్న విషయమూ తెలుసు. అయితే కేవలం సంక్షేమ కార్యక్రమాలకు నిధులు సేకరించే నిమిత్తమే నిర్వహించే లాటరీలు కూడా ఉన్నాయి. అలాంటివాటి గురించి ఈ అధ్యాయంలో తెలుసుకుందాం.

వార్విక్‌షైర్‌లో మైటాన్ హామ్లెట్ హాస్‌పైస్ అనే సంస్థ ఉంది. అనారోగ్యంపై బాధపడుతున్న వారిని అక్కున చేర్చుకుని వారికి వైద్య సౌకర్యాలు కల్పించేశరణాలయం ఇది. ఈ సంస్థ నిర్వహణకోసం నిధులు సేకరించే నిమిత్తం 1996లో మైటాన్ లాటరీని ఏర్పాటు చేశారు. గ్లోబెలాట్ అనేది మరో లాటరీ. దీనిని నాలుగు స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఈ లాటరీ నిధులు హ్యూమన్ రైట్స్ వాచ్, ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ రెడ్ క్రాస్, రెడ్ క్రెసెంట్ సొసైటీస్, వరల్డ్‌వైడ్ ఫండ్ ఫర్ నేచర్, కేర్ ఇంటర్నేషనల్‌లకు అందుతాయి. నైజీరియాకు చెందిన కాను హార్ట్ ఫౌండేషన్ స్వయంగా ఓ లాటరీని నిర్వహిస్తోంది. తద్వారా వచ్చిన నిధులను చిన్నపిల్లలకు గుండె ఆపరేషన్లకోసం ఖర్చు చేస్తోంది. ఇప్పటివరకూ ఈ లాటరీ ద్వారా హృద్రోగంతో బాధపడుతున్న 68మంది చిన్నారులకు స్వస్థత చేకూరింది.

నెదర్లాండ్స్‌లో సంక్షేమ కార్యక్రమాలకోసం మూడు లాటరీలు నడుస్తున్నాయి. వాటి పేర్లు నేషనల్ పోస్ట్‌కోడ్ లాటెరిజ్, స్పాన్సర్ లాటెరిజ్, బ్యాంక్ గిరో లాటెరిజ్. న్యాయ మంత్రిత్వ శాఖ అనుమతితో నడుస్తున్న నేషనల్ పోస్ట్‌కోడ్ లాటెరిజ్ ద్వారా వచ్చే ఆదాయాన్ని పర్యావరణ పరిరక్షణకు, ఇతర సామాజిక ప్రయోజనాలకు వినియోగిస్తారు. అమ్నెస్టీ ఇంటర్నేషనల్, యునైటెడ్ నేషన్స్ హై కమిషనర్ ఫర్ రెఫ్యూజీస్, ది డచ్ సొసైటీ ఫర్ నేచర్ అండ్

ఎన్విరాన్‌మెంట్, ది డచ్ రెడ్‌క్రాస్, వరల్డ్‌వైడ్ ఫండ్ ఫర్ నేచర్ అండ్ స్టిచింగ్ డిఓఇఎన్ అనే సంస్థలకు ఈ లాటరీ నిధులు అందుతున్నాయి. ఈ సంస్థలు చేపట్టే ప్రాజెక్టులకోసం ఇప్పటివరకూ నేషనల్ పోస్ట్‌కోడ్ లాటెరిజ్ 1.2 బిలియన్ డాలర్లను అందించింది. క్రీడలు, సాంస్కృతిక, సంక్షేమరంగాల్లో చేపట్టే వివిధ రకాల ప్రాజెక్టులకు నిధులు అందించేందుకు 'ది స్పాన్సర్ లాటెరిజ్' అనే సంస్థ ఏర్పాటైంది. ఇప్పటివరకూ ఈ లాటరీ 70 మిలియన్ యూరోలను సంక్షేమ కార్యక్రమాలకోసం విరాళంగా ఇచ్చింది. నెదర్లాండ్‌లో సేవాకార్యక్రమాలకు అండదండగా నిలిచేందుకు ప్రారంభమైన తొలి లాటరీ బ్యాంక్ గిర్ లాటెరిజ్. ఇది హార్ట్ ఫౌండేషన్, యాంటీ కేన్సర్ ఆర్గనైజేషన్, ఎయిడ్స్ ఫండ్, ప్రిన్స్ బెర్న్‌హార్డ్ కల్చర్ ఫండ్ అనే సంస్థలకు 79 మిలియన్ యూరోల ఆర్థిక సహాయాన్ని అందించింది.

ఐర్లాండ్‌కు చెందిన రెహాబ్ లాటరీలు రెహాబ్ గ్రూపుకోసం నిధులు సేకరించేందుకు ఉపయోగపడుతున్నాయి. వికలాంగుల సంక్షేమం కోసం రెహాబ్ గ్రూపు లాటరీ నిధులను ఖర్చు చేస్తోంది.

యునైటెడ్ కింగ్‌డమ్‌లోని ఓల్డ్ అప్పోస్ ఛారిటీ లాటరీ 'ఎన్.ఎస్.ఎ.ఎఫ్.ఎ. ఫోర్సెస్ హెల్ప్'కు నిధులు అందిస్తోంది. మాజీ సైనికులు, వారి కుటుంబాల సంక్షేమం కోసం ఈ సంస్థ కృషి చేస్తోంది. సైనిక సహాయ నిధి కూడా ఓ లాటరీని నిర్వహిస్తోంది. దీనిద్వారా లభించే నిధులు రాయల్ నావల్ బెనోవలెంట్, ఎక్స్-పి.ఓ.డబ్ల్యు అసోసియేషన్ వంటి సంస్థలకు అందుతున్నాయి.

ఆక్స్‌ఫర్డ్‌లోని సర్ మైకేల్ సోబెల్ హౌస్ అనేది ఓ శరణాలయం. ఇది 1999లో సోబెల్ లాటరీని ప్రారంభించింది. లాటరీ ద్వారా వచ్చే ఆదాయం శరణాలయం నిర్వహణకు, అది చేపట్టే కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ఉపయోగపడుతోంది.

ఇండియాలోని తమిళనాడు రాష్ట్రంలో బధిరత్వంతో బాధపడుతున్న

పిల్లలకోసం 'డెఫ్‌చైల్డ్ ఇండియా' పేరిట 2000లో ఓ సేవాసంస్థ ఏర్పాటైంది. యు.కె.లోని నేషనల్ లాటరీ ఛారిటీస్ బోర్డ్ అందించే లాటరీ నిధులతో ఈ సంస్థ నడుస్తోంది.

ఇండియాలో లాటరీ నిధులతో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయి. వెస్ట్ బెంగాల్, కేరళ వంటి రాష్ట్రాలు ఇందుకు ఉదాహరణ. దేశంలోనే అతి ప్రాచీన లాటరీ ఆపరేటర్ అయిన సుగాల్ అండ్ దమాని సంస్థ హైదరాబాద్‌లో మెడిసిటీ కాలేజ్, ఆస్పత్రిల ఏర్పాటుకోసం 1980లలో ఓ లాటరీని నిర్వహించింది. చెన్నైలో కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటుకు, హైదరాబాద్‌లో భారతీయ విద్యా భవన్ స్థాపనకు కూడా ఈ లాటరీ ఆపరేటర్ లాటరీలు నిర్వహించింది. హైదరాబాద్‌లోని భారతీయ విద్యా భవన్ ఆడిటోరియాన్ని లాటరీ నిధులతోనే నిర్మించారు.

వివిధ దేశాలలో కేవలం సంక్షేమ కార్యక్రమాలకోసం మాత్రమే నిర్వహిస్తున్న లాటరీలు ఎన్నో ఉన్నాయి.

## గ్రీన్ కార్డ్ లాటరీ

అమెరికా 1990లో గ్రీన్‌కార్డ్ లాటరీని ప్రవేశపెట్టింది. దీనిని డైవర్సిటీ లాటరీ అని కూడా అంటారు. ఇతర దేశాలకు చెందిన వారు అమెరికాలో ఉపాధి పొందేందుకు, శాశ్వత వసతి కలిగి ఉండేందుకు చేయూతనిస్తుంది. కెంటకీ కాన్సులార్ సెంటర్ కంప్యూటర్ ర్యాండమ్ పద్ధతిలో కొన్ని నంబర్లను ఎంపిక చేస్తుంది. లాటరీలో గెలుపొందినవారిలో 90,000మందిని అమెరికా విదేశాంగ శాఖ ఎంపిక చేస్తుంది. అయితే ముందుగా స్పందించిన 50,000మందికి మాత్రమే వీసాలు లభిస్తాయి. గ్రీన్ కార్డ్ లాటరీలో పాల్గొనేందుకు కెనడా, ఇండియా, మెక్సికో, ఫిలిప్పీన్స్ వంటి దేశాలకు అనుమతి లేదు.

## హెరిటేజ్ లాటరీ

సాంస్కృతిక వారసత్వ సంపద పరిరక్షణకోసం లాటరీలను నిర్వహించే దేశాలు కూడా ఉన్నాయి.

బ్రిటన్‌లోని ట్వీడ్ రివర్ హెరిటేజ్ ప్రాజెక్టు నాలుగు మిలియన్ పౌండ్ల విలువైనది. ఈ ప్రాజెక్టుకు నిధులు హెరిటేజ్ లాటరీస్ బోర్డ్ ద్వారా లభిస్తున్నాయి. దేశ ప్రజలు తమ దేశ సాంస్కృతిక వారసత్వ సంపద గురించి తెలుసుకునేందుకు, వాటిని పరిరక్షించేందుకు అవసరమైన కార్యక్రమాల అమలుకోసం హెరిటేజ్ లాటరీ ఫండ్ నిధులను వెచ్చిస్తున్నారు. ఈ లాటరీ రాయల్ అబ్జర్వేటరీ ఆఫ్ గ్రీన్‌విచ్ పరిరక్షణకోసం 7 మిలియన్ పౌండ్లను అందజేసింది. బెల్‌ఫాస్ట్‌లోని సెయింట్ జార్జి మార్కెట్ పునరుద్ధరణకు చేయూతనిచ్చింది. 1890లో ప్రారంభమై ఇప్పటికీ కొనసాగుతున్న మార్కెట్ ఇది.

# బహుళ జాతీయ, అంతర్రాష్ట్ర లాటరీలు

## బహుళ జాతీయ లాటరీలు

కొన్ని దేశాలు కలసికట్టుగా నిర్వహించే లాటరీలను బహుళ జాతీయ లాటరీలు అంటారు.

## వైకింగ్ లోటో

మొట్టమొదటి బహుళ జాతీయ లాటరీగా వైకింగ్ లాటరీని చెప్పుకోవచ్చు. దీనిని ఐదు స్కాండినేవియన్ దేశాలు కలసి 1992లో ఏర్పాటు చేశాయి. ఈ లాటరీని డెన్మార్క్, ఫిన్‌లాండ్, ఐస్‌లాండ్, నార్వే, స్వీడన్ దేశాలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఇందులోకి 2000లో ఎస్టోనియా కూడా వచ్చి చేరింది. ఈ గేమ్‌కు ఎంతో ఆదరణ లభిస్తోంది.

## యూరో-మిలియన్స్

ఈ గేమ్‌ను యునైటెడ్ కింగ్‌డమ్, ఫ్రాన్స్, స్పెయిన్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. వీక్లీ డ్రాలు పారిస్‌లో తీస్తారు.

## అంతర్రాష్ట్ర లాటరీలు

ఒక దేశంలోని వివిధ రాష్ట్రాలు కలసి సంయుక్తంగా నిర్వహించే లాటరీలను అంతర్రాష్ట్ర లాటరీలు అంటారు.

## యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా

అమెరికాలో అంతర్రాష్ట్ర లాటరీలను మల్టీ-స్టేట్ లాటరీ అసోసియేషన్ (ఎం.యు.ఎస్.ఎల్) పర్యవేక్షిస్తుంది. ఇది లాభాపేక్ష రహిత సంస్థ. దీనిని సభ్యత్వ రాష్ట్రాలన్నీ కలసి ఏర్పాటు చేశాయి. ఎంయుఎస్ఎల్ ఆపరేట్ చేసే గేమ్‌లన్నీ ఆయా రాష్ట్రాలు ఆఫర్ చేసేవే. 1987లో ఏర్పాటైన ఈ సంస్థ తొలుత

లోటో అమెరికా అనే గేమ్‌ను ప్రారంభించింది. అయితే నాలుగేళ్ళ తరవాత ఈ గేమ్‌ను ఉపసంహరించుకుంది. ప్రస్తుతం ఎంయుఎస్ఎల్ వివిధ రాష్ట్రాల మధ్య అనేక గేమ్‌లు నిర్వహిస్తోంది. వాటిలో పవర్‌బాల్ గేమ్ ఎంతో ఆదరణ పొందింది.

లాటరీలకు సంజబంధించిన అకౌంట్‌ను సంబంధిత రాష్ట్రాలన్నీ సంయుక్తంగా నిర్వహిస్తూంటాయి. కాబట్టి బహుమతి గెలుచుకున్న విజేతలు తమ తమ రాష్ట్రాల్లోనే వాటిని క్లెయిమ్ చేసుకోవచ్చు. లాటరీల వ్యయాల నిర్వహణ, డ్రాల పర్యవేక్షణ, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, న్యాయపరమైన వివాదాల పరిశీలన వంటి బాధ్యతలను ఆయా రాష్ట్రాలు పంచుకుంటాయి. క్లెయిమ్‌కాని బహుమతులకు సంబంధించిన నగదును ఇతర ప్రాజెక్టులకోసం వెచ్చిస్తాయి.

జార్జియా, ఇల్లినాయిస్, మేరీలాండ్, మసాచుసెట్స్, మిచిగాన్, వర్జీనియా రాష్ట్రాలు కలసి 1996లో 'ది బిగ్ గేమ్' పేరిట లాటరీని ప్రారంభించాయి. 1998లో న్యూజెర్సీ కూడా ఈ బృందంలో చేరింది. 2002లో న్యూయార్క్, ఒహియో మరియు వాషింగ్‌టన్‌లు చేరాయి. ఆ తరవాత 2002లో ఈ గేమ్ పేరును 'మెగా మిలియన్స్' గా మార్చారు. 2003లో టెక్సాస్ కూడా చేరింది.

లాటరీ టిక్కెట్ల అమ్మకం ద్వారా వచ్చే నగదులో 50 శాతాన్ని ప్రైజ్‌మనీగా ఇచ్చివేస్తారు. ఐదు శాతం రిటైలర్లకు కమిషన్‌గా చెల్లిస్తారు. 35 శాతం నిధులను ప్రభుత్వ సర్వీసులకోసం కేటాయిస్తారు. ఈ డబ్బుతో విద్య, వైద్య, ఆరోగ్య రంగాల అవసరాలకు వినియోగిస్తారు. మిగిలిన నిధుల్ని లాటరీ నిర్వహణ ఖర్చులకోసం వాడతారు.

వివిధ రాష్ట్రాల మధ్య నడిచే పవర్‌బాల్ గేమ్‌లో మెగా జాక్‌పాట్ ఉంటుంది. దీనిని 27 రాష్ట్రాలు కలసి 1992లో ప్రారంభించాయి. డిస్ట్రిక్ట్ ఆఫ్ కొలంబియా, యు.ఎస్. వర్జిన్ ఐలాండ్స్‌లకు కూడా ఇందులో సభ్యత్వం ఉంది.

నెబ్రాస్కా, కాన్సాస్ కలసి 2బై2 లాటరీని ఆపరేట్ చేస్తున్నాయి. ఆటగాళ్ళు

1నుంచి 26 లోపు రెండు ఎర్ర రంగు నంబర్లను, రెండు తెల్ల రంగు నంబర్లను ఎంచుకోవాలి. డ్రాలను మల్టీ-స్టేట్ లాటరీ అసోసియేషన్ నిర్వహిస్తుంది. ఈ గేమ్‌లో వారానికి ఆరు డ్రాలు ఉంటాయి. డ్రా తీసిన నంబర్లతో ఎన్ని బాల్స్ మ్యాచ్ అయ్యాయన్న దాన్ని బట్టి బహుమతి ఆధారపడి ఉంటుంది.

మైనె, న్యూహాంప్‌షైర్, వెర్మాంట్ రాష్ట్రాలు సంయుక్తంగా 'ట్రై స్టేట్ మెగా బక్స్' అనే లాటరీని 1985లోనూ, 'ట్రై స్టేట్ హెడ్స్ ఆర్ టెయిల్స్' అనే లాటరీని 2003లోనూ ప్రారంభించాయి.

నార్త్ డకోటా 2002లో ఎన్.డి. హాట్ లోటోను మొదలుపెట్టింది. ఆ తరవాత కొలంబియా, అయోవా, మిన్నెసోటా, మోంటానా, న్యూహాంప్‌షైర్, సౌత్ డకోటా, వెస్ట్ వర్జీనియాలు నార్త్ డకోటాతో చేతులు కలిపాయి. నార్త్ డకోటా రాష్ట్రం 1998లో ఎన్‌డి వైల్డ్ కార్డ్ అనే లాటరీని కూడా ప్రారంభించింది.

కనెక్టికట్, డిస్ట్రిక్ట్ ఆఫ్ కొలంబియా, డెలావర్, అయోవా, కాన్సాస్, కెంటకీ, లూసియానా, మిన్నెసోటా, న్యూ హాంప్‌షైర్, న్యూ మెక్సికో, ఓరెగాన్, పెన్సిల్వేనియా, సౌత్ కరోలినా, వెస్ట్ వర్జీనియా రాష్ట్రాలు కలసికట్టుగా పవర్‌బాల్ మల్టీమిలియనీర్ అనే ఇన్‌స్టంట్ గేమ్ షోను నిర్వహిస్తున్నాయి.

## ఆస్ట్రేలియా

సౌత్ ఆస్ట్రేలియా, విక్టోరియా, వెస్టర్న్ ఆస్ట్రేలియా, క్వీన్స్‌లాండ్ రాష్ట్రాల సంయుక్త భాగస్వామ్యంలో ఆస్ట్రేలియన్ లోటో బ్లాక్ అనే లాటరీని 1981లో ప్రారంభించాయి. ఆస్ట్రేలియావైడ్ సాకర్ పూల్స్ బ్లాక్ 1989లో మొదలైంది. ఇంగ్లండ్‌లోగాని, ఆస్ట్రేలియాలోగాని జరిగే సాకర్ మ్యాచ్‌లలో వెలువడే ఫలితాలను బట్టి బహుమతిని గెలిచే నంబర్లు ఆధారపడిఉంటాయి. ప్రతి వారం జరిగే 38 మ్యాచ్‌లు, అందులోనూ ప్రధానంగా డ్రా అయ్యే మ్యాచ్‌ల ఆధారంగా లాటరీలో జయాపజయాలు ఆధారపడి ఉంటాయి. ఈ రాష్ట్రాలు ఓజ్ లోటో, గోల్డ్ లోటో, పవర్‌బాల్ లేదా ది బిగ్ వన్ అనే లాటరీలను కూడా సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి.

# లాటరీ డ్రాలు

ర్యాండమ్ పద్ధతిలో విన్నింగ్ నంబర్లను ఎంపిక చేయడాన్ని డ్రా అంటారు. నంబర్లను ఎంపిక చేయడమనేది

ఎక్కడైనా ఒకటే అయినా  నంబర్లను ఎంచుకునే పద్ధతే దేశానికో రకంగా ఉంటుంది. ఇండియాలో గిర్రున తిరిగే డ్రమ్‌లను ఉపయోగించి నంబర్లను ఎంపిక చేస్తారు. అజర్‌బైజాన్‌లో డ్రా తీసేందుకు 1నుంచి 90 వరకూ అంకెలు గల చిన్న చిన్న డబ్బీలను వినియోగిస్తారు. ఈ డబ్బీలను ప్రత్యేకంగా తయారుచేసిన ఓ సంచీలో ఉంచి, ఒక దాని తరవాత ఒకటిగా బయటకు తీస్తారు. ఆడే గేమ్‌ను బట్టి డబ్బీల సంఖ్య ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు బింగో గేమ్‌కు 41 డబ్బీలు అవసరమవుతాయి. మరికొన్ని గేమ్‌లలో డ్రా తీసేందుకు లోటో్ట్రోన్ అనే లాటరీ మెషీన్‌ను వాడతారు.

ఇండియాలో డ్రా తీసేందుకు సాధారణంగా ఈ కింది మూడు పద్ధతులనూ అనుసరిస్తారు.

## యంత్రసాయంతో డ్రా

డ్రా తీసే హాలులో చతురస్రాకారంలో ఉన్న మెషీన్‌ను నిర్దిష్టమైన ప్రదేశంలో ఉంచుతారు. ఈ మెషీన్‌కు గిరగిరా తిరిగే గుండ్రటి ఆకారంలో ఉండే ఆరు డిస్కులు ఉంటాయి. ప్రతి డిస్కుపైనా 0 నుంచి 9 వరకు అంకెలు ఉంటాయి. ఈ డిస్కులను గేర్లు లేని చక్రం సాయంతో తిప్పుతారు. చక్రానికి పొడవుగా గొలుసు ఉంటుంది. దానికి చివర పెడల్ ఉంటుంది. పెడల్ సాయంతో డిస్కులను ఆపరేట్ చేస్తారు. కొన్ని చోట్ల ఇలాంటి యంత్రాన్ని మోటారుతో అనుసంధానించి, స్విచ్ సాయంతో ఆపరేట్ చేస్తారు. ఐదుగురు జడ్జీలు ఆమోదముద్ర వేసిన తరవాత ఈ యంత్రాన్ని వినియోగిస్తారు. గిరగిరా తిరుగుతున్న డిస్కులను అకస్మాత్తుగా ఆపుతారు. అప్పుడు ప్రతి డిస్కుపైన

ఓ అంకె మెషీన్‌పై ఉన్న ఫ్రేమ్‌లో ఉన్న రంధ్రంగుండా కనిపిస్తుంది. ఎడమ వైపునుంచి ప్రారంభించి, ఇలా ఆరు డిస్కులపై కనిపించే ఆరు నంబర్లను నోట్ చేసుకుంటారు. ఇదే బహుమతిని గెలుచుకున్న నంబర్ అన్నమాట. డ్రా కమిటీ చైర్మన్ విన్నింగ్ నంబర్లను ఓ రిజిష్టరులో నోట్ చేసుకుంటారు. ఇదే పద్ధతిని అనుసరించి ద్వితీయ, తృతీయ బహుమతులను కూడా ఎంపిక చేస్తారు. చివరి అయిదంకెలను బట్టి, చివరి నాలుగు అంకెలను బట్టి...ఇలా మిగిలిన బహుమతులను నిర్ణయిస్తారు. కేవలం అంకెలను ఎంచుకునేందుకు మాత్రమే గుండ్రిటి డిస్కులను ఉపయోగిస్తారు. ఉదాహరణకు చివరి నాలుగంకెలను బట్టి బహుమతి నిర్ణయించేటప్పుడు, ఆరు డిస్కులలో ఎడమవైపున ఉన్న చివరి రెండు డిస్కులను మూసి వేసి, మిగిలిన డిస్కులనుంచి నాలుగంకెలను ఎంచుకుంటారు. డ్రా ముగిశాక, బహుమతులు లభించిన నంబర్లను ప్రకటించాక కమిటీ సభ్యులంతా రిజిష్టర్‌లో సంతకం చేస్తారు.

## మానవ ప్రయత్నంతో డ్రా

డ్రా తీసే చోట ఆరు డ్రమ్‌లు లేదా అవసరమైనన్ని డ్రమ్‌లను ఉంచుతారు. ఈ డ్రమ్‌లపై రోమన్ అంకెల్లో 1 నుంచి 6 వరకూ అంకెలు వేసి ఉంటాయి. మొదటి డ్రమ్ లక్షలను, రెండో డ్రమ్ పది వేలను, మూడో డ్రమ్ వేలును, నాలుగో డ్రమ్ వందలను, ఐదో డ్రమ్ పదులను, ఆరో డ్రమ్ ఒకట్లను సూచిస్తాయి. ప్రతి డ్రమ్‌లోను 10 చిప్‌లు లేదా డిస్కులు ఉంటాయి. ప్రతి డిస్కుపైనా 0 నుంచి 9 వరకూ అంకెలు ఉంటాయి. ఒక్కొక్క సీరీస్‌కు ఒక్కో డ్రమ్ ఉంటుంది. వీటిపై సీరిస్‌ను సూచించే ఇంగ్లీష్ అక్షరాలను (ఉదాహరణకు దిబి 367289) కూడా పేర్కొంటారు. ప్రతి చిప్‌ను లేదా డిస్కును జడ్జీల సమక్షంలో ప్లాస్టిక్ బ్యాగ్‌తో మూసివేస్తారు. జడ్జీలు అనుమతి ఇచ్చాక ఓ బెల్ మోగుతుంది. ఆ వెంటనే అన్ని డ్రమ్‌లను గుండ్రంగా గిరగిరా తిప్పుతారు. కొంత సేపటి తరవాత జడ్జీల అనుమతితో మరోసారి బెల్ మోగిస్తారు. ఆ వెంటనే తిరిగే డ్రమ్‌లను అకస్మాత్తుగా నిలిపివేస్తారు. ఒక్కొక్క

డ్రమ్‌లో ఉన్న చిప్ లేదా డిస్క్‌ను వెలుపలకు తీసి, అందులో ఉన్న నంబర్‌ను జడ్జీలకు చూపిస్తారు. ప్రతి డిస్క్‌లో ఏ నంబర్ ఉంటుందో ఆ నంబర్‌ను బోర్డుపై రాస్తారు. ఇలా ఆరు డిస్క్‌లలో కనిపించే ఆరు నంబర్లను బోర్డుపై రాస్తారు. ఇదే బహుమతిని గెలుచుకున్న నంబర్ అవుతుంది. ఇక సీరీస్‌ను ఎంపిక చేసేందుకు ఏడో డ్రమ్‌ను ఆపరేట్ చేస్తారు. ఇందులోంచి సీరీస్‌ను డ్రా తీస్తారు. ఆ తరవాత ఐదు డ్రమ్‌లను మాత్రమే పరిగణనలోకి తీసుకుని రెండో బహుమతిని, నాలుగు డ్రమ్‌లను మాత్రమే పరిగణనలోకి తీసుకుని మూడో బహుమతిని... ఇలా డ్రా తీస్తారు. డ్రాల తంతు ముగిశాక మామూలుగానే కమిటీ సభ్యులంతా రిజిష్టర్‌లో సంతకం చేస్తారు.

## చీటీలను ఉపయోగించి డ్రా తీయడం

సేవా కార్యక్రమాలకోసం లాటరీలు నిర్వహించేవారు సాధారణంగా ఈ పద్ధతిని పాటిస్తారు. ఇందులో నంబర్లు ప్రింట్ చేసి ఉన్న చీటీలను ఓ డ్రమ్‌లో ఉంచుతారు. ఎన్ని టిక్కెట్లు అమ్ముడైతే, అన్ని చీటీలను డ్రమ్‌లో వేస్తారు. డ్రమ్‌ను బాగా కుదిపిన అనంతరం అందులోంచి చీటీలను డ్రా తీసి, ఆ నంబర్లకు బహుమతులు ఇస్తారు.

ప్రస్తుతం బంతులను ఉపయోగించే డ్రా మెషీన్ల సాయంతో డ్రా తీస్తున్నారు. అమెరికాతో సహా అనేక దేశాల్లో ఈ పద్ధతిని ఆచరిస్తున్నారు. డ్రాల సంఖ్య పెరుగుతున్న కొద్దీ అనేక దేశాలు డ్రా మెషీన్లవైపు మొగ్గుచూపుతున్నాయి.

## బాల్‌సెట్ పద్ధతి

ఇందులో మూడు డ్రా మెషీన్లు, ఆరు సెట్ల బంతులను ఉపయోగిస్తారు. ర్యాండమ్ నంబర్ ప్రోగ్రామ్‌లో డ్రా తీసేందుకు రెండు మెషీన్లను ఉపయోగిస్తారు. లోటో గేమ్‌లో సూపర్ లోటో ప్లస్ డ్రా మెషీన్, మెగా డ్రా మెషీన్‌లు ఉంటాయి. సూపర్ లోటో ప్లస్ డ్రాకోసం మూడు సెట్ల తెల్ల బంతులను వినియోగిస్తారు. మెగా డ్రా మెషీన్‌కోసం ఊదా  రంగులో ఉన్న

మూడు సెట్ల బంతులను ఉపయోగిస్తారు. ఈ బంతులను ఓ బాక్సులో ఉంచి, దానికి సీల్ వేస్తారు. డ్రా తీసేటప్పుడు ఈ సీల్‌ను విరగ్గొడతారు. డ్రాకు ముందు మెషీన్లను, బంతులను క్షుణ్ణంగా పరీక్షిస్తారు. మెషీన్‌కు గిరగిరా తిరిగే డ్రమ్ అమర్చి ఉంటుంది. అది తిరుగుతుండగా అందులోకి బంతులను జారవిడుస్తారు. మెషీన్‌ను ఆపివేస్తే, డ్రమ్ కూడా ఆగిపోతుంది. అప్పుడు ఏయే నంబర్లపై బంతులు ఆగి ఉన్నాయో ఆ నంబర్లను బట్టి బహుమతులు ప్రకటిస్తారు. డ్రా తీసే రెండు మెషీన్లు పాడైపోయిన పక్షంలో మూడో మెషీన్ సాయంతో డ్రా తీస్తారు.

## ఆటోమేటెడ్ డ్రా

ఫాంటసీ 5, డైలీ డెర్బీ టిఎం, డైలీ 3 వంటి డ్రాలకోసం ఈ పద్ధతిని అనుసరిస్తారు. ఆటోమేటెడ్ డ్రాను 1998లో ప్రవేశపెట్టారు. గేమ్‌ల సంఖ్య పెరగడంతో డ్రాలు తీసేందుకు ఆటోమేటెడ్ డ్రా పద్ధతిని అనుసరించక తప్పట్లేదు. ఆటోమేటెడ్ డ్రా మెషీన్లంటే కంప్యూటర్లే. సాధారణంగా డ్రా తీసేందుకు మూడు పద్ధతులు వాడుకలో ఉన్నాయి. ఏ యంత్రాన్ని ఉపయోగించాలో ఏ పద్ధతిని ఆనుసరించాలో ర్యాండమ్ నంబర్ ప్రోగ్రామ్‌ను బట్టి నిర్ణయిస్తారు. కంప్యూటర్ హార్డ్‌డ్రైవ్‌కు సెక్యూరిటీ సీల్ ఉంటుంది. సంబంధిత సాఫ్ట్‌వేర్ ఆవిష్కరించే ర్యాండమ్ నంబర్లను తారుమారు చేసేందుకు ఆస్కారం ఉండనే ఉండదు. ఏ మెషీన్ అయినా పాడైతే వినియోగించేందుకు మరో మెషీన్‌ను సిద్ధంగా ఉంచుతారు.

## అమెరికాలో చేతిలో డ్రా తీసే పద్ధతి

ఫాంటసీ 5 ఎంట్రీ ఫారమ్ కూపన్ మెయిల్స్‌ను లాటరీ ఆఫీసువద్ద ట్రేలు, రేక్‌లలో సరఫరా చేస్తారు. ఒక్కొక్క ట్రేలో సుమారు 1200 కవర్లు ఉంటాయి. ఒక్కొక్క రేక్‌లో 36 ట్రేలు ఉంటాయి. ప్రతి ట్రేకు ఒక్కో నంబర్ ఉంటుంది. ట్రేల నంబర్లు రాసిన చీటీలను ఓ డ్రమ్‌లో వేస్తారు. ఈ డ్రమ్‌లోంచి ఓ చీటీని

వెలికి తీస్తారు. సాధారణంగా ఇలా డ్రా తీసే వ్యక్తి లాటరీ సంస్థతో ఎలాంటి సంబంధాలు లేనివారై ఉంటారు. డ్రా తీసిన నంబర్లు గల ట్రేలను ఒక దాని తరవాత ఒకటిగా తీసుకువస్తారు. ఈ ట్రేలలోంచి ఒక్కొక్క కవర్‌ను సదరు వ్యక్తి ఎంపిక చేస్తాడు. విజేతలందరినీ ఎంపిక చేసేంతవరకూ ఇలా డ్రా తీస్తారు. మిగిలిన కవర్లను చించివేస్తారు.

టిక్కెట్లపై డ్రా తేదీ, సమయం వివరంగా పేర్కొంటారు. అనివార్య కారణాలవల్ల డ్రాను వాయిదా వేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. అయితే ఆ విషయాన్ని ప్రభుత్వం వివరంగా తెలియజేయాల్సి ఉంటుంది. తదుపరి డ్రా తేదీని కూడా ప్రకటించాలి. అన్ని దేశాల్లోనూ ప్రజల సమక్షంలో డ్రా తీయడమే సాంప్రదాయంగా వస్తోంది. వీటిలో చాలావరకూ డ్రాలను టీవీల్లో ప్రత్యక్ష ప్రసారం కూడా చేస్తారు. డ్రా సమయంలో తగిన బందోబస్తును కూడా ఏర్పాటు చేస్తారు. ఈ వివరాలన్నింటినీ తదుపరి అధ్యాయాల్లో వివరించడం జరిగింది.

# భారతీయ లాటరీల్లో ఆర్థిక కోణం

లాటరీ వ్యాపారంలో టిక్కెట్లను అమ్మడం, బహుమతులను పంచడమే కాకుండా ఇతరత్రా ఆర్థికాంశాలు ఎన్నో ఉంటాయి. పేపర్ లాటరీ టిక్కెట్ల ధర సాధారణంగా పదకొండు రూపాయలుగా ఉంటుంది. ఇందులో పది రూపాయలు ప్రైజ్‌మనీ నిధికి చెందుతుంది. కొన్ని రకాల లాటరీ గేమ్‌లలో టిక్కెట్ ధర ఒక్క రూపాయి, పది పైసలు కూడా ఉంటుంది.

## ప్రభుత్వానికి ఆదాయం

ఏదైనా రాష్ట్రప్రభుత్వం లాటరీ నిర్వహణకోసం టెండర్లను పిలిస్తే, బిడ్డింగ్ చేసే ఆపరేటర్లు కొంత డబ్బును డిపాజిట్ చేయాలి. ఈ డబ్బును ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (ఇ.ఎం.డి.) అంటారు. ఇది రీఫండబుల్ డిపాజిట్. టెండర్‌లో విజయం సాధించిన బిడ్డర్ ప్రభుత్వం వద్ద నిర్దిష్ట మొత్తంలో నగదును సెక్యూరిట్ డిపాజిట్‌గా చెల్లించాలి. ఒప్పందం కాలపరిమితి పూర్తికాకుండానే ఆపరేటర్ లాటరీ నిర్వహణనుంచి వెనక్కు తగ్గకుండా ఈ ఏర్పాటు చేశారు. ఒకవేళ అలా జరిగితే ఈ సెక్యూరిటీ డిపాజిట్‌ను సదరు ఆపరేటర్ కోల్పోతాడు. ఈ డిపాజిట్ కూడా రీఫండబుల్ డిపాజిట్టే. దీనిపై వచ్చే వడ్డీయే ప్రభుత్వానికి లాభమన్నమాట. లాటరీ వ్యాపారంలో ప్రభుత్వానికి అధిక ఆదాయం లభించేది టిక్కెట్ల అమ్మకం ద్వారానే. బిడ్డర్లు మినిమమ్ గ్యారంటీడ్ డబ్బును కోట్ చేస్తారు. ఉదాహరణకు ఒక ఆన్‌లైన్ ఆపరేటర్ దశలవారీగా ఐదేళ్ళ కాలపరిమితిలో ప్రభుత్వానికి 1100 కోట్ల రూపాయల ఆదాయం సమకూర్చి పెడతానని హామీ ఇచ్చాడు. దీనినే ఐదేళ్ళ కాలానికి లైసెన్సింగ్ ఫీజుగా వ్యవహరిస్తారు. ఒక ఆపరేటర్ రాష్ట్ర ప్రభుత్వానికి ఏడేళ్ళ కాల వ్యవధిలో 1141 కోట్ల రూపాయల మొత్తాన్నిగాని, టర్నోవర్‌లో 17 శాతాన్నిగాని...రెండింటిలో ఏది ఎక్కువైతే అంత మొత్తాన్ని కేటాయిస్తానని ఒప్పందం కుదుర్చుకున్నాడు. ప్రభుత్వానికి టిక్కెట్ల విక్రయంపై లభించే ఆదాయమే కాకుండా, ఆపరేటర్

చెల్లించే అమ్మకం పన్ను రూపేణా కూడా ఆదాయం సమకూరుతుంది. లాటరీ టిక్కెట్లపై అమ్మకం పన్ను వివిధ రాష్ట్రాల్లో వివిధ రకాలుగా ఉంటుంది. వెస్ట్‌బెంగాల్ రాష్ట్రం అమ్మకంపన్ను విధింపులో శ్లాబ్ సిస్టమ్‌ను అనుసరిస్తోంది. లాటరీ స్కీమ్‌లను బట్టి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదాయం లభిస్తూ ఉంటుంది. ఉదాహరణకు కేరళలో అక్కడి రాష్ట్రప్రభుత్వం నిర్వహించే లాటరీ కంటే మేఘాలయ, నాగాలాండ్ వంటి రాష్ట్రాలు నడిపే లాటరీలకే ఎక్కువ డిమాండ్ ఉంది. టిక్కెట్ల అమ్మకం ద్వారా లభించే మొత్తంలో 50 శాతం మాత్రమే కేరళ ప్రభుత్వం బహుమతులకోసం వెచ్చిస్తోంది. మేఘాలయ, నాగాలాండ్ ప్రభుత్వాలయితే దాదాపు 80 శాతాన్ని ప్రైజ్‌మనీగా ఇస్తాయి. అందువల్లనే కేరళలో ఈ లాటరీలకు అంత డిమాండ్. సాధారణంగా పేపర్ లాటరీలకంటే ఆన్‌లైన్ లాటరీలద్వారానే అధికమొత్తంలో ఆదాయం లభిస్తోంది.

## ఆపరేటర్ పెట్టుబడి

ఆపరేటర్ కొంత డబ్బును డిపాజిట్ చేయడమే కాకుండా ప్రభుత్వంనుంచి తాను కొనుగోలు చేసే టిక్కెట్లకు బ్యాంక్ గ్యారంటీని కూడా సమర్పించాల్సి ఉంటుంది. టిక్కెట్ల అమ్మకం పూర్తయ్యాక ప్రభుత్వానికి రాయల్టీ లభిస్తుంది. అదికాకుండా లాటరీ ద్వారా ప్రభుత్వానికి రావలసిన ఆదాయానికి బ్యాంకు గ్యారంటీ పూచీకత్తుగా ఉంటుంది. ఆన్‌లైన్ ఆపరేటర్ విషయానికొస్తే, అతను మౌలిక సదుపాయాలకోసం ఎంతో ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఓ లాటరీ కంపెనీ లోటో గేమ్‌ను ప్రవేశపెట్టినప్పుడు వంద కోట్ల (బిలియన్) రూపాయలను ఖర్చు చేసి, మూడు వందల టెర్మినళ్ళను ఏర్పాటు చేసింది. తదనంతర కాలంలో మరో 4000 టెర్మినళ్ళ ఏర్పాటు కోసం 350 కోట్ల రూపాయలను వెచ్చించింది. మరో ఆన్‌లైన్ ఆపరేటర్ తమ ఉత్పత్తులను ప్రవేశపెట్టేందుకు రూ. 400 కోట్లను వ్యయం చేశారు.

## ఏజెంట్ పెట్టుబడి

ఆన్‌లైన్ లాటరీల్లో ఓ వ్యక్తి ఏదైనా లాటరీ నిర్వహించే కంపెనీకి రిటైలర్‌గా మారాలనుకుంటే కొంత మొత్తాన్ని డిపాజిట్ చేస్తూ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తుదారు ఆర్థిక స్తోమతపై కంపెనీకి నమ్మకం కలిగితే, టెర్మినళ్ళను, ఐదు లక్షల రూపాయల విలువైన సాఫ్ట్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేస్తుంది. రిటైలర్ డిపాజిట్ చేసే నగదుపై ఆపరేటర్‌కు వడ్డీ లభిస్తుంది. డిపాజిట్ చేసే మొత్తం, దానిపై వడ్డీ రేటు ఒక్కొక్క ఆపరేటర్ వద్ద ఒక్కొక్కరకంగా ఉంటుంది. అమ్ముడైన టిక్కెట్లపై చెల్లించే కమిషన్ కూడా రాష్ట్రానికో రకంగా ఉంటుంది. రిటైలర్ అమ్మిన టిక్కెట్‌కు బహుమతి లభించినట్లయితే అతనికి కొంత పర్సంటేజీ ఇస్తారు. ఆన్‌లైన్ లాటరీల్లోను, పేపర్ లాటరీల్లోనూ కూడా ఈ రకంగా పర్సంటేజీని చెల్చించడం ఆనవాయితీగా వస్తోంది. ఇది కూడా రాష్ట్రానికో విధంగా ఉంటుంది. దీనిని బోనస్ కమిషన్ అని అంటారు. చాలామంది ఆన్‌లైన్ ఆపరేటర్లు బహుమతి గెలిచిన టిక్కెట్లపై 15 శాతాన్ని బోనస్ కమిషన్‌గా ఇస్తారు. రెండు కోట్ల రూపాయల వరకూ జాక్‌పాట్‌పై రెండు శాతం బోనస్ కమిషన్‌గా చెల్లిస్తారు. ఉదాహరణకు సిక్కిం ప్రభుత్వం మొట్టమొదటగా 8.61 కోట్ల రూపాయల ఆన్‌లైన్ జాక్‌పాట్ లాటరీని ప్రవేశపెట్టినప్పుడు ఆ టిక్కెట్‌ను విక్రయించిన రిటైలర్‌కు ఒక శాతం, అంటే 8.61 లక్షల రూపాయల కమిషన్ లభించింది.

# భారతీయ లాటరీల్లో టాక్స్ వ్యవహారాలు

## లాటరీలపై ఆదాయపన్ను

ఇండియాలో లాటరీల్లో గెలిచిన ప్రైజ్ మనీపై ఆదాయపన్ను చట్టం-1961లోని సెక్షన్ 56(2) ప్రకారం ఆదాయ పన్ను చెల్లించవలసి ఉంటుంది. మొత్తం ప్రైజ్‌మనీకి ఆదాయ పన్ను వర్తిస్తుంది. ప్రస్తుతం మొత్తం ప్రైజ్‌మనీపై ఆదాయపన్ను చట్టం-1961లోని సెక్షన్ 115 (బిబి) ప్రకారం 30 శాతం పన్నుతోపాటు సర్‌చార్జిని కూడా వసూలు చేస్తున్నారు.

## డిడక్షన్ ఆఫ్ టాక్స్ ఎట్ సోర్స్ (టి.డి.ఎస్.)

రూ. 5000కు మించిన బహుమతి మొత్తాలపై ఆదాయపన్ను చట్టం-1961లోని సెక్షన్ 194 (బి) ప్రకారం టి.డి.ఎస్. వసూలు చేస్తారు.

- బహుమతి మొత్తాన్ని వాయిదాల పద్ధతిన చెల్లించే వార్షిక బహుమతి పథకాలలోనైతే ప్రతి వాయిదాకు నగదు చెల్లించేటప్పుడు పన్ను వసూలు చేస్తారు.

-వస్తురూపంలో ఇచ్చే బహుమతులకైతే బహుమతులను అందించే ఏజెంటు ముందుగానే విజేతవద్దనుంచి పన్ను మొత్తాన్ని రికవర్ చేస్తాడు. కొంత నగదు రూపంలోనూ, కొంత వస్తురూపంలోనూ బహుమతులు ఇచ్చేటట్లయితే మొత్తం విలువపై పన్ను విధిస్తారు. పన్ను విధించేంత పెద్ద మొత్తంలో నగదు వాటా లేనట్లయితే, దానికి ఎంత పన్ను చెల్లించాలో ఏజెంట్ లెక్కగట్టి ముందుగానే విజేతవద్దనుంచి వసూలు చేసుకోవాలి. లేనిపక్షంలో ఆ పన్ను భారాన్ని ఏజెంట్ భరించక తప్పదు.

1. టి.డి.ఎస్. ఎక్కడ వర్తించదంటే...

-చెల్లింపు సింగిల్ లాటరీ గెలుపునకు సంబంధించినది మాత్రమే అయి ఉండి, సంబంధిత ఆర్థిక సంవత్సరంలో చేసిన మొత్తం చెల్లింపు కాని పక్షంలో

టి.డి.ఎస్. వర్తించదు. రెండు వేర్వేరు సందర్భాల్లో ఒకే ఆటగాడు రూ 5000కంటే తక్కువ మొత్తాన్ని గెలుచుకున్నట్లయితే అతనికి టి.డి.ఎస్. వర్తించదు. ఉదాహరణకు ఆటగాడు రెండు వేర్వేరు సందర్భాల్లో రూ. 3000 గెలుచుకుంటే అతనివద్దనుంచి పన్ను వసూలు చేయకూడదు.

-ఎవరూ క్లెయిమ్ చేసుకోని/ చెల్లింపు జరగని ప్రైజ్‌మనీపై పన్ను ఉండదు.

-లాటరీ సెల్లర్లకు లేదా ఏజెంట్లకు లభించే బోనస్‌పైన లేక కమిషన్‌పైన సెక్షన్ 194 (బి) ప్రకారం పన్ను వర్తించదు.

-అమ్ముడుపోని టిక్కెట్లపై బహుమతులను ఏజెంట్ వ్యాపారంలో వచ్చిన లాభంగా పరిగణిస్తారే తప్ప లాటరీలో గెలిచి పొందిన బహుమతిగా పరిగణించరు కాబట్టి దానిపై పన్ను ఉండదు.

2 లాటరీ టిక్కెట్ల అమ్మకంపై లభించే కమిషన్‌పై టి.డి.ఎస్.

లాటరీ ఏజెంట్ లేదా సెల్లర్‌కు లభించే కమిషన్ రూ. వెయ్యికి మించితే 194(జి) సెక్షన్ ప్రకారం పన్ను వర్తిస్తుంది. పన్ను కేవలం ఒక దఫా కమిషన్‌పైనే ఉంటుంది తప్ప సంబంధిత ఆర్థిక సంవత్సరం మొత్తంలో లభించిన కమిషన్‌కు వర్తించదు.

ప్రభుత్వం వినియోగదారులకు విక్రయించేందుకు ఏజెంట్లకు టిక్కెట్లు అందజేస్తుంది. ఆ టిక్కెట్ల విక్రయం ద్వారా తనకు లభించే కమిషన్‌లో కొంతమొత్తాన్ని ప్రభుత్వం ఏజెంట్లకు డిస్కౌంట్‌గా ఇస్తుంది. ఈ డిస్కౌంట్‌ను తరవాత చెల్లించే పక్షంలో సదరు ఆదాయంపై ఏజెంట్ వద్దనుంచి పన్నును మినహాయించేందుకు వీలు లేదు. .

## సర్వీస్ టాక్స్

భారత ప్రభుత్వం ఇటీవలే కమిషన్ ఏజెంట్ల సేవలను సర్వీస్ టాక్స్ పరిధిలోకి తీసుకువచ్చింది. కాబట్టి లాటరీ ఏజెంట్‌కు లభించే కమిషన్‌కు సర్వీస్ పన్ను వర్తిస్తుంది. లాటరీ వ్యాపారం టిక్కెట్ల క్రయవిక్రయాలపై

జరుగుతుంది. ఈ క్రయవిక్రయాలకు మాత్రం సర్వీస్ టాక్స్ వర్తించదు.

## అమ్మకం పన్ను

రాష్ట్ర ప్రభుత్వాలు ఆన్‌లైన్ లాటరీలపైనా, పేపర్ లాటరీలపైనా కూడా అమ్మకం పన్ను విధిస్తున్నాయి. కేరళ, కర్నాటక, మహారాష్ట్ర, వెస్ట్ బెంగాల్, పంజాబ్, హర్యానా రాష్ట్రాలు అమ్మకం పన్నును వసూలు చేస్తున్నాయి. ఈ పన్ను శాతం రాష్ట్రానికోరకంగా ఉంటుంది.

# లాటరీ కార్యకలాపాలు సజావుగా సాగాలంటే...

భారతీయ లాటరీ వ్యాపారంలో ఆపరేటర్లపై ఆరోపణలు ఎక్కువగా వినవస్తుంటాయి. ఈ ఆరోపణల్లో ఏమాత్రం నిజం ఉన్నా ప్రభుత్వానికి నష్టం వాటిల్లక తప్పదు. ఈ పరిస్థితి తలెత్తడానికి కారణం... లాటరీ వ్యాపారాన్ని క్రమబద్ధం చేసేందుకు పటిష్టమైన యంత్రాంగం లేకపోవడమే. అయితే లాటరీ వ్యాపారంలో జరుగుతున్న అవకతవకలను అరికట్టేందుకు నిషేధమే సరైన మార్గం అనుకోవడం మాత్రం సమంజసం కాదు.

కొన్ని రాష్ట్రాలు ఆపరేటర్ నుంచి నిర్దిష్ట మొత్తంలో నగదును తీసుకుంటున్నాయి. ఎన్ని టిక్కెట్లు ముద్రిస్తున్నారనే దానితో నిమిత్తం లేకుండా డ్రాకు రూ. 550 చొప్పున అతి చిన్న మొత్తాలను ఆదాయంగా పొందుతున్న రాష్ట్రాలు కూడా ఉన్నాయి. ఈ పరిస్థితి ఆపరేటర్లకు లాభాల పంట పండిస్తోంది. ఆపరేటర్లు కూడా పుట్టగొడుగుల్లా పుట్టుకువస్తున్నారు. ప్రభుత్వాలకు లాభాలు రావాలంటే, ముద్రించిన టిక్కెట్లపై కొంత శాతం ఆదాయాన్ని రాబట్టుకోవాలి. ప్రభుత్వానికి లభించే కనీస రాయల్టీ ఐదు శాతానికి తగ్గకూడదు.

రాష్ట్రప్రభుత్వాలు టిక్కెట్లతోనూ, టర్నోవర్‌తోనూ పనిలేకుండా నిర్దిష్ట శాతంలో అమ్మకం పన్నును వసూలు చేస్తున్నాయి. దీనివల్ల కూడా ఆపరేటర్లకే ఎక్కువ లబ్ధి చేకూరుతోంది. దీనికి బదులుగా అమ్మకం పన్నుపై శ్లాబ్‌వ్యవస్థకు రూపకల్పన చేసి, దానిని టిక్కెట్ల విక్రయం టర్నోవర్‌తో అనుసంధానిస్తే ప్రభుత్వాలకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఉదాహరణకు రూ. 40 లక్షల విలువైన టిక్కెట్లను విక్రయిస్తే, రూ, 20,000 అమ్మకం పన్నును వసూలు చేయవచ్చు. రూ. 40లక్షల నుంచి 60 లక్షల విలువైన టిక్కెట్లను విక్రయిస్తే, రూ. 40,000 అమ్మకం పన్నును విధించవచ్చు.

ఎక్కడైనా ఓ రాష్ట్ర ప్రభుత్వం లాటరీలను నిషేధించినా, దానివల్ల ప్రభుత్వానికి ఆశించిన ప్రయోజనాలు సిద్ధించడం లేదు. ఎందుకంటే, మిగిలిన రాష్ట్రాల టిక్కెట్ల విక్రయం యథావిధిగా సాగుతూండటమే. మామూలుగా పదకొండు రూపాయలకు అమ్మవలసిన టిక్కెట్, నిషేధం అమలులో ఉన్న చోట ఇతర రాష్ట్రాల టిక్కెట్లను పదకొండున్నర రూపాయలకు అమ్ముతున్నారు. లాటరీ ఆడాలనుకునేవారికి టిక్కెట్లు ఎలాగూ దొరుకుతున్నాయి. నష్టపోతున్నది ప్రభుత్వం మాత్రమే.

ఏదైనా ప్రభుత్వం లాటరీలను నిషేధిస్తే, ప్రజలు విదేశీ ఆన్‌లైన్ లాటరీ గేమ్‌లవైపు లేదా ఇతర రాష్ట్రాలు నిర్వహించే లాటరీలవైపు ఆకర్షితులవుతున్నారు.

చాలా సందర్భాల్లో లాటరీల ద్వారా ప్రభుత్వాలకు రావలసిన ఆదాయం రాకుండా పోతోంది. ఒప్పందాలు కుదుర్చుకోవడంలోనూ, టెండర్లు పిలవడంలోనూ అధికారులు చూపించే నిర్లక్ష్యం, ఉదాసీన వైఖరే ఇందుకు కారణం.

కొన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వానికి, ఆపరేటర్‌కు మధ్య కుదిరే ఒప్పందంలో ఎన్ని టిక్కెట్లు ఇష్యూ చేయాలో స్పష్టంగా పేర్కొనరు. టిక్కెట్ల సంఖ్యను బట్టి ప్రభుత్వం రాయల్టీ అడిగే పక్షంలో ఆపరేటర్ చిన్నపాటి లాటరీ స్కీమ్‌లవైపు మొగ్గు చూపిస్తాడు. కనీస సంఖ్యలో టిక్కెట్లను ముద్రించి, అవసరమైతే ఆ తరవాత ప్రైజ్ విన్నింగ్ టిక్కెట్లను ముద్రిస్తాడు. ఇలాంటి సందర్భాల్లో ఆటగాడికి దక్కాల్సిన బహుమతి ఆపరేటర్‌కు దక్కే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. లాటరీపై ప్రభుత్వం ఫిక్సెడ్ రాయల్టీని అడిగితే, ఆపరేటర్ పెద్ద స్కీమ్‌ను ఎంచుకుంటాడు. అవసరమైనవాటికంటే ఎక్కువ టిక్కెట్లను ముద్రించుకుని, లాభపడేందుకు ప్రయత్నిస్తాడు. ఆ మధ్య ఒక రాష్ట్రంలో ఆపరేటర్ 56 లక్షల టిక్కెట్లను ముద్రించాడు. నిజానికి 46 లక్షల టిక్కెట్లు సరిపోతాయి. అదనంగా ముద్రించిన టిక్కెట్లలో దేనికైనా బహుమతి లభిస్తే అది ఆపరేటర్

పరమవుతుంది. అందుకే ఈ ఎత్తుగడ.

ఒక రాష్ట్రంలో ప్రభుత్వానికి, ఎస్ఎస్ఏ (సోల్ సెల్లింగ్ ఏజెంట్)కూ మధ్య కుదిరిన ఒప్పంద పత్రాల్లో నికరాదాయాన్ని ఎలా పంచుకోవాలనే విషయాన్ని పేర్కొనలేదు. ఫలితంగా ప్రభుత్వానికి తీరని నష్టం వాటిల్లింది.

మరో కేసులో 91 శాతం టిక్కెట్ల ముఖవిలువను ప్రైజ్‌మనీగా చెల్లించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. కానీ ప్రైజ్‌మనీగా 78 శాతం మాత్రమే చెల్లింపులు జరిగాయి.

ప్రైజ్‌మనీ పంపకాలు జరిగినప్పుడు, ఆదాయం పన్ను మినహా ఇతరత్రా ఎలాంటి చెల్లింపులు జరపనక్కర్లేదు. కానీ, కొందరు ఎస్.ఎస్.ఏ.లు తమ ఖర్చులకోసం ప్రైజ్‌మనీలో అదనంగా డబ్బును మినహాయించుకుంటున్నారు. ప్రైజ్‌మనీలో ఇది కొంతమొత్తమే కావడంతో విజేతలెవరికీ ఈ సంగతి తెలియడం లేదు.

కొన్ని సందర్భాల్లో ఎస్.ఎస్.ఏ.లు ప్రభుత్వం నుంచి అనుమతి పొంది డ్రాలను రద్దు చేస్తారు. కానీ, అనుమతి ఇచ్చే ముందు టిక్కెట్లన్నీ అమ్ముడయ్యాయా లేదా అని ప్రభుత్వం తనిఖీ చేయదు. ఒకవేళ టిక్కెట్లన్నీ అమ్ముడైపోతే, దాని మీద వచ్చే లాభమంతా ఎస్ఎస్ఏలే కైవసం చేసుకుంటారు. నష్టపోయేది ప్రభుత్వమూ, టిక్కెట్లు కొన్న ఆటగాళ్ళూ మాత్రమే. కొన్ని సందర్భాల్లో ఈ డబ్బు అసాంఘిక శక్తుల చేతులకు చేరిన దాఖలాలు కూడా ఉన్నాయి.

నిర్దేశిత కాలవ్యవధిలో ప్రైజ్‌మనీ లేదా రాయల్టీని ప్రభుత్వ ఖజానాలో ఆపరేటర్ జమ చేయకపోతే పెనాల్టీని గాని, వడ్డీని గాని చెల్లించవలసి ఉంటుందని ఒప్పందంలో లేకపోయినా ప్రభుత్వం నష్టాన్ని భరించవలసి ఉంటుంది.

డ్రా సమయాన ఉద్దేశపూర్వకంగా తప్పుడు విన్నింగ్ నంబర్లను ప్రకటించి, కొన్ని రోజులు పోయాక అసలు విన్నింగ్ నంబర్‌ను పత్రికల్లో 'సవరణ' పేరిట ఇస్తారు. దీంతో తమకు బహుమతి రాలేదనుకుని అసలు విజేతలు టిక్కెట్లను చించేయడమో, పారేయడమో చేస్తారు. అప్పుడు డీలర్లు డూప్లికేట్ టిక్కెట్లను ప్రింట్ చేసి, వాటితో బహుమతి మొత్తాలను క్లెయిమ్ చేసుకుంటారు. ఇలా కూడా ప్రజలను మోసం చేస్తారు.

ఫలితాన్ని తారుమారు చేయాలనో లేక అమ్ముడుకాని టిక్కెట్లలోంచి విన్నింగ్ నంబర్‌ను ప్రకటించాలనో అధికారులపై ఏజెంట్లు ఒత్తిడి తెచ్చారంటూ గతంలో అనేకమార్లు ఆరోపణలు వచ్చిన సందర్భాలు ఉన్నాయి.

పైన చెప్పిన అక్రమాలు, అవకతవకలను బట్టి చూస్తే, లాటరీ వ్యాపారాన్ని క్రమబద్ధీకరించేందుకు పటిష్టమైన, పారదర్శకమైన యంత్రాంగం ఆవశ్యకత ఉందని అర్థమవుతోంది. పైన పేర్కొన్న సమస్యలను అధిగమించాలంటే, సెబీ, ట్రాయ్‌ల మాదిరిగా లాటరీ వ్యాపారానికి ఓ నియంత్రణ సంస్థను ఏర్పాటు చేయాలి.

# ఆటగాళ్ళకు రక్షణ

లాటరీలు ఆడే వారికి ప్రభుత్వం అన్నివిధాలా రక్షణ కల్పించాల్సిన అవసరం ఉంది. ఇందుకు అనేక కారణాలు ఉన్నాయి.

లాటరీ ఆపరేటర్లు తాము నిర్వహించే వివిధ రకాల లాటరీ గేమ్‌ల గురించి ప్రకటనలు చేస్తూ ఉంటారు. లాటరీ అనేది ఓ వినోద ప్రధానమైన ఆటే తప్ప కష్టించి పనిచేసే తత్వానికి ఇది ప్రత్యామ్నాయమో లేక కడుపులో చల్ల కదలకుండా సంపాదించే మార్గమో కాదని ఇలాంటి ప్రకటనల్లోనే ప్రజలకు ఓ సందేశాన్నీ అందించాలి. విదేశాలలో ఇచ్చే ప్రకటనల్లో ఇలాంటి సందేశమూ ఉంటుంది. మరీ ముఖ్యంగా ప్రైవేటు లాటరీ ఆపరేటర్లు తాము ఇచ్చే ప్రకటనలకు ఇలాంటి సందేశాలను జోడించడం కద్దు. ఆటగాళ్ళకు రక్షణ కల్పించాల్సిన ఆవశ్యకత గురించి నేషనల్ లాటరీ ఆఫ్ యునైటెడ్ కింగ్‌డమ్ కొన్ని మార్గదర్శక సూత్రాలను రూపొందించింది. తగినంత డిమాండ్ ఉంటేనే లాటరీ గేమ్‌లకు అనుమతి ఇవ్వాలని బ్రిటన్‌లోని బెట్టింగ్ అండ్ గేమింగ్ చట్టం 1960 నిర్దేశిస్తోంది. లాటరీలకు సంబంధించి ప్రకటనలు, టిక్కెట్ల డిజైన్ ఎలా ఉండాలో, అవి ఏయే వర్గాలకు చేరాలో నిర్దేశిస్తూ తగిన విధివిధానాలు ఉన్నాయి. ఆర్థిక ఇబ్బందులను అధిగమించేందుకు లాటరీలు ఓ పరిష్కారమార్గమనే అభిప్రాయాన్ని ప్రజలకు  కలిగించకూడదు. పేపర్ లాటరీ టిక్కెట్లు అమ్మే కౌంటర్లవద్ద, ఆన్‌లైన్ గేమ్‌ల రిటైల్ అవుట్‌లెట్ల వద్ద లాటరీలకు సంబంధించిన చట్టబద్ధమైన హెచ్చరికను పేర్కొనడం తప్పనిసరి చేయాలి.

పేపర్, ఆన్‌లైన్ లాటరీల కౌంటర్ల వద్ద లాటరీలకు సంబంధించిన సమాచారంతో ముద్రించిన కరపత్రాలను టిక్కెట్ విక్రయదారులకు అందించాలి. లాటరీలను ఆడే విధానం, ప్రైజ్‌మనీ వివరాలు, లాటరీ స్కీమ్‌ల వివరాలను అందులో పేర్కొనాలి. విజయావకాశాల గురించి కూడా వివరంగా ఇవ్వాలి. దీనివల్ల  కేవలం ప్రైజ్‌మనీకి ఆశపడి కాకుండా, లాభనష్టాలను

బేరీజు వేసుకుని టిక్కెట్ కొనే వెసులుబాటు ప్రజలకు లభిస్తుంది సాధారణంగా లాటరీ స్కీమ్‌లలో ప్రైజ్‌మనీని పెద్దపెద్ద అంకెల్లో చూపించి, విజయావకాశాలను చిన్నటి అక్షరాల్లో పేర్కొనడం జరుగుతూ ఉంటుంది.

ప్రైజ్‌మనీపై ఆదాయపన్ను తప్ప మరే ఇతర చార్జీలను చెల్లించాల్సిన అవసరం లేదని ప్రభుత్వమే టిక్కెట్లపై స్పష్టంగా పేర్కొనాలి.

లాటరీలో గెలిచి అకస్మాత్తుగా పెద్దమొత్తంలో డబ్బు చేతికి అందగానే విజేత సామాజిక స్థితిగతుల్లో ఊహించని మార్పులు సంభవిస్తాయి. సమాజ సేవకులు, లాటరీలకు వ్యతిరేకంగా ఉద్యమించేవారూ తరచూ ఆందోళన వ్యక్తం చేసే అంశమిది. సాధారణంగా దిగువ, మధ్య తరగతి ఆదాయవర్గాలవారు జాక్‌పాట్ వంటి లాటరీలను గెలిచినప్పుడు ఇలాంటి పరిస్థితి తలెత్తుతుంది. అనుకోకుండా అదృష్టదేవత కరుణించడంతో సమాజంలో ఒక్కసారిగా వారి హోదా పెరిగిపోతుంది. వారు ఊహించనివిధంగా వార్తల్లో వ్యక్తులైపోతారు. లాటరీలో విజయం...కుటుంబాల విచ్ఛిన్నానికి దారితీసిన సంఘటనలు విదేశాల్లో బోలెడు. పెద్దమొత్తాల్లో నగదు బహుమతులను గెలిచినప్పుడు ఏడాదికి కొంత మొత్తం చొప్పున అందచేయడమే దీనికి విరుగుడు. ఇలాంటి పద్ధతి అమెరికాలో కొన్ని లాటరీ స్కీమ్‌లకు అమలవుతోంది. జాక్‌పాట్ వంటి పెద్దమొత్తాల్లో నగదును గెలుచుకున్న వ్యక్తికి ఒకేసారి అంత డబ్బునూ ఇవ్వకుండా కొన్నేళ్ళ కాలవ్యవధిలో వాయిదాల వంతున చెల్లిస్తారు. ఈ పద్ధతిని తప్పనిసరి చేయడం వల్ల ప్రయోజనం ఉంటుంది.

ఆటగాళ్ళకు లాటరీలపట్ల అంతులేని వ్యామోహం పెరగకుండా ఉండే విధంగా లాటరీ స్కీమ్‌లకు రూపకల్పన జరగాలి. సాధారణంగా బహుమతి మొత్తాన్ని చూసి ఆటగాళ్ళు ప్రభావితమవుతారు. వారు తమ విజయావకాశాలను ఎక్కువగా ఊహించుకుంటారని, అదే సమయంలో వ్యక్తిగతంగా తమకు కలిగే కష్టనష్టాలను తక్కువ అంచనా వేస్తారని మానసిక శాస్త్రవేత్తలు పలు

సందర్భాల్లో జరిపిన అధ్యయనాల్లో వెల్లడైంది. సింగిల్ డిజిట్ లాటరీలపైనా, స్క్రాచ్ టిక్కెట్ లాటరీలపైనా ఆటగాళ్ళు వ్యామోహం పెంచుకునేది అందుకే. అందువల్లనే ఇండియాలో ఈ రెండు లాటరీలను నిషేధించారు. బ్రిటన్‌లో ఆటగాళ్లను వ్యామోహానికి గురి చేసేలా ప్రోత్సహించే లాటరీల లైసెన్సులను రద్దు చేసే అధికారం డైరెక్టర్ జనరల్‌కు ఉంది. ఆటగాళ్ళ మనస్తత్వాలపైన, వారు వ్యయం చేసే విధానాలపైనా విస్తృత స్థాయిలో అధ్యయనాలు జరిపిన బ్రిటిష్ ప్రభుత్వం ఆటగాళ్ళు విపరీతమైన వ్యామోహంతో లాటరీల్లో పాల్గొనడానికి దారి తీసే పరిస్థితులపై ఎలాంటి పరిశోధనలనూ జరపకపోవడం విచారకరం.

జాక్‌పాట్ మొత్తాలపై సీలింగ్ విధించాల్సిన అవసరం ఉంది. యునైటెడ్ కింగ్‌డమ్‌లో జాక్‌పాట్ రోల్ ఓవర్ అవుతుందని తెలిసినప్పుడల్లా దానిలో పాల్గొనే ఆటగాళ్ళ సంఖ్య 62 శాతంనుంచి 74 శాతం పెరుగుతున్నట్లు వెల్లడైంది. జాక్‌పాట్‌లో బహుమతి మొత్తం అత్యధికంగా ఉన్నప్పుడు ఆటగాళ్ళు వేలం వెర్రిగా టిక్కెట్లు కొంటున్నట్లు కూడా పలు అధ్యయనాల్లో బహిర్గతమైన సత్యం. కాగా ప్రైజ్‌మనీ స్వల్పంగా ఉన్నప్పుడు ప్రభుత్వానికి ఆదాయం రావడం లేదని కూడా తెలిసింది. కాబట్టి ప్రైజ్ మనీ ప్రభుత్వానికి ఆదాయం లభించే విధంగా ఉండటంతోపాటు ఆటగాళ్లు వేలం వెర్రిగా పాల్గొనడాన్ని నివారించే విధంగానూ ఉండటం అత్యవసరం.

ప్రైజ్‌మనీని విజేతలకు అందించడం, విజేతలు ప్రైజ్‌మనీని క్లెయిమ్ చేసుకోవడం వంటి వాటికి అన్ని దేశాలూ కొంత గడువును నిర్దేశిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో ఆపరేటర్లు విజేతలకు సకాలంలో బహుమతిని అందించరు. దీంతో విజేతలు వడ్డీని నష్టపోవలసి వస్తోంది. జాక్‌పాట్‌లు, బంపర్ ప్రైజ్‌ల విషయంలో సాధారణంగా ఇలా జరుగుతూంటుంది.

బాలబాలికలను ఆకర్షించేలా లాటరీలకు రూపకల్పన జరగకూడదు. లాటరీల్లో పాల్గొనేందుకు ప్రతి దేశమూ వయోపరిమితిని నిర్దేశించింది. మన

దేశంలో మహారాష్ట్ర ప్రభుత్వం లాటరీల్లో పాల్గొనేందుకు కనీస వయో పరిమితిని 18 సంవత్సరాలుగా పేర్కొంది. అనేక దేశాల్లో కూడా కనీస వయోపరిమితి 18 ఏళ్ళు. యునైటెడ్ కింగ్‌డమ్‌లో ఇది 16 ఏళ్ళు మాత్రమే. మలేసియాతోపాటు మరికొన్ని దేశాలు 21 ఏళ్ళ కనీస వయోపరిమితిని నిర్ణయించగా కెనడాకు చెందిన బ్రిటిష్ కొలంబియా, అమెరికాలోని నెబ్రాస్కాలు 19 ఏళ్ళుగా నిర్దేశించాయి. అయినప్పటికీ అనేక దేశాల్లో మైనారిటీ తీరని బాలబాలికలు లాటరీ టిక్కెట్లను కొనుగోలు చేస్తున్నారు. వారికి తల్లిదండ్రులనుంచి ఇది అలవాటవుతోంది. దీంతో తల్లిదండ్రులు లాటరీల్లో పాల్గొనేందుకు పిల్లలతో రాకూడదని, వారి సమక్షంలో ఆడకూడదని 'సింగపూర్ పూల్స్' సలహా ఇస్తోంది. లాటరీలో పాల్గొనేందుకు వచ్చిన వారి వయసుకు సంబంధించి అనుమానం కలిగితే ఐడెంటిటీ ప్రూఫ్ చూపించవలసిందిగా అడగాలని రిటైలర్లను సింగపూర్ ప్రభుత్వం ఆదేశించింది. లాటరీలో పాల్గొనేందుకు రిటైలర్ ఎవరైనా మైనర్లకు అనుమతి ఇచ్చిన పక్షంలో వారిని శిక్షించే అధికారం, వారి లైసెన్స్‌ను రద్దు చేసే అధికారం  సింగపూర్ పూల్స్‌కు ఉంది.

యునైటెడ్ కింగ్‌డమ్‌లో వివిధ ఉత్పత్తుల కొనుగోళ్ళ తీరును పరీక్షించే అధికారం ట్రేడింగ్ స్టాండర్డ్స్ విభాగానికి ఉంది. ఈ విభాగం పదహారేళ్ళ లోపు వయసున్న పిల్లలచేత లాటరీ టిక్కెట్లు కొనిపిస్తుంది. వాస్తవానికి వారికి ఎవరూ టిక్కెట్లు అమ్మకూడదు. ఎవరైనా రిటైలర్ వారికి టిక్కెట్లు అమ్మినట్లయితే వెంటనే సదరు రిటైలర్ లైసెన్సును కనీసం మూడు నెలల పాటు రద్దు చేస్తుంది. ఇదే కారణంపై ఇప్పటివరకూ 118 టెర్మినళ్ళను రద్దు చేసింది. మరోపక్క యుకె లాటరీ ఆపరేటర్ 'ఆపరేషన్ చైల్డ్' పేరిట లాటరీల్లో చిన్నారులు పాల్గొనడాన్ని నివారించేందుకు తన సొంత యంత్రాంగాన్ని కూడా ఏర్పాటు చేసుకుంది.

యునైటెడ్ కింగ్‌డమ్ ప్రభుత్వం మేధావులు, శాస్త్రవేత్తలు, మార్కెట్ అధ్యయనవేత్తల సహకారంతో 'గేమ్ డిజైనింగ్ ప్రోటోకాల్'ను రూపొందించుకుంది. ఆర్థికంగా బలహీనులు, మైనారిటీ తీరని పిల్లలు, లాటరీని

వ్యసనంగా చేసుకున్నవారు లాటరీలో పాల్గొంటున్నట్లయితే ఆ విషయాన్ని పట్టి ఇచ్చే సాధనమిది. అలాగే 'ఆప్టిమమ్' పేరిట ఓ కంప్యూటర్ సాఫ్ట్‌వేర్‌నూ తయారుచేసింది. ఆయా ప్రాంతాలను బట్టి రిటైల్ అవుట్‌లెట్ ఏర్పాటుకు అడ్వర్టయిజ్‌మెంట్ వ్యూహాన్ని ఎలా రూపొందించాలో సూచించే సాఫ్ట్‌వేర్ ఇది.

అమెరికాలో వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు జాక్‌పాట్ గెలుచుకున్న విజేతకు ఆర్థికపరంగానూ, న్యాయపరంగానూ ఎదురయ్యే సమస్యలను ఎలా అధిగమించాలనే విషయమై సూచనలను, సలహాలను అందజేస్తాయి. యు.కె.లో 50,000 పౌండ్లకు మించి ప్రైజ్‌మనీని గెలుచుకునే ఆటగాళ్ళకు ఆర్థిక, న్యాయపరమైన సలహాలతో కూడిన సమాచారాన్ని కూడా అందిస్తారు. 250,000 పౌండ్ల ప్రైజ్‌మనీని గెలుచుకున్న విజేతలకు ఆర్థిక, న్యాయ సలహాదారు సేవలను ప్రభుత్వమే అందజేస్తుంది.

తమ ఆటగాళ్ళు లాటరీ స్కామ్‌లలో ఇరుక్కోకుండా ఉండేందుకు లాటరీ ఆపరేటర్లే స్వయంగా ఆటగాళ్లను చైతన్యపరచే కార్యక్రమాలను నిర్వహిస్తారు. కొలరాడో లాటరీ తమ ఆటగాళ్ళను ALERT పేరిట అప్రమత్తం చేసేందుకు ఐదు సూచనలను ప్రచారంలోకి తెచ్చింది. అవి

Ask Questions (ప్రశ్నించండి)

Listen Carefully (జాగ్రత్తగా వినండి)

Educate Yourself (స్వయంగా తెలుసుకోండి)

Refuse to be pressured (ఒత్తిళ్ళకు లొంగకండి)

Tell the Authorities (అధికారులకు చెప్పండి)

# భద్రతా చర్యలు

లాటరీ టిక్కెట్ల ముద్రణకు ఉపయోగించే యంత్రాలకు, సిబ్బందికి తగిన రక్షణ కల్పించడంతోపాటు నకిలీ టిక్కెట్ల ముద్రణ జరగకుండా ఉండేందుకు, డ్రాలు సాఫీగా సాగేందుకు ప్రతి దేశమూ తగిన భద్రతా ఏర్పాట్లు చేపడుతుంది.

## టిక్కెట్ల ముద్రణలో జాగ్రత్తలు

ఇండియాలో రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా లేక ఇండియన్ బ్యాంక్ అసోసియేషన్ అమోదించిన సెక్యూరిటీ ప్రింటర్లకు మాత్రమే లాటరీ టిక్కెట్లను ముద్రించే హక్కు ఉంటుంది. సీరీస్‌ను (అక్షర క్రమం), లాటరీ టిక్కెట్ల నంబర్లను ముద్రించేందుకు ప్రత్యేకమైన ఇంకును వినియోగిస్తారు.

ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తమ లోగోను, సంబంధిత అధికారి సంతకాన్ని టిక్కెట్లపై ముద్రిస్తాయి. టిక్కెట్లపై నిర్దిష్టమైన సెక్యూరిటీ మార్కులను కూడా ముద్రిస్తాయి. టిక్కెట్లను ప్రింటర్ ఇన్స్యూర్ చేయించవలసి ఉంటుంది. టిక్కెట్ల ముద్రణ పూర్తయ్యాక సంబంధిత ప్లేట్లను ధ్వంసం చేయాల్సి ఉంటుంది. ఇంకా మిగిలిపోయిన కాగితపు వ్యర్థాలను, చిరిగిపోయిన టిక్కెట్లను అధికారుల సమక్షంలోనే ధ్వంసం చేయాల్సి ఉంటుంది. సకాలంలో టిక్కెట్లను ముద్రించి ఇచ్చేందుకు పూచీకత్తుగా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రింటర్‌నుంచి సెక్యూరిటీ డిపాజిట్‌నుగాని, బ్యాంక్ గ్యారంటీనిగాని కోరతాయి.

చైనాలో టిక్కెట్ల ముద్రణకు ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారు. బీజిన్ జాంగ్‌కై ప్రింటింగ్ కంపెనీ లిమిటెడ్ (బి.జడ్.పి.) అధీనంలో పనిచేసే నాణ్యత పరీక్షా విభాగం టిక్కెట్ల ఉత్పత్తి మొదలయ్యాక ప్రతి దశలోనూ కెమికల్, ఎలక్ట్రికల్, మెకానికల్ పరీక్షలు నిర్వహిస్తుంది. పనికిరాని టిక్కెట్లను బి.జడ్.పి.లోనే ఉన్న ఓ ప్రత్యేకమైన ప్రదేశంలో ధ్వంసం చేస్తారు. ఇజ్రాయెల్‌లో మిఫల్ హిపాయిస్ నకిలీ టిక్కెట్లు వెల్లువెత్తకుండా ఉండేందుకు టిక్కెట్లను విదేశాల్లో ముద్రిస్తుంది.

యు.కె.లో ప్రతి స్క్రాచ్ కార్డుకు విలక్షణమైన ఓ వెరిఫికేషన్ నంబర్, బార్ కోడ్ ఉంటాయి. మిస్సోరీలోనూ స్క్రాచ్ టిక్కెట్లను పరీక్షించేందుకు విస్తృత యంత్రాంగం ఉంది.

******

## మార్కెటింగ్ ఏజెంట్ల భద్రతా చర్యలు

టిక్కెట్లను అమ్మకానికి విడుదల చేసేముందు వాటిపై నంబర్లు సరిగ్గా ఉన్నాయో లేదో మార్కెటింగ్ ఏజెంట్లు తనిఖీ చేస్తారు. ముద్రణ సరిగ్గా లేని, తప్పుడు నంబర్లు ఉన్న టిక్కెట్లను గుర్తించి వాటి స్థానంలో కొత్తవి పంపాలనిగాని లేదా వాటిని ధ్వంసం చేయాలని గాని కోరుతూ సంబంధిత లాటరీ డైరెక్టరేట్‌కు తిప్పి పంపుతారు.

## అమ్ముడుకాని టిక్కెట్లు

టిక్కెట్ల అమ్మకం పూర్తయ్యాక మిగిలిపోయిన టిక్కెట్లను వెంటనే పంచ్ చేస్తారు. వాటిని దుర్వినియోగం చేయకుండా ఉండేందుకే ఈ ఏర్పాటు. ఆ తరవాత వీటిని ఓ పెట్టెలో పెట్టి లాటరీ డ్రా పూర్తయ్యేంతవరకూ భద్రపరుస్తారు.

## బహుమతి గెలిచిన టిక్కెట్లు

బహుమతి పొందిన ఆటగాళ్లు ఇచ్చిన టిక్కెట్లను తనిఖీ చేసి పంచ్ చేస్తారు. వాటిపై డ్రా తేదీ, నంబర్ వంటి వివరాలను నిశితంగా పరీక్షిస్తారు. అవి నకిలీవి కాదని ధ్రువీకరించుకున్నాకనే వాటి తాలూకు నగదు బహుమతులను విజేతలకు అందిస్తారు.

## డ్రా సమయంలో భద్రత

కొన్ని రకాల డ్రాలను డైరెక్టర్ సమక్షంలో తీయాలని, మరికొన్ని రకాల స్కీమ్‌లకు సంబంధించి ప్రభుత్వం నియమించిన న్యాయమూర్తుల సమక్షంలో

డ్రా తీయాలని ఇండియాలోని రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశిస్తున్నాయి. ప్రతి డ్రాకు ముందు న్యాయమూర్తులు డ్రా తీసే యంత్రాలను తనిఖీ చేస్తారు. అమెరికాలోని ఓరెగాన్‌లో డ్రా తీసే ర్యాండమ్ నంబర్ జనరేటర్‌ను ఆ రాష్ట్ర పోలీస్ గేమింగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సెక్షన్ పరీక్షించి సర్టిఫై చేస్తుంది. లాటరీ నిర్వహణలో పారదర్శకత ఉట్టిపడేలా జాగ్రత్తలు తీసుకుంటుంది. ఆపరేటర్లకు తగిన రక్షణ కల్పిస్తుంది. డ్రాలను తిలకించేందుకు ప్రతి దేశమూ తమ పౌరులకు అవకాశం కల్పిస్తుంది. ఇజ్రాయెల్ వంటి కొన్ని దేశాల్లో డ్రా ఫలితాలను స్టాటిస్టికల్ అధికారులు తనిఖీ చేస్తారు.

ఉత్తర అమెరికాలోని అన్ని రాష్ట్రాల్లోనూ లాటరీ నిర్వహణ ప్రక్రియ యావత్తు పారదర్శకంగా జరుగుతుంది. లాటరీ రికార్డులను ప్రజలకు అందుబాటులో ఉంచుతారు. మీడియా కూడా వాటిని పరిశీలించవచ్చు. లాటరీ కార్యకలాపాలల్లో పాలుపంచుకునే ఉద్యోగులు, వారి కుటుంబాలు లాటరీలో పాల్గొనకూడదని అనేక రాష్ట్రాల్లో నిబంధన అమలులో ఉంది. లాటరీ నిర్వహణలో తగిన భద్రతా ఏర్పాట్లు తీసుకుంటున్నదీ లేనిదీ పరిశీలించేందుకు మిస్సోరీ రాష్ట్రంలో ఓ ప్రత్యేకమైన విభాగం ఉంది.

అమెరికాలో బంతులను ఉపయోగించి డ్రా తీసే స్కీమ్‌లలో సదరు బంతులను ఓ బాక్స్‌లో పెట్టి భద్రపరుస్తారు. ఈ బాక్స్‌కు అంకెలతో కూడిన మెటల్ సీల్‌ను వేస్తారు. నెలకోమారు ప్రతి బంతినీ తీసి బరువు చూస్తారు. దాని చుట్టుకొలతను కొలిచి, దానిని తారుమారు చేయలేదని నిర్ధారించుకుంటారు. మధ్యాహ్నం, సాయంత్రాలు వరుసగా డ్రాలు ఉన్నప్పుడు మధ్యాహ్నం ఉపయోగించిన బంతుల సెట్‌ను సాయంత్రం డ్రాకు ఉపయోగించరు. లోటో, టేక్ ఫైవ్ వంటి గేమ్‌లలో మూడు నెలలకోసారి బంతులను మారుస్తూ ఉంటారు. విన్4 వంటి గేమ్‌లలో ఒకనెలకోసారి ,పిక్ 10 వంటి గేమ్‌లలో రెండు నెలలకోసారి చొప్పున బంతులను మారుస్తారు. డ్రా పూర్తయిన వెంటనే మెషీన్‌ను ఒక రూమ్‌లో ఉంచి సీల్ చేస్తారు. దీనిపై

24 గంటలూ నిఘా ఉంటుంది. ఈ గదికి అలారం, కదలికలను పసిగట్టే డిటెక్టర్లు ఉంటాయి. గదిలోకి వెళ్ళాలంటే సీల్‌ను పగులగొట్టాల్సి ఉంటుంది. సీల్‌పై ఉన్న నంబర్‌ను రికార్డు చేస్తారు. ఆటోమేటిక్‌గా పనిచేసే డ్రా మెషీన్‌లో కంప్యూటర్ హార్డ్‌వేర్‌కు అంకెలతో కూడిన సెక్యూరిటీ సీల్ ఉంటుంది. సాఫ్ట్‌వేర్ జనరేట్ చేసే ర్యాండమ్ నంబర్లను తారుమారు చేయడం కూడా కష్టసాధ్యం.

యునైటెడ్ కింగ్‌డమ్‌లో అన్ని రిటైల్ అవుట్‌లెట్లలోనూ సిసిటివీలు (క్లోజ్‌డ్ సర్క్యూట్ టెలివిజన్లు) ఉంటాయి. కొన్ని సందర్భాల్లో వీటి ఫుటేజ్ ఆధారంగా నేరగాళ్ళను గుర్తించడమూ కద్దు. బ్రిటిష్ స్టాండర్డ్స్ ఇన్‌స్టిట్యూషన్ (బి.ఎస్.ఐ.) నిర్దేశించిన ప్రమాణాల మేరకు డ్రా మెషీన్లను తయారు చేస్తారు. డ్రాలలో ఉపయోగించే బంతులను సీల్ వేసిన కంటెయినర్లలో భద్రపరుస్తారు. వాటిని క్రమం తప్పకుండా బరువు తూచి చూస్తూంటారు. సిసిటీవీల సహాయంతో డ్రా మెషీన్లను నిరంతరం పర్యవేక్షిస్తుంటారు.

## కంప్యూటర్, ఆన్‌లైన్ గేమ్‌లకు భద్రత

కంప్యూటర్, ఆన్‌లైన్ లాటరీల విషయంలో కంప్యూటర్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌లకు తగిన భద్రత కల్పించడంతోపాటు సంస్థాగతంగాను ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారు. కంప్యూటర్లన్నీ ఒకే పాస్‌వర్డ్‌తో పనిచేస్తాయి. ఈ పాస్‌వర్డ్ కీలకమైన అధికారులకు మాత్రమే తెలిసి ఉంటుంది. మొత్తం నెట్‌వర్క్‌ను రిలయన్స్, హెచ్‌సిఎల్, సత్యం వంటి సర్వీస్ ప్రొవైడర్లే హ్యాండిల్ చేస్తాయి. ఈ సంస్థలు అత్యుత్తమ భద్రతా ప్రమాణాలను పాటిస్తాయి.

ప్రతి రిటైల్ పి.ఓ.ఎస్. టెర్మినల్‌కూ సెంట్రల్ సర్వర్‌ను ఏక్సెస్ చేసుకునే అవకాశం ఉంటుంది. అయితే ఏజెంట్ పాస్‌వర్డ్‌ద్వారా అనుమతి పొందితేనే ఇది సాధ్యమవుతుంది. రక్షణ యంత్రాంగం ఎప్పుడైనా విఫలమైన పక్షంలో ప్రధాన సర్వర్‌తో టెర్మినల్‌కు కనెక్షన్ దానంతట అదే తెగిపోతుంది.

## ఎ. వినియోగదారుడి ఆథరైజేషన్

సిస్టమ్‌లు (కంప్యూటర్లు) కేవలం పాస్‌వర్డ్‌ను ఉపయోగిస్తేనే పనిచేస్తాయి. ఈ పాస్‌వర్డ్‌లు అధీకృత అధికారులకు మాత్రమే తెలుస్తాయి.

## బి. టెర్మినల్ ఐడెంటిటీ మరియు ఆథరైజేషన్

ప్రతీ హార్డ్‌వేర్ టెర్మినల్‌కూ ఓ ప్రత్యేకమైన గుర్తింపు ఉంటుంది. కాబట్టి దాని ఆథరైజేషన్ స్థాయిని తనిఖీ చేసుకునే సౌలభ్యం ఉంటుంది. ఈ రకమైన టెర్మినల్స్‌ను మాత్రమే లావాదేవీలు జరిపేందుకు అనుమతిస్తారు.

## సి. యాక్సెస్ నెట్‌వర్క్ సెక్యూరిటీ

ఏజెంట్ పాస్‌వర్డ్ ద్వారా ఆథరైజేషన్ ఇచ్చిన తర్వాతనే సెంట్రల్ సర్వర్‌తో ప్రతి రిటైల్ పిఓఎస్ టెర్మినల్‌కూ యాక్సెస్ లభిస్తుంది. నెట్‌వర్క్‌లో లోపాలు తలెత్తి, సెక్యూరిటీ యంత్రాంగం విఫలమైతే ఆటోమేటిగ్గా ప్రధాన సర్వర్‌నుంచి టెర్మినల్‌తో సంబంధాలు తెగిపోతాయి. పబ్లిక్ నెట్‌వర్క్‌ను ఉపయోగించినా అందులోనే అంతర్గతంగా సబ్ నెట్‌వర్క్ పనిచేసే విధంగా వర్చువల్ ప్రైవేట్ నెట్‌వర్క్ (విపిఎన్) ఏర్పాటు చేయబడుతుంది. దీనివల్ల లాటరీ వినియోగదారులకు రక్షణ చేకూరుతుంది. విడిగా ఐడెంటిటీ మరియు పాస్‌వర్డ్‌ల సహాయంతో విపిఎన్ యాక్సెస్ అవుతుంది. దీనివల్ల మొత్తం వ్యవస్థకు మరింత భద్రత చేకూరుతుంది. విపిఎన్ వల్ల వైరస్ బెడద కూడా ఉండదు.

## డి. కోర్ నెట్‌వర్క్ సెక్యూరిటీ

లాటరీ ఆపరేటర్లు తమ సర్వర్లను అనుసంధానించేందుకు అతి ప్రధానమైన టెలికాం సర్వీస్ ప్రొవైడర్లను ఎంచుకుంటారు. ఈ సర్వీస్ ప్రొవైడర్లు అత్యంత రక్షణను చేకూరుస్తాయి.

## ఇ. ఫైర్‌వాల్

సర్వర్లను ఫైర్‌వెల్ అనే ఓ భద్రతా పరికరం వెనుక అమరుస్తారు. ఈ ఫైర్‌వెల్ హార్డ్‌వేర్ గాని సాఫ్ట్‌వేర్‌గాని అయి ఉంటుంది. అనధీకృత యాక్సెస్‌లను ఈ ఫైర్‌వెల్ వడగడుతుంది. అనధికార ప్రవేశాలను గుర్తించి, ఆ విషయాన్ని వెంటనే సంబంధిత అధికారులకు చేరవేయడంలో ఇది చురుగ్గా పనిచేస్తుంది.

## ఎఫ్. డేటా సెక్యూరిటీ

డేటా బేస్‌తో వినియోగదారులకు నేరుగా యాక్సెస్ ఉండకుండా ఉండేందుకు డేటాబేస్‌ను అప్లికేషన్ సాఫ్ట్‌వేర్ వెనుక ఉంచుతారు. అప్లికేషన్ సాఫ్ట్‌వేర్ ద్వారానే లావాదేవీలు జరుగుతాయి. డేటాబేస్ నిర్వహణకోసం కొద్దిమందికి మాత్రమే యాక్సెస్ కల్పించబడుతుంది.

## జి. వ్యాపార కొనసాగింపు మరియు విపత్తుల నివారణ చర్యలు

సహజంగానూ లేదా మానవ తప్పిదాలవల్ల జరిగే విపత్తులనుంచి రక్షించేందుకు సర్వర్లను వివిధ సీస్మిక్ జోన్లలో ఉంచుతారు. ఉదాహరణకు ప్రైమరీ సర్వర్లను ముంబాయిలో (సీస్మిక్ మ్యాప్‌లో ముంబాయి జోన్ 4లో ఉంది) ఉంచబడ్డాయి. బ్యాక్ అప్ సర్వర్లను బెంగళూరులో (జోన్ 1) ఉంచారు. సర్వర్ల మధ్య డేటాబేస్ మార్పిడి జరుగుతుంటుంది. దీనివల్ల సర్వీస్‌లో అంతరాయం లేకుండా వ్యాపార కార్యకలాపాలు అటూ ఇటూ

త్వరితగతిన షిఫ్ట్ అయ్యేందుకు అవకాశం ఉంటుంది.

## హెచ్. భౌతిక భద్రత

సర్వర్లను ఏర్పాటు చేసిన సెంటర్లలో చక్కటి ఏర్పాట్లు ఉంటాయి. అంతేకాదు, ఈ సెంటర్లకు భౌతిక భద్రత కూడా పటిష్ఠంగా ఉంటుంది బయోమెట్రిక్ యాక్సెస్ కంట్రోల్ వంటి అధునాతన గాడ్జెట్లతో కూడిన భద్రత

ఈ సెంటర్లకు ఉంటుంది. అధీకృత సిబ్బంది మాత్రమే ఈ సెంటర్లలో ప్రవేశానికి అనుమతి ఉంటుంది.

### ఐ. టిక్కెట్ల ముద్రణ

ఒక టెర్మినల్‌నుంచి జారీ అయ్యే టిక్కెట్లు, అడ్వైజ్ స్లిప్పులు, కొనుగోళ్లకు సంబంధించిన రుజువులు వంటివాటన్నింటికీ సెంట్రల్ సర్వర్‌నుంచి ఓ ప్రత్యేకమైన నంబర్ జారీ అవుతుంది. సంబంధిత టిక్కెట్లకు, రసీదులకు సెంట్రల్ సర్వర్ ఆథరైజేషన్ ఉందనడానికి ఈ నంబరే సాక్ష్యం. దీంతోపాటు ప్రతి టిక్కెట్‌కూ ఓ ప్రత్యేకమైన బార్‌కోడ్ ఉంటుంది.

ఆన్‌లైన్, కంప్యూటర్ లాటరీలు ప్రభుత్వం ఆధ్వర్యంలో లేదా ప్రభుత్వం అనుమతితో నడుస్తున్నాయని ప్రజలకు తెలిసేందుకు గాను టిక్కెట్లపై ప్రభుత్వ లోగో, సంబంధిత అధికారి సంతకం ముద్రించడాన్ని తప్పనిసరి చేశాయి. టిక్కెట్ ఎక్కడ, ఏ సమయానికి ఇష్యూ అయిందో తెలియజేసే ఓ సీరియల్ నంబర్‌నూ టిక్కెట్‌పై పేర్కొంటారు. టిక్కెట్లను అనుకరించడానికి వీలులేని ప్రత్యేకమైన కాగితంపై ముద్రిస్తారు.

### జె. బహుమతి చెల్లింపు

బహుమతులు చెల్లించే ముందు టిక్కెట్లను పూర్తిగా తనిఖీ చేస్తారు. స్కాన్ చేసిన డేటాను టిక్కెట్ ఇష్యూ చేసేటప్పుడు స్టోర్ చేసి ఉంచిన డేటాతో సెంట్రల్ సర్వర్ పోల్చి చూస్తుంది. క్లెయిమ్‌కు గడువు పూర్తి కాగానే తన వద్ద ఉన్న క్లెయిమ్‌కాని బహుమతుల జాబితాను సర్వర్ విడుదల చేస్తుంది. దీనివల్ల ప్రభుత్వ ఖాతాలో జమ చేయాల్సిన క్లెయిమ్ కాని బహుమతుల విలువ ఎంతో తేలుతుంది.

# రిటైలర్ల పాత్ర

లాటరీ విజయవంతం కావాలంటే రిటైలర్ల నెట్‌వర్క్ పటిష్టంగా ఉండటం ఎంతో ముఖ్యం. ప్రజలకు, లాటరీ ఆపరేటర్లకు మధ్య రిటైలర్లు సంధానకర్తలుగా వ్యవహరిస్తారు. ప్రజలతో వారు ప్రత్యక్ష సంబంధం కలిగి ఉంటారు కాబట్టి లాటరీ జయాపజయాలు వారి పనితీరుపై ఆధారపడి ఉంటాయి. అందువల్ల రిటైలర్లపై ప్రభుత్వం, లాటరీ ఆపరేటర్లు కూడా ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తారు.

కేరళ రాష్ట్రంలో 35,000 మంది లాటరీ రిటైలర్లు ఉన్నారు. మహారాష్ట్రలో 1.5 లక్షల మంది, పంజాబ్‌లో 30,000 మంది, హర్యానాలో సుమారు 20,000 మంది, కర్నాటకలో దాదాపు 1.5 లక్షల మంది రిటైలర్లుగా పనిచేస్తున్నారు.

ఇండియాలో ఎవరైనా లాటరీ రిటైలర్ కావచ్చు. దీనికి విద్యార్హతలేమీ లేవు. రిటైల్ అవుట్‌లెట్‌ను ఏర్పాటు చేసుకుని, దానిని చక్కగా నడపగల సామర్థ్యం ఉంటే చాలు. తాను అమ్మిన టిక్కెట్‌కు బహుమతి లభిస్తే రిటైలర్‌కు బోనస్ కమిషన్‌ను ఇచ్చే సాంప్రదాయం అనేక దేశాల్లో ఉంది. ఉదాహరణకు సిక్కింలో తొలిసారిగా ఆన్‌లైన్ లాటరీని ప్రవేశపెట్టినప్పుడు జాక్‌పాట్ గెలుచుకున్న వ్యక్తికి 8.61 కోట్ల రూపాయల బహుమతి లభిస్తే, ఆ టిక్కెట్‌ను అమ్మిన రిటైలర్‌కు ఒక శాతం అంటే... 8.61 లక్షలు కమిషన్‌గా దక్కింది. మామూలుగా ఇచ్చే కమిషన్‌కు ఇది అదనం అన్నమాట. మామూలుగా ఒక్కో లాటరీ టిక్కెట్ ధరను 11 రూపాయలుగా నిర్ణయిస్తారు. సెల్లింగ్ ఏజెంట్లకిచ్చే కమిషన్ ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా ఉంటుంది. సాధారణంగా రిటైలర్‌కు 25 పైసలు, స్టాకిస్టుకు, పంపిణీదారుకు చెరో 15 పైసలు, ఉప పంపిణీదారుకు 20 పైసలు, రాష్ట్ర ప్రభుత్వానికి 25 పైసలు లభిస్తాయి. మిగిలిన మొత్తం ప్రైజ్‌మనీ ఫండ్‌కు వెళుతుంది.

కనెక్టికట్‌లో మిస్టరీ షాపర్ ప్రోగ్రామ్ పేరిట ఓ స్కీమ్ అమలులో ఉంది. లాటరీ డైరెక్టరేట్‌కు చెందిన ప్రతినిధులు ముందుగా సమాచారం ఇవ్వకుండా

రిటైల్ అవుట్‌లెట్లను సందర్శిస్తారు. అవుట్‌లెట్‌ను, రిటైలర్ పనితీరును అంచనా వేసి, వారు డైరెక్టరేట్‌కు ఓ నివేదిక ఇస్తారు. ఈ నివేదిక ఆధారంగా సంబంధిత లాటరీ స్కీమ్‌ను ఆకర్షణీయంగా ప్రదర్శనకు ఉంచిన రిటైలర్‌కు నగదు పారితోషికాలు అందిస్తారు. అలాగే కనెక్టికట్‌లో ప్రీమియం పాయింట్ రివార్డ్స్ ప్రోగ్రామ్ అనే మరో స్కీమ్ ఉంది. ఇందులో ఆయా గేమ్‌లకు సంబంధించి ఎక్కువ టిక్కెట్లను అమ్మిన రిటైలర్లకు పాయింట్లు లభిస్తాయి. ఈ పాయింట్లను బట్టి వారికి బహుమతులు వస్తాయి.

బెల్జియంలోని నేషనల్ లాటరీ మార్కెటింగ్ విభాగం కొత్త గేమ్‌ల రూపకల్పనపై దృష్టి సారించడంతోపాటు పంపిణీ వ్యవస్థతో సన్నిహిత సంబంధాలు నెలకొల్పుకోవడం లక్ష్యంగా నిర్దేశించుకుంది. రిటైలర్లలో ఉత్సాహం నింపేందుకు, వారిలో వృత్తి నైపుణ్యం పెంపొందించేందుకు మార్కెటింగ్, అడ్వర్టయిజింగ్ విభాగాలు ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తూంటాయి. అమ్మకాలను పెంచిన రిటైలర్లకు బహుమతులు కూడా ఇస్తూంటాయి.

కెంటకీలో రిటైలర్లకోసం సేల్స్ ఇన్సెంటివ్ ప్రోగ్రామ్ అమలవుతోంది. అమ్మకాల టార్గెట్‌ను అధిగమించిన రిటైలర్లకు ఇన్సెంటివ్‌లు అందజేస్తారు.

ఇజ్రాయెల్‌లో తమ రిటైల్ అవుట్‌లెట్లను ఆకర్షణీయంగా తీర్చి దిద్దుకున్న రిటైలర్లకోసం అడపాదడపా 'ఆకట్టుకునే లాటరీ బూత్' పేరిట పోటీలను నిర్వహిస్తారు. రిటైలర్లు, పంపిణీదారులు, మార్కెటింగ్ సిబ్బంది పనితీరు మెరుగు పరిచేందుకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

మసాచుసెట్స్‌లో ఎక్కువ టిక్కెట్ పుస్తకాలను విక్రయించిన ఏజెంట్లకోసం డ్రా నిర్వహిస్తారు. ప్రతి పదిహేనురోజులకోసారి జరిగే ఈ డ్రాలో దాదాపు వెయ్యి మంది ఏజెంట్లకు 50 నుంచి 10,000 డాలర్ల వరకూ పారితోషికాలు లభిస్తాయి. రెండు నెలలకోసారి గ్రాండ్ ప్రైజ్ డ్రా కూడా ఉంటుంది. డ్రాలో గెలిచిన వారికి ప్రథమ బహుమతిగా 250,000 డాలర్లు, 50,000 డాలర్లు చొప్పున నాలుగు ఇతర బహుమతులు అందజేస్తారు.

న్యూ మెక్సికో లాటరీ అథారిటీ రిటైల్ అవుట్‌లెట్ల డిజైన్, టిక్కెట్ల

అమ్మకాలను బట్టి రిటైలర్లకు పాయింట్లు ఇస్తుంది. ఈ పాయింట్ల ఆధారంగా రిటైలర్లను గోల్డ్ లేదా సిల్వర్ హోదా లభిస్తుంది. గోల్డ్ హోదా దక్కించుకున్న రిటైలర్‌కు తాను అమ్మిన టిక్కెట్లపై అదనంగా 0.5 శాతం, సిల్వర్ హోదా లభించిన రిటైలర్‌కు అదనంగా 0.25 శాతం కమిషన్ ఇస్తారు.

న్యూ మెక్సికో లాటరీ అథారిటీ సిబ్బందికోసం విడిగా మరో స్కీమ్‌ను అమలు చేస్తోంది. లాటరీ అథారిటీకి చెందిన ప్రతినిధులు రిటైల్ షాపులను సందర్శించి, సిబ్బందితో మాట్లాడతారు. గేమ్‌లను ప్రమోట్ చేస్తున్నవారికి, ప్రజలతో సత్సంబంధాలు నెరపుతున్నవారికి పాయింట్లు కేటాయిస్తారు. ఈ పాయింట్లను బహుమతులుగా మార్చుకోవచ్చు.

ట్రినిడాడ్ అండ్ టొబాగోలో టిక్కెట్ల ముఖవిలువకు మూడు రెట్లు ఎక్కువగా డబ్బును ఏజెంట్లు డిపాజిట్ చేయాలి. తరవాత ఈ డిపాజిట్‌ను టిక్కెట్ల అసలు విలువకు సమానంగా తగ్గిస్తారు. ఏజెంట్లకు 15 శాతం కమిషన్‌గా ఇస్తారు. లాటరీలు విజయవంతం కావడంతో ప్రభుత్వం ఏజెంట్లకిచ్చే కమిషన్‌ను 17 శాతానికి పెంచింది.

# లాటరీ ఆధారిత పరిశ్రమలు

లాటరీలవల్ల పరోక్షంగా అనేక పరిశ్రమలకు లబ్ధి చేకూరుతోంది. అడ్వర్టయిజింగ్, ప్రింటింగ్, రవాణా, గేమింగ్ సర్వీస్ ప్రొవైడర్లు, టెలికాం రంగం, మీడియా వంటి పరిశ్రమలు లాటరీలపై లబ్ధి పొందుతున్నాయి.

## అడ్వర్టయిజింగ్

లాటరీ పరిశ్రమకు అడ్వర్టయిజింగ్ ఎంతో కీలకం. వివిధ రకాల లాటరీ స్కీమ్‌లను ప్రమోట్ చేసేందుకు అడ్వర్టయిజ్‌మెంట్లు అవసరమవుతాయి. లాటరీల గురించి ప్రచారం చేసేందుకు బిల్‌బోర్డులు, పోస్టర్లు వంటివాటిని తయారు చేస్తారు. ప్రింట్ మరియు విజువల్ మీడియాలోనూ ప్రకటనలు ఇస్తారు.

యునైటెడ్ కింగ్‌డమ్‌లో లాటరీ ఆపరేటర్ ఏటా ప్రవేశపెట్టే నాలుగు ప్రధాన ఇన్‌స్టంట్ గేమ్‌ల మార్కెటింగ్ కోసం దాదాపు మిలియన్ స్టెర్లింగ్ పౌండ్లను వెచ్చిస్తారు. ఉత్తర అమెరికా లాటరీల్లో మొత్తం వ్యయంలో 1.17 శాతం అడ్వర్టయిజ్‌మెంట్ల కోసమే ఖర్చవుతుంది. మత్తుపానీయాలు, సౌందర్య సాధనాల కోసం చేసే వ్యయం కంటే ఇది ఎంతో తక్కువ. యు.కె.లో మత్తుపానీయాల కంపెనీలు 7.5 శాతం, సౌందర్య సాధన ఉత్పత్తుల కంపెనీలు 8.8 శాతం ఖర్చు చేస్తున్నాయి. అమెరికా లో 1996లో అడ్వర్టయిజ్‌మెంట్లపై 400 మిలియన్ డాలర్లు వ్యయం కాగా, అమ్మకాలపై 34 బిలియన్ డాలర్ల ఆదాయం లభించింది.

ఇండియాలో ఆన్‌లైన్ లాటరీల కార్యకలాపాలను ప్రారంభించినప్పుడు అన్ని ప్రధాన పట్టణాలు, నగరాల్లో పెద్ద పెద్ద బిల్‌బోర్డులపై ప్రకటనలను ప్రదర్శించారు. మొదటిసారి కావడంతో ప్రధాన దినపత్రికల్లో ఫ్రీ లాటరీ కూపన్లను ప్రచురించారు. అప్పట్లో దేశవ్యాప్తంగా 10 భాషలకు చెందిన 68

పబ్లికేషన్లలో తమ లాటరీ స్కీమ్ల గురించి ప్రచారం చేసేవారు. ఆరంభంలో బ్రాండ్ ఇమేజ్ పెంచుకునేందుకు, ప్రజలకు చేరువయ్యేందుకు ఇలా ప్రకటనలను గుప్పించారు. ఇప్పుడు సొంత గేమ్లకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. ఓ ఆన్లైన్ ఆపరేటర్ తమ లాటరీ స్కీమ్ను లాంచ్ చేసేందుకు ప్రచారం కోసం 2.5 కోట్ల రూపాయలను ఖర్చు చేశారు. ఈ లాటరీ వార్షిక అడ్వర్టయిజింగ్ బడ్జెట్ రూ. 65 కోట్లు. డైలీ, వీక్లీ గేమ్లను విడివిడిగా రెండు అడ్వర్టయిజింగ్ ఏజెన్సీలు నిర్వహిస్తూంటాయి. మరో ఆపరేటర్ తన బ్రాండ్ను ప్రవేశపెట్టడంతో అది తన అడ్వర్టయిజింగ్ బడ్జెట్ను రూ. 85 కోట్లకు పెంచింది. స్కీమ్ను బట్టి అడ్వర్టయిజింగ్ బడ్జెట్నుంచి డబ్బును కేటాయిస్తూంటారు. మరో ఆపరేటర్ తొలుత అడ్వర్టయిజింగ్ బడ్జెట్గా రూ. 150 కోట్ల (1500 మిలియన్ రూపాయలు)ను కేటాయించింది.

ఇండియాలో 2002 సంవత్సరంలో మొత్తం అడ్వర్టయిజ్మెంట్లపై చేసిన వ్యయంలో 70 శాతం లాటరీ అడ్వర్టయిజ్మెంట్లమీదే ఖర్చు చేసినట్లు టామ్ ఎడెక్స్ అనే మీడియా రీసెర్చి సంస్థ అధ్యయనంలో తేలింది. ఆ మరుసటి సంవత్సరం ఇది 80 శాతానికి చేరింది. మహారాష్ట్ర, వెస్ట్ బెంగాల్, కేరళ రాష్ట్రాల్లో లాటరీ అడ్వర్టయిజ్మెంట్లు ఎక్కువ. లాటరీ పరిశ్రమ చేసే మొత్తం వ్యయంలో అడ్వర్టయిజ్మెంట్లపై 2002లో 1.07 శాతం, 2003లో 1.34 శాతం వ్యయమైనట్లు అంచనా.

## ప్రింటింగ్

పేపర్ లాటరీ టిక్కెట్లను సెక్యూరిటీ ప్రింటర్లు లేక విశ్వాసపాత్రమైన ప్రింటర్లు మాత్రమే ముద్రిస్తారు. కాగా ఆన్లైన్ టిక్కెట్లను ఆట ప్రారంభమయ్యే సమయంలో పిఓఎస్ టెర్మినళ్ళ వద్ద ప్రింట్ చేస్తారు. బ్రిటన్కు చెందిన నేషనల్ లాటరీ వారానికి 25 మిలియన్ టిక్కెట్లను విక్రయిస్తుంది. ఇండియాలో మహారాష్ట్ర ప్రభుత్వం వారానికి రెండంకెల లాటరీ గేమ్లకోసం 16.8 మిలియన్ టిక్కెట్లను ముద్రిస్తుంది. మిగిలిన గేమ్లకు కూడా డ్రాల సంఖ్యను బట్టి

టిక్కెట్ల సంఖ్య ఆధారపడి ఉంటుంది. ఇండియాలో సాధారణంగా ఒక్కో ఆన్‌లైన్ ఆపరేటర్ 17 మిలియన్ టిక్కెట్లను విక్రయిస్తారు. కెనడాకు చెందిన బ్రిటిష్ కొలంబియా లాటరీ కార్పొరేషన్ లివింగ్ లార్డ్ లాటరీ 2004 గేమ్‌కోసం 660,000 టిక్కెట్లను ముద్రించింది. సింగపూర్ స్వీప్ గేమ్‌లో ప్రతి డ్రాకు 2.7 మిలియన్ టిక్కెట్లను ముద్రిస్తారు.

### పేపర్ పరిశ్రమ

కాగితం పరిశ్రమ పరోక్ష లబ్ధిదారు. ఎన్ని లక్షల టిక్కెట్లను ముద్రిస్తే అందుకు సరిపడా కాగితం అవసరమవుతుంది.

### రవాణా

లాటరీల ద్వారా రవాణా రంగానికీ లబ్ధి చేకూరుతోంది. ముద్రించిన టిక్కెట్లను గమ్యస్థానాలకు చేరవేయడానికి వాహనాలు తప్పనిసరి.

### గేమింగ్ సర్వీస్ ప్రొవైడర్లు

పేపర్ లాటరీలకు డ్రా మెషీన్లు మాత్రమే అవసరమవుతాయి. ఆన్‌లైన్ లాటరీలకు ఆదరణ పెరిగాక గేమింగ్ మెషీన్లు ప్రవేశించాయి. పనులన్నీ యాంత్రికంగానే జరుగుతాయి. మానవ ప్రయత్నంతో జరిగే పనులు అతి స్వల్పం.

ఇన్‌స్టంట్ స్క్రాచ్ టిక్కెట్ ప్రొడ్యూసర్లు, విలక్షణమైన ఆన్‌లైన్ గేమ్‌ల రూపకర్తలు, టిక్కెట్ డిజైనర్లు, నెట్‌వర్క్‌లో సమస్యలు తలెత్తితే పరిష్కరించేవారు. లాటరీ కియోస్క్‌ల తయారీదార్లు, గేమింగ్ మెషీన్ల ఉత్పత్తిదార్లు... వీరంతా గేమింగ్ సర్వీస్ ప్రొవైడర్ల కోవకే చెందుతారు. సైంటిఫిక్ గేమ్స్ కార్పొరేషన్, ఓబెర్తర్ గేమింగ్ టెక్నాలజీస్, జిటెక్ గేమింగ్ సొల్యూషన్స్ వంటివి అంతర్జాతీయస్థాయిలో పేరు గడించిన కొన్ని సర్వీస్ ప్రొవైడర్లు. సైంటిఫిక్ గేమ్స్ కార్పొరేషన్ అమెరికాలోని 16 రాష్ట్రాల్లో ఆన్‌లైన్ లాటరీలను

ఆపరేట్ చేస్తోంది. కొరియా, నార్వే, స్విట్జర్లాండ్ వంటి దేశాల్లోనూ లాటరీలను నిర్వహిస్తోంది. జిటెక్ సంస్థ 400,000కు పైగా పిఓఎస్ టెర్మినళ్ళను ఏర్పాటు చేసింది. ఓబెర్తర్ గేమింగ్ టెక్నాలజీస్‌కు యాభై దేశాల్లో వందకు పైగా క్లయింట్లు ఉన్నారు.

చెన్నైలోని ఓ ఆటోమేషన్ కంపెనీకి చెందిన డిజైన్ విభాగం లాటరీ టెర్మినళ్ళను డిజైన్ చేసింది. 360 డిగ్రీల కోణంలో డిస్‌ప్లే అయ్యే విధంగా టెర్మినల్‌ను, పెద్ద పెద్ద ప్రింట్ రోల్స్‌ను స్టోర్ చేసుకునేందుకు కావలసినంత ప్రదేశాన్ని, లూజ్ టిక్కెట్లను ఉంచేందుకు తగిన వసతిని కూడా ఈ కంపెనీ తన డిజైన్‌లో వివరంగా పేర్కొంది. ఆన్‌లైన్ గేమ్‌లు ఆడేందుకు ఎంతో వ్యవధి అక్కర్లేదు. కాబట్టి మెషీన్లు అత్యంత వేగంతో పనిచేయగలిగి ఉండాలి. సాధారణంగా గంటకు 900 టిక్కెట్లను ఉత్పత్తి చేసే సామర్థ్యం గల మెషీన్లనే వాడతారు. ఆన్‌లైన్ గేమ్‌లు ఆడే కస్టమర్లకోసం దేశవ్యాప్తంగా 10.000కు పైగానే పిఓఎస్ టెర్మినళ్ళను నెలకొల్పారు. దేశంలో లాటరీ టెర్మినళ్ళను సరఫరా చేసే కంపెనీల్లో హెచ్‌సిఎల్ ప్రముఖమైనది.

ఇండియాలో ఆపరేటర్ వాడే గేమింగ్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌లను ఇంటర్నేషనల్ అండ్ టోటలైజేటర్ సిస్టమ్స్ సంస్థ సరఫరా చేస్తుంది. డ్రా మెషీన్లను అమెరికాకు చెందిన స్మార్ట్‌ప్లే ఇంటర్నేషనల్ ఇన్‌కార్పొరేషన్ అందజేస్తుంది. అయితే సుగాల్ అండ్ దమాని కంపెనీ సొంతంగా సిస్టమ్‌లను సమకూర్చుకుంది. వాటికి స్థానిక కంపెనీలు తయారు చేసిన సాఫ్ట్‌వేర్‌నే వినియోగిస్తోంది.

అమెరికాలోని సౌత్ కరొలినా రాష్ట్రం విన్నింగ్ నెంబర్లను డ్రా తీసేందుకు రెండు బీటెల్ క్రైటీరియన్ మెషీన్లను వాడుతోంది. వాటిలో ఒకదానిని తెల్ల బంతులకోసం, రెండోదానిని ఎర్ర బంతులకోసం వినియోగిస్తోంది.

## సాఫ్ట్‌వేర్ పరిశ్రమలు

లాటరీ గేమ్‌లకు కావలసిన గేమింగ్ సాఫ్ట్‌వేర్‌ను టోటలైజేటర్ వంటి గేమింగ్

కంపెనీలు సమకూరుస్తాయి. ఆన్‌లైన్, కంప్యూటర్ లాటరీల విషయానికొస్తే అదనంగా అడ్మినిస్ట్రేటివ్, అకౌంటింగ్, ఫైనాన్షియల్ వంటి సాఫ్ట్‌వేర్‌లు అవసరమవుతాయి.

ఆర్థిక లావాదేవీలను పర్యవేక్షించేందుకు, డ్రా ఫలితాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసేందుకు, ఫలితాలను ఆటోమేటిక్‌గా ప్రకటితమయ్యేందుకు, సబ్ ఏజెంట్లు, రిటైలర్లు వంటి వారితో కూడిన నెట్‌వర్క్‌ను పర్యవేక్షించేందుకు ఈ సాఫ్ట్‌వేర్‌లు సాయపడతాయి. లాటరీ కంపెనీలకు, గేమింగ్ ప్రొవైడర్లకు ఎవరి వెబ్‌సైట్లు వారికుంటాయి.

## టెలికాం రంగం

ఇ-మెయిల్, ఫోన్, ఎస్‌ఎంఎస్ వంటి సదుపాయాల ద్వారా లాటరీల్లో పాల్గొనే అవకాశాలు పెరగడంతో విశాట్, సిడిఎంఎ, జిపిఆర్‌ఎస్ వంటి సాంకేతిక పరిజ్ఞానాల వినియోగం విస్తృతమైంది. దీంతో టెలికాం రంగానికి విపరీతమైన లబ్ధి చేకూరడం ప్రారంభమైంది. ఇండియాలో రిలయన్స్, ఎయిర్‌టెల్ వంటి ప్రైవేటు కంపెనీలు అందించే డేటా సర్వీసులను భారీ స్థాయిలో వినియోగించుకునే రంగాల్లో లాటరీ రంగం ఒకటి కావడం విశేషం.

## దినపత్రికలు

లాటరీ అడ్వర్టయిజ్‌మెంట్ల రూపేణా దిన పత్రికలకు లబ్ధి చేకూరుతోంది. లాటరీ ఫలితాలు వెల్లడయ్యే సమయాల్లో దినపత్రికల సర్క్యులేషన్ పెరగడమూ జరిగింది. యోగలక్ష్మి, అదృష్టం, ధనవర్ష వంటి పత్రికలు 95 శాతం స్పేస్‌ను లాటరీలకు సంబంధించిన వార్తలకు, ఫలితాలకు కేటాయిస్తున్నాయి.

## పరిశోధన, అభివృద్ధి

లాటరీ స్కీమ్‌లు, గేమ్‌లలో ఎప్పుడూ కొత్తదనం ఉండాలి. వినూత్నమైన

గేమ్‌లు, స్కీమ్‌లతో ప్రజలను ఆకట్టుకోవాలని ఆపరేటర్లు చూస్తారు. వీటికి తగినట్టుగా సంబంధిత మెషీన్లు కూడా ఎంతో వేగంగా పనిచేస్తూ ఉండాలి. కాబట్టి ఈ రంగంలో పరిశోధన, అభివృద్ధికి గేమింగ్ ప్రొవైడర్లు, సాఫ్ట్‌వేర్ పరిశ్రమలు పెద్దపీట వేస్తున్నాయి.

# లాటరీ నియమ నిబంధనలు

లాటరీ కార్యకలాపాలకు సంబంధించిన నియమ నిబంధనలు అన్ని దేశాల్లోనూ దాదాపు ఒకే రకంగా ఉంటాయి. సాధారణంగా లాటరీలను నిర్వహిస్తున్నది ప్రభుత్వమా లేక ప్రైవేటు సంస్థలా అనే దానిని బట్టి ఈ నియమ నిబంధనలు రూపు దిద్దుకుంటాయి. ఇండియాలో మాదిరిగానే ఐరోపా దేశాల్లోనూ, ఉత్తర అమెరికా రాష్ట్రాల్లోనూ లాటరీలను ప్రాంతాలవారీగానే నిర్వహిస్తూంటారు. డెన్మార్క్, నెదర్లాండ్స్, జర్మనీ, ఇటలీ, పోర్చుగల్ దేశాల్లో లాటరీలు ప్రభుత్వ నియంత్రణలో ఉన్నప్పటికీ వాటిని నిర్వహించేవి కార్పొరేషన్లే. వాస్తవానికి అనేక దేశాల్లో లాటరీ రంగం ఆర్థిక లేక రెవిన్యూ మంత్రిత్వ శాఖల పరిధిలో ఉంటుంది.

అజర్‌బైజాన్‌లో అజర్‌లోటెరేయ కార్పొరేషన్ కొత్తగా ఏ లాటరీ స్కీమ్‌నైనా ప్రవేశపెట్టేముందు దానికి సంబంధించిన వివరాలను, లాటరీ టిక్కెట్ నమూనాను స్టేట్ కమిటీ ఆన్ సెక్యూరిటీస్ (ఎస్.సి.ఎస్.)కు సమర్పించవలసి ఉంటుంది. లాటరీ పేరు, ఏ తరహా లాటరీ, లాటరీ నిర్వహణకు పట్టే సమయం, డ్రా తేదీలు, బహుమతుల వివరాలు, నియమ నిబంధనలు వంటి వివరాలన్నింటినీ తాను సమర్పించే నివేదికలో పొందుపరచవలసి ఉంటుంది.

యు.కె.లో నేషనల్ లాటరీ ఆఫ్ యునైటెడ్ కింగ్‌డమ్‌ను నేషనల్ లాటరీ కమిషన్ నియంత్రిస్తుంది.

జపాన్‌లో లాటరీని బ్యాంకులే నిర్వహించాలని చట్టాలు నిర్దేశిస్తున్నాయి.

## టిక్కెట్లు

దాదాపు అన్ని దేశాలూ లాటరీ స్కీమ్‌కు సంబంధించిన వివరాలను టిక్కెట్ల వెనుకవైపు ముద్రించాలని నిర్దేశిస్తున్నాయి. కార్పొరేషన్ పేరు, లాటరీ పేరు, తరహా, టిక్కెట్ల సంఖ్య, టిక్కెట్ ధర, సీరీస్ నంబర్, బహుమతి వివరాలు,

డ్రా తేదీ వంటి వివరాలను తప్పనిసరిగా టిక్కెట్‌పై పేర్కొనాలి. అజర్‌బైజాన్‌లో లాటరీ టిక్కెట్లను ముద్రించిన ప్రింటర్ పేరు, రిజిస్ట్రేషన్ నంబర్, లాటరీకి లైసెన్సు ఇచ్చిన సంస్థ పేరు వంటి వివరాలను కూడా టిక్కెట్‌పై ముద్రించాలన్న నిబంధన అమలులో ఉంది.

టిక్కెట్‌ను ఆన్‌లైన్‌లోగాని, ఇమెయిల్ ద్వారాగాని కొనుగోలు చేయరాదన్న నిబంధన అమెరికాలోని అనేక రాష్ట్రాల్లో అమలులో ఉంది. లాటరీలో పాల్గొనేందుకు అమెరికన్లుకానివారిని కూడా అనుమతి ఇస్తున్నా టిక్కెట్లను మాత్రం రిటైలర్లనుంచే కొనుగోలు చేయాలి. పైగా టిక్కెట్లను నగదు చెల్లించే కొనాలి తప్ప క్రెడిట్ కార్డులను ఉపయోగించకూడదు. స్వదేశీయులు తాము గెలుచుకున్న బహుమతులపై ప్రభుత్వ పన్నును మాత్రం చెల్లిస్తే సరిపోతుంది. కానీ నాన్ రెసిడెంట్లు బహుమతి మొత్తంపై అదనంగా 28 శాతం ఫెడరల్ పన్నును చెల్లించాల్సి ఉంటుంది. ఇండియాలో ప్రభుత్వం నిర్వహించే లాటరీల్లో పాల్గొనేందుకు స్వదేశానికి చెందినవారు మాత్రమే అర్హులు. స్పెయిన్ వంటి కొన్ని దేశాలు లాటరీలను ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉంచుతున్నాయి. దీనివల్ల ప్రపంచంలో ఎక్కడ ఏమూలనున్నవారైనా పాల్గొనే అవకాశం లభిస్తోంది. కొన్ని దేశాలు టిక్కెట్ల కొనుగోళ్ళలో సభ్యత్వాలను ఇస్తాయి. ఇలా సభ్యత్వం పొందినవారు రాబోయే గేమ్‌ల తాలూకు టిక్కెట్లను పెద్ద సంఖ్యలో కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది.

కొన్ని దేశాలు అమ్ముడుపోయిన టిక్కెట్లను మాత్రమే డ్రాకు పరిగణనలోకి తీసుకుంటున్నాయి. అలాంటి దేశాల్లో అజర్‌బైజాన్ ఒకటి. ఇండియాలోని అనేక రాష్ట్రాల్లోనూ ఈ నిబంధన అమలులో ఉంది.

### డ్రా

అన్ని దేశాలూ బహిరంగంగానే డ్రా తీయాలని నిర్దేశిస్తున్నాయి. వీటిలో చాలా దేశాలు డ్రాలను ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నాయి. లాటరీ డైరెక్టరేట్‌కు

చెందిన ఓ ప్రతినిధి సమక్షంలో డ్రా జరగాలని కూడా అనేక దేశాలు నిబంధనలు విధించాయి. అమెరికాలోని ఓరెగాన్ రాష్ట్రంలో డ్రా తీసే సమయంలో పోలీస్ గేమింగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి చెందిన సిబ్బంది ఉండటం తప్పనిసరి. ఇండియాలోని అనేక రాష్ట్రాల్లో డ్రా తీసే సమయంలో ఓ చైర్మన్ నాయకత్వంలో ఐదుగురు సభ్యుల బృందం విధిగా హాజరు కావాలనే నిబంధన ఉంది. మహారాష్ట్రలో నెలనెలా జరిగే డ్రాలు, బంపర్ డ్రాలను లాటరీ డిప్యూటీ డైరెక్టర్ పర్యవేక్షణలో జరుగుతాయి. ఉత్తర అమెరికాలోని పలు రాష్ట్రాల్లో పబ్లిక్ అకౌంట్స్ విభాగం సర్టిఫై చేసిన ఏదైనా సంస్థకు చెందిన ప్రతినిధి సమక్షంలో డ్రా మేనేజ్‌మెంట్ కమిటీ సిబ్బంది డ్రాను నిర్వహిస్తారు. డ్రా జరిగిన విధానాన్ని సవివరంగా రాసి, లాటరీ డైరెక్టర్ ఆమోదానికి పంపుతారు. డ్రాకు హాజరైన ప్రతినిధి డ్రా నిబంధనల మేరకే జరిగిందంటూ ధ్రువీకరిస్తారు. నిబంధనలను పాటించకుండా డ్రాను నిర్వహిస్తున్నారని సదరు ప్రతినిధి భావిస్తే, డ్రాను నిలిపివేసే అధికారం ఉంటుంది. అలాంటి సందర్భంలో లాటరీ డైరెక్టర్‌కు ప్రతినిధి ఓ నివేదికను రాతపూర్వకంగా సమర్పించాల్సి ఉంటుంది.

పెన్సిల్వేనియా వంటి రాష్ట్రాల్లో రిటైలర్లకూ లాటరీలో పాల్గొనే అవకాశాన్ని కల్పించారు. అజర్‌బైజాన్ వంటి దేశాల్లోనూ, అమరికాలోని ఫ్లోరిడా వంటి రాష్ట్రాల్లోనూ లాటరీ డైరెక్టరేట్, ఆపరేటర్లకు చెందిన ఉద్యోగులు, లాటరీ సరంజామాను సరఫరా చేసే వారు లాటరీల్లో పాల్గొనడానికి అర్హులు కారనే నిబంధన ఉంది.

## బహుమతులను పొందే విధానం

బహుమతులను గెలుచుకున్న వారు వాటిని క్లెయిమ్ చేసుకునేందుకు విధించే గడువు ఒక్కో దేశంలో ఒక్కో విధంగా ఉంటుంది. ఇండియాలోని అనేక రాష్ట్రాల్లో ఈ గడువు 90 రోజులు. అమెరికాలోని జార్జియాలో ఇన్‌స్టంట్ గేమ్‌లకు 90 రోజులు, ఇతర గేమ్‌లకు 180 రోజుల గడువు ఉంది. ట్రినిడాడ్ అండ్ టొబాగోలో స్క్రాచ్ గేమ్‌లకు ఆరు నెలలోగాను, ఇతర గేమ్‌లకు ఏడాది

లోగాను క్లెయిమ్ చేసుకునే అవకాశం ఉంది. స్వల్ప బహుమతి మొత్తాలనైతే రిటైలర్ వద్దనే క్లెయిమ్ చేసుకునే వీలు అన్ని దేశాల్లోనూ ఉంది. పెద్ద బహుమతి మొత్తాలను డైరెక్టరేట్‌లో క్లెయిమ్ ఫారంను, టిక్కెట్‌ను సమర్పించి పొందవచ్చు. అజర్‌బైజాన్‌లో డ్రా ముగిసిన ఏడు రోజులనుంచే బహుమతుల పంపకం మొదలవుతుంది.

అమెరికాలో బహుళ రాష్ట్రాల లాటరీల్లో విజేతలు తాము ఏ రాష్ట్రంలో టిక్కెట్ కొన్నారో అదే రాష్ట్రనుంచి బహుమతులను క్లెయిమ్ చేసుకోవచ్చు.

## పంపకం - విధివిధానాలు

లాటరీ ద్వారా సమకూరే ఆదాయంలో 50 శాతాన్ని బహుమతులకోసం కేటాయించాలనే నిబంధన అనేక దేశాల్లో అమలులో ఉంది. కనీసం 50 శాతాన్ని బహుమతులకు కేటాయించాలని, ఈ కేటాయింపు 80 శాతానికి మించకుండా ఉండాలని రష్యా ఫెడరేషన్ చట్టాలు చెబుతున్నాయి. లాటరీల ద్వారా సేకరించే నగదులో ఎంత భాగాన్ని ఎందుకోసం వినియోగించాలో కూడా నిర్దేశిస్తూ నియమ నిబంధనలు ఉన్నాయి. ఉదాహరణకు ఓరెగాన్ రాష్ట్రంలో లాటరీ ద్వారా సమకూరే నిధుల్లో 16 శాతాన్ని మాత్రమే పరిపాలనాపరమైన పనులకోసం వినియోగించాలనే నిబంధన ఉంది. సౌత్ కరొలినాలో నిర్వహణ ఖర్చులు, రిటైలర్లకు చెల్లించే కమిషన్ వగైరాలు మొత్తం అమ్మకాల ద్వారా సమకూరిన నిధుల్లో 15 శాతాన్ని మించరాదని ఎడ్యుకేషన్ లాటరీ చట్టం నిర్దేశిస్తోంది. లాటరీ నడిచే అన్ని దేశాల్లోనూ క్లెయిమ్ చేసుకోని బహుమతులు లాటరీ పూల్‌కే చెందుతాయనే నిబంధన అమలవుతోంది. కొన్ని సందర్భాల్లో క్లెయిమ్ చేసుకోని బహుమతుల్లో కొంత శాతాన్ని సామాజిక కార్యక్రమాలకోసం కేటాయిస్తారు. అమెరికాలోని మోంటానాలో క్లెయిమ్ చేయబడని బహుమతులు జనరల్ ఫండ్‌కు చెందుతుంది. ఇండియాలో ఈ డబ్బంతా ప్రభుత్వ ఖజానాలో జమ అవుతుంది.

యు.కె.లో క్లెయిమ్‌కాని జాక్‌పాట్ తదుపరి లాటరీకి బదిలీ అవుతుంది. ఇలా మూడుసార్లు బదిలీ అయినా క్లెయిమ్ చేసుకోకపోతే ఆ జాక్‌పాట్‌ను బోనస్‌బాల్ ప్రైజ్ ఫండ్‌లో జమ అవుతుంది.

## రిటైలర్లు / ఏజెంట్లు

లాటరీ నిర్వహించే సామర్థ్యాన్ని బట్టి రిటైలర్‌కిగాని, ఏజెంట్‌కిగాని లైసెన్స్ మంజూరు అవుతుంది. అలాగే అతను స్థానికుడా కాదా అనే విషయాన్ని కూడా పరిశీలిస్తారు. ఏజెంట్ తనకు నిర్దేశించిన ప్రదేశాల్లోనే టిక్కెట్ల విక్రయం జరపాలంటూ అమెరికాలోని డెలావర్ లాటరీ నిబంధన విధించింది. ఈ విషయాన్ని ఏజెంట్‌కిచ్చే లైసెన్స్‌లో కూడా పేర్కొంటారు.

ఇండియాలోని కేరళ వంటి కొన్ని రాష్ట్రాల్లో లాటరీ ఏజెంట్ కావాలంటే కనీసం 21 ఏళ్ళ వయసు ఉండాలనే నిబంధన ఉంది. ఏజెంట్ కాగోరేవారు రాష్ట్రంలోని ఏదో ఒక ప్రదేశానికి మాత్రమే లైసెన్స్‌కోసం దరఖాస్తు చేసుకోవాలి. సదరు వ్యక్తి ఆ ప్రదేశానికి చెందినవాడై, కనీస లాటరీ టిక్కెట్లను అమ్మగలిగిన సామర్థ్యం కలవాడై ఉండాలి. అమెరికాలోని ఫ్లోరిడాలో ఏజెంట్ కనీస వయోపరిమితి 18 ఏళ్ళు కాగా డెలావర్‌లో 21 ఏళ్ళుగా నిర్ణయించారు.

ఇండియాలోని కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు అధీకృత ఏజెంట్లను నియమించేటప్పుడు వారినుంచి కొంత మొత్తాన్ని ఫీజుగా వసూలు చేస్తున్నాయి. పెన్సిల్వేనియాలో ఇన్‌స్టంట్ టిక్కెట్లను విక్రయించే ఏజెంట్లనుంచి 15 డాలర్ల చొప్పున లైసెన్సింగ్ ఫీజును వసూలు చేస్తున్నారు. మిస్సోరీలో లైసెన్స్ పొందే రిటైలర్ మిస్సోరీ లాటరీకి 50 డాలర్ల బాండ్ సమర్పించాల్సి ఉంటుంది.

## ఇతర రాష్ట్రాల లాటరీలు

ఇండియాలో ఒక రాష్ట్రప్రభుత్వం స్వయంగా లాటరీని నిర్వహిస్తున్నప్పటికీ ఇతర రాష్ట్రాల లాటరీ టిక్కెట్లను తమ రాష్ట్రంలో నిషేధించకూడదు. ప్రజలు

ఏ లాటరీ టిక్కెట్‌నైనా కొనుక్కునే స్వేచ్ఛను కల్పించాలి. అదే అమెరికాలో అయితే, ఆయా రాష్ట్రాలు తమ పరిధిలోనే లాటరీ టిక్కెట్లను విక్రయించుకోవాలి. ఎవరైనా పొరుగు రాష్ట్రానికి వెళ్ళినప్పుడు అక్కడి లాటరీ టిక్కెట్‌ను కొనుక్కోవచ్చు. ఆ టిక్కెట్‌కు బహుమతి వచ్చిన పక్షంలా దానిని అదే రాష్ట్రంలో క్లెయిమ్ చేసుకోవాలి. అయితే లాటరీ టిక్కెట్‌ను కొనుక్కుని తిరిగి వచ్చిన కొంత కాలానికి తన టిక్కెట్‌కు బహుమతి వచ్చినట్టు తెలిస్తే మాత్రం తన రాష్ట్రంలోనే దానిని క్లెయిమ్ చేసుకోవచ్చు. ఇలా ఎందుకంటే లాటరీ టిక్కెట్ల విక్రయంపైనే నిషేధం తప్ప లాటరీ టిక్కెట్ల కొనుగోలుపై లేదు కాబట్టి.

## ఇతర నియమ నిబంధనలు

లాటరీకి కావలసిన సామగ్రిని, టిక్కెట్లను సరఫరా చేసే కాంట్రాక్టర్లు లాటరీ కమిషన్‌లోని సభ్యులకుగాని, ఉద్యోగులకు గాని ఎలాంటి చెల్లింపులు జరపడం, బహుమతులు ఇవ్వడం, రుణాలు అందజేయడం వంటివి చేయకూడదని సౌత్ డకోటా రాష్ట్ర ప్రభుత్వం నిబంధన విధించింది. అజర్‌బైజాన్‌లో అమ్ముడుకాక మిగిలిపోయిన లాటరీ టిక్కెట్ల గురించి, వాటిని ధ్వంసం చేసే పద్ధతి గురించి డ్రాకు ఓ గంట ముందు లాటరీ ఆపరేటర్ సవివరంగా అధికారులకు నివేదిక ఇవ్వాలనే నియమం ఉంది. డ్రా ముగిసిన మూడు రోజుల్లోగా డ్రా ఫలితాలపై లాటరీ ఆపరేటర్ నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. డ్రా ఫలితాలను మూడు రోజుల్లోగా వెల్లడించాల్సి ఉంటుంది కూడా.

నిబంధనలకు కట్టుబడని ఏజెంట్ లైసెన్స్‌ను రద్దు చేసే అధికారం అన్ని దేశాల్లోని ప్రభుత్వాలకూ ఉంటుంది. బాలబాలికలకు లాటరీ టిక్కెట్లు విక్రయించడం, దురుద్దేశపూర్వకంగా టిక్కెట్ల రూపురేఖలను మార్చివేయడం, బహుమతులను సకాలంలో చెల్లించకపోవడం వంటివాటికి పాల్పడినప్పుడు ఏజెంట్ల లైసెన్సును రద్దు చేస్తారు. యు.కె.లో లాటరీ కార్యకలాపాలు

ప్రారంభమైన మొదటి ఏడాదిలోనే 27 మంది రిటైలర్ల కాంట్రాక్టును రద్దు చేశారు. ఏజెంట్‌కు ముందుగా రెండు నెలల నోటీసు ఇచ్చి బోర్డుతో తన కాంట్రాక్టును రద్దు చేసుకోవచ్చని ట్రినిడాడ్ అండ్ టొబాగోలోని చట్టాలు చెబుతున్నాయి.

ఇండియాలో ప్రస్తుతం అమలులో ఉన్న విధానాన్ని బట్టి, లాటరీ వ్యాపారం, గేంబ్లింగ్, బెట్టింగ్ వంటివాటిలో విదేశీ పెట్టుబడులకు అవకాశం లేదు.

లాటరీలను నిర్వహిస్తున్న 120 దేశాల్లో లాటరీ వ్యాపారాన్ని క్రమబద్ధం చేసేందుకు ఎలాంటి చట్టాలూ రూపొందించని దేశం చైనా ఒక్కటే.

ఇండియాలో లాటరీలకు సంబంధించి చట్టాలు చేసిన రాష్ట్రాలు, అవి చేసిన చట్టాల వివరాలు ఈ దిగువన చూడండి.

| క్రసం. | రాష్ట్రం | చట్టం |
|---|---|---|
| 1 | కేరళ | కేరళ స్టేట్ లాటరీస్ అండ్ ఆన్‌లైన్ లాటరీస్ (రెగ్యులేషన్) రూల్స్, 2003 |
| 2. | కర్నాటక | 1. ది కర్నాటక టాక్స్ ఆన్ లాటరీస్ ఆర్డినెన్స్, 2003 |
| | | 2. కర్నాటక కంప్యూటరైజ్డ్ నెట్‌వర్క్ లాటరీ రూల్స్ 2001 |
| | | 3. కర్నాటక స్టేట్ లాటరీ రూల్స్, 1998 |
| 3. | పంజాబ్ | 1. పంజాబ్ స్టేట్ లాటరీ రూల్స్, 1998. వాటిని 1999లో సవరించారు |
| | | 2. పంజాబ్ స్టేట్ లాటరీ (మొదటి సవరణ) రూల్స్, 2001 |

| | | |
|---|---|---|
| 4. | జమ్మూ కాశ్మీర్ | జమ్మూ కాశ్మీర్ స్టేట్ లాటరీ రూల్స్, 2004 |
| 5. | రాజస్థాన్ | రాజస్థాన్ స్టేట్ కంప్యూటరైజ్డ్ నెట్‌వర్క్ లాటరీ రూల్స్, 2003 |
| 6. | హర్యానా | హర్యానా స్టేట్ ఆన్ లైన్ లాటరీ (రెగ్యులేషన్) రూల్స్, 2002 |
| 7. | మిజోరం | మిజోరం స్టేట్ లాటరీ రూల్స్ 2000 (తేదీ 01.09.2000) |
| 8. | మహారాష్ట్ర | 1. మహారాష్ట్ర స్టేట్ ఆన్‌లైన్ లాటరీ (రెగ్యులేషన్) రూల్స్, 2001 |
| | | 2. మహారాష్ట్ర స్టేట్ (మెయిన్) లాటరీ రూల్స్ |
| 9. | తమిళనాడు | 1. తమిళనాడు స్టేట్ ఆన్ లైన్ లాటరీ (రెగ్యులేషన్) రూల్స్, 2002 |
| | | 2. తమిళనాడు స్టేట్ లాటరీస్ (రెగ్యులేషన్) రూల్స్, 2002 |
| 10. | మేఘాలయ | మేఘాలయ స్టేట్ లాటరీ రూల్స్, 2002 |
| 11. | హిమాచల్ | హిమాచల్‌ప్రదేశ్ స్టేట్ లాటరీ రూల్స్, 1999 |
| 12. | అరుణాచల్‌ప్రదేశ్ | అరుణాచల్‌ప్రదేశ్ స్టేట్ లాటరీ రూల్స్, 2001 |

# లాటరీలు - కుంభకోణాలు

## కంప్యూటర్ హాకింగ్

ఒకే గ్రామానికి చెందినవారు తరచూ తమ లాటరీలో గెలుపొందుతున్నట్టు మాస్కోకు చెందిన ఓ ప్రైవేట్ లాటరీ కంపెనీ యాజమాన్యం పసిగట్టింది. టిక్కెట్లను ఫోర్జరీ చేయడానికైతే ఏమాత్రం వీలు ఉండదు. ఎందుకంటే కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య టిక్కెట్లను ముద్రిస్తారు. ఇంకెలా జరుగుతోందీ కుంభకోణం? ఆరా తీస్తే చివరకు తేలిందేమిటంటే... ఇద్దరు యువ టిక్కెట్ వెండర్లు తమ కంపెనీకి చెందిన కంప్యూటర్లను హ్యాక్ చేస్తున్నారని.

## టెలిఫోన్ లాటరీ అవకతవకలు

యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన ప్రజలకు 2002లో చిత్రమైన ఫోన్‌కాల్స్ వచ్చాయి. 'కెనడియన్ నేషనల్ లాటరీలో మీకు ఫ్రీ ఎంట్రీ లభించింద'ని ఎవరో ప్రజలకు ఫోన్ చేసి చెప్పేవారు. కొద్ది రోజుల తరవాత వారే 'లాటరీలో మీకు బహుమతి లభించింద'ని మళ్ళీ ఫోన్ చేసి చెప్పేవారు. గెలిచిన బహుమతి మొత్తంపై పన్ను లేదా ప్రాసెసింగ్ ఫీజును చెల్లించాలనేవారు. ఈ మాటలను నమ్మి ఫీజు చెల్లించినవారు ఆ తరవాత మోసపోయినట్లు తెలుసుకుని లబోదిబోమనేవారు. ప్రైజ్‌మనీని క్లెయిమ్ చేసుకునేందుకు ముందే ఏ విధమైన చెల్లింపులు జరపనక్కరలేదనే విషయాన్ని ప్రజలు గ్రహించాలి.

## అక్రమ వలసదారుల బహుమతులు

కొలరాడోలో వయసు పైబడిన హిస్పానిక్ పౌరులను లక్ష్యంగా చేసుకుని 2002లో మరో 'విన్నింగ్ టిక్కెట్ స్కామ్' చోటు చేసుకుంది. దుండగులు ఓ ముఠాగా ఏర్పడి ఈ అక్రమాలను సాగించారు. ఈ ముఠాలోని సభ్యుల్లో ఒకడు ముందుగా స్పానిష్ మాట్లాడే ఓ వృద్ధుడిని ఎంచుకుని అతని వద్దకు వెడతాడు. తనకు లాటరీలో బంపర్ ప్రైజ్ తగిలిందని, కానీ దేశంలోకి తాను అక్రమంగా

వలస వచ్చినందున ఆ బహుమతిని క్లెయిమ్ చేసుకునే హక్కు తనకు లేదని నమ్మబలుకుతాడు. ముఠాలోని మరో సభ్యుడు అక్కడే ఉండి, అపరిచితుడిలా ఈ సంభాషణ అంతా వింటూ ఉంటాడు. అతను కలగజేసుకుని లాటరీ టిక్కెట్ చూసి, దానికి బహుమతి వచ్చిన మాట నిజమేనంటాడు. దీంతో వృద్ధుడు నమ్మి ఎంతో కొంత ముట్టజెప్పి ఆ టిక్కెట్‌ను సొంతం చేసుకుంటాడు. తీరా ఆ టిక్కెట్‌ను తీసుకుని ఏజెంట్ వద్దకు వెడితేగాని తాను మోసపోయానన్న సంగతి ఆ ముసలాయనకు తెలీదు పాపం. అయితే అక్రమంగా వలస వచ్చినవారు కొన్ని టిక్కెట్లకు బహుమతి వచ్చినప్పుడు సంబంధిత డాక్యుమెంట్లను చూపించలేకపోయినా బహుమతిని క్లెయిమ్ చేసుకోవచ్చు. కానీ వారు పన్ను రూపంలో భారీ మొత్తాన్ని చెల్లించుకోకతప్పదు.

## డబ్బుకోసం టిక్కెట్ల మార్పిడి

ఇండియాలో అక్రమాలకు పాల్పడేవారు తాము వలసవచ్చినవారమని చెప్పుకోలేరు. అయితే తమకు అత్యవసరంగా డబ్బు కావలసి వచ్చిందని నమ్మబలుకుతారు. తన వద్ద ఉన్న టిక్కెట్‌కు బహుమతి వచ్చినప్పటికీ దానిని క్లెయిమ్ చేసుకునేందుకు సమయం పడుతుంది కాబట్టి ఆ టిక్కెట్‌ను మీరే తీసుకుని ఎంతో కొంత డబ్బు ఇవ్వండని ప్రాధేయపడతారు. అది నమ్మి డబ్బు చెల్లిస్తే మోసపోయినట్టే. ఆ టిక్కెట్ నకిలీదన్న సంగతి వారికి ఆ తరవాతగాని తెలియదు.

## విన్నింగ్ నంబర్లపై జోస్యం

కొంతమంది అంతర్జాతీయ మోసగాళ్ళు తాము విన్నింగ్ నంబర్లను ఊహించి చెబుతామని, కచ్చితంగా వాటికే బహుమతులు వస్తాయని ఘంటాపథంగా చెబుతారు. అది విని కొందరు అమాయకులు వారికి డబ్బు చెల్లించి ఆనక మోసపోయామంటూ తీరిగ్గా విలపిస్తారు.

## అంతర్జాతీయ లాటరీలు

'మీరు జాక్‌పాట్ గెలుచుకున్నారు. వెంటనే క్లెయిమ్ చేసుకోండి' అంటూ ఎంతోమందికి ఇ-మెయిల్స్, ఫోన్ కాల్స్ వస్తూ ఉంటాయి. అయితే బహుమతిని క్లెయిమ్ చేసుకోవాలంటే ముందుగా పన్ను, అడ్మినిస్ట్రేషన్ ఫీజు లేక ట్రాన్స్‌ఫర్ ఫీజు చెల్లించాలంటూ షరతు పెడతారు. బహుమతి మొత్తంలోంచే పన్నును మినహాయించుకోవచ్చుకదా అని ఎవరైనా అడిగితే, లాటరీ ఆపరేటర్ పూర్తి మొత్తంలో బహుమతిని చెల్లించాలన్న నిబంధన ఉందని నమ్మబలుకుతారు. ఇలాంటి కేసుల్లో లాటరీ ఆపరేటర్ల అడ్రసులు భూతద్దం పెట్టి వెదికినా భూమండలం మీద కనిపించవు. వాళ్ళిచ్చే ఫోన్ నంబర్లు కూడా మొబైల్ నంబర్లే అయి ఉంటాయి. వారి ఆచూకీ కనిపెట్టడం కష్టమే. వారి కంపెనీ పేర్లు కూడా అసలు కంపెనీలను పోలి ఉంటాయి. సైబర్ క్రైమ్ పోలీసులు ఇలాంటి ఐదు వందల నకిలీ కంపెనీలతో ఓ జాబితాను తయారుచేశారు. యు.కె. ఓవర్సీస్ లోటో లిమిటెడ్, రాయల్ స్పానిష్ స్వీప్‌స్టేక్ ఇంటర్నేషనల్, లోటో నెట్ ఇంటర్నేషనల్ వంటివి వాటిలో కొన్ని.

## పోయిన డబ్బును రికవర్ చేసుకోవడం

అంతర్జాతీయ లాటరీ కుంభకోణాలు వెల్లువెత్తుతూండటంతో ప్రజలు కూడా వాటిపట్ల అప్రమత్తులవుతున్నారు. దీంతో అక్రమార్కులు వారిని మోసగించేందుకు కొత్త ఎత్తుగడ వేస్తున్నారు. అదేమిటంటే, నకిలీ లాటరీల్లో మోసపోయినవారి డబ్బును తాము తిరిగి ఇప్పిస్తామని చెబుతారు. అందుకు కొంత ఫీజు చెల్లించాలంటారు. వారి మాటలు నమ్మి ఫీజు చెల్లిస్తే మోసం పోవడం ఖాయమనే సంగతి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

## బ్యాంక్ అకౌంట్ నంబర్

మరికొంతమంది మోసగాళ్ళు ప్రైజ్‌మనీని డిపాజిట్ చేసేందుకు బ్యాంక్ అకౌంట్ నంబర్‌ను తెలియజేయాల్సిందిగా కోరతారు. ఒకసారి కస్టమర్ బ్యాంక్

అకౌంట్ నంబర్ మోసగాళ్ళకు తెలిసిందంటే, వారు మోసపోయినట్టే.

## చైనీయుల స్కాములు

చైనాలోని షాంగ్జి ప్రావిన్స్‌లోని జియాన్ పట్టణానికి చెందిన ఓ కాంట్రాక్టర్, అతని ఉద్యోగి కుమ్మక్కై విన్నింగ్ టిక్కెట్లపై గుర్తులు పెట్టేవారు. దానివల్ల వారి అనుచరులు వాటిని గుర్తుపట్టి అవే టిక్కెట్లను కొనుగోలు చేసేవారు. ఓసారి ఇలా గుర్తులు పెట్టిన టిక్కెట్ ఒకటి అనుకోకుండా ఓ కార్మికుడి చేతికి చిక్కింది. దానిని క్లెయిమ్ చేసుకోవడానికి వెడితే అది నకిలీ టిక్కెట్ అని లాటరీ ఆపరేటర్ పసిగట్టాడు. ఇలా ఆ కుంభకోణం బట్టబయలైంది.

షెంజాన్‌లో ఓ లాటరీ ఆపరేటర్ ఎవరి కంటా పడకుండా ప్రైజ్ విన్నింగ్ బంతులకు చిన్నపాటి అయస్కాంతాలను అమర్చేవాడు. దాంతో ఈ బంతులు సహజంగానే డ్రా మెషీన్ మూలలవైపు జరిగేవి. ఇలా లాటరీల్లో గెలుపొందేవాడు.

# లాటరీ సూక్తులు

## థామస్ జెఫర్‌సన్

"లాటరీ అనేది ఓ లాభదాయకమైన సాధనం. అత్యధిక మొత్తంలో నగదు బహుమతిని ఆశించి టిక్కెట్ ధర రూపేణా ప్రజలు చేసే వ్యయంపై వారి అనుమతితోనే పన్ను వసూలు చేస్తారు"

## కింగ్ ఫ్రాన్సిస్ I, ఫ్రాన్స్

"నా ప్రజలు లాటరీ ఆడుతుంటే, ఒకరినొకరు అవమానించుకోవడం, ఒకరితోఒకరు పోట్లాడుకోవడం, ఒకరి దేవుణ్ని మరొకరు దూషించడంవంటివాటిని వారు మరచిపోతారు"

## బైబిల్‌లోని సూక్తులు 18-18

చీటీలను లాటరీ తీయడంద్వారా వివాదాలను పరిష్కరించడం మరియు ప్రత్యర్థులను వేరు చేయడం

## 3పంజాబ్ యూనివర్శిటీ ఆధ్వర్యంలోని యూనివర్శిటీ స్కూల్‌కు చెందిన డాక్టర్ మనోజ్ శర్మ

"లాటరీల ద్వారా సంపాదించిన మొత్తంలో అధికభాగాన్ని వివిధ ప్రభుత్వ పథకాలకు ఖర్చు చేస్తారు కాబట్టి పరిధిని అతిక్రమించనంతవరకూ లాటరీలు ఆడటంలో తప్పేమీ లేదు. లాటరీలపై కాకపోతే ప్రభుత్వాలు మరో విధంగా పన్ను వసూలు చేస్తాయి. అందువల్ల వినోదంతోపాటు స్వచ్ఛందంగా పన్ను చెల్లించేందుకు ముందుకు రావడమే మంచిది"

## మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎం.సి. చగ్లా

"ప్రభుత్వం సాధించిన అత్యుత్తమ విజయాల్లో యూనివర్శిటీని

నెలకొల్పడం ఒకటి. మెక్సికోలోని అగ్రశ్రేణి ఆర్కిటెక్ట్‌ల సహాయంతో ఈ యూనివర్శిటీని నిర్మించారు. దీనికి విశాలమైన కేంపస్ కూడా ఉంది. యూనివర్శిటీ ఏర్పాటుకు కావలసిన నిధులను ప్రభుత్వం లాటరీ నిర్వహించడం ద్వారా సమకూర్చుకుంది. దక్షిణ అమెరికాకు చెందిన ప్రజలు సహజంగానే లాటరీల పట్ల ఎంతో మక్కువ చూపుతారు. ఈ విషయాన్ని గ్రహించిన ప్రభుత్వం తెలివిగా లాటరీని నిర్వహించడం ద్వారా నిధుల సేకరణకు పూనుకుంది. నేను మొదటిసారి మెక్సికో వెళ్ళివచ్చాక ఈ యూనివర్శిటీ ఎలా ఏర్పడిందో వివరిస్తూ నెహ్రూకు ఓ లేఖ రాశాను. ఇదే పద్ధతిలో మనమూ లాటరీలు నిర్వహిద్దామని సూచించాను. ఐర్లాండ్‌లో ఐరిష్ డెర్బీ స్వీప్ స్టేక్స్ అనే లాటరీకి విపరీతమైన ప్రజాదరణ ఉంది. ఈ లాటరీ ద్వారా సమకూరిన నిధులతోనే ఐర్లాండ్ ప్రభుత్వం తమ దేశంలో అనేక ఆస్పత్రులను నిర్మించింది. ఈ విషయాన్ని కూడా నా లేఖలో పేర్కొన్నాను. దీనిపై నెహ్రూ స్పందిస్తూ " మన దేశంలో కొన్ని సత్సంప్రదాయాలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వమే లాటరీలను నిర్వహించడం ద్వారా ప్రజలలో జూదమాడాలన్న కాంక్షను ప్రేరేపించడం నీతిబాహ్యమైన చర్య అవుతుంది. లాటరీలను ప్రోత్సహించడానికి బదులు పూర్తిగా నిషేధించకపోయినా కనీసం వాటిని నియంత్రించేందుకైనా ప్రయత్నించాలి" అని అభిప్రాయపడ్డారు. అయితే నేను ఈ లేఖ రాసిన చాలా ఏళ్ళ తరవాత క్రమంగా అన్ని రాష్ట్రాలూ లాటరీలను నిర్వహించడం మొదలుపెట్టాయి. ఇతర దేశాలు లాటరీల వల్ల అందిపుచ్చుకుంటున్న ప్రయోజనాలేమిటో తెలుసుకునేందుకు ఇండియాకు అనేక సంవత్సరాలు పట్టడం విచారకరం. లాటరీలను నిషేధిస్తే కోట్ల రూపాయల నష్టం వాటిల్లుతుంది. అవినీతి పెరిగి పోలీసు, న్యాయవ్యవస్థలకు సైతం చీడపురుగులా పాకుతుంది. ఈ విషయంలో అమెరికానుంచి గుణపాఠాలను నేర్చుకునేందుకు మనం నిరాకరించాం. ఇంతకాలానికి తప్పు తెలుసుకుంటున్నాం. కానీ అందుకు చెల్లించిన మూల్యం మాటేమిటి?"

**తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి దివంగత సి.ఎన్. అన్నాదురై**

''విజుంతాల్ వీటిర్కు, విజవిట్టాల్ నాటిర్కు''. (లాటరీలో ఎవరైనా గెలిస్తే గెలిచిన వ్యక్తి లాభపడతాడు. లేకపోతే దేశానికి లాభం కలుగుతుంది)

**'ది హిందూ' చెన్నై ఎడిషన్‌లో 7-4-1999న ప్రచురితమైన సంపాదకీయంలోని ముఖ్యాంశాలు**

''మరో రెండు ముఖ్యమైన విషయాలపై కూడా దృష్టి సారించాల్సి ఉంది. మొదటిది ఆర్థిక కోణం. విచిత్రంగా ఇండియాలో ఆర్థిక-సామాజిక లక్ష్యాల సాధనకోసం అనేక లాటరీ స్కీమ్‌లను ప్రవేశపెట్టారు. వీటిలో ముఖ్యమైనది ఉపాధి కల్పన. మరీ ముఖ్యంగా లాటరీలు ప్రభుత్వాలకు పెద్దయెత్తున ఆదాయాన్ని ఆర్జించి పెడుతున్నాయి. అది సాంప్రదాయాలకు విరుద్ధంగానే కావచ్చు. అయితే కష్టకాలంలో ప్రభుత్వాలకు ఈ నిధులు ఎంతో అక్కరకు వస్తున్నట్టు అనేక అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.''.

**1-4-1999న ఎకానమిక్ టైమ్స్‌లో ప్రచురితమైన సంపాదకీయంలోని ముఖ్యాంశాలు**

లాటరీలను, గేంబ్లింగ్‌ను నిషేధించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ 'సామాజిక దురాచారాన్ని' నిషేధించే విషయమై పార్లమెంటులో ఏకాభిప్రాయం వ్యక్తం కాలేదు. ఆ మాటకొస్తే ప్రభుత్వమే అనేక దుస్సాహసాలకు పాల్పడుతూ ప్రజాధనంతో జూదమాడుతోంది. నష్టాల్లో కూరుకుపోయిన ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వ అధీనంలోని బ్యాంకుల ఎన్.పి.ఎ.ల మాటేమిటి? మరో విషయం ఏమిటంటే... ప్రజాస్వామిక పద్ధతులే ఓ జూదం లాంటివి. రాజకీయ నాయకులు ఎన్నికలనే జూదక్రీడలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న విషయంపై పార్లమెంటు ఇకనైనా దృష్టి సారించాలి. మన వినోదం కోసం మన డబ్బుతో మనం లాటరీలు ఎందుకు ఆడకూడదు? వినోదం కోసం గేంబ్లింగ్ ఆడటం నాగరిక క్రీడ. ప్రభుత్వం గేంబ్లింగ్‌పై నిషేధాస్త్రం

ప్రయోగించజాలదు. అలా చేస్తే, అండర్‌గ్రౌండ్ నేరగాళ్లు, రాజకీయాల ముసుగులో నేరాలకు పాల్పడేవారు పోలీసులను లోబరచుకుని దొంగచాటుగా లాటరీ కార్యకలాపాలను నిర్వహించుకునేందుకు తెర తీసినట్లవుతుంది.... లాటరీ కార్యకలాపాలను ప్రభుత్వం చట్టబద్ధం చేసి, క్రమబద్ధీకరిస్తే మంచిది (జూదగృహంపై అజమాయిషీకి సంబంధించి కౌటిల్యుడు రచించిన 'అర్ధశాస్త్రం'లో ఆసక్తి గొలిపే ఓ అధ్యాయమే ఉంది). లాటరీల ద్వారా లభించిన ఆదాయాన్ని సామాజిక ప్రయోజనాలకోసం వెచ్చించవచ్చు....

**బాలా సాహెబ్ థాకరే**

"గత 36 ఏళ్ళలో మహారాష్ట్ర ప్రభుత్వానికి లాటరీల రూపేణా ఎంతో ఆదాయం చేకూరింది. అలాగే అనేకమందికి ఉపాధి లభించింది"

**పంజాబ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రకాశ్ సింగ్ బాదల్ విడుదల చేసిన ఓ పత్రికా ప్రకటన (డిపిఆర్ సిఎం.99/1230)**

" పారదర్శకంగా కొనసాగుతున్న ప్రస్తుత వ్యవస్థ అసాంఘిక శక్తులు, బ్లాక్ మార్కెటర్లు నిర్వహించే సట్టా మట్కా వంటి అక్రమ జూదాలను అరికడుతుందని నాకు నమ్మకం ఉంది. లాటరీలను నిషేధించాలన్న ప్రతిపాదన కార్యరూపం దాలిస్తే నిరుద్యోగ సమస్య ప్రజ్వరిల్లుతుంది. పరోక్షంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కోట్లాది రూపాయల నష్టం వాటిల్లుతుంది. రాష్ట్ర ప్రభుత్వాలు లాటరీ నిర్వహించడం వల్ల ఆదాయపన్ను, సేవల పన్ను రూపంలో కేంద్రానికీ ఆదాయం సమకూరుతుంది. యు.కె.లోని నేషనల్ లాటరీ సామాజిక సంక్షేమానికి, సాంస్కృతిక వారసత్వ సంపద పరిరక్షణకు పెద్దయెత్తున నిధులు అందజేస్తోంది"

**ప్రముఖ బ్రిటిష్ అథ్లెట్ క్రిస్ రాలిన్‌సన్**

"నాలాంటి అథ్లెట్లు ఒలింపిక్స్‌లో పాల్గొనేందుకు లాటరీ ఆడేవారంతా సహాయం అందిస్తున్నట్లు లెక్క. ఈ విషయాన్ని ప్రజలంతా గ్రహించాలి"

**బ్రిటిష్ వెయిట్ లిఫ్టర్ మైకేలా బ్రీజ్**

"లాటరీ ఆడేవారందరికీ నా కృతజ్ఞతలు. ఒలింపిక్స్‌లో ఆడాలని కలలుగనే నాలాంటి అథ్లెట్లకు వారు చేస్తున్న సహాయం మరువలేనిది"

**బ్రిటిష్ రోయర్ ఎడ్ కూడే**

"సిడ్నీ ఒలింపిక్స్‌లో గెలిచిన పతకాల్లో రెండు మూడు పతకాలు రావడానికి లాటరీల ద్వారా అందిన నిధులే కారణమని నా నమ్మకం"

**బ్రిటిష్ సాంస్కృతిక శాఖ మంత్రి టెస్సా జోవెల్**

"లాటరీలు విజేతలను సృష్టిస్తాయి. అవి కొందరి జీవితాలను మార్చివేస్తాయి. కొన్ని సమాజాల్లో పెను మార్పులు తీసుకువస్తాయి".

**ఓ మాతృమూర్తి లాషాండ్ మూర్**

"నేనో సింగిల్ పేరెంట్‌ను. టెన్నెస్సీ లాటరీ అందిస్తున్న హోప్ స్కాలర్‌షిప్ లేకపోతే నేను నా కుమారుడిని స్కూలుకు పంపించలేకపోయేదాన్ని ".

# వింతలు- విశేషాలు

- లోటోలజీ : వివిధ రకాల లాటరీ టిక్కెట్లపై పరిశోధన, అధ్యయనం చేయడం, వాటిని సేకరించడాన్ని లోటోలజీ అంటారు.

- లోటోలజిస్ట్ : లోటోలజీలో పూర్తిగా నిమగ్నమైన వ్యక్తిని లోటోలజిస్ట్ అంటారు.

- చైనీస్ కెనో గేమ్‌ను వైట్ పీజియన్ గేమ్ (తెల్ల పావురాల ఆట) అని కూడా అంటారు. గ్రామీణులకు లాటరీ ఫలితాలను చేరవేసేది పావురాలే కాబట్టి దానికి ఈ పేరు వచ్చింది

- లాటరీలు మూఢవిశ్వాసాలకూ ప్రతీకగా ఉండేవి. స్పెయిన్‌లో అత్యంత జనాదరణ గల లాటరీకి 1899లో ఊహించనివిధంగా డిమాండ్ పడిపోయింది. ఆ శతాబ్దంలో అదే చివరి డ్రా కావడంతో అది తమకు దురదృష్టాన్ని తెచ్చిపెడుతుందన్న మూఢనమ్మకంతో ప్రజలు డ్రాలో పాల్గొనలేదు.

- లోటో గేమ్‌లపట్ల ప్రజలు వేలంవెర్రిగా ఎగబడటం ఇప్పుడు మామూలైపోయింది. మొదటిసారిగా ‘లోటో మేనియా’ (లోటో పిచ్చి) సంఘటన 1755లో జరిగినట్లు రికార్డయింది. ఇంగ్లండ్‌లో లోటో టిక్కెట్ల అమ్మకాలు ప్రారంభించిన మొదటిరోజున ప్రజలు టిక్కెట్లకోసం లాటరీ కార్యాలయాల్లోకి తలుపులు విరగ్గొట్టుకుని మరీ ఎగబడ్డారట.

- మసాచుసెట్స్‌లో ‘ది గేమ్’ పేరిట ప్రవేశపెట్టిన లాటరీ డ్రా 1972లో బోస్టన్‌లోని ఫాన్యుయేల్ హాల్‌లో జరిగింది. ఈ హాల్‌ను పద్ధెనిమిదో శతాబ్దంలో లాటరీల ద్వారా సేకరించిన నిధులతోనే తిరిగి నిర్మించారు.

- పదహారో శతాబ్దంలో ఇటాలియన్ రిపబ్లిక్ ఆఫ్ జెనోవాలో 90 మంది

అభ్యర్థులు సెనేట్‌కు పోటీ చేశారు. వారిలోంచి ఐదుగురు సభ్యులను ఎన్నుకోవాలి. ఎన్నికల్లో ఎవరు గెలుస్తారో ముందుగానే ఊహించినవారికి పిస్టోలా (బంగారు నాణెం)ను బహుమతిగా ఇస్తామంటూ ఓ గేమ్‌ను కొందరు నిర్వాహకులు ప్రారంభించారు. ఎన్నికల్లో గెలిచే ఐదుగురు సభ్యుల పేర్లనూ కరెక్టుగా చెప్పినవారికి జాక్‌పాట్ లభిస్తుంది. ఇదీ ఆ గేమ్. ఆ తరవాత బెనెడెట్టో జెంటైల్ అనే పెద్దమనిషి సూచనలతో పేర్లకు బదులు అంకెలు ప్రవేశించాయి. అలా ఆవిర్భవించిందే ఇప్పుడు బహుళ ప్రజాదరణ పొందిన లోటో గేమ్.

- ఇండియాలో రాజుల కాలంలో గ్రామ కమిటీ సభ్యులను 'కుడవొలాయ్' అనే ఒకరకమైన లాటరీ పద్ధతిద్వారా ఎంపిక చేసేవారు. అభ్యర్థుల పేర్లను ఒలాయ్ లేదా తాటాకులపై రాసి వాటిని కుండలో పెట్టేవారు. అందులోంచి ర్యాండమ్ పద్ధతిలో తాటాకులను తీసి, వాటిపై పేర్లు గలవారిని గ్రామ కమిటీ సభ్యులుగా ప్రకటించేవారు.

- జార్జియాలో నడిచే క్యాష్ 3 గేమ్‌కోసం 1994 ఆగస్టులో వరుసగా మూడు రాత్రులు తీసిన డ్రాలలో 571 నంబరే వచ్చింది. ఆ తదుపరి సంవత్సరం మార్చిలో జరిగిన డ్రాలో వరుసగా మూడురోజులు 706 నంబరే వచ్చింది.

- జార్జియాలో ఫిబ్రవరి 1997లో జరిగిన క్యాష్ 3 గేమ్ డ్రాలో 888 అనే నంబర్ వచ్చింది. అదే నంబర్ ఫిబ్రవరి 1998న, జులై 1999న, నవంబర్ 1999న జరిగిన డ్రాలలోనూ రావడం విశేషం.

- జార్జియా క్యాష్ 3 గేమ్‌లో నవంబర్ 1994న, డిసెంబర్ 1997న, జూన్ 1998న జరిగిన డ్రాలలో 444 అనే ఒకే నంబర్‌కు బహుమతులు వచ్చాయి. క్యాష్ 4 గేమ్‌లో మార్చి 1998న 2222 అనే నంబర్ డ్రాలో వచ్చింది. ఒరెగాన్‌లో నవంబర్ 1989న తీసిన బిగ్ 4 గేమ్ డ్రాలో 7777 అనే నంబర్ వచ్చింది.

- యు.కె.లో కోకోకోలా అమ్మకాల కంటే ఏడు రెట్లు అధికంగా ఆన్‌లైన్ టిక్కెట్లు అమ్ముడవుతున్నట్లు అంచనా.

- ఫిబ్రవరి 1995న మిచిగాన్ లోటో గేమ్‌కోసం నిమిషంలో 39,000 టిక్కెట్లు అమ్ముడుపోయాయి. ఒక గంటలో 22 లక్షల టిక్కెట్లు అమ్ముడయ్యాయి.

- అత్యధిక సంఖ్యలో స్క్రాచ్ కార్డులను సేకరించిన వ్యక్తిగా న్యూ సౌత్ వేల్స్‌లోని బాచూ బేకు చెందిన డారెన్ హాక పేరు గిన్నిస్‌బుక్‌లోకి ఎక్కింది. 1993లో కార్డుల సేకరణ ప్రారంభించిన డారెన్ ఫిబ్రవరి 2000 నాటికి 311,362 కార్డులను సేకరించడం విశేషం.

- అంతర్రాష్ట్ర పవర్‌బాల్ లాటరీలోకి న్యూ మెక్సికో 1996లో అడుగుపెట్టినప్పుడు మొట్టమొదటి టిక్కెట్‌ను గవర్నర్ జాన్సన్ కొనుగోలు చేశారు. 1998లో రోడ్‌రన్నర్ క్యాష్ గేమ్‌ను ప్రవేశపెట్టినప్పుడు సెనెటర్ రోమన్ మేస్ తొలి టిక్కెట్‌ను ఖరీదు చేశారు.

- ఉత్తర అమెరికా 1996లో రోజుకు 52 మిలియన్ డాలర్ల చొప్పున ఒక్క నిముషానికి 36,000 డాలర్లను ప్రైజ్‌మనీకోసం కేటాయించింది.

- దీపావళి పండుగ రోజు గేంబ్లింగ్‌లో పాల్గొననివారు వచ్చే జన్మలో గాడిదై పుడతారని ఇండియాలో కొందరు విశ్వసిస్తారు. ఆదాయానికి లాటరీ ఓ చక్కటి మార్గమని విశ్వసించేవారు దీపావళి పండుగ రోజున ఎంతో కొంత మొత్తం గేంబ్లింగ్‌కోసం వెచ్చించాలని భావిస్తారు.

- నెదర్లాండ్స్‌లోని నేషనల్ పోస్ట్‌కోడ్ లాటరీలో టిక్కెట్ నంబర్లు ఆ దేశంలోని పోస్టల్ కోడ్ వ్యవస్థను అనుసరించి ఉంటాయి. టిక్కెట్లను నేరుగా పోస్టు ద్వారా విక్రయిస్తారు. ఒకే పోస్టల్ కోడ్ ఏరియాలో గెలిచిన విజేతలు వీక్లీ స్ట్రీట్ ప్రైజ్, జాక్‌పాట్, మెగా సమ్మర్, నూతన సంవత్సరం సందర్భంగా

నిర్వహించే పోస్ట్‌కోడ్ కంజేర్ వంటి బహుమతులను సమానంగా పంచుకుంటారు. విజేతల ఇళ్ళకు ఇరుగుపొరుగున ఉండేవారికి కూడా బహుమతులు దక్కుతాయి.

- ఆస్ట్రేలియాలో ఇన్‌స్టంట్ మనీ అనే గేమ్‌కోసం టీవీల్లో ఇచ్చే వాణిజ్య ప్రకటనల్లో ఫ్రాంక్ అనే పేరు గల మాట్లాడే కుక్క కనిపిస్తూ ఉంటుంది. ఈ ప్రకటనలు 1993లో అంతర్జాతీయ స్థాయిలో జరిగిన ఓ పోటీలో అత్యుత్తమమైనవిగా ఎంపికయ్యాయి.

- సిడ్నీలో మే 2004న ఆరవయ్యేళ్ళ వృద్ధుడొకరు ఒకే గేమ్‌కు చెందిన వేర్వేరు ఏజెంట్లనుంచి మూడు టిక్కెట్లను ఖరీదు చేశారు. విచిత్రంగా ఈ మూడు టిక్కెట్లకూ బహుమతులు లభించాయి.

- అరూబాలో నిర్వహించే అరూబా లాటరీలో రోడెరిక్ చిన్ అనే పెద్దమనిషి మూడుసార్లు లోటో జాక్‌పాట్లను గెలుచుకున్నారు. మార్చి 2000, జనవరి 2003, ఆగస్టు 2004న జరిగిన డ్రాలలో ఆయనకు ఈ బహుమతులు లభించాయి.

- స్పెయిన్‌లో 'నావిదాద్' అనే గేమ్‌కు ఎంతో ఆదరణ ఉంది. కొన్ని నంబర్లను కొందరు యాభయ్యేళ్ళపాటు రిజర్వ్ చేసుకుంటారంటే దీనికి ఉన్న ఆదరణ ఏపాటిదో అర్థమవుతుంది.

- పంజాబ్‌కు చెందిన ఓ అసిస్టెంట్ లైన్‌మాన్ (ఎలక్ట్రికల్ బోర్డ్) భార్యకు ఏప్రిల్ 2004లో బంపర్ ప్రైజ్ లభించింది. వారు తమకు లభించిన నగదు బహుమతిలో అత్యధిక భాగాన్ని తమ గ్రామంలోని పేద యువతుల వివాహాలకు ఖర్చు చేస్తుండటం విశేషం.

# లాటరీలపై ఇంతకుముందు వెలువడిన పుస్తకాలకు లభించిన స్పందనలు

లాటరీ వ్యాపారాన్ని నిషేధించడం ద్వారా పెద్ద సంఖ్యలో ప్రజలు ఉపాధి కోల్పోతారనడంలో సందేహం లేదు.

- లజ్‌పత్‌రాయ్ (ఎం.పి. రాజ్యసభ)

సాంప్రదాయక లాటరీ, కంప్యూటరైజ్డ్ లాటరీ పరిశ్రమల్లో పనిచేస్తున్నవారందరికీ ఈ పుస్తకం ఎంతో సహాయకారిగా ఉంటుందని కచ్చితంగా చెప్పవచ్చు

- డాక్టర్ ఎ.ఆర్. బసు, కమిషనర్ కమ్ సెక్రటరీ, మానవ హక్కుల సంఘం

ఒక్క సుగాల్ అండ్ దమానీ కంపెనీయే ముందుచూపుతో ఆలోచించి లాటరీలపై పుస్తకాలను వెలువరిస్తోంది

- లలిత్ భండారీ, సోనాల్ ఎంటర్‌ప్రైజెస్, పుణె

లాటరీ పరిశ్రమలో ఉన్న ప్రతి ఒక్కరూ ఈ పుస్తకాన్ని చదివి లాటరీలవల్ల కలుగుతున్న ప్రయోజనాలను తెలుసుకోవాలి

- యూసుఫ్ భాయ్, పరిహార్ ఏజెన్సీస్, పుణె

ఒక లక్ష్యంతో లాటరీని నిర్వహిస్తే సమాజానికి ప్రయోజనం ఉంటుంది. లాటరీ ద్వారా ఏ లక్ష్యాన్ని ఆశించి డబ్బు సేకరించారో ఆ లక్ష్యసాధనకోసం తప్పనిసరిగా ఆ డబ్బును ఖర్చు చేయాలి

- బాబూలాల్ గౌర్, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, ఎంఎల్ఎ

లాటరీ వ్యాపారాన్ని కూలంకషంగా పరిశోధించి, పరిశీలించి సకల సమాచారంతో

రాసిన పుస్తకమిది. లాటరీ పరిశ్రమపై నెలకొని ఉన్న అపోహలను ఈ పుస్తకం దూరం చేస్తుంది.

-కపిల్ ఖన్నా, న్యూ ఢిల్లీ

లాటరీ వ్యాపారానికి సంబంధించి సకల అంశాలను పొందుపరచిన ఓ విశిష్టమైన కృషికి దర్పణం ఈ పుస్తకం

- పరేష్ రాజ్డే, ఫోర్బ్సు ఇన్‌ఫొటైన్‌మెంట్ లిమిటెడ్, ముంబాయి

ఇది చాలా ఆసక్తికరమైన పుస్తకం. పాఠకుల్లో ఆలోచనలను రేకెత్తింపచేస్తుంది.

- గిరీష్ కుమార్ సంఘీ, ఎంపి, రాజ్యసభ

లాటరీ పరిశ్రమకు సంబంధించి ఎదురవుతున్న సవాళ్ళను దీటుగా ఎదుర్కొనేందుకు దోహదపడే పుస్తకమిది.

- విలాస్‌రావ్ దేశ్‌ముఖ్ ( మహారాష్ట్ర ముఖ్యమంత్రి)

లాటరీ వ్యాపారాన్ని పునర్ నిర్మించడమెలా అనే అంశంతోపాటు అనేక విషయాలను విపులంగా వివరించిన పుస్తకం

-ఆర్ ఆర్ పాటిల్ (హోమ్ మంత్రి, మహారాష్ట్ర)

లాటరీ పరిశ్రమ ఆవిర్భావంనుంచి చోటుచేసుకున్న పరిణామాలన్నింటినీ చర్చించిన పుస్తకమిది

- జయంత్ పాటిల్ (ఆర్థిక, ప్రణాళిక మంత్రి, మహారాష్ట్ర)

లాటరీలకు సంబంధించిన విజ్ఞాన ఖని ఈ పుస్తకం

- అమితాబ్ బచ్చన్, నటుడు

# ఉపయుక్త గ్రంథ పట్టిక

హ్యాండ్‌బుక్ ఆన్ లాటరీస్ - ఎన్. సుగాల్‌చంద్ జైన్

అకిలతిల్ అర్పుత కోవిల్- సు.సు.స. తంగం

కోలిన్స్ ఇంగ్లీష్ డిక్షనరీ

లాటరీ మార్కెట్ రిపోర్ట్ 1983- ఎన్. సుగాల్‌చంద్ జైన్

నల దమయంతి (పుగజెంధి పులావర్)- ఎస్. లలితంబాళ్

ది బైబిల్ - కింగ్ జేమ్స్ వెర్షన్

ది చీఫ్ సెక్రటరీ - మద్రాస్ డైరీస్ ఆఫ్ అలెగ్జాండర్ ఫాల్కనెర్ 1790- 1809

ది నేషనల్ లాటరీ అండ్ ఇట్స్ రెగ్యులేషన్ - ఆండ్రూ డగ్లస్

ది న్యూ పెంగ్విన్ ఎన్‌సైక్లోపీడియా

ది న్యూ వెబ్‌స్టర్స్ ఇంటర్నేషనల్ ఎన్‌సైక్లోపీడియా

ది తమిళనాడు రాఫిల్ రూల్స్, 1976

ది విన్నర్స్ గైడ్ టు కేసినో గేంబ్లింగ్- ఎడ్విన్ సిల్బెర్‌స్ట్రాంగ్

వెస్టిజెస్ ఆఫ్ ఓల్డ్ మద్రాస్: 1640-1800- వాల్యూమ్ III- హెన్రీ డేవిసన్ లవ్

పబ్లిక్ డిపార్ట్‌మెంట్ (1926) రికార్డ్స్- జి.ఓ. నం:124, తేదీ 16-2-1926

పబ్లిక్ డిపార్ట్‌మెంట్ (1925) రికార్డ్స్- జి.ఓ. నం:834, తేదీ 28-8-1925

www.alc.ca
www.allaboutrish.com
www.aniin.com
www.answers.google.com
www.arizonalottery.com
www.arthur.ohara.com
www.ateonline.co.uk
www.azerlotereya.com

www.bclc.com
www.bengalonthenet.com
www.biglottoryfund.org.uk
www.blonnet.com
www.cag.nic.in
www.calottery.com
www.camelotgroup.co.uk
www.cciltd.com
www.centralchoronicle.com
www.ce-review.org
www.cmi.ac.in
www.coloradolottery.com
www.cphpost.dk
www.crime-of-persuasion.com
www.ctlottery.org
www.dclottory.com
www.deafax.org
www.deccanherald.com
www.dir.indiamart.com
www.doitpunjab.gov.in
www.domain-b.com
www.dulottery.state.gov
www.economictimes.indiatimes.com
www.economictimes.indiatimes.com
www.eff.org
www.encyclopedia.thefreedictionary.com
www.exchange4media.com
www.family.org
www.ficci.com
www.finance.mah.nic.in
www.finngl.nic.in
www.fishingnet.com
www.flalottery.com
www.flonnet.com
www.forbesinfotainment.com
www.galottery.com
www.gambletribune.org

www.gangtoktimes.com
www.go.hrw.com
www.goanews.com
www.goldencasket.com
www.goodlot.co.uk
www.greencardlottery.visapro.com
www.gtech.com
www.hi-arts.co.uk
www.hindionnet.com
www.hinduonnet.com
www.hindustantimes.com
www.hkjc.com
www.hkjc.com
www.ialottery.com
www.idaholottory.com
www.illg.com
www.illnoislottery.com
www.in.gov.hoosierlottery
www.indiacar.net
www.indiainfoline.com
www.indiaprofile.com
www.infolink.com.au
www.infoplease.com
www.irish-lottory.net
www.itzcash.com
www.kanuheartfoundation.com
www.kerala.gov.in
www.keralanext.com
www.kslottery.com
www.kuviyam.com
www.kylottery.com
www.loterie.ch
www.lottery.state.de.us
www.lottery-bzp.com
www.lotterycentral.uk
www.lotteryshop.com
www.lottery-syndicate-world.com

www.lotterywest.wa.gov.au
www.louisianalottery.com
www.magindia.com
www.maharashtra.gov.in
www.maha-ss.com
www.mainelottery.com
www.martinorg.com
www.masslottery.com
www.mdlottery.com
www.megamillions.com
www.michigan.gov
www.microsoft.com
www.mnlottery.com
www.molottery.state.mo.us
www.molottery.state.mo.us
www.montanelottery.com
www.mslonline.com
www.musl.com
www.myplaywin.com
www.myplaywin.com
www.mytonhospice.org
www.nagaland.nic.in
www.national-lottery.co.uk
www.ndlottery.com
www.nelottery.com
www.neportal.org
www.newindpress.com
www.newstabs.com
www.nhlottery.org
www.nmlottery.com
www.nlb.org.za
www.nlcb.co.tt
www.nmlottery.com
www.norsk-tipping.no
www.nswlottery.com.au
www.nylottery.org
www.oldoppos.co.uk

www.oregonlottery.org
www.pais.co.il
www.palottery.com
www.palottery.statepa.us
www.parliamentofindia.nic.in
www.plusloto.com
www.pratham.org/novib
www.prweb.com
www.publicgaled.bc.ca
www.rediff.com
www.rediff.com
www.slotteries.sa.gov.au
www.sazka.cz
www.sceducationlottery.com
www.scigames.com
www.sdlottery.org
www.sdnp.delhi.nic.in
www.shreeshantadurga.com
www.singaporepools.com
www.sisal.it
www.sobellhospice.org
www.sportstoto.com.my
www.sugaldamani.com
www.suntimes.co.za
www.szerencsejatek.hu
www.tattersalls.com.au
www.telegraphindia.com
www.tendercity.net
www.the-keno-guide.com
www.timesofindia.indiatimes.com
www.tips.dk
www.tn.gov.in
www.tnlottery.gov
www.toezichtkanssperne.nl
www.txlottery.org
www.universalgarmants.com
www.us.indiantelevision.com

www.virudhunagar.tn.nic.in
www.visitlordbuddha.com
www.veikkaus.fi
www.westden.co.uk
www.willen-hospice.org.uk

H. Anraj Vs State of Maharashtra (1989) 2 SCC 292
J.K. Bharti Vs State of Maharashtra (1984) 3SCC 704
State of Haryana Vs Suman Enterprised (1994) 4 SCC 217
B.R. Enterprises Vs State of U.P. (1999) 9 SCC 700
State of Bombay Vs RMDC - AIR (1957) SC 628
State of Bombay Vs RMDC - AIR (1957) SC 628
H. Anraj Vs Govt. of Tamil Nadu (1986) 1 SCC 414
Director of State Lotteries Vs CIT (1999) 238 ITR (Guwahati)
Circular No. 257 dated june 4, 1979
Director of State Lotteries Vs CIT (1999) 238 ITR (Guwahati)
Asstt. CIT Vs Director of State Lotteries (2002) 255 ITR (Guwahati)
K.C. Suresh Vs Ex- officio Director of Lotteries (1992) 103 CTR (Kerala)
M.S. Hameed Vs Director of State Lotteries (2001) ITR 186 (Kerala)
Service Tax Notification No. 8/2004 - Service Tax dated 9th july 2004
Press Note dated 5th july, 2002